# కథా కౌముది

## 2017 - Part 2



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 201

కౌముది మాసపత్రికలో

2017 జూలై నుంచి డిసెంబర్ 2017

వరకూ

వచ్చిన కథలు

| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | వెలి | జొన్నలగడ్డ రామలక్ష్మి | 5 |
| 2 | నాన్న కూడా అమ్మే | శారద కాశీవఝుల | 11 |
| 3 | అబ్బే.. లాభం లేదు | చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి | 18 |
| 4 | వారసురాలు | విద్యార్థి | 20 |
| 5 | పుత్రేషణ అనే తల్లి తాపత్రయం | విద్యేశ్వరి | 26 |
| 6 | స్వల్పజ్ఞుడు | తాడికొండ శివకుమార శర్మ | 31 |
| 7 | అష్టావక్ర | రవి కొప్పరపు | 40 |
| 8 | క్షమయా ధరిత్రీ | గాయత్రి (క్రొవ్విడి) చెనిమిళ్ళ | 46 |
| 9 | అదిగదిగో గగనసీమా! | ఎన్నెల | 56 |
| 10 | అపురూపం | డా. లక్ష్మీరాఘవ | 63 |
| 11 | ఆపరేషన్ వసుధైక కుటుంబకం | గిరిధర్ రాజేష్ | 66 |
| 12 | చేసిన పాపం | తెలుగుసేత: సూరపరాజు రాధాకృష్ణమూర్తి<br>మూలం: Fyodor Dostoevsky | 71 |
| 13 | నడక | ఆరి సీతారామయ్య | 82 |
| 14 | ది అంగుళీయం | డా.జి.సురేశ్‌బాబు | 84 |
| 15 | విజయం | దర్భా లక్ష్మీ అన్నపూర్ణ | 91 |
| 16 | నిజం | డా. డి.వి.జి శంకరరావు | 99 |
| 17 | చిగురించిన జ్ఞాపకం | మణి వడ్లమాని | 102 |
| 18 | ఆద్యుడు | రవి కొప్పరపు | 106 |
| 19 | భోక్త | అనామకుడు | 112 |
| 20 | ఏక్సిడెంట్ | ఆనంద్ వేటూరి | 120 |
| 21 | అనగనగా ఓ రాజకుమారి | బోడపాటి రమేష్ | 126 |

| | | | |
|---|---|---|---|
| 22 | ఊట...! | డా. వాసాల వరప్రసాద్ | 128 |
| 23 | భూమి | రవి కొప్పరపు | 132 |
| 24 | ఉండండి నాన్నా! | డా. పేరం ఇందిరాదేవి | 135 |


కౌముది

# వెలి -జొన్నలగడ్డ రామలక్ష్మి

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

"ముప్పై లక్షల డైమండ్ నెక్లెస్. డెడ్ చీప్గా పద్దెనిమిది లక్షలకొస్తోంది. సునీత ఇరవై ఇస్తానని ముందుకొచ్చింది. ఐనా నేను వద్దంటేనే తనకిస్తానన్నాడు సేఠ్" అంది రమ.

రమ నా భార్య. నగకి పద్దెనిమిది లక్షలు డెడ్ చీప్ అనుకునే కుటుంబంలో పుట్టి పెరిగింది.

"సేఠ్ చాలా మంచివాడు. మంచివాళ్లకి అన్యాయం చెయ్యకూడదు. ఆయనకి రెండు లక్షల లాసెందుకూ, బేరం సునీతకే వదిలేయ్" అన్నాను.

మంచివాళ్లకి న్యాయం జరగాలన్న తాపత్రయమేం నాకు లేదు. నాది లౌక్యం.

"ఏదో సరదా పడ్డాను. తీర్చడం తీర్చకపోవడం మీ ఇష్టం" అంది రమ. నా ఇష్టాన్ని తన ఇష్టానికి అనుకూలంగా మార్చుకుందుకు సాధారణంగా తను ప్రయోగించే అస్త్రమది.

అప్పటికి నేను బదులివ్వకుండా ఊరుకున్నాను.

కాసేపటికి ఇంజనీరింగ్ చదువుతున్న పుత్రరత్నం మాధవ్ వచ్చి బిఎండబల్యూ మోటార్ బైక్ కొనాలన్నాడు. అది ఇరవై లక్షలకి పైన.

"నీకు స్పీడు ముఖ్యం. అది మన దేశంలో ప్రమాదం. నాకు నువ్వు ముఖ్యం. డిగ్రీ పూర్తి చెయ్యి. ఎంత డబ్బైనా సరే, ఫారిన్ పంపిస్తా. అక్కడ ఎంత స్పీడెళ్లినా ప్రమాదముండదు. తిరగడానికి బైకేం కర్మ, బీఎండబల్యూ కారే కొనిస్తా" అన్నాను.

వర్తమానాన్ని మాత్రమే నమ్ముకున్న వాడికి, ఎప్పటికో వచ్చేదానిమీద ఆసక్తి ఉండదు. అదిప్పటికి వాయిదా వేస్తే, ఎప్పటికీ వాయిదా వెయ్యడమేనని నాకు తెలుసు.

"నా ఫ్రెండ్ కొనుక్కున్నాడు. ఎవర్నీ వెనకాల తప్ప ముందు కూర్చోనివ్వడు. ఎవరికీ వెనుక ఉండడం నాకిష్టముండదు" అన్నాడు వాడు నిట్టూర్చి.

"నువ్వు చదువు సంగతేనా చెబుతుంట!" అన్నాను. వాణ్ణి ఖండించడానికి నాకున్న అమోఘాస్త్రమది.

ఇంకాసేపటికి టెన్తు చదువుతున్న ముద్దుల కూతురు ముత్య వచ్చింది. దాని ఫ్రెండు హిత సెలవులకి వాళ్ల బాబాయింటికి ఆస్ట్రేలియా వెళ్లొచ్చిందిట. పుట్టినరోజు వేడుక అక్కడే చేసుకుందిట. ఆ ఫొటోలూ, విడియోలూ చూపించి తెగ గొప్పలకి పోతోందిట.

"ఈసారి నా పుట్టినరోజు స్విట్జర్లాండులో చేసుకుందాం" అంది సింపుల్గా.

అది పసితనం కాదు. దానికి నా హోదా తెలుసు. నేను తన మాట కాదనలేనని కూడా గొప్ప నమ్మకం. ఐతే నాకు దాంతో ఎలా డీల్ చెయ్యాలో తెలుసు.

"అయాం వెరీ డిజప్పాయింటెడ్ బేబీ" అన్నాను ముందు. తర్వాత అందుక్కారణం చెబుతూ, "మనమేం చేసినా మనకి నచ్చి చెయ్యాలి. ఎదుటివాళ్లతో పోటీ పడాలని కాదు. నీకు స్విట్జర్లాండు చూడాలనుందనుంటే, వెంటనే టికెట్లు బుక్ చేసుండేవాణ్ణి. కానీ హిత ఆస్ట్రేలియా వెళ్లిందని, నువ్వు స్విట్జర్లాండనడం – ఏం బాగాలేదు" అని వివరించాను.

అది ముత్యని డిఫెన్సులో పడేసే నా టెక్నిక్. ఎటొచ్చీ ముత్యకి ఒరిజినల్ ఐడియాస్ తక్కువ. ఎవర్నో చూసి ఏదో చెయ్యాలనుకోవడం దానికి రివాజు. అదేం ప్రపోజ్ చేసినా, నచ్చినప్పుడు మాట్లాడకుండా ఒప్పుకుంటాను. లేనప్పుడు ఇలా కౌంటరిస్తాను. మరప్పుడలా చేశారు కదా అని ముత్య అనదు. అంటే అవీ మానేస్తానని దాని భయం. ఒరిజినల్ ఐడియాస్ లేనివాళ్లు సద్దుకుపోక తప్పదు కదా!

ఇలాంటివి జరిగినప్పుడు ఆ విషయం ఆ క్షణంతో ఆగిపోయేది. కానీ ఆ రోజు రాత్రి రమ, మాధవ్, ముత్య – ముగ్గురూ నాదగ్గరకొచ్చారు.

"ఇటీవల మీరు ఖర్చులకి బాగా వెనకాడుతున్నారు" అంది రమ.

మిగతా ఇద్దర్నీ చూస్తే – వాళ్ల కళ్లు అవే మాటలు చెప్పాయి.

అన్నిమార్లూ మాటలకి మాటలతో బదులివ్వకూడదు. నేను నవ్వి ఉరుకున్నాను. నవ్వడంలో విశేషం ఏమిటంటే, ఎవరికి తోచిన అర్థం వారు తీసుకోవచ్చు. వాళ్లది చెప్పినప్పుడు మనకి కొత్త ఐడియాలొస్తాయి. కానీ అప్పుడు రమ నేనూహించని మాట అంది.

"మీవాళ్లు మిమ్మల్ని దూరం పెట్టారు కానీ, నేను మిమ్మల్ని వాళ్లకి దూరం చెయ్యలేదు" అంది రమ.

రమ మాటలో రవంత అబద్ధం కూడా లేదు. కానీ మా మధ్య మావాళ్ల ప్రసక్తి ఉండకూడదని, మామధ్య ఒప్పందంలాంటిది ఒకటుంది. రమ దాన్ని సిన్సియర్గానే పాటిస్తుంది మరి. ఐనా ప్రస్తుత విషయానికీ మావాళ్లకీ ఉన్న లంకె ఏమిటో అర్థం కాక, "నేనలా ఎప్పుడైనా అన్నానా?" అన్నాను.

"ప్రత్యేకంగా చెప్పాలా? వాళ్లకి డబ్బవసరమైతే, అది మీరు సద్దుబాటు చేస్తుంటే, నేను కాదంటానా? ఇదేనా మీరు నన్నర్థం చేసుకున్నది!" అంది రమ.

ఇది కూడా నా ఊహకందని ఆరోపణ. "వాళ్లకి నేను డబ్బు సద్దుబాటు చేస్తున్నానని నీకెవరు చెప్పారు?" అన్నాను.

"వాళ్ల అవసరం కాస్తా కూస్తా కాదు. అంత డబ్బు మీరు కాక ఎవరు వాళ్లకి సద్దుబాటు చెయ్యగలరు?"

"మావాళ్లకి డబ్బవసరమైందా? ఆ విషయం నాకు తెలియకుండా నీకెలా తెలిసింది?" అన్నాను ఆశ్చర్యంగా.

"అంటే, మీ నాన్నగార్ని హాస్పిటల్లో చేర్చినట్లు మీ మిత్రుడు శేఖర్ మీకింకా చెప్పలేదా?" అంది రమ చాలా మామూలుగా.

ఉలిక్కిపడ్డాను, "నాన్నని హాస్పిటల్లో చేర్చారా? ఎప్పుడు?" అన్నాను అపనమ్మకంగా.

"శేఖర్గారు నిన్న చెప్పారు. మీ పెర్సనల్ మొబైల్ నంబరిచ్చాను. చెప్పే ఉంటారనుకున్నాను" అంది రమ మళ్లీ మామూలుగానే.

అపనమ్మకం షాక్గా మారింది.

నాన్నకీ, నాకూ మధ్య బాగా దూరం ఏర్పడి చాలాకాలమైంది. అది మరీ ఇంత దూరమని నేననుకోలేదు.

– – – – –

క్రమంగా జరిగింది నాకు అర్థమైంది.

శేఖర్ నా బాల్యమిత్రుడు. కాలేజ్ తర్వాత మా బాటలు వేరయ్యాయి. వాడు కాలేజిలో లెక్చరర్. నేను సిటీలో పెద్ద బిజినెస్మాన్ని. హోదాలు వేరైనా, ఇప్పటికీ మేమిద్దరం తరచుగా కలుసుకుందుకు బాల్యస్నేహమే కాదు, మా నాన్న కూడా కారణం.

చాలా ఏళ్లుగా నాకూ, నాన్నకీ మాటల్లేవు. కానీ నాన్నకీ శేఖర్కీ మాటలున్నాయి. నాన్న వివరాలు తెలుసుకుందుకు నాకున్న ఆధారం శేఖర్ మాత్రమే.

నాన్నని హాస్పిటల్లో చేర్చారు. ఆ విషయం శేఖర్కి తెలిసింది. వాడది నేరుగా నాకు చెప్పొచ్చు. కానీ చెప్పడు. ఎందుకంటే తన విషయాలేవీ తనకి తానుగా నాకు చెప్పొద్దని ఆయన వాణ్ణి శాసించాడు. వాడా శాసనాన్ని చాలా సిన్సియర్గా ఫాలో ఔతాడు. అందుకని అంకుల్ శాసనం రమకి చెప్పాడు. తనెలాగూ నాకు చెబుతుందిగా – సత్యపాలనలో అది అశ్వత్థామ హతః రూటు....

శేఖర్ రమకి కూడా నేరుగా అసలు విషయం చెప్పలేదు. నాన్నని హాస్పిటల్లో చేర్చిన విషయం నాకు చెప్పడానికి పెర్సనల్ మొబైల్ నంబరు కావాలనడిగాడు.

ఇన్నేళ్లుగా కాపురం చేస్తోంది – రమ అసలు విషయం గ్రహించదా!

నాన్న విషయం చెప్పాల్సిన బాధ్యత తనదేనని ఊహించింది. కానీ మామధ్య కూడా ఓ ఒప్పందముంది కదా! అందుకని పిల్లల్ని కూడగట్టుకుంది. అంతా కలిసి ఓ పథకం ప్రకారం – నగ, బైకు, స్విట్జర్లాండు పట్టుకుని నా దగ్గరకొచ్చారు. పరోక్షంగా నాన్న ప్రసక్తి వచ్చింది. ఆయనకి ఎంత డబ్బవసరమైనా తామెవరం అడ్డు తగలమని కూడా పరోక్షంగా నాకు హామీ ఇచ్చారు.

నావాళ్ల హామీకి మనసు తేలిక పడింది. కానీ నాన్న హాస్పిటల్లో ఉన్నాడన్న విశేషం ఆ తేలికలోని హాయిని మింగేసింది.

వెంటనే వెళ్లి శేఖర్ని కలుసుకున్నాను.

– – – – –

నాన్నకి పెద్దలిచ్చిన నాలుగెకరాల పొలం, మండువా ఇల్లు ఉంది. తెలివైనవాడు, ఎమ్మెస్సీ చదివి యూనివర్సిటీకి ఫస్టుగా వచ్చాడు. ఆదర్శవాది, స్వగ్రామంలోనే స్కూల్లో టీచరుద్యోగం చేస్తూ ఉండిపోయాడు. కొంత వాస్తవవాది – అక్క పెళ్లికి అంతో ఇంతో కట్నమిచ్చాడు. తమ్ముడికి అంతగా చదువు రావడం లేదని చిన్నప్పట్నించీ వ్యవసాయంలో శిక్షణ ఇచ్చి, పొలం వాడికి అప్పజెప్పాడు.

నాన్నకి సామాజికస్పృహ ఎక్కువే. మా ఊరి పెద్దమనిషి ఒకాయన ఊళ్లో ఫ్యాక్టరీ పెడతానంటే, కాలుష్యానికి గాలి–నేల–నీరు పాడౌతాయని అభ్యంతరం చెప్పాడు. నాన్నని ప్రలోభపెట్టడానికి ఆ పెద్దమనిషి, ఫ్యాక్టరీ మా పొలంలోనే పెడదామన్నాడు. ఒప్పుకుంటే నాన్న కోటీశ్వరుడయ్యేవాడు. కానీ ఒప్పుకోలేదు.

వచ్చిన చిక్కల్లా నా విషయంలోనే. ఆయన నన్ను తన ఆశయాలకు వారసుడిగా ఎన్నుకున్నాడు.

చిక్కెందుకంటే – చిన్నప్పట్నించీ నా దృష్టి వ్యాపారంమీదుండేది. తెలివుంటే చదువునే వ్యాపారం చేసుకుని ఎంతోమంది కోటీశ్వరులౌతున్న విషయం విద్యార్థి దశలోనే గ్రహించాను. నాన్నకి విద్యాదానంమీదున్న ఆసక్తి విద్యాగారంమీద లేదు.

ఆయన లెక్కల్లో జెమ్. కోచింగుకి మంచి ఆఫర్లొచ్చాయి. వద్దన్నాడు. పోనీ తనే కోచింగ్ సెంటర్ పెట్టినా సరిపోయేది. నా చదువయ్యేక నేను దాన్ని వృద్ధి చేసేవాణ్ణి.

నాన్న కోచింగ్ సెంటర్ పెట్టలేదు కానీ – సాయంత్రమయ్యేసరికి మా ఇల్లో కోచింగ్ సెంటర్లా ఉండేది. వచ్చిన కుర్రాళ్లకి పాలో, మజ్జిగో, చిరుతిళ్లు పెట్టడమో తప్ప– మాకు పైసా అదనపు ఆదాయం లేదు.

పల్లెటూరు కదా, మా ఊరిపెద్దలు కొందరు నన్ను చేరదీసి మరీ బాధపడేవారు, “మీ కుటుంబం బాగుపడదయ్యా” అని. వాళ్ల ప్రకారం – నాన్న ఈపాటికే కోట్లకు పడగలెత్తాలి.

నిజమేననిపించేది. నా బాధని శేఖర్తో పంచుకునేవాణ్ణి.

శేఖర్ నాన్నకి భక్తుడు. ఆయనలో వాడికి దేవుడు కనిపించేవాడు. “నీకో విషయం తెలుసా? గుడికి వెళ్లని నాస్తికులు కూడా అంకుల్ని దేవుడిలా భావించి చేతులు జోడిస్తారు. ఆయన గురించి నీ దగ్గర బాధ పడ్డ వాళ్లెవ్వరికీ, ఊళ్లో ఆయనకున్న గౌరవం లేదు” అనేవాడు.

అది నిజమేనని నాకూ తెలుసు. కానీ ఆ నిజాన్ని గౌరవించేదెందరు?

“గౌరవం ఏంచేసుకుంటావ్? డబ్బు కావాలి. ఈ లోకం నడిచేది డబ్బుతోనే” అనేవాడు కుమార్.

కుమార్ నా క్లాస్మేట్. మా ఊళ్లో ఓ భూస్వామి బిడ్డ. క్లాసులో వాడికెప్పుడూ అత్తెసరు మార్కులే. ఫస్టొచ్చిన గజపతి ఓసారి వాణ్ణి ఎగతాళి చేస్తే, “క్లాసులో ఫస్టొచ్చి ఏంచేస్తావ్? ఏ కాలేజిలోనే లెక్చరరువౌతావ్? లేదా ఏదో కంపెనీలో మేనేజరువౌతావ్. ఆ కాలేజిలు, కంపెనీ పెట్టేది ఎవరో తెలుసా, నేనే!” అన్నాడు.

అందులో కొంత నిజం లేకపోలేదు. వాడి బాబాయి ఇంటర్ ఫెయిల్డ్. సిటీలో ఫ్యాక్టరీ నడుపుతున్నాడు.

ఒకసారి మాటల సందర్భంలో కుమార్తో, “చదువయ్యేక నేనూ ఓ కంపెనీ పెడతాను” అన్నాను.

కుమార్ నవ్వి, “అది నీబోటివాళ్లవల్ల కాదు. మీరు పద్ధతి మనుషులు. బిజినెస్కి పద్ధతి పనికిరాదు. లేకపోతే మీ నాన్నే ఎప్పుడో పెద్ద కోచింగ్ సెంటర్ పెట్టి ఉండేవాడు” అన్నాడు.

ఆ మాట ఇంట్లో అమ్మకి చెప్పాను. అమ్మకి ఆదర్శాల పట్టింపు లేదు. తనకి తెలిసిన ఆదర్శం, నాన్నని అనుసరించడమే. నాన్న తర్వాత అమ్మకి ముఖ్యం కన్నబిడ్డలు. అందుకని నేనన్న మాటలు నాన్నకి చేరేసింది.

నాన్న ఓ రోజు నన్ను పిలిచాడు. “వ్యాపారమూ ఒక సేవ. సేవా దృక్పథంతో చేసే వ్యాపారం మహోన్నతం. కానీ అలా చేసే వ్యాపారస్థులకి, మామూలు ఉద్యోగులపాటి ఆదాయం కూడా రాదు. వస్తే కనుక, వాళ్లు అడ్డదార్లు తొక్కుతున్నా రన్నమాట. ఉద్యోగమైనా, వ్యాపారమైనా అడ్డదార్లు తొక్కకూడదని నా ఆశయం. మనింట్లో ఎవ్వరూ ఈ ఆశయానికి భిన్నంగా ఆలోచించకూడదు. ఇది శాసనమే అనుకో” అన్నాడు.

తనిష్టం తనది. నా ఇష్టాన్ని శాసించడానికి ఆయనెవరు – అనుకున్నాను. కానీ ఆ మాట అమ్మ దగ్గర కూడా అనలేదు. దేనికైనా నాన్నని – ఆయనెవరు – అని ప్రశ్నిస్తే తట్టుకోలేని పవిత్ర భారతనారి అమ్మ.

ఎవరికో ఒకరికి చెప్పుకోకపోతే మనశ్శాంతి ఉండదు. అందుకని శేఖర్కి చెప్పాను. వాడు వెంటనే, “నీకేమనిపించిందో కానీ, ఈరోజునుంచీ అంకుల్ ఆశయం నాకూ శాసనమే” అని అమ్మని మరిపించాడు.

వాడాయన శాసనాన్ని పాటించి, కాలేజిలో లెక్చరరుగా తేలి నలభైఏళ్లొచ్చినా ప్రమోషన్ లేకుండా ఉన్నాడు. నేను నాన్న శాసనాన్ని వ్యతిరేకించి నలభై ఏళ్లకే కోట్లకి పడగెత్తాను. కానీ నాన్నకి దూరమయ్యాను.

ఆ దూరం తక్కువది కాదు –

నాన్నని హాస్పిటల్లో చేర్చితే, ఆ విషయం శేఖర్ ద్వారా తప్ప తెలుసుకోలేనంత దూరం.....

– – – – –

నాన్న మా ఊరికి పక్కనున్న పట్నంలో ఓ హాస్పిటల్లో చేరాడు. వాళ్లు రెండ్రోజులు రకరకాల పరీక్షలు చేసి ఐదువేల దాకా లాగారు. జబ్బేమిటో ఇంకా నిర్ధారణ కాలేదు. కానీ ఆయన్ని సిటీలో పెద్ద హాస్పిటల్కి తరలించాలని అంటున్నారు. అక్కడైతే బహుశా లక్షల్లో ఉండొచ్చు ఖర్చు. అంత ఖర్చుకి నాన్న ఒప్పుకోవడం లేదు. బతికినన్నాళ్లు బతుకుతాను, నన్నింటికి తీసుకుపొండి – అంటున్నాట్ట.

నేను నాన్న ఆశయాలు పాటించకపోవచ్చు. కానీ నాకాయనంటే ఎంతో గౌరవం. ఇంకా చెప్పాలంటే ఆయన్ని నేను ప్రతిరోజూ మిస్సవుతున్నాను.

చిన్నప్పుడాయన నాతో ఎంతో సరదాగా గడిపిన రోజులు ఇప్పటికీ నాకు మధురస్మృతులు. ఇప్పటికీ, గుడ్డిగా తన ఆశయానికి కట్టుబడిపోవడంవల్ల, ఆయన గుడ్డిగా నన్ను ద్వేషిస్తున్నాడని నాకు అనిపిస్తుంది.

బాగా డబ్బు సంపాదించాలన్న లక్ష్యసాధనకోసమే చదువవగానే నేను ఓ బిజినెస్మాన్ కూతురు రమని ఆకర్షించాను. రమ నా ప్రేమలో నిండా మునిగిపోయేక – ఆమె తండ్రి నా గురించి బాగా వాకబు చేసి తృప్తిపడి, తనే మా నాన్నని కలిసి పెళ్లి ప్రపోజల్ తెచ్చాడు.

నాన్నకి కులమతాల పట్టింపులు లేవు. ఆయన రమ తండ్రికి తన ఆశయాలు చెప్పాడు. ఆయనకి నాన్న ఆశయాలకంటే, నామీద ఎక్కువ నమ్మకం కాబట్టి, నిస్సంకోచంగా ఆయన ఆశయాల్ని మెచ్చుకున్నాడు.

కన్నకొడుకుని కదా, నాన్న నన్ను నమ్మాడు. ధన సంపాదనకు నేను తొక్కనున్న అడ్డదార్లు నాన్నకి అబద్ధం చెప్పడం దగ్గరే మొదలయ్యాయి. నాకు రమతో పెళ్లయిపోయింది.

నేను నా మామగారికి విధేయుణ్ణయి, ఆయన ఆశయాలకు అనుగుణంగా మసిలాను. నాకు నేనుగానూ బాగా డబ్బు సంపాదించాను.

ఒక ఏడాదిలో నాన్నకి నేనెంచుకున్న దారితోపాటు, నా వ్యక్తిత్వమూ అర్థమైపోయింది.

నాన్న నన్ను వెలేశాడు. అమ్మ, అక్క, తమ్ముడు నాతో మాట్లాకూడదన్నాడు. వాళ్లు నాకులా కాదుగా, ఆయన మాటకి కట్టుబడ్డారు. నేను నా వాళ్లందరికీ దూరమయ్యాను.

ఒకటా రెండా సుమారు పాతికేళ్ల అనుబంధం. నావాళ్లని ప్రతిరోజూ మిస్సవుతాను. అందరికీ దూరం కావడానికి కారణమైన నాన్నని మరీ ఎక్కువగా మిస్సవుతాను.

పిల్లలు అమ్మని ప్రేమిస్తారు. నాన్ననుంచి తమ ప్రతిభకు గుర్తింపు కోరతారు. ఆర్థికంగా నేను సాధించిన ప్రగతికి ఆయన మెప్పు లభించాలన్నది నాలో బలమైన కోరిక.

డబ్బు సంపాదించడమొక్కటే నేను చేసిన నేరం. అందుకని నేను హత్యలు చెయ్యలేదు. మానభంగాలు చెయ్యలేదు. వ్యాపారపు కిటుకుల్లో కొంత మోసముంటుంది. కొంత దౌర్జన్యముంటుంది. అదే చేశాను. పోరికోసం, పోరుకోసం ఏంచేసినా న్యాయమేనని వాదుక. నేనేం చేసినా చట్టం పరిధి దాటను. దాటినా చట్టానికి దొరకను.

అక్క పెళ్లికి నాన్న కట్నం ఇచ్చాడు. అక్క భవిష్యత్తుకోసం అదో తప్పు కాదనుకున్నాడు. అలా లంచాలు ఇస్తున్నవాళ్లున్నారు. అనవసరమైన మెడికల్ టెస్టులు చేయిస్తున్నవాళ్లున్నారు. వాళ్లలో ధనికులే కాదు, సామాన్య పౌరులు కూడా ఉన్నారు. ఇంకా నాన్న దగ్గర చదువుకున్నవాళ్లలో ఎందరో కోచింగ్ సెంటర్ల నిర్వహణతో సహా ఆయనకు నచ్చని పనులెన్నో చేస్తున్నారు.

నాన్న చుట్టూ ఉన్నవాళ్లలో ఆయన ఆశయానికి విరుద్ధంగా నడిచినవారు చాలామందే ఉన్నారు. వాళ్లనాయన వెలి వెయ్యలేదు. నన్నే వెలి వేశాడు. ఒక విధంగా అది దౌర్జన్యం.

అమ్మకి, అక్కకి, తమ్ముడికి – నాతో మాట్లాడాలనుందేమో, ఎప్పుడైనా వాళ్లని అడిగేడా? ప్రజాస్వామ్యంలో ఉంటూ – మెజారిటీ అభిప్రాయాన్ని పాటించాలనుకున్నాడా?

నా బాధని శేఖర్కి చెప్పుకునేవాణ్ణి.

“నీ భావాలు చీకటి. అంకుల్ సూర్యుడు. ఆయన దగ్గరున్నవాళ్లకి నీ భావాలు కనబడవు. నాక్కూడా” అన్నాడు శేఖర్ నా ఆవేదనని కొట్టిపారేస్తూ.

వాడి మాటల్లో నిజముంది. నాన్న నన్ను దూరం పెట్టడం ఘోరంగా, క్రూరంగా అనిపించినా – నాకెప్పుడూ ఆయనమీద ద్వేషం పుట్టలేదు. నా భార్యాబిడ్డలకి కూడా ఆయన గురించి గొప్పగానే చెబుతాను. ఎంత గొప్పగా అంటే – వాళ్లకి ఆయన్ని కలుసుకోవాలని కోరిక. కానీ ఆయన చెప్పిన ఆశయాన్ని కాకపోయినా, వేసిన వెలిని గౌరవిస్తాను కాబట్టి వాళ్లు ఆయన్ను కలుసుకోరు.

చివరికి నా మామగారికి కూడా నాన్నంటే గౌరవమే!

నాన్నిప్పుడు హాస్పిటల్లో ఉన్నాడు. లక్షలు ఖర్చు పెడితే తప్ప నాకు దక్కడు. ఆయన్ని దక్కించుకునే శక్తి నాకుంది. కానీ ఏమీ చెయ్యలేని అసహాయత.

“నీ దగ్గర చెప్పలేనంత డబ్బుందని మిడిసి పడుతున్నావ్. మీ నాన్నని రక్షించుకోగలవా?” అని నాన్నే నన్ను సవాలు చేస్తున్నట్లుంది.

దూరంగా ఉన్నా ఏదో రోజున మళ్లీ నాన్నకి దగ్గరవుతానన్న ఆశ నాకుంది. ఆ ఆశకిప్పుడు సవాలొచ్చింది.

నాన్నని రక్షించుకోవాలి. ఎలా?

"ఆయనకి నువ్వంటే ద్వేషం లేదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీ దారి మార్చుకో. హృదయానికి హత్తుకుంటాడు" అన్నాడు శేఖర్.

అది నాన్న సందేశమా? లేక అసూయతో శేఖర్ తనకి తానుగా ఇస్తున్న సలహాయా?

ఏ దారీ తోచకపోతే అప్పుడు గుర్తొచ్చారు నావాళ్లు.

నాన్న నన్ను మావాళ్లకి దూరం చేశాడు. అయన్ని తప్పు పడుతున్నాను. ఆయన నియంతృత్వాన్ని నిరసిస్తున్నాను. మరి నేనూ నావాళ్లని మావాళ్లకి దూరం చేశాను. ఆ విషయమై ఒక నియంతలా ప్రవర్తించాను తప్ప – వాళ్లనెప్పుడైనా సలహా అడిగానా, సంప్రదించానా?

నావాళ్లని నావాళ్లనుకున్నాను తప్ప మావాళ్లలో ఒక భాగంగా ఎందుకు గుర్తించలేదు?

ఆ రాత్రి మొదటిసారిగా మావాళ్ల గురించి నావాళ్లతో ప్రజాస్వామిక పద్ధతిలో చర్చించాను.

మనసుంటే మార్గముండదా – మార్గం కోసం మనసుల్ని కలిపాను....

– – – – –

ఒకే ఒక్కసారి మాట్లాడాలంటే ఏ కళనున్నాడో నాన్న ఒప్పుకున్నాడు.

హాస్పిటల్లో ఆయన, నేను – ఇద్దరమే ఉన్నాం.

నా మనసులో ఉద్వేగం. ఆయనలో గుంభనని జయిస్తున్న ఆత్మీయత.

"నువ్వు నీ ఆశయం కోసం బ్రతుకుతున్నావు. ఈ సమాజానికి అది మేలు చేస్తుందని నమ్ముతున్నావు. నీ ఆశయం సంగతేమో కానీ, సమాజానికి నువ్వేమైపోయినా పట్టదు. నేను నీ ఆశయం జోలికి రాను. నిన్ను బ్రతికించుకుంటాను. ఇందులో సమాజానికి మేలే తప్ప నావల్ల నీకూ, నీ ఆశయాలకీ ఏ నష్టమూ లేదు. నాకు నువ్వు వేసిన వెలిని తొలగించమని కూడా నేనడగను. కానీ నువ్వు నా దారిని కాక, నా డబ్బుని శాసించావనుకో. అప్పుడు మనం కలిసుండడంవల్ల సమాజానికి ప్రయోజనముంటుంది. నువ్వు సమాజాన్ని ప్రేమించడం నిజమైతే, నా మాట కాదనకు" అన్నాను.

నాన్న కళ్లు మూసుకున్నాడు. నా మాటల్ని జీర్ణం చేసుకుందుకు ప్రయత్నిస్తున్నాడని అర్థమౌతోంది.

ఆయన ఆశయాలు పాటించిన తమ్ముడు వ్యవసాయంలోనూ, శేఖర్ ఉద్యోగంలోనూ ఎదుగుబొదుగులు లేక అవస్థలు పడుతున్నారు. ఇద్దరిలో ఒక్కరు కూడా ఆయనకు సాయపడగల స్థితిలో లేరు. మరి నేను...

ఆయన వైద్యానికొప్పుకుంటే, నలుగురు పేదవాళ్లకి లక్షలు ఖర్చుపెట్టి ఆపరేషన్లు చేయించి ప్రాణాలు పోసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయనకి ముందే కబురందింది.

నేను నాన్ననే చూస్తున్నాను. ఆయనా నన్నే చూస్తున్నాడు. ఆ కనుల బాస నాకు అర్థమౌతోంది.

"డబ్బుని వెలి వేస్తే మానవత్వం మరుగున పడిపోయే ప్రమాదముందన్న మాట! ఎందుకంటే మానవత్వానికీ డబ్బు కావాలి" అంటున్నాయవి.

ఈ సమాజం ఆయన్ను పట్టించుకోదన్న నిజాన్ని ఆ కళ్లు పట్టించుకున్నట్లు లేదు.

మా నాన్న నాకు దక్కితే చాలు. నేనూ ఆ నిజాన్ని నొక్కి చెప్పను.

# నాన్న కూడా అమ్మే! శారద కాశీవఝ్ఝుల

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

అర్ధరాత్రి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచాను.

ఇండియాలో కనుమ పండగ వచ్చేసింది. అమ్మమ్మ వాళ్ళ ఊళ్ళో తెల్లారే లేచి వీధి వీధంతా సందడిగా జరుపుకునే భోగి, సంక్రాంతి గుర్తొచ్చాయి. వారం ముందు నించే మొదలయ్యే కోలాహలం, బంధువుల హడావిడి వల్లే పండగ ఆనందం రెట్టింపు అయ్యేది. అవన్నీ వదులుకుని ఈ దూర దేశం వచ్చినందుకు రోజూ కన్నా ఎక్కువ బాధ ఇలాంటప్పుడు కలుగుతోంది. రెక్కలు కట్టుకుని ఈ క్షణం ఏలూరులో వాలిపోయే అవకాశం ఉంటే ఎంత బావుణ్ణు! ఎన్ని సంవత్సరాలు గడిచినా – ఆ మమతల నెలవులకి వెళ్ళిపోవాలో, ఈ సుఖాలకు లొంగి ఇక్కడే ఉండిపోవాలో అన్న త్రిశంకు శంకలు పోయేలా లేవు.

మంచం మీద నుంచి లేచి, అలవాటైన వ్యసనంతో సెల్ ఫోనుని అందుకుని యధాలాపంగా చూసాను. నాన్న ఫోను నుంచి పద్దెనిమిది మిస్స్ డ్ కాల్స్. నిర్ఘాంతపోయాను. ఎప్పటిలా చెడు ఆలోచనలే ముందు వచ్చాయి, జరగరానిదేమైనా జరిగిందేమో అని. నా గొంతు తడారిపోయింది.

ఒక్క మిస్సెడ్ కాల్ ఇచ్చి వదిలేసే నాన్న, అర్ధరాత్రి పద్ధెనిమిదిసార్లు చెయ్యాల్సిన అవసరం ఏమొచ్చింది? పండగకి అందరూ కలిసి, నన్ను తలుచుకుని మాట్లాడదామని ఫోన్ చేశారేమో.

మనసు సర్ది చెప్పడానికి ప్రయత్నిస్తే మెదడు వినట్లేదు.

వణుకుతున్న చేతులతో ఇండియాకి డయల్ చేశాను. అవతల మోగుతున్నంత సేపూ రకరకాల ఊహలతో నాకు తల పగిలిపోయే నొప్పి మొదలయ్యింది. మా చెల్లి ఫోన్ఎత్తింది..

"హల్లో" అన్నాను భయంభయంగా...

"అక్కా...నాన్న" అని గట్టిగా ఏడుపు మొదలెట్టింది. నా మెదడు చల్లబడిపోయింది.

"ఏమైంది" ఏం వినాల్సొస్తుందో అని భయంగా అన్నాను పూడుకుపోతున్న గొంతుతో.

"నాన్నకి రాత్రి హార్ట్ అట్టాక్ వచ్చింది, అమ్మమ్మ వాళ్ళ ఊర్లో ఉన్నాము. నువ్వూ, అన్నయ్యా వచ్చెయ్యండి..నాకు భయంగా ఉంది" వెక్కిళ్ళ మధ్య అతి కష్టం మీద చెప్పింది.

నా గుండె ఆగినంత పనయ్యింది , అనుమానించినదే నిజమయ్యింది.

"నాన్నకి ఏమి కాదు, నేను ఇప్పుడే బయలుదేరుతున్నాను..వచ్చేస్తా..ధైర్యంగా ఉండు..నేను అరగంటకోసారి ఫోన్ చేస్తాను" ఇవన్నీ చాలా సహజం అని నాకు తెలుసు అని ధ్వనించేలా అక్క స్థానంలో బింకంగా జవాబిచ్చాను.

"అన్నయ్యకి కూడా చెప్పు, నాకు వాడి ఫోను అందట్లేదు, త్వరగా వచ్చెయ్యి అక్కా" మళ్ళీ భళ్ళుమంది మా చెల్లి.

“అలాగే,నాన్న వయసు ఐపోతోంది కదా, ఏదో ఒక రోజు ఇలా జరుగుతుందని మనం ముందే ఊహించినదే కదా. నేనూ, అన్నయ్యా వచ్చేస్తున్నాము, నువ్వు జాగ్రత్త” నా దుఖం వింటే దాని ధైర్యం సడలిపోతుందేమో అని స్పందన కోసం ఎదురు చూడకుండా ఫోన్ పెట్టేసి కుర్చీలో కూలబడ్డాను.

నాన్న… నాన్న!

కల్మషం నిండిన ప్రపంచంలో నిజమైన ప్రేమ అంటే ఏంటో పరిచయం చేసిన రెండో సగం!

ఇల్లు, పిల్లలే ప్రపంచమైన అమ్మది అమాయకపు ప్రేమ – వాళ్ళ కోసం తనకు చేతనైనది ఏదైనా సరే చేసెయ్యాలనీ, కళ్ళ ముందు పిల్లలు ఆనందంగా తిరుగుతుంటే చాలనుకునే ఆరాటం మాత్రమే ఉన్న ప్రేమ.

దేవుడి కన్నా గొప్పదీ, సృష్టి కన్నా అందమైనదీ అమ్మ ప్రేమ!

మరి నాన్నది? పిల్లల భవిష్యత్తు గురించి ఆరాటపడే ప్రేమ. గారాబం చేసి అలుసు ఇస్తే చదువుకుని పిల్లలు బాగుపడరేమో అనే భయం ఉన్న ప్రేమ. ఇంటి బయట ఉండే ప్రపంచంలో తన పిల్లలు బాగా బ్రతకాలని తాపత్రయపడే ప్రేమ. తను పడినట్లు పిల్లలు జీవితంలో కష్టపడకుండా ఉండాలని, ఆపేక్ష అంతా మనసులో దాచేసుకుని, కఠినంగా బాధ్యతలు నేర్పే ప్రేమ.

అందుకే హైదరాబాదు ఇంట్లోంచి వెళ్ళిపోయి, తమ్ముడు కర్నాటకలోని మంచి కాలేజీలో చేరాల్సి వచ్చినప్పుడు వెళ్ళి తీరాల్సిందే అని నాన్న పట్టుబట్టాడు. ‘కొడుకు దూరంగా వెళ్ళిపోతాడు, ఎలా బతుకుతాడో, ఇంటి తిండి తినే అదృష్టం లేద’నే బెంగతో అమ్మ వంటింట్లోనే వెక్కి వెక్కి ఏడ్చి నాన్న తిడతారని కళ్ళు తుడుచుని బయటకి వచ్చి, బింకం నటించేది. నేనూ , చెల్లీ ‘హమ్మయ్య! మమ్మల్ని ఏడిపించేవాడు దూరంగా వెళ్తున్నాడ’నుకున్నామే గానీ రెండు రోజుల్లో వాడి వెలితి తెలిసి కలవరించినది గుర్తుంది. అసలు ఈ ఇంట్లో , ఈ ప్రపంచంలో, ప్రత్యక్ష కఠినాత్ముడు నాన్న ఒక్కడే. అందుకే ఏ బెంగా లేకుండా వాడినలా ఇంటికి దూరంగా పంపేసి మామూలుగా ఉంటున్నాడని ఎన్నోసార్లు అనిపించేది.

‘ఇంకొకడికి అవకాశం ఇవ్వకుండా, పవర్ సీట్లో కూచుని మనుషులందరి మీదా అధికారం చెలాయిస్తున్న దేవుడిలాగా, ఇంటిపెద్ద హోదాలో అందరి జీవితాలూ ఈయన ఇష్టానికి శాసిస్తున్నాడు నాన్న’ అంటూ ఎన్నోసార్లు తిట్టుకోవడం గుర్తుంది. ఎంత చదివినా 'ఇంకా బాగా చదవాలి' అని తప్ప 'నువ్వు బెస్ట్' అని మెచ్చుకోని నాన్నని సంతుష్టుడిని చేసే ప్రయత్నం పోను పోను మానుకున్నాను. దహించే పశ్చాత్తాపం తప్ప ప్రాయశ్చిత్తం లేని గతం తాలూకు చెరుపుకోలేని పొరపాట్లు!

మూడు పూటలా మాకు కూడు, గూడు, గుడ్డ, చదువులు, షికార్లు, అనువైన జీవితం మా అందరికీ అమర్చడం కోసం, పొద్దున్న నాలుగింటికి కాఫీ మాత్రం తాగి ఇంట్లోంచి బయటపడి ఎప్పుడో మేమంతా పడుకున్నాక రాత్రి ఒంటిగంటకి ఓపిక లేకుండా వచ్చే నాన్నలో తప్పులు పట్టడం ఎంత అవివేకం! ఆయన స్కూటర్ శబ్దం విని పరిగెత్తుకెళ్ళి పలకరిస్తే రోజంతా పడ్డ శ్రమ మర్చిపోతాడు పాపం అన్న ఊహ కూడా లేకుండా – కష్టం ఆయన బాధ్యత, సుఖం మా హక్కు అన్నట్టు సాగిన మా ప్రవర్తనకి అప్పట్లో పెట్టుకున్న పేరు తెలీనితనం.

అదే చిన్నతనంతో ఇప్పుడు నా పదేళ్ళ కొడుకు ఎప్పుడో ఒకసారి అలిగితే గింజుకునే నాకు, ఏ శిక్ష వేయాలి? ఇంట్లో తప్ప బయటెక్కడా తిండి తినని నాన్న రోజంతా కాఫీలు తాగే నిలదొక్కుకుని ఉద్యోగం చేసి ఉంటాడు అన్నగిల్ట్ ఇన్ని ఏళ్ళ తరువాత వచ్చి ఎవరికి ప్రయోజనం? అవకాశం చేజారిపోయాకే వచ్చే ఈ కొరగాని స్ఫురణలెందుకు?

అదే దుఖంతో, కెనడాలో ఉన్న మా తమ్ముడికి ఫోన్ చేశాను.

“హల్లో..”

“ఆ, అక్కా..ఏంటి ఈ టైంలో పడుకోకుండా”

“చెల్లి ఫోన్ చేసిందిరా..నీకోసం చాలాసార్లు ప్రయత్నించిందిట..నాన్న..” కన్నీళ్ళ మధ్య పూర్తి చెయ్యలేక పోయాను..

”ఏమైందీ..” భయాన్ని అణుస్తున్న వాడి ఆత్రం తెలుస్తోంది.

“రెండోసారి గుండెనొప్పి వచ్చిందిట, మనం బయల్దేరాలి రా”

రెండు క్షణాల నిశ్శబ్దం తరువాత "ధైర్యంగా ఉండు..ఊహించినదే కదా ఏదో ఒక రోజు వినాల్సొస్తుంది అని! నేనిప్పుడే బయల్దేరుతున్నాను..నువ్వు టెన్షన్ పడకుండా జాగ్రత్తగా రా ” ఏడ్చే స్వాతంత్ర్యం లేని మగవాడిలా ఎప్పటిలా వాడు దుఖం ఆపుకుని నాకు ధైర్యం చెప్పాడు. ఫోన్ పెట్టేశాక వాడెంత బాధపడతాడో నాకు తెలుసు. నాన్నని చూసి నేర్చుకున్నదే. మనసులో ఎంత బాధ ఉన్నా, పెద్దగా లేనట్టు నటిస్తూ ఇంట్లో మిగతావారికి ధైర్యం చెప్పడం.

ఇండియాలో మధ్యాహ్నం ఒంటిగంట అయ్యుంటుంది. నా ఆలోచనలకు బలవంతంగా ఆనకట్ట వేసి మళ్ళీ చెల్లికి ఫోన్ చేశాను "కృష్ణకి చెప్పాను అపర్ణా. వాడూ నేనూ బయల్దేరుతున్నాం. నాన్నకి ఎలా ఉంది"

"ఈ పల్లెటూరులో హార్ట్ స్పెషలిస్టులు లేరుట. విజయవాడ తీసుకెళ్ళమంటున్నారు. మూడు గంటలు ప్రయాణం. రోడ్ మీద నిలబడి ఉన్నాం అక్కా.ఆక్సిజెన్ సిలిండెర్లు ఉన్నవాన్ కావాలిట, ఎక్కడా లేవు. మావయ్య పరిగెడుతున్నాడు" ఎన్ని గంటల నుంచీ ఏడుస్తోందో దాని గొంతు బొంగురు పోయి మాట్లాడలేక పోతోంది.

నాకు మళ్ళీ దుఖం వచ్చింది. కొద్దో గొప్పో మా ముగ్గిరికీ అమ్మనీ, నాన్ననీ బాగా చూసుకునే స్తోమత వచ్చేసరికీ ఆరోగ్యం పాడయ్యి చెల్లి ఒక్కత్తీ దగ్గిరుండగానే, అమ్మ కూడా ఆసుపత్రికి తీసుకెళుతుండగా చనిపోయింది. ముగ్గరిలో చిన్నదయినా అపర్ణకొచ్చిన కష్టం చూస్తే, మరింత క్షోభగా ఉంది.

"భయపడకు అపర్ణా. కనుమ పండగ కదా, ఎవరో ఒకళ్ళు దొరుకుతారు. బస్ స్టాండుల్లో ఉంటారేమో" దూరంగా కూచుని సలహా చెప్పడం ఎప్పుడూ తేలికే.

"ఆ..అన్ని చూస్తున్నాం..ఎంత డబ్బైనా ఇస్తాం, తీసుకెళ్ళండని అడుక్కుంటున్నా ఒక్కళ్ళూ దొరకట్లేదు..త్వరగా వెళితే నాన్న బతుకుతాడేమో అక్కా...భయంగా ఉంది వెళ్ళగలమో లేదో" దాని ఏడుపు ఆగట్లేదు. పాతికేళ్ళు పెంచిన తండ్రిని అలా గుండె పట్టుకుని విలవిల్లాడుతుండగా చూస్తూ, స్తిమితంగా చెయ్యవలసిన పనులు ఆలోచించడానికి చాలా నిబ్బరం కావాలి.

"నాన్నకి ఏం కాదు. ఆయనకి విల్ల్ పవర్ ఎక్కువ అని డాక్టర్లు ఎన్నోసార్లు చెప్పలేదూ? మేము వచ్చేస్తున్నాం, ఆయనకేం కాదు" నాకు నేనే మళ్ళీ మళ్ళీ చెప్పుకుంటున్నట్లుగా అని పెట్టేశాను..

ఎంతసేపు మాట్లాడినా దాన్ని ప్రశ్నలు అడిగి ఇంకా క్షోభపెట్టడం కన్నా ఏం ఉండదు. క్రృష్ణ కూడా ఫోన్ చేస్తాడు, మళ్ళీ అవే జవాబులన్నీ చెప్తూ అది బాధ పడాలి. ఫోన్ బ్యాటెరీ దారిలోకి సరిపడ ఉందో లేదో!

చేయక తప్పని విధిలా పెట్టె సర్దడానికి లేచాను. ఏం పెట్టుకోవాలో గుర్తురావట్లేదు. అన్నిటికన్నా పాస్పోర్ట్ ముఖ్యమని తోచింది. చేతికందిన కాసిని బట్టలు పెట్టుకున్నాను. టిక్కెట్ కొనాలని గుర్తొచ్చింది. ఎక్కడికి? ఏలురు. కాదు హైదరాబాద్ ఇంటికి. కాదు విజయవాడకి కదా? బుర్ర పని చెయ్యడం లేదు. అజెంట్ కి ఫోన్ చేసి వివరాలు చెప్పాను. వాడెంత రాటుదేలి ఉన్నాడో పాపం, నేను వెక్కిళ్ళ మధ్య ఏడుస్తూ చెప్తుంటే ఓపిగ్గా రాసుకున్నాడు.

"ఇలాంటి మెడికల్ ఎమెర్జెన్సీకి కొంచెం డిస్కౌంట్ ఉంది మేడం"

మనస్కరించలేదు, అసలా పదమే నచ్చలేదు. "వద్దు. మై డాడ్ విల్ల్ బి ఫైన్"

పిల్లల రూంలోకి వచ్చాను. పదేళ్ళ ప్రబంధ్ లౌకిక సమస్యలతో నిమిత్తం లేకుండా అమాయకంగా నిద్రపోతున్నాడు. అమ్మమ్మతో ఆడుకునే అవకాశం రాని వాడి చిన్నతనపు జ్ఞాపకాల్లో కాస్తో కూస్తో ఉన్నది తాతయ్యతో ఆటపాటల అనుబంధమే. ఆయనకీ ప్రబంధ్ కీ జరిగే క్రమశిక్షణ పోరులో, నా పరిస్తితి అడకత్తెరలో పోక చెక్క అయ్యేది.

"ఎందుకు అమ్మా ఇలా చెయ్యడం" అని ప్రతిదానీ ప్రశ్నించే వాడి తరం తీరు, 'పెద్దవాళ్ళు చెప్తే ఎదురు ప్రశ్న వెయ్యకుండా చెయ్యాల'నే మా నాన్న సూత్రానికి చిర్రెతించే విషయం.

'వెధవలు. ఇవా వీళ్ళు నేర్పేది స్కూల్లో. ముందు వాళ్ళకి రెండు అంటించాలి. ఒక్క పద్ధతీ సవ్యంగా లేదు ఈ దేశంలో.అదే ఇండియా ఐతేనా' అంటూ మా నాన్న ఈ దేశం వచ్చినప్పుడు చేసిన విమర్శల ప్రచారం వల్లే హైదరాబాదులోని సగం మంది తల్లిదండ్రులు అమెరికా ప్రయాణం విరక్తితో మానుకున్నారని  మా తమ్ముడు జోక్ చేస్తూండేవాడు.

ఆయన వాడిని తిట్టొచ్చుగానీ, నేనెప్పుడైనా ప్రబంధ్ ని ఒక మాట అంటే వాడిని వెనకేసుకొచ్చేవాడు 'మొత్తం సిస్టమే సరిగ్గా లేని దేశంలో పెంచుతూ వాడిని తిట్టకు. నేను ఇండియాలో పెంచి చూపిస్తా వాడిని బ్రహ్మాండంగా ' అనేవాడు, ఆవు మీద వ్యాసంలా.  ఇక్కడికి వచ్చేసి మాతో ఉండిపోతే, ఆయన పొద్దున్నే లేచి 'పేపర్, పాలు, కరెంటు కోత లాంటి ఇబ్బందులు పడక్కర్లేదు, ఎంతో కొంత సుఖంగా ఉండొచ్చు' అని సౌలభ్యాలవైపు ఆయన మనసు మళ్ళించడానికి ఎంత ప్రయత్నించినా విఫలులమైనాము.

"నాన్నా! చూడు ఇన్నిరకాల కూరగాయలు ఫ్రెష్షుగా దొరుకుతాయి ఇక్కడ. ఎంత ఆరోగ్యం, వీలు? " అని ఆరాటంగా స్టోరుకి తీసుకెళితే, అన్ని రకాల విచిత్రమైన ఆకుల్నీ, అలమల్నీ పరీక్షించి

"ఏంటీ చెత్తంతా తింటారా మేకల్లా? ఉమ్మెత్తకాయల్ని కూడ తింటున్నారో ఏంటో, విషం అని చెప్పు వెర్రివాళ్ళకి. ఈ ఆకులన్నీ వినాయకచవితి పత్రి పూజకి తప్ప ఎందుకూ పనికి రావు. చక్కగా వంకాయ అల్లం కూర, గోంగూర పచ్చడి తినమను బతికున్నన్నాళ్ళూ రుచిగా" అని స్తోత్రం చదివేవాడు.

ప్రపంచమంతా అద్భుతం అనే నయాగరా ఫాల్సుకి ఆశగా తీసుకెళితే "ఇదా? మేము చిన్నప్పుడు ఈదిన చెరువుల పక్కనే ఇలాంటివి బోలేడు చూశా. ఎక్కడైతేనేం నీళ్ళు పై నుంచి కింద పడడమేగా? దూరం నుంచి చూడ్డం తప్ప వీళ్ళు దగ్గిరకి వెళ్ళానివ్వరు. అదే ఇండియా అయితే మన ఇష్టం, ఎక్కడ ఈదినా అడిగేవాడు లేడు. ఇక్కడంతా హడవిడి తప్ప క్రియ శూన్యం. ' అని తీసి పారేసేవాడు.

సాయంత్రం నేను ఆఫీసు నుంచి వచ్చేలోగా రకరకాల వంటలు చేసి పెట్టేవాడు, ఎంత వద్దన్నా వినకుండా.  సీరియల్ తిని స్కూలుకి వెళ్ళే ప్రబంధ్ కి పొద్దున్నే రవ్వదోశలూ, మావిడికాయ పచ్చళ్ళూ అలవాటు చేశాడు. వాడు నేను పెట్టినవన్నీ చప్పగా ఉన్నాయని, తాతయ్య చేత అడిగి చేయించుకునేవాడు. ఒక్క తిండి విషయంలో మాత్రం వారిద్దరి మధ్యా క్రమశిక్షణకి తావు ఉండేది కాదు.

'ఇంతింత కారాలు ఏంటి నాన్నా, ఇవాళ నేను చేస్తాను వంట ఉప్పూ కారం తగ్గించీ' అంటే

'ఆ చప్పిడి కూడు తిని తొంభై ఏళ్ళు బ్రతకడం కన్నా, అన్నీ కావాల్సినట్లు తినేసి త్వరగా చచ్చిపోడమే మేలు. నా వాటా బెండకాయలు నాకు పడెయ్యి, నాకిష్టమైనట్టు వండుకుంటా' అనేవాడు.

ఎక్కడ దొరికేవారో, వాకింగ్ అని వెళ్ళి రోజుకొకళ్ళని తీసుకొచ్చేవాడు 'అమ్మాయి, ఇదిగో వీళ్ళూ తెలుగువాళ్ళేట '  అంటూ.  వయోభేదం లేకుండా అందరూ బిలబిలమని వచ్చేవాళ్ళు ఆయనతో గడపడానికి 'అంకుల్ని మా ఇంట్లో దింపేసి వెళ్ళండి, లేపోతే మేము పికప్ చేసుకోగలం' అంటూ.

'నీకు మరీ ఫాన్స్ ఎక్కువయిపోయారు నాన్నా' అంటే ముసిముసిగా నవ్వుకునేవాడు.

'వాళ్ళందరి మనసులు మార్చేసి, ఇండియా తీసుకెళ్ళిపోతాడు తనతో పాటూ' అనేవాడు మా తమ్ముడు.

ఆయనకి అమెరికాలోని అన్ని వింతలూ చూపించెయ్యాలని నా ఆరాటం. 'బయటకి వెళదాం పద నాన్నా' అంటే, 'ఎందుకు డబ్బులు దండగ. ఎలాగో రెంటు కడతాముగా, ఇంట్లో ఉండి న్యాయం చేద్దాం' అనేవాడు.

మధ్యాహ్నం ప్రబంధ్ 'తాతా' అని అరుచుకుంటూ స్కూల్ నుంచి రాగానే అన్నం పెట్టి, హోంవర్క్ చేయించేవాడు. వాడు వచ్చినప్పుడు తలుపు తియ్యకపోతే ఇబ్బంది పడతాడని, మధ్యాహ్నం నిద్ర మానుకుని ఎదురుచూసేవాడు . ఐనా మురిపెంగా 'ఇప్పటిదాకా ఇల్లు ప్రశాంతంగా ఉంది. వచ్చాడుగా, ఇంక కిష్కింధకాండే' అనేవాడు. 'పనిలో పని వాడికి కాస్త తెలుగు నేర్పు నాన్నా' అంటే

'శిక్షణలో మొదటి అడుగు బాసింపెట్లు వేసుకుని కూచోవాలి వాడు అప్పుడే మొదలెడతా అనేవాడు '. అయిదుఏళ్ళ క్రితం మొదలయిన ఆ తెలుగు నేర్పే ప్రహసనం మొదటి అడుగు దగ్గిరే ఆగిపోయి ఉంది.

నిశ్చింతగా నిద్రపోతున్న ప్రబంధ్ వైపు మరోసారి చూశాను. వాడిని నాతో ఇండియా తీసుకువెళితే హాస్పటల్లో పరుగుల మధ్య, మా రోదన చూస్తే వాడి లేత గుండె గాయపడి జీవితాంతం ఏడుస్తుందేమో! మనవాళ్ళు అనుకున్న వాళ్ళ దగ్గిర చెడువార్త ఎప్పుడూ దాచాలనో, చెప్పడంలో తాత్సారం చెయ్యాలనో అనిపిస్తుంది. ఏది జరిగినా తిరిగొచ్చాకే వాడికి చెప్పాలని నిర్ణయించుకున్నాను.

ఎయిర్పోర్ట్ కి వెళ్ళే దారిలో మళ్ళీ అపర్ణకి ఫోన్ చేశాను.

"ఒక ఆక్సిజెన్ సిలిండరే ఉన్న వాన్ దొరికింది అక్కా! వాడు రాను, మా సార్ని పర్మిషన్ అడగాలి అంటే మావయ్య అరిచి బయల్దేరదీసాడు. దారిలో ఉన్నాము. రెండు గంటల్లో విజయవాడ ఆయుష్ ఆసుపత్రిలో ఉంటాము" అంది.

నాక్కాస్త ఊరట అనిపించింది "గుడ్. నా ఫ్లయిట్ గంటలో ఉంది. ఫోన్ ప్లాన్ తీసుకుంటాను. ఏం జరుగుతోందో వాట్సాప్ లో రాస్తూ ఉండు, నాకూ అన్నయ్యకీ. ఎన్నిసార్లు అని ఫోన్ ఎత్తగలవు? ఏమైనా తిన్నావా?"

" ఆ తిన్నాను అక్కా. నాకిప్పుడు ధైర్యంగా. నువ్వు బెంగపడకుండా రా" ధైర్యం చెప్పాల్సిన కర్తవ్యం గుర్తొచ్చిన దానిలా అంది బింకంగా. అది అబద్ధం చెప్తోందని తెలుసు.

మరోసారి కృష్ణతో మాట్లాడాను. ఊరటకి ఊరికే ఫోన్ చేసుకోవడం తప్ప ఏముంది మాటలకి?

అవసరమైనప్పుడు నిద్రరాదు అని మరోసారి ఋజువైంది. ఇరవై రెండు గంటలు కంటకంగా గడిచాయి.

ఆ క్షణం విజయవాడలో వాలిపోవాలన్న నా ఆరాటంతో నిమిత్తం లేకుండా విమానం నత్తనడకతో డిల్లీ ద్వారా విజయవాడ చేరింది. గమ్యం చేరేలోగా ఏం వినాల్సొస్తుందో అనే భయం బిగబట్టి, ఇరవై రెండు గంటల పాటూ చెల్లి రాస్తున్న విషయాలు చదువుతుంటే గుండె ద్రవించిపోయింది. దారిలో నాన్న నొప్పితో, ఆయాసంతో విలవిలలాడారనీ, ఆసుపత్రి చేరగానే ఐసీయులోకి తీసుకెళ్ళిపోయి డాక్టర్లు ఇంకా ప్రయత్నిస్తున్నారనీ చెప్తుంటే ఎంత దుఖించినా తరగని బెంగ రెట్టింపయ్యింది.

విజయవాడలో విమానం దిగి, హాస్పిటల్ పేరు చెప్పి టాక్సీ అడిగాను. ఆసుపత్రి గుమ్మంలో అడుగు పెడుతుంటే ముందు వారలో ఉన్న రోగులూ, గుప్పున వస్తున్న మందుల వాసనా స్వాగతానికి మళ్ళీ కన్నీళ్ళు ఉబికాయి.

నాన్న పేరు చెప్తే రెండో అంతస్తులో ఉన్న ఐసీయులో ఉన్నారని చెప్పారు. పిచ్చి పట్టినట్లు అందరినీ తోసుకుంటూ పరిగెత్తాను.

ఐసీయు గది ముందు దిగాలుగా కూచునుంది అపర్ణ. నన్ను చూడగానే ఇరవైనాలుగు గంటలుగా ఆపుకున్న దుఖం పొంగి "అక్కా" అని బావురుమంటూ వచ్చి కౌగిలించుకుంది.

కొన్ని గంటల్లో మా ఇద్దరి విషాదానికీ మా తమ్ముడూ వచ్చి తోడయ్యాడు. రాత్రయితే ఒక్కళ్ళే ఆసుపత్రిలో ఉండాలన్న నియమం సడలించమనీ, ఒక్క బంధువూ లేని ఆ ఊళ్ళో ఐసీయు ముందు పడిగాపులు పడుతూ ఉండనివ్వమనీ డాక్టర్లని వేడుకున్నాము. సిబ్బంది కనికరించారు.

యముడితో ముప్పై గంటల యుద్ధం తరువాత, పిల్లల్ని ఇంకోసారి చూడాలన్న నాన్న సంకల్పబలం గెలిచింది. కళ్ళు తెరిచారు. ఒక్కరినే ఐసీయులోకి పంపుతామంటే ముందుగా చెల్లిని లోపలికి పంపాము.

తలుపు బయట నుంచుని అద్దంలోంచి తొంగి చూస్తే నాన్న ఒళ్ళంతా వైర్లతో, వెంటిలేటర్తో కనిపించారు. సింహంలా గర్జిస్తూ తనకేం కాదు అని మొండి ధైర్యంతో బతుకు లాక్కొస్తున్న నాన్నని...ఆ క్షణం అంత బేలగా, బలహీనంగా చూడటం ఎప్పటికీ వెంటాడే వేదన.

చెల్లి బయటకి రాగానే ఆపుకున్న దుఖం పెల్లుబికింది. 'అక్కా, అన్నయ్యా' వచ్చారా అన్నది చెల్లికి నాన్న సైగ చేసి అడిగిన మొదటి ప్రశ్న. ఒక్కసారి ముగ్గురినీ చూడాలంటున్నాడని ఎంతో బతిమాలితే, ఒకే ఒక అవకాశం ఇచ్చింది నర్స్. మేము డీలా కనిపిస్తే పేషంట్ మానసికంగా దెబ్బ తింటాడు అని హెచ్చరిస్తే, లేని ధైర్యం నటిస్తూ ముగ్గురమూ నాన్న రూంలోకి ఒకేసారి అడుగుపెట్టాము.

ఊహించినట్టుగానే, ఒకరినొకరు చూసుకోగానే మా అందరి దుఖం ఉవ్వెత్తున లేచింది.

ఎన్నో చెప్పాలని సైగలు చేసేస్తున్న నాన్న ఒళ్ళంతా సూదులు గుచ్చిన రక్తపు గాట్లు. రెప్పల మీద ప్లాస్టర్లు, పక్కకి తిరిగిపోయిన కళ్ళు, నోరు. ఎముకలు అంటుకుపోయి, కళ్ళు లోతుకుపోయి మా నాన్నేనా అనిపిస్తున్న నాన్న. మా అందరినీ ఇబ్బంది పెట్టినందుకు బాధ పడుతూ సారీ అన్నట్టు సైగ చేసాడు. ఎప్పటికీ సంతోషంగా కలిసి ఉండమని చెప్పాడు. ఇంటికి తీసికెళ్ళిపొమ్మని కన్నీరు పెట్టుకున్నాడు.

ఆకలేసినా లేకిగా అడగకూడదనీ, అతిధులుగా వెళ్ళినప్పుడు, ఎంత ఇష్టమైనా ఒకటి కన్నా ఎక్కువ ఎవరింట్లోనూ తినకూడదనీ నేర్పిన నాన్న దీనంగా పొట్టవైపు చూపించి 'తినడానికి ఏదైనా పెట్టమని ' జాలిగా, అరవై ఏళ్ళలో మొదటిసారి అడిగాడు. మా ముగ్గురికీ దుఖంతో గొంతు పూడుకుపోయింది. మానిటర్ మీద మారుతున్న రీడింగ్స్ చూసి నర్స్ మమ్మల్ని తిట్టి బయటకి తోసేసింది.

ఆయనకి కాస్త తిండి పెట్టలేకపోతున్నందుకు, అందరూ చూస్తున్నారని కూడా మర్చిపోయి ముగ్గురమూ గుండెలవిసేలా ఏడుస్తూ, సముదాయించుకుంటూ మళ్ళీ ఐసీయు బయట కూర్చుండిపోయాం.

అమ్మ పోయాక, నాన్నని ఒక్కడినే ఇండియాలో వదిలేసి ముగ్గురం ఇతర దేశాలకి ఎగిరిపోయామనే అపరాధభావం ముగ్గురికీ ఉంది. రోజూ నాన్నకి ఫోన్ చేసినా, మనసులో బోలెడంత ప్రేమ ఉందిలే అని సర్దిచెప్పుకున్నా,

'ఇక్కడకొచ్చేయ్ నాన్నా, ఇప్పటికైనా కాస్త సుఖపడుదువుగానీ అని మొరాయిస్తున్న నాన్నకి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా, సంవత్సరానికి ఒకసారి నాన్న దగ్గరికి వెళ్ళొచ్చినా ఏదీ పరిహారంగా లెక్కరాదు – అవసరం తీరాక తల్లిదండ్రుల్ని వదిలేసిన ఎంతోమందిలో మేమూ ఉన్నాం, ఇదే నిజం అంతే! మరొకర్ని విమర్శించే హక్కు మాకు లేదు! సమర్ధనకేం, ఏ కారణాలైనా చెప్పుకోవచ్చు!

ఒంటి మీద కండువాతో సహా ఉన్న కాస్త ఆస్తి, ఊళ్ళో వాళ్ళందరికీ దానం చేసిన తన తండ్రి పేరుని గర్వంగా తన కొడుకుకి పెట్టుకుని, ముప్పయి ఏళ్ళల్లో కొడుకుని పేరు పెట్టి 'కృష్ణ ' అని పిలిస్తే తన తండ్రిని పేరుతో పిలిచిన అపరాధం చేసినట్టని నమ్మి పిలవని మా నాన్న –

తండ్రి పోయిన తరువాత, ఒంటరి తల్లి క్రమశిక్షణకు తల ఒగ్గి, చదువొదిలేసి చిన్నతనంలోనే కుటుంబ భారాన్ని పెద్ద కొడుకుగా తలకెత్తుకున్న మా నాన్న –

నాలుగు మైళ్ళు నడిచి రెండు రూపాయలకు ఆరు ఇడ్లీలు తీసుకుని, తను పంపు నీళ్ళు తాగేసి ఇద్దరు తమ్ముళ్ళనీ, చెల్లెలినీ ప్రాణప్రదంగా సాకి, పెళ్ళిళ్ళు చేసి, ఆదర్శమైన మా నాన్న –

వాళ్ళ అమ్మ చూపించి పెళ్ళి చేసుకోమన్న మా అమ్మ మెళ్ళో తాళి కట్టి, చేతనయినంతగా భర్తగా బాధ్యతలు నిర్వర్తించి రిటైర్ అయ్యాక వ్యక్తిగత జీవితంలోనూ ఒంటరయిపోయినా, ఎవరి మీదా ఆధార పడకుండా నిబ్బరం నటించి, సంతోషం మాత్రమే పంచి బతికిన మా నాన్న –

పొద్దున్న నాలుగింటికి లేచి చదువుకోవాలి అనే శాసనం నుంచీ, ఉన్నవాటితో సంతృప్తిగా సద్దుకోవాలి అనే సూక్తి వరకూ అడుగడుగునా నేర్పిన పాఠాలూ, ఆయన చేసిన త్యాగాలూ మనసు కలచివేస్తుంటే ఆజన్మాంతం ముగ్గురు పిల్లలనీ ఋణగ్రస్తులుగా మిగిల్చిన మా నాన్న –

తల్లిదండ్రులు లేని లోటు, భార్య పోయిన మథన, పిల్లలు దగ్గిర లేని బాధ, మనవలతో గడపలేని వెలితి తొలుస్తున్నా, రాబందుల్లా ఎంతో కొంత దోచుకుపోయి పలకరింపు పేరుతో ఆయన ఒంటరితనాన్ని కుళ్ళబొడిచి, చేసే సాయం కన్నా ప్రచారం ఎక్కువ చేసుకునే బంధువుల మధ్య మనిషి ఇంటికొస్తే చాలనుకుని ఆశగా గుమ్మం వైపు చూసిన మా నాన్న –

కర్ర ముక్క, పగిలిపోయిన రబ్బర్ బంతితో రోడ్ మీద చిన్నపిల్లలు ఆడినా, అంతర్జాతీయస్థలిలో చెయ్యి తిరిగిన ఆటగాళ్ళు ఆడినా, వర్ధమాన ఆటగత్తెలు రంజీ ట్రోఫీ ఆడినా క్రికెట్ అయితే చాలు చూడాలనుకుని నర్సులందరినీ వారంలో స్నేహితులుగా మార్చేసుకున్న మా నాన్న –

తను చివరిసారి చూడాలనుకున్న వాళ్ళంతా వచ్చి చూసేదాకా ప్రాణాలు ఉగ్గబట్టుకుని, కుటుంబపెద్దగా ప్రేమని పంచడమే తప్ప తాను ఎప్పుడూ సరిగ్గా అనుభవించలేక ఆప్యాయతల కోసం మనుషులని ప్రాకులాడుతూ బతికిన మా నాన్న – వారం తరువాత తుది శ్వాస విడిచాడు.

నిన్నమొన్నటి దాకా కప్పిపుచ్చిన మా బింకం పటాపంచలైంది. అమ్మ పోయిన గాయం నుంచి ఇంకా కోలుకోక ముందే నాన్న కూడా దూరమయ్యాడు.

మూడోసారి గుండెపోటుతో, జాతకంలో రాసిపెట్టి ఉన్న చివరి ముప్పై క్షణాల ఐహిక నరకాన్ని పూర్తిచేసి, నిష్కల్మషంగా అరవై ఏళ్ళు పూజించినా కరగని దేవుడి పాషాణ హృదయం గెలిచాననుకుంటున్న మరో విజయం ముందు, తలవంచాడు.

ప్రపంచానికి ప్రాణం లేని ఐసు ముక్కగా కనపడుతున్ననాన్నమీద, కర్మ తంతులో భాగంగా నిర్దాక్షిణ్యంగా పురోహితుడు నీళ్ళు గుమ్మరిస్తున్న చేదు జ్ఞాపకాలు, భారతదేశంతో తెగిన చివరి బంధం వీడ్కోలు బహుమతులుగా మిగిలాయి. బతికుండగా తన పితృదేవతలకు క్రమం తప్పక విధులని ఆచరించిన మా నాన్నకు ఏ విధంగానూ లోటు రాకుండా కర్మ నిర్వర్తించాలని, కొండంత దుఖాన్ని కడుపులో దాచుకుని, కొడుకుగా ఆయత్తమైన మా తమ్ముడికి చేతులెత్తి నమస్కరించాలనిపించింది.

అమెరికా తిరిగొచ్చి వార్త చెప్పగానే, 'తాత కావాలి ' అంటూ ప్రబంధ్ గుండెలవిసేలా ఏడ్చిన ఏడుపు కన్నా, భగవంతుడు మనుషులని హింసించి పొందే వినోదం తాలూకు వికట్టాట్టహాసమే గట్టిగా వినిపిస్తోంది.

తప్పని మరణం, తప్పించుకోలేని దుఖం సహజమని తెలిసినా, కాలంలో కొట్టుకుపోతున్న ఎన్నో కుటుంబాల ఆక్రోశం వంతు మాదాకా వచ్చేసరికీ ఓర్చుకోవడం దుర్భరంగా ఉంది. ప్రపంచానికి మా నాన్న ప్రాణం ఎంతోమందిలో ఒకటే కావొచ్చు, మాకు మాత్రం ఎంతో మందిలో మా నాన్న ఒకడే ప్రాణం!

గర్భం దాల్చి, ప్రాణాన్ని పణంగా పెట్టి ప్రతిసృష్టి చెయ్యగల అమ్మ ఎంత గొప్పదో, ప్రకృతిసిద్ధంగా తొమ్మిది నెలలు మోయలేకపోయినా జన్మంతా గుండెల మీద పిల్లల్ని ఇష్టంగా మోసిన మా నాన్నైనా, ఎవరి నాన్నైనా అంతే గొప్ప. మాతృత్వ ప్రేమ కొలమానం అయితే నాన్న స్థానం అమ్మ తరువాతది కాదు, అమ్మతో సమానమే!!

# అబ్బే.. లాభం లేదు

చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి

**"అబ్బే లాభంలేదు"** మూతి విరిచాడు. ముక్కు పింగళించాడు. కళ్ళు చిట్లించాడు. మొఖాన్ని చిట్లించాడు. ముఖ్యంగా పెదవి కూడా విరిచాడు. తల అటూ ఇటూ ఊపాడు. ఆ ఊపటంలో కూడా నిరాశ ఉంది. నిజానికి నిరాశకంటే కొంచెం ఎక్కువ. అలాగని నిరాసక్తత కాదు. నిరాశ, నిరాసక్తత, ఆశక్తత అన్నీ కలిపి తల ఊపుతూ ఉన్నాడు.

అంటే 'ఆలోచిస్తున్నాడు'. ఆలోచించటం అనేది. ఇక్కడ అతిశయోక్తి అలంకారం. అయినా సాంబడికి అన్వయించాల్సిన, ముఖ్యంగా ఆ క్షణంలో అన్వయించాల్సిన అతి ముఖ్యమైన అలంకారం. అవును నిఝం నిజ్జంగా నిజ్జం. సాంబడు ఆలోచిస్తున్నాడు. చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అలవాటులేని పనికాబట్టి. నాకు కొంచెం ఇబ్బందిగా ఉంది. అయినా చెప్పక తప్పదు. సాంబడు ఆలోచిస్తున్నాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అవును మరి ఆలోచించాల్సిన దుస్థితి అతనికి ఎందుకు వచ్చింది? నిజానికి అది అతని తప్పుకాదు అనిపించింది. ఆ తప్పు పరిస్థితులది, అని నాకు గట్టి నమ్మకం. అయితే ప్రస్తుతం మనకు కావల్సింది, ఆ పరిస్థితులేంటి? అతను ఆ పరిస్థితుల్లోకి ఎందుకు నెట్టబడ్డాడు? ఏం జరిగింది? ఎలా జరిగింది? ఏ.. ఏ కారణాల వల్ల అలా జరిగింది? తెలుసుకోవాలని కుతూహలం. మీకే కాదు నాకూ కలిగింది.

"అబ్బే.. లాభం లేదు" గట్టిగా అన్నాడు. నాకూ వినిపించేంత గట్టిగానే అన్నాడు. నాకూ అర్థం అయింది. అతని ఉద్దేశ్యం. అయితే సాటి మనిషికి ఏం కష్టమొచ్చిందో పట్టించుకోని కుహనా మేధావులలాగా నేనూ తల తిప్పుకొని వెళ్ళిపోలేదు. ఎందుకంటే నేను నిఖార్సైన మేధావిని. పైగా మీ అందరి ఆసక్తిని గమనించి సంఘంలో బాధ్యత కలిగిన పెద్దమనిషిగా కేవలం పెద్దమనిషిగా మాత్రమే.. మీ అందరి కోరిక తీర్చటం నా బాధ్యతగా భావించి అత్యవసరమైన పనులు ఉన్నప్పటికీ వాటిని త్యాగం చేసి మీకోసం కేవలం మీకోసం ఈ సాంబడి సంగతేమిటో తేలుద్దామని ఆగాను.

అదుగో అదే అదే నాకు నచ్చదు. ఏదైనా సూటిగా మాట్లాడండి. గొణగొద్దు. అత్యవసరమైన పనులు ఏంటి అనా? అదే దినపత్రికని తిరగేయటం తేనీరు సేవించడం. మీకు అతి ముఖ్యమైన విషయాలు అనిపించకపోవచ్చు. కాని మాకు అవి అత్యవసరం. ఎవరి శరీర ధర్మాలు వారికి!

"అబ్బే లాభం లేదు" మళ్ళీ మూతివిరిచాడు. ముక్కు పింగళించాడు. ముఖ్యంగా పెదవి కూడా విరిచాడు పైపెచ్చు తనే విరిగిపోయాడు. "అబ్బే! లాభం లేదు ఈ దేశం బాగుపడదు" సూటిగా నాకే చెప్పాడు.

అటూ ఇటూ చూశాను. ఎవరూ లేరు. మేమిద్దరమే ఉన్నాం. అంటే నాకే చెప్పాడు "చూశారా" నాకే చెప్పాడు మళ్ళీ. ఇక తప్పలేదు. చూశాను.

"ఈ లోకంలో మంచి వాళ్ళకి స్థానమే లేదండి.." స్థిరంగానే చెప్పాడు.

నిర్ణయానికి వచ్చినవాడిలాగే మాట్లాడాడు. బాల్ నా కోర్టులోకి వచ్చింది. ఇక తప్పలేదు. నేనూ ఆలోచించాల్సిన సమయం వచ్చింది. మొదటిగా ప్రశ్న మీలాగే నా ఆలోచనలో కూడా అదే ప్రశ్న. మంచివాళ్ళకి స్థానం లేదా? నిజమా? అదేంటి నేను, మీరు అదిగో ఆ ఎదురింటివారు. ఆ ప్రక్కింటివారు. అందరూ మంచివారేగా? అంటే - మనందరము మంచివాళ్ళమేగా? మనకి బాగానే ఉంది.

మనకంటూ ఒక స్థానం ఉంది. కాబట్టి మంచివాళ్ళకి స్థానంలేదు. అనటం యొక్క ఆంతర్యమేమిటి? అంటే సాంబడు మంచివాడా? కాదా? అదీ ప్రశ్న. ఒకవేళ అతను మంచివాడు అనుకుంటే అతనికి స్థానంలేదని బాధపడుతున్నాడా? అతనికి స్థానం ఎందుకులేదు? కారణం ఎవరు? పరిస్థితులు ఏంటీ? ఒకవేళ అతను మంచివాడు కాదూ అనుకుంటే అతను తనని తాను మంచివాడని అని భ్రమపడుతున్నాడా? లేక ఇతర మంచివాళ్ళు (అంటే మనలాంటివాళ్ళు) వాళ్ళకి స్థానం లేదని నిర్ణయిస్తున్నాడా? అసలేం జరుగుతోంది?

"కలికాలం కాకపోతే మరేంటండీ?" నా ఆలోచనలను చిన్నాభిన్నం చేస్తూ మళ్ళీ ప్రశ్న. ప్రశ్నల తుట్టె. ప్రశ్నకు ప్రశ్న. ప్రశ్నపైన ప్రశ్న. ప్రశ్నకు సమాధానం ప్రశ్న. ఆలోచనాధార.. అదీ... "సాం...బ...డి" నుంచి అయ్యబాబోయ్.. నేను తట్టుకోలేను.. నేనేంటి మనలాంటి ఆలోచనగలవారు తట్టుకోలేరు.

ముందుగా మీకు సాంబడి గురించి కొంచెం తెలియాలి.

'సాంబడు' మనలాంటి మేధావుల దృష్టిలో అనామకుడు (అవుననుకోండి మనకి మనం మేధావులు అని చెప్పుకోకూడదు. నిజమే అయినా మనలో మనం అనుకోవచ్చు బయటవాళ్ళకి మాత్రం చెప్పకూడదు. మనం మేధావులం అని వాళ్ళ తెలుసుకోవాలి) అయితే ఈపాడు సామాన్య లోకం దృష్టిలో బ్రతకనేర్చిన వాడు, నెలకింత సంపాయించి పడేస్తూవుంటాడు. పెళ్ళాం పిల్లల్ని చాతనయినంతగా తన స్థాయిలో పోషిస్తూ ఉంటాడు. అయితే మనలాంటి మేధావి మాత్రంకాదు. ప్రపంచ సమస్యల గురించి తెలుసుకోడు, ఈదేశం ఎటుపోతోందో అతనికి అవసరంలేదు, దేశంలో సహనం ఉందోలేదో తెలీదు, తీవ్రవాదులోకాదో తెలీదు, దేశభక్తి ఉండాలో వద్దో తెలీదు. 'సహనం' దేశంలో ఉందో లేదో తెలియదు. పైగా ఆవేశపడటం మీటింగ్‌లకి వెళ్ళటం, మన ఆలోచనలని వ్యతిరేకించిన వారిని శత్రువులుగా చూడటం విదేశాలని పొగడటం, దేశం పాడైపోతోంది. అని నిర్ణయం తీసుకునే శక్తికూడా లేదు. మనం అందరం ఈ విషయాలపై చర్చించి బుర్రలు వేడెక్కి ఇంటికెళ్ళి ఏ.సి వేసుకుని హాయిగా (క్షమించండి పరాకులో ఉన్నమాట అనేశాను) హాయిగా కాదు, నిద్రలేని రాత్రులు గడిపేవాళ్ళం.

ఈ సాంబడికి అలాంటి సద్గుణాలు ఏవీలేవు. మనలాంటి ఒకటోరకం మేధావి మాత్రం కాదు. ఈ విషయానికి నేనే సాక్ష్యం. ఎందుకంటే ఈ దేశం పాడైపోతోందని అసహనం ఎక్కువైందని కొందరు పెద్ద మేధావులు (అంటే మేస్త్రీలు అన్నమాట) అవార్డులు వెనక్కి ఇచ్చే ఉద్యమం చేపట్టినప్పుడు ఉడతాభక్తిగా నేనూ నా పాఠశాల వారు పదవతరగతిలో నాకు ఇచ్చిన మేధావి అవార్డ్ వెనక్కి ఇవ్వటం కోసం కార్యక్రమం పెట్టి అందరిని పిలిస్తే (ఈ సాంబడిని కూడా) అంత ముఖ్యమైన కార్యక్రమం వదిలేసి పెళ్ళాం పిల్లల్ని తీసుకుని విహారయాత్రకు వెళ్ళిన వాజమ్మ వాడు. అచ్చంగా నీరోచక్రవర్తి ఫిడేలు వాయించినంతగా "ఏమయ్యా రాలేదు?" అని ముఖాన అడిగితే వెధవ ఏమన్నాడో తెలుసా? "ఎందుకండీ తిన్నది అరక్క ఇలాంటి కార్యక్రమాలూ" అని అట్లా అవే మాటలు నా మొహాన చెప్పేశాడు. మనలాంటి మేధావులు ఏం చెప్పాలి? కుదరలేదనో లేక వేరే అర్జంట్ పని ఉందనో చెప్పాలి. కానీ వీడేంటి? అందుకే వీడు మేధావి కాదు! అది తేటతెల్లం.

ఇక ప్రస్తుతానికి వద్దాం. సాంబడు నన్నే చూస్తున్నాడు. సలహాకోసమేమో నేనూ సాంబడిని చూశా. మళ్ళీ సాంబడు ఆలోచనలో పడ్డాడు. ఈసారి జనాంతికంగా అన్నాడు. ముచ్చటగా మూడోసారి అన్నాడు. "అబ్బే లాభంలేదు.." ఈసారీ అంతే. మూతి విరిచాడు, ముక్కు పింగళించాడు. పైగా పెదవి కూడా విరిచాడు. కళ్ళెగరేశాడు. "ఈ దేశం బాగుపడదు" స్థిరంగా చెప్పాడు. రెండు చేతులతో ఆహ్వానించాల్సిన విషయం మేధావిలాగానే అన్నాడు. నాలోని మేధావికూడా నిద్రలేచాడు. "ఏం జరిగింది?"

"ఏం జరిగితే ఏంలెండి? మీరేమన్నా ఆరుస్తారా? తీరుస్తారా?"

"అసలేం జరిగింది?" అసహనంగా అడిగాను.

బాధ్యత నిద్రలేచింది, ఆవేశం నిద్రలేచింది.

"సాంబశివరావుగారూ చెప్పండి. ఏం జరిగిందో? నేనేమైనా సహాయం చెయ్యగలనా?"

సాంబశివరావు నావైపు కళ్ళెత్తి చూడు. తీక్షణంగా చూశాడు. ఏదో వెతుకుతున్నట్టు చూశాడు. ఏదో ఉంది. చెప్పబోతున్నాడు. ఇప్పటికి మీకు నాకు విషయం తెలియబోతోంది. ఇదే మనలాంటి మేధావులం ఎదురు చూస్తున్న తరుణం. అశక్తులని, ఆర్తులనీ, తాడితులనీ, పీడితులనీ ఉద్ధరించబోతున్న తరుణం.

"చెప్పు ఏం జరిగిందో?" మళ్ళా సమరోత్సాహంతో అడిగాను, కులం సమస్య, ఏదైనా ఏమైనా సరే నేను విప్లవానికి నాంది పలకాల్సిందే తరతరాలుగా జరిగిన తప్పులన్నీ ఈ రోజు సరిచెయ్యాల్సిందే విప్లవానికి ఈరోజు నాంది పలకాల్సిందే ఈ మార్పుకోసం నన్ను నేను అర్పించుకోవాల్సిందే పోరాటాల బాటలో వెనకడుగు వేసే ప్రసక్తేలేదు. నా ఆవేశం ఆగటంలేదు. మేధావులు ప్రపంచాన్ని ఎలా ప్రభావితం చేశారో చరిత్ర చెప్పిన పాఠాలన్నీ గుర్తుకొస్తున్నాయి.

ఛాందసవాదం ఈ దేశాన్ని ఎలా ముక్కలు చెక్కలు చేసిందో ప్రతీ పేజీని చించి అక్కడ నే వ్రాయబోయే కొత్త చరిత్ర రక్త చరిత్ర నాకు తెలుస్తోంది. బ్రహ్మాండం బద్దలు కాబోతోంది. నీకు తెలుస్తోంది. నాయకుడిగా ఇది నా మొదటి అడుగు. స్థిరంగా చూశా.

"ఏ సహాయం కావాలన్నా అడుగు సాంబశివరావు.. ఏం జరిగిందో చెప్పు" దర్పంగా దయగా ధీమాగా అడిగా. సాంబశివరావుగారు నా వైపు దీనంగా చూశారు. గట్టిగా ఊపిరి పీల్చి వదిలారు. నిర్ణయానికి వచ్చినవాడిలా.

"నాకు ఒక్క పదివేలు ఉంటే సర్దండి సార్. మళ్ళా ఫస్టుకి ఇచ్చేస్తా.. చాలా అవసరం పడింది. "

అందుకే ఈ దేశం బాగుపడదు. దొంగముండాకొడుకు.!!

## వారసురాలు — విద్యార్థి

"అమ్మా,ఇవ్వాళ నాక్ ఛాల్లా ఇంఫార్టెంట్ మీఠింగ్స్ ఉన్నాయ్. ఫోయినసార్కి మల్లి ఇంకోటి ఏధీ మొదలెప్టబాకు. నువ్ ఫోయిన సారి చేసిందాన్కి పోలీస్, కోర్టుస్ చుట్టూ ధిరగాల్సివచ్చింది. మళ్లీ ధిరగలేన్. నాకు ఇటువంటివాట్కి టైం లేద్" అని కొంచెం గొంతు పెంచి హెచ్చరించి బయలుదేరాడు కొడుకు. కోడలు కూడా లిప్ స్టిక్ రాసుకుని, పెదాలు చప్పరిస్తూ, ఒక చెవి ఇటు పడేసి విని ఉద్యోగానికి బయలుదేరింది.

అన్నపూర్ణమ్మ గారు కొడుకుకి ఇష్టమని, గుమ్మడి కాయ కూర కోసం ముక్కలు కోస్తూ గింజలు పక్కన పెడుతున్నారు.

అన్నపూర్ణమ్మ గారు అమెరికా రావడం ఇది రెండవ సారి. మొదటిసారి పదిహేనేళ్ల క్రితం మనవరాలుని పెంచటానికి వచ్చింది. ఇప్పుడు అదే మనవరాలు హైస్కూలు పూర్తి అవుతున్నది. గ్రాడ్యువేషన్ పార్టీ, ఒక్కగానొక్క కూతురు, దానికి నీ పేరే పెట్టుకున్నాము, నువ్వు రాక పోతే ఎలా అని మళ్లీ అమెరికా తీసుకు వచ్చి బంధించారు..

తనది పల్లెటూరు. తన ఊరిలో అందరూ తెలిసిన వారు అనేకంటే, తను చెప్పిందే చేస్తామంటారు. తను లేకుండా ఏ శుభ కార్యం జరగదు. ఆవిడ చేతులలో ఏది పడినా పచ్చగా పెరుగుతుంది, అందుకని ఆ పచ్చటి చేతులతో ఆశీర్వదించమని, పెళ్లికూతుళ్లని తయారు చేయటానికి, పెళ్లిళ్లకీ, సీమంతాలకి, బారసాలలకి, అక్షరాభ్యాసలకి ఊళ్లోవాళ్లే కాదు, పక్క ఊళ్ల వాళ్లు కూడా పిలుస్తారు.

నిజంగానే అన్నపూర్ణమ్మగారివి పచ్చని చేతులు. ఏ గింజ ఎక్కడ పడేస్తుందో గానీ, మొక్కలు ఏపుగా పెరుగుతాయి. కూరగాయ మొక్కలు విరగకాస్తాయి. ఒకసారి సొరపాదు బడి పంతులు గారి ఇంటి కప్పు పైకి పాకించింది. గంగాళం సైజులో సొర కాయలు విరగ కాసి, బీద బడిపంతులు ఇంటి కప్పు కూలినంత పనయ్యింది. ఇంకోసారి గుడి పక్కన ఉత్సవ విగ్రహాలు పెట్టే పందిరికి పొట్లపాదు ఎక్కించింది. పొట్లకాయలు మోకులల్లే తెగ కాసి వేలాడాయి. ముక్కోటి ఏకాదశికి ఉత్సవ విగ్రహాలు తీద్దామని ఆచార్లు గారు తెల్లవారకు ముందే స్నానం చేసి, మడి కట్టుకుని, సగం చీకట్లో ఆ పందిట్లోకి ప్రవేశించ బోయారు. గాలికి ఊగుతున్న దుద్దు పొట్లకాయ ఒకటి ఆయన వీపు తట్టింది. చీకట్లో త్రాచుపాము అనుకుని ఆచార్లు గారు మూర్ఛ వచ్చి పడ్డారు. తరువాత ఆదిశేషుడుకి ఏదో అపచారం జరిగిందనుకుని ఉపవాసాలు పెంచి, ముక్కోటి ఏకదశి పూజలు మాత్రం బ్రహ్మాండంగా చేశారు. ఆ సంవత్సరం బోలెడు ప్రసాదాలు.

ఇక చెట్లయితే ఒకటిగాదు. ఊరుకి ఒక మూల ఉన్న తాటి చెట్లకి అన్నపూర్ణమ్మ గారి తాటి తోపు అని పేరు. ఊళ్లో పది గీత కార్మికుల కుటుంబాలు, టౌనులో రెండు కల్లు దుకాణం కుటుంబాలు వాటి మీద బ్రతుకుతున్నాయి. ఊళ్లో ఎక్కడపడితే అక్కడ మామిడి చెట్లు, కొబ్బరి చెట్లు. వాటి కాయలు అమ్ముకుని బ్రతికే వాళ్లూ ఉన్నారు. ఈ మధ్య పంచాయితీ వాళ్లు మామిడి, కొబ్బరి కాయలకి వేలం పాట పెడతానన్నారు. కరణం మున్సబులని దుమ్ము దులిపి, ఉతికి ఎండేసింది. ప్రతి ఒక్కళ్ల ఇంటి ముందు మామిడి చెట్టు, ఇంటి వెనుక గొడ్ల సావిళ్లకి ముందు జామ చెట్లు, "అన్నపుర్ణమ్మగారు మా అమ్మాయి పెళ్లికి పెట్టిన మామిడి పాదు, సీమంతానికి పెట్టిన జామ పాదు" అని చెపుతారు. తను పెట్టిన వేప చెట్లూ, చింత చెట్లూ, కొండ మల్లి చెట్ల మీద కాకి గూళ్లే కాదు, కొంగల గుంపులు కూడా నివాసం ఉంటున్నాయి. ఒకసారి గొవర్నమెంటు వాళ్లు పెద్ద రోడ్డు వేస్తూ దారికి అడ్డంగా ఉందని ఓ తుమ్మ చెట్టును కొట్టేయబోయారు. తను వేసిన తుమ్మ చెట్ల మీద బోలెడు గిజిగూళ్లు ఉన్నాయి, బోలెడు పిచ్చుకలు కాపురం చేస్తున్నాయి, తుమ్మాకు ఒక్కటి రాలినా నేనూరుకోను అంటూఒక చేత్తో తుమ్మ చెట్టుని వాటేసుకుని, రెండో చేత్తో ముక్కుమూసుకుని ఊపిరి బిగబట్టి భీష్మించుకుని కూర్చుంది. ఆ రోడ్డు ఆ చెట్టు దాకా వచ్చి చంద్రవంక లాగా వయ్యారపు మలుపు తిరిగింది.

అంతటి అన్నపూర్ణమ్మగారిని అమెరికా రెండోసారి తీసుకువచ్చి బంధించాడు కొడుకు..

పోయినసారి, పదిహేనేళ్ల క్రితం మనవరాలుని పెంచటానికి వచ్చినప్పుడు, వస్తా, వస్తా తన చీర కొంగు కొనని మజ్జిగలో ముంచి, దాంట్లో గోగు గింజలు కట్టుకుని తెచ్చింది. కొడుకింటికి రాగానే గోగు గింజలని పక్కన పెట్టి, పాలు కాచి ఆరబెట్టి చీర కొంగు కొనని ఆ పాలలో ముంచి, పిండి, తోడు పెట్టింది. ఆ పెరుగు, జున్ను కంటే గట్టిగానూ, తియ్యగాను తయారయింది. ఈ కాలానికి అమెరికా సంయుక్త రాష్ట్రాలన్నింటికి ఆ పెరుగు తోడు విస్తరించింది. రెండో రోజు, కొడుకూ కోడలూ ఉద్యోగానికి వెళ్లిన తరువాత మనవరాలితో కలసి లాన్ లో ఆడుకుంటూ ముల్లు అట్లకాడు పట్టుకుని లాన్ ఒక మూల తవ్వి, మట్టి సరి చేసి, తను కొంగున ముడి కట్టుకొచ్చిన గోగు గింజలని వేసింది.

గోంగూర ఏపుగా పెరిగింది. గోగు పూలైతే మహా సొగసుగా ఊగాయి. తుమ్మెదల గుంపు, వాటిని పట్టుకోటానికి పక్షుల గుంపూ చేరాయి. అప్పుడప్పుడూ మనవరాలిని పార్క్ లో ఆడించమంటూ కోడలు దించి వచ్చేది. అక్కడ పోగేసిన ఏవేవో చెట్ల గింజలు తీసుకువచ్చి, అట్లకాడతో తవ్వి ఇంటి వెనకాల దడి చుట్టూ వేసింది.

మనవరాలి పుట్టిన రోజుని పార్టీ పెడితే, అన్ని కూరలతోపాటు, లాన్ లో పెరిగిన గోంగూరతో పచ్చడి చేసింది. మనవరాలు కేక్ కట్ చేస్తున్నప్పుడు గొడవ మొదల్లయ్యింది. పెద్ద పెద్దగా కూతలు వేసుకుంటూ పోలీసు కార్లు వచ్చాయి. ఒక్క ఉదుటున పోలీసులు లోపలికి చొరపడి "ఫ్రీజ్" అని అరచి, బెదిరించడం మొదలు పెట్టారు. ఓ నలుగురు పోలీసులు గోంగూర మొక్కల దగ్గరకి వెళ్లి ఫోటోలు తీసి, పచ్చటి గోంగూర మొక్కలని నరికి మోపు కట్టారు. లోపలికి వచ్చారు. ఒక పోలీసు "మారువానా" అన్నాడు, ఇంకొకడు వీడ్ అన్నాడు. "గంజాయి పెంచుతుతున్నారా?" అని ఇంకొక తెలుగు కోడలు వంకర్లు పోతూ కిసుక్కుమంది. నవ్వుకుని, గోంగూర పచ్చడితో అన్నం కలుపి, పోలీసువాడికి తనకి వచ్చిన ఇంగ్లీసులో eat అని చెప్పి, చేతులతో సంజ్ఞలు చేసి, చేతిలో ముద్ద పెట్టబోయింది. వాడు సుకుమారంగా ఎడంచేతి పిడికిలి బిగించి, చిటికిన వేలు ముందుకు చాచి గోంగూర పచ్చడి ముద్దకు అంటించి, నాలుకకు రాసుకుని చప్పరంచి, తననూ, కోడుకునూ పోలీసు కారులోకి ఈడ్చుకుపోయాడు. ఆ పోలీసు వాడి మోహం మాత్రం నిజంగా ఎర్రగా మాడింది.

తరువాత, కొడుకు పోలీసుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగి, బోటనీ ప్రొఫెసర్లతో సాక్ష్యాలు ఇప్పించి కేసు కొట్టేయించుకున్నాడు. తనని వెంటనే ఊరుకి పంపించేసాడు. మళ్లీ పదిహేను సంవత్సారల తరువాత ఇప్పుడు తీసుకువచ్చాడు. ఆఫీసుకు పోతూ, పోయినసారి జరిగిన గొడవని గుర్తు చేశాడు.

కోడలేమో ముల్లు అట్లకాడ దాచేసి, ముల్లు అట్లకాడ ఎప్పుడో విరిగిపోయిందని చేతులు వంకర్లు తిప్పుతూ అబద్ధం చెప్పింది. మనవరాలు కూడా పెద్దదయ్యింది, దానికి కూడా తన చదువు తన స్నేహితులతో సరిపోతున్నది. చెయ్యటానికి కూడా ఏమీ పని లేదు.

గుమ్మడి కాయ కూర చేయటం కోసం పోపు డబ్బా తీయబోతే, అన్నీ చిందర వందరగా కనిపించాయి. అన్నీ అడుగూ బొడుగూ ఉన్నాయి. పోపు డబ్బా ఉన్న అరలోనే వేరే దినుసులుకూడా చిన్న చిన్న ఫాషన్ గాజు సీసాల్లో అడుగంటి ఉన్నాయి. కోడలకి శుభ్రం తక్కువ, వివరం తక్కువ, దుబారా ఎక్కువ అని అనుకుంది అన్నపూర్ణమ్మ గారు. అన్నిటినీ శుభ్రం చేయటం కోసం వెనక డెక్ మీదకు చేర్చారు. గుమ్మడి కాయ కోసిన గింజలని కూడా డెక్ ఒక మూల శుభ్రం చేసి ఎండపెట్టింది.

ఈ లోపల కర్ణ కటోరంగా పైనుంచి పక్షి అరుపు వినబడింది. చూస్తే పాల పిట్ట. రెక్కలు నల్లగానూ, శరీరం నీలం రంగులోనూ ఉంది. తన ఊరిలో ఉన్న పాల పిట్ట కంటే కొంచెం పెద్దది. కర్ర్ కర్ర్ అంటూ అరుస్తోంది. "నేను నిన్నేమి చేశానే?" అని ముద్దుగా విసుక్కుంది అన్నపూర్ణమ్మ గారు. కొంచెం అవతలకి వెళ్లి పోపు డబ్బాలో అడుగున ఉన్న గింజలు లాన్ కి అవతల ఉన్న మట్టి మీద విసిరింది. నల్ల గసగసాలు, తెల్ల ఆవాలు. కోడలుకి ఏ దినుసులలో రుచి ఎక్కువుంటుందో తెలీదనుకుని, కొన్ని సీసాలు సగం నిండుగా ఉన్నా మట్టి మీద జల్లింది. ఇంట్లో కోడలు డయిటింగ్ అనుకుంటా సజ్జలూ, జొన్నలూ, రాగులూ, పొద్దు తిరుగుడు గింజలూ, ఎండు మొక్కజొన్న గింజలూ, బఠాణీలూ, ఇంకా ఏమిటో చాలా ఉన్నాయి. లేకపోతే కొడుకుతో డయిటింగ్ చేయించుతున్నదేమో? అన్నీ తీసుకు వెళ్లి బయట పారబోసింది.

పాల పిట్ట మళ్లీ కర్ర్ కర్ర్ మన్నది. తను ఎండబెట్టిన గుమ్మడి గింజలని నోటి నిండా పట్టుకుని చెట్టు కొమ్మ మీదకి ఎగిరింది.ఈ చెట్టు పదిహేనాళ్ల క్రితం తను వేసిన విత్తనమేనా అనుకుంది అన్నపూర్ణమ్మ గారు. పాలపిట్ట చెట్టు కొమ్మల సందులలోనుంచి ఒకొకక్క కొమ్మ పైకి గెంతుకుంటూ చెట్టు చిటారు కొమ్మ పైకి చేరి, చుట్టూ చూస్తోంది. పాల పిట్ట తనని ఎవరూ చూడటం లేదనుకున్నది కామోసూ, చెట్టు మీద నుంచి ఎగురుకుంటూ లాన్ అటువైపు మూలకి చేరింది. నోట్లో గింజలని కింద పడేసి, ముక్కుతో నేలని పొడవటం మొదలు పెట్టింది. ఒకొక్క గింజనూ సుతారంగా ఆ చిన్ని చిన్ని కంతలలో పెట్టి, మళ్లీ మట్టి కప్పి, ఒకొక్క కంత మీదా ఎండుటాకులను జాగ్రత్తగా కప్పుతోంది. "ఓసి నీ దుంపా తెగా, గింజలని దాచుకుని తర్వాత తింటావా" అని అనుకుంది అన్నపూర్ణమ్మ గారు.



"పాల పిట్ట"

పక్షులు చాలా చేరాయి. వేటికి కావాల్సినవి అవి తిన సాగాయి. గువ్వలు చేరి సజ్జలూ, రాగులూ తిన్నాయి. నాలుగు రకాలుగా ఉన్న పిచ్చుకలు కూడా చేరాయి. పాల పిట్ట మాత్రం కర్ర్ కర్ర్ అని అరుచుకుంటూ మొక్క జొన్న గింజలనీ, పొద్దు తిరుగుడు గింజలనీ పట్టుకు పోయి దాచుకుంటోంది. ఎందుకో ముచ్చట వేసింది. నలుపూ, నీలం రంగుల్లో ఉంది కాబట్టి కృష్ణుడు అని పేరు పెట్టుకుంది. మిగిలన పక్షులకు కూడా పేరు పెట్టుకుంది.

రాత్రికి కోడలుతో అన్నీ సరుకులూ తెప్పించి సీసాలు నింపింది. గుమ్మడి కాయ కూర పూర్తి చేసింది. రెండో రోజు ఏమీ తోచకపోతే కొన్ని గింజలు తీసుకువచ్చి ఈ సారి కొంచెం దూరంగా మట్టి మీద వేసింది. పక్షులు తయారయ్యి తిన్నంత తిని, మిగిలిన వాటిని జిమ్మటం మొదలుపెట్టాయి. అన్నపూర్ణమ్మ గారు గింజలు చెల్లా చెదురయ్యిన చోటల్లా నీళ్లు చిలకరించటం మొదలుపెట్టారు. కృష్ణుడు మాత్రం గింజలు దాచుకుంటున్నాడు. దొంగ ఎక్కడ దాచుకుంటున్నాడో అన్నపూర్ణమ్మ గారు కనిపెడుతూనే ఉంది. అక్కడ కూడా కొన్ని చోట్ల నీళ్లు చిలకరించారు. కృష్ణుడు కర్ర్ కర్ర్ మని అరిచాడు. ఇక వాటితోనే కాలక్షేపం.

రెండు నెల్లు గడిచాయి. మొక్కలు పెరగాయి. సజ్జలు, రాగులు, జొన్నలూ, మొక్క జొన్నలూ కంకులు వెయ్యటం మొదలు పెట్టాయి. గసగాలు పూలు గాలికి రెప రెపలాడుతున్నాయి, మిస మిసలాడుతున్నాయి. గుమ్మడి పూలు వెండి పళ్లెంలా మెరిసి, రెండో రోజుకు ముడుచుకుని, మూడో రోజుకి పింద వేస్తున్నాయి. ప్రొద్దు తిరుగుడు పూలైతే సూరీడుకి పోటీ పడుతున్నాయి. రకరకాల పూలు పలకరిస్తున్నాయి.

కొడుకూ కోడలూ ఏమిటో ఎప్పుడూ పరిగెడుతూనే ఉంటారు. ఇట్లా వస్తారు, అట్లా వెళతారు. ఇక తనకు కాలక్షేపం ఆ పక్షులూ, మొక్కలు మాత్రమే. మనవరాలు మాత్రం ఒక రోజు ప్రొద్దు తిరుగుడు పూలని చూసి "ఎంత పెద్ద పూలో" అని ఆశ్చర్యపోయింది. "నువ్వు ఈ మొక్కలని ఎప్పుడు పెట్టావు" అని నానమ్మని అడిగింది. "నేను పెట్టలేదు, కృష్ణుడు నాటాడూ" అని బదులిచ్చారు అన్నపూర్ణమ్మగారు.

చిన్న అన్నపూర్ణకి ఆశ్చర్యం పెరిగింది. కృష్ణుడెవరు అంటే, అన్నపూర్ణమ్మగారు మనవరాలిని లోపలికి తీసుకువచ్చి కొన్ని ప్రొద్దు తిరుగుడు గింజలిచ్చి డెక్ పైన పెట్టి పక్షులేం చేస్తాయో గమనించ మన్నది.

"అడిగో కృష్ణుడు" అన్నారు అన్నపూర్ణమ్మగారు.

"ఓ ఆ పక్షి పేరు కృష్ణుడా, ఇక్కడ 'బ్లూ జే' అంటారు నానమ్మ, ఇది మా కాలిఫోర్నియా రాష్ట్ర పక్షి" అన్నది చిన్న అన్నపూర్ణ.

"అవునా, మా ఆంధ్ర రాష్ట్ర పక్షి 'పాల పిట్టా, వీళ్లిద్దరూ అన్నదమ్ములన్నమాట, సరే ఏం చేస్తుందో జాగ్రత్తగా గమనించు" అన్నారు అన్నపూర్ణమ్మగారు.

కృష్ణుడు గింజలని జాగ్రత్తగా దాయటం గమనించింది చిన్న అన్నపూర్ణ.

"ఇప్పుడు వెళ్లి మనం కొంచెం నీళ్లు చిలకరిస్తే చాలు. అన్ని గింజలమీద చల్లవద్దు,, కొన్ని కృష్ణుడు తినాలి కూడా కదా. మనకంటే పక్షులకెక్కువ తెలుసు ఏ మొక్కలు ఎక్కడ పెట్టాలో, వాటినుంచి కూడా మనం నేర్చుకోవాలి. పిచ్చుకలైతే బోలెడు పురుగుల్ని తింటాయి, వాటిని కాపాడితే మనకు పురుగులు ఉండవు" .

"నానమ్మ, నువ్వు జీనియస్" అంది చిన్న అన్నపూర్ణ.

"మనం మట్టిని పోషిస్తేనే, మట్టి మొక్కలని పోషిస్తుంది, మొక్కలు మనల్ని పోషిస్తాయి. అందుకని మనం వంట చేసేటప్పుడు పనికి రానివి ఏవీ పారేయకూడదు" చెప్పారు అన్నపూర్ణమ్మగారు.

"మట్టిని పోషించటమేమిటి?" అడిగింది చిన్న అన్నపూర్ణ.

"నువ్వే ఆలోచించు"



'బ్లూ జే'

చిన్న అన్నపూర్ణ మొక్కల చుట్టూ తిరుగుతూ గుమ్మడి పాదు మొదలులో కూరగాయ ముక్కల తొడాలూ, కాఫీ పొడి, కోడి గుడ్డు పెంకులూ గమనించింది. అక్కడ ఒక పక్షి వానపాముల్ని ముక్కున వేలాడేసుకుని చూస్తోంది. "దీన్ని రాబిన్ అంటారు నానమ్మా" అన్నది.

"అవునా మా గోరువంక లాగా ఉన్నది, చూసావా మనం చాలా చాలా కొని ఇంటికి తెచ్చుకుంటాము. ఇక్కడ అందరూ మనకు అవసరం లేదని గార్బేజీ లో నింపి ఎక్కడకో పంపుతారు. మనం మట్టిని కొంచెం పోషిస్తే ఎన్నిటిని పోషిస్తున్నదో కదా!" అన్నారు.

"మరి నీకు ఏ గింజలు ఎక్కడ వెయ్యాలో ఎలా తెలుసుసు, ఎక్కడ చదువుకున్నావు?"

"చదువా చట్టుబండలా, రెండు కళ్లూ రెండు చెవులూ ఉన్నాయి కదా, అవే నేర్పించుతాయి. అవి నేర్పించినవి చెయ్యటానికి రెండు చేతులు ఉన్నాయి, అంతే"

"మొక్కలన్నీ ఒక వరసలో ఉంటే బాగుండేవి" అన్నది చిన్న అన్నపూర్ణ.

"ఏమో, కొన్ని కొన్ని మొక్కలు, చెట్లకీ స్నేహాలుంటయి అనిపిస్తుంది. వాటంతకవే పెరిగేటప్పుడు ఎప్పుడూ ఒక వరసలో పెరగవు కదా! కొన్ని మొక్కలేమో ఇంకొన్ని మొక్కలకి నీడనిస్తాయి. మన ఊరిలో అయితే, దొండ పాదుకి పందిరి వేసి, ఆ నీడలో అల్లం మొక్క వేస్తాము. ఇప్పుడు నువ్వే ఆలోచించు ఒక వరసలోఎందుకు లేవో, ఉండాల్సిన అవసరం ఉందో లేదో" అన్నారు అన్నపూర్ణమ్మ గారు.

పెద్దా, చిన్న అన్నపూర్ణలిద్దరూ ఆ రోజు నుండీ సాయంకాలం మొక్కలూ, పక్షులతో ఆడుకోవడం మొదలుపెట్టారు.

ఒక రోజు ఉత్సాహంగా స్కూల్ నుంచి వచ్చింది చిన్న అన్నపూర్ణ. "నానమ్మ నువ్వు చేసే పనులన్నీ, నీ పద్ధతులనీ గురించి పరిశోధించి ఒక వ్యాసం వ్రాసా. నువ్వు చేసేది పెర్మాకల్చర్, ఇది ఆర్గానిక్ గార్డెనింగ్ కంటే మంచిది. నీ గురించి కూడా వ్రాసా. నేను వ్రాసిన వ్యాసానికి "ఏ" గ్రేడ్ వచ్చింది. మా బయాలజి టీచర్ బార్బరా డిక్సన్, ఛాదస్తపు ముసలావిడి, ఇంతవరకు ఎవరికీ మంచి మార్కులు ఇవ్వలేదు. మా క్లాస్ వాళ్లనందరినీ వచ్చి నీ గార్డెన్ చూడమంది. ఆవిడ కూడా వస్తానన్నది".

"అవునా, అందరినీ నాకు కూడా చూడాలని ఉంది. నీ గ్రాడ్యుఏషన్ పార్టీకి తప్పకుండా పిలువు అందరినీ" అన్నారు అన్నపూర్ణమ్మ గారు మనవరాలు అన్నపూర్ణతో.

ఒక రోజు గ్రాడ్యుఏషన్ పార్టీ అని మొదలు పెట్టారు. చాలా మంది వచ్చారు. అందరికీ తను ఒక్కటే బోలెడు కూరలు చేసింది. అందరూ సాయంకాలం గాలికి లాన్ లోకి చేరుకున్నారు.

మనవరాలి స్నేహితురాలు ఒకతె గబ గబా గుమ్మడి కాయ దగ్గరకు పరిగెత్తి దాని మీద ఎక్కి కూర్చుని ,బుద్ధావతరంలాగ పోజు పెట్టి, సెల్ఫీ తీస్కోవటనికి ప్రయ్త్నించి., కిందకి దొల్లి పడింది. పిల్లలందరూ గలగలా నవ్వారు. పోటీలు పడి పడి ఫొటోలు తీసుకుని "గ్రాండ్మా ఈజ్ ఏ జీనియస్" అని చప్పట్లు కొట్టారు.

పార్టీకి వచ్చిన ఒక కోడలు "ఈ మొక్కలన్నీ ఇంత అందంగా ఉన్నాయి, మీ గార్డెనర్ ఎవరూ?" అని అడిగింది. కోడలు అనుమానంగాను, కొడుకు భయంగాను అన్నపూర్ణమ్మ గారి వంక చూశారు.

పిల్లందరికీ చిట్టి చిట్టి తేనె గారెలు పెట్టారు అన్నపూర్ణమ్మగారు.

"గ్రాండ్ మా ఈజ్ ఎ గ్రేట్ కుక్" అన్నారు పిల్లలందరూ. కోడలు వచ్చి ఇల్లంతా గందరగోళమేమిటని చిరాకు పడింది.

మీ టీచర్ భ్రమరాంబ గారు. రాలేదా అడిగారు అన్నపూర్ణమ్మ గారు.

“ ఓ, టీచర్ బార్బరా డిక్సన్? అమ్మో ఆవిడ రాకుండా ఉంటేనే మెరుగు, మళ్లీ మాకు ఇక్కడకూడా పాఠాలు చెపుతుంది.” అన్నారు పిల్లలందరూ.

"తప్పకుండా వస్తానన్నది నానమ్మా, కానీ ముసలావిడకదా తీరికగా వస్తుంది" చెప్పింది చిన్న అన్నపూర్ణ

కేక్ కట్ చెయ్యటం మొదలుపెట్టారు. ఒక్కసారిగా పోలీసు కార్ల మోతలు. పోలీసు వాళ్లు దూసుకు వచ్చారు. గబ గబా పరిగెత్తి లాన్ అవతల మొక్కల దగ్గరకి చేరారు. ఒకడు చేతికి తెల్లని మేజోళ్లు తొడుక్కుని గసగసాల పూలు పట్టుకున్నాడు. "పాపీ ఫ్లవర్స్, ఓపియం" అని అరిచాడు.

"గంజాయి అయిపోయింది, నల్లమందు పెంచుతున్నారా ఈసారి?" పకా పకా ఎగతాళిగా నవ్వుతూ తళుకుల గొలుసుకేలాడుతున్న చిన్ని పరుసుని అంత పెద్ద నడుము మీద నాట్యం చేయించింది ఇంకో కోడలు.

అన్నపూర్ణమ్మ గారు నవ్వుకుని గసగాల వంకాయ కూర గిన్నె పోలీసు వాడి ముందుకు తోసింది. క్రితం సారి చూసిన పోలీసు వాడే. బాగా లావయ్యి మొద్దుబారాడు. పోలీసు వాడు ఒక్కసారిగా వెన్నక్కి దూకి తుపాకి ముందుకు జాపాడు.

కొడుకునీ, తననీ మళ్లీ పట్టుకుపోయి పోలీసు కారులో కూర్చోబెడుతున్నారు. కృష్ణుడు దగ్గరగా వచ్చి కర్ కర్ అని అరిచాడు. "అయ్యో, కృష్ణుడికి ఈ పూట ఏమీ వెయ్యలేదే" అని నొచ్చుకున్నారు అన్నపూర్ణమ్మ గారు.

"ఎక్స్ క్యూజ్ మీ ఆఫీసర్, ఇదిగో ఇవి పాపి సీడ్ మఫిన్స్. ప్రతి గ్రాసరీ స్టోర్లోను దొరుకుతాయి. మరి వాళ్లందరినీ కూడా అరెస్ట్ చేస్తారా?" అని అడిగింది చిన్న అన్నపూర్ణ. వెనకే దాని స్నేహితులు నిలబడివున్నారు. "య్యా, మేమందరమూ కూడా ఇప్పుడు ఈ మఫిన్స్ తింటాము, మమ్మల్ని కూడా తీసుకు వెళ్లండి అని ముందుకువచ్చారు".

చిన్న అన్నపూర్ణ స్నేహితులని వారించింది. "నేను పోలిసులతో మాట్లాడతాను.మీరందరూ మీ సెల్ ఫోనులతో లైవ్ స్ట్రీం వీడియో ఫేస్ బుక్‌లోనూ, ట్విట్టర్‌లోనూ పెట్టండి. మన స్కూల్ వాళ్లల్లందరికీ మెసేజ్ పంపండి, ప్రతివొక్కళూ రీట్వీట్ చేసి వారికి తెలిసినవాళ్లకి దేశం మొత్తం, కాదు కాదు ప్రపంచం మొత్తం పంపమని చెప్పండి. మన టీచర్లకి, ప్రిన్సిపాల్కి కూడా మెసేజ్ పంపండి . టివి వాళ్లందరికీ కబురు చెయ్యండి, ఒక సీనియర్ సిటిజన్ని కారణం లేకుండా అరెస్ట్ చేస్తున్నారని."

—-X—-

భూగోళానికి ఆవలి వైపున, ఒకానొక తెలుగు పల్లెటూరిలో కోడి కూసింది.

ఒకానొక వనితా శిఖామణి అలవాటు ప్రకారం టివిలో భక్తి పాటలు పెట్టుకుని వాకిలి ఊడవడాం మొదలుపెట్టింది. ఇంటాయన ఖస్సుమంటూ లేచి టివి కట్టేయటానికి తయారయ్యడు.

ఇంతలో టివిలో భక్తి కార్యక్రమాలు ఆగి "పగులుతున్న వార్తలు, పగులుతున్న వార్తలు" అని మోగింది. టివి ఎనౌన్సర్ అందుకున్నాడు "ఇప్పుడే అందుతున్న సమాచారం, అమెరికాలో అమానుషం, ఒక భారతీయురాలు, ఒక పండు ముదుసలి, ఒక వృద్దురాలిని అమెరికా పోలీసులు అమానుషంగా, నిర్దయగా, ఏ మాత్రం కనికరం లేకుండా అరెస్టు చేస్తున్నారు. లైవ్ వెళ్దాము, మీరే చూడండీ. ఫేస్‌బుక్ లోనుంచి మీకు అందిస్తున్నాము. పగులుతున్న వార్తలు. అసలు అమెరికాలో మన భారతీయులకు, ముఖ్యంగా స్త్రీలకు, మన ఆడపడుచులకు, మన తల్లులకు ఇలాంటి అవమానాలు ఎందుకు జరుగుతున్నాయో అర్థంకావటంలేదు, ఈ విషయం గురించి చర్చించటానికి హక్కుల సంఘం గౌరవాధ్యక్షులు మొరమొర రావు గారు పోన్ లైన్లో వున్నారు, వారి అభిప్రాయం తెలుసుకుందాం. మొరమొర రావు గారు, మొరమొర రావు గారూ, హల్లో, హల్లో ..."

"అయ్యో అయ్యో టివి కట్టేయమాకు, అమ్మో అమ్మో మన అన్నపూర్ణమ్మ గారిని అమెరికాలో పోలీసులట్టుకెళ్తన్నారు, వామ్మో వామ్మో .." అరిచింది ఆ వనితా శిఖామణి వాకిలి ఊడవటం ఆపి. ఊరంతా చేరింది.

టివి లో చిన్న అన్నపూర్ణ వైపుకు తిరిగింది సెల్ ఫోన్ కెమేరా.

"యెవరీ పిల్ల, జీను ఫాంటేస్కుందికానీ అచ్చు మన అన్నపూర్ణమ్మగారిలాగా ఉందే" అన్నది ఇంకో వనితా రత్నం.

"యెవరో ఏంటి, తెలీట్ల, జీను పాంటేసింది కానీ పోలికలు తెలీట్లా, మన అన్నపూర్ణమ్మగారి మనవరాలే, చిన్న అన్నపూర్ణ"

చిన్న అన్నపూర్ణ చేతులు ముందుకి జాపి ఇంగిలీసులో ఏదో చెపుతాంది. పోలీసులు పెద రెక్కలు విరిచి సంకెళ్లెయ్యబోతున్నారు.

"పగులుతున్న వార్తలు, పగులుతున్న వార్తలు, అమెరికాలో అమానుషత్వం, అమెరికాలో భారతీయ సంతతి వారి నందరినీ అరెస్ట్ చేస్తున్నారు. హల్లో మొరమొర రావు గారూ, హల్లో, హల్లో .."

"అయ్యో అయ్యో చిన్న పిల్లను కూడా అరెస్టు చేస్తున్నారు .." నోళ్లు నొక్కుకున్నారు వనితలందరూ. పిడికిళ్లు బిగించారు మొగవాళ్లందరూ.

పాలపిట్ట ఒకటి "కిర్రు కిర్రు" మంటూ ఎగిరివచ్చి నేరేడు చెట్టు కొమ్మ మీద వాలి టీవి వంక చూసింది.

ఇంతలోటివీలో కనబడుతున్న గుంపులోనుంచి "డిక్సన్, నన్ను కూడా అరెస్ట్ చెయ్యి" అంటూ ఖంగు మంటూ ఒక గొంతు మోగింది. సెల్ ఫోన్ కెమేరా అటు తిరిగింది. ఒక ముగ్గు బుట్టు తల మామ్మాగారు వాకర్ తోసుకుంటూ చుట్టూ చేరిన గుంపును తోసుకుంటూ వస్తున్నారు. చుట్టూతా ఉన్న పిల్లలందరూ చప్పట్లు కొడుతూ "మిస్సెస్ డిక్సన్, టీచర బార్బరా డిక్సన్" అంటూ అరవటం మొదలు పెట్టారు.

చిన్న అన్నపూర్ణని అరెస్ట్ చెయ్యబోతున్న పోలీసు, ఒక్కసారిగా తల ఎత్తి చూసి "మామ్, అమ్మా, నువ్వు ఇక్కడికెందుకు వచ్చావు" అన్నాడు.

"ముందు నన్ను అరెస్ట్ చెయ్యి" అని వాకర్ వదిలి చేతులు చాపారు మిసెస్ డిక్సన్. పడిపోతున్న పెద్దావిడను పోలీస్ పడిపోకుండా పట్టుకున్నాడు."

"పగులుతున్న వార్తలు, పగులుతున్న వార్తలు. అమెరికాలో జాత్యాహంకారపు పోలీసులు, వాళ్ల జాతీయులను వదిలేసి మన బారతీయులను, ముఖ్యంగా స్త్రీలను, మహిళలను, అబలలను అరెస్ట్ చేస్తున్నారు. మొరమొర రావు గారూ, హల్లో, హల్లో .."

టివిలో ముగ్గుబుట్ట తల మామ్మగరు పోలీసు ఆఫీసర్ కళ్లలోకి సూటిగా చూస్తూ చెబుతున్నారు "వీళ్లందరూ నా స్కూల్లో పిల్లలు. ఈ అమ్మాయి పేరు "ఆన్నా", అనాపూరాన నా క్లాసులో ఫస్టు వచ్చింది. వాళ్ల గ్రాండ్మా చేసే పర్మాకల్చర్ గురించి చాలా మంచి వ్యాసం వ్రాసింది. ఆవిడని, ఆవిడ గార్డెన్ని చూద్దామని నేను కూడా వచ్చాను. ఓ ఐ యామ్ సారీ" అని పోలీసు కారులో ఉన్న అన్నపూర్ణమ్మ గారి చేతులు పట్టుకుంది. మళ్లీ పోలీసు వైపు తిరిగి, "ఆవిడని అరెస్ట్ చేస్తే, నన్ను కూడా చెయ్యి, కానీ ఈవీడ చేసిన తప్పేమిటో నాకూ అర్థం కావటంలేదు".

చిన్న అన్నపూర్ణ అందుకుంది "పాపీ సీడ్స్ తప్పయితే గ్రాసరి స్టోర్సులో ఎందుకు అమ్ముతున్నారు? అసలు కాలిఫోర్నీ రాష్ట్ర పుష్పం పాపీ కాదా? మిసెస్ డిక్సన్, మీ కొడుకుకి ఈ మాత్రం తెలీదా? మా అందరికీ బోలెడు పాఠాలు చెబుతారే, మరి మీ కొడుకుకి చెప్పలేదా? సీనియర్ సిటీజన్ అని కూడా చూడకుండా అరెస్ట్ చేస్తారా? ఆవిడ దగ్గర మనమందరమూ నేర్చుకోవలసింది చాలా ఉంది అని క్లాస్లో మీరే చెప్పారు కదా?" అంటూ నిలదీసింది. చుట్టూతా ఉన్న పిల్లలందరూ చప్పట్లు కొట్టారు.

పోలిసువాడికి తప్పలేదు, అన్నపూర్ణమ్మగారిని కారు దించేసాడు. టీచర్ బార్బరా డిక్సన్ అన్నపూర్ణమ్మగారిని కౌగిలించుకుంది. పిల్లలు మళ్లీ చప్పట్లు కొట్టారు. టీవీలో పాల పిట్ట ఒకటి "క్రర్ క్రర్రో" అంటూ రెక్కలు టప టపా కొట్టుకుని చప్పట్లు కొట్టింది. పల్లెలో నేరేడు చెట్టు మీది పాల పిట్ట "కిర్ర్ కిర్రో" అంటూ రెక్కలు టప టపా కొట్టుకుని చప్పట్లు కొట్టి ఎగిరిపోయింది.

"అమ్మో అమ్మో ఇక్కడ మన అన్నపూర్ణమ్మ గారిలానే చేసింది అక్కడి చిన్న అన్నపూర్ణ" అన్నదో మెచ్చులాడి.

"అక్కడి చిన్న అన్నపూర్ణ అంటావేంటీ, మన చిన్న అన్నపూర్ణే, చిన్న పిల్లప్పుడు చూసాం, మళ్లీ ఇప్పుడు ఇలా సూత్తన్నాం" అన్నది ఒక సునయన.

"పగులుతున్న వార్తలు, హల్లో, హల్లో, మొరమొర రావుగారు, అమెరికాలో ఏదో జరుగుతుందనుకున్నాం, ఏం జరగలేదు, ప్చ్. మిమ్మలని అనవసరంగా తెల్లారే లేపాం. క్షమించండి. మళ్లీ పొడుకోండి. ఇప్పుడు తప్పదు, మళ్లీ భక్తి మార్గం పాటలు వినండి."

# పుత్రేషణ అనే తల్లి తాపత్రయం

విద్వేశ్వరి

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

**రాజమ్మకి ఎనభై** అయిదేళ్ళు వచ్చాయి. వార్ధక్యం వల్ల నాలుగైదేళ్ళ నుంచి మోకాళ్ళ నెప్పులు, గట్టివస్తువులు నమలలేకపోవటం వంటి కొన్ని చిన్న చిన్న బాధలు వచ్చాయి గానీ ఈ రోజుకీ తన పనులు తానే చేసుకుంటుంది. ఆరోగ్యంగానే తిరుగుతోంది. అయిదేళ్ళ క్రితం కొడుకులు ముగ్గురూ, కూతుళ్ళు ఇద్దరూ వాళ్ళలో వాళ్ళు సంప్రదించుకుని తల్లి దగ్గరకు వచ్చారు.

"అమ్మా, నాన్నగారికి చేసినట్టే నీకూ ఎనభైయవ పుట్టినరోజు చేద్దామనుకుంటున్నాం. నాన్నగారితో చెపితే 'అలాగే మీ యిష్టం' అన్నారు" అని చెప్పారు.

తనకోసం ఏదైనా చేస్తామని, తెస్తామని పిల్లలు అన్నప్పుడల్లా "నాకెందుకర్రా ఇవన్నీని?" అంటుంది. అలాగే అలవాటుగా ఇప్పుడుకూడా, "నాన్నగారి పక్కన నన్నూ కూర్చోబెట్టి చేశారుగా, మళ్ళీ ఎందుకు?" అంది.

"అదేమిటమ్మా, నాన్నగారి ఎనభైయవ పుట్టినరోజు చేశాం. సహస్ర సంపూర్ణ చంద్రోదయ దర్శనం ఎనభై రెండేళ్ళప్పుడు చేశాం. తొంభైయవ పుట్టినరోజు కూడా చెయ్యాలనుకుంటున్నాం. ఇప్పుడు నీకు చెయ్యాలనుకున్నాం. అప్పుడు నువ్వు నాన్నగారి పక్కనుంటే ఇప్పుడు ఆయన నీ పక్కనుంటారు."

అందరూ కలసి నిర్ణయించేశారు.

పిల్లలందరూ పట్టుబడితే కాదనలేకపోయింది. ఆ తరవాత నుంచే లేస్తుంటే కాళ్ళు పట్టుకుపోవటం, అప్పుడప్పుడు చూపు మందగించి దూరంగా ఉన్న వస్తువులు కనిపించకపోవటం మొదలైంది. 'నిజంగా ముసలిదాన్నైపోయానా?' అని అనిపించసాగింది. తన పుట్టిన రోజు వేడుక జరిగిన ఏడాదికి భర్త పోయాడు.

"నేను పుట్టినరోజు చేసుకోకపోతే ఆయన ఇంకా కొన్నాళ్ళు బ్రతికేవారేమో?" అనే సందేహం రాజమ్మను కొన్నాళ్ళు వేధించింది. ఆ బాధ మరీ గుండెల్ని తొలిచేస్తుంటే తట్టుకోలేక ఒకసారి పెద్దకూతురు అన్నపూర్ణ వచ్చినప్పుడు ఆమె ముందు తన మనసులో మాట బయటపెట్టింది.

"నీకేమన్నా పిచ్చా అమ్మా! దానికి, దీనికి సంబంధం ఏమిటి? నాన్నగారికి తొంభైఏళ్ళు దగ్గరపడ్డాయి, అదృష్టవంతుడు గనుక మంచంమీద తీసుకోకుండా అనాయాసంగా వెళ్ళిపోయాడు. అయినా నీ పుట్టినరోజు తరువాత ఏడాది గడిచాక ఆయన పోయాడు. ఇలాంటి పిచ్చిపిచ్చి ఆలోచనలతో నీ మనసుపాడుచేసుకోకు. ఎవళ్ళ ఆయుర్దాయం ఎన్నాళ్ళో ఆ దేవుడు ముందే రాసిపెడ్తాడు"

కొంత ప్రేమ, కొంత జాలి కలిపి మందలించింది.

ఎంతో ప్రయత్నం చేసి ఆ ఆలోచనలలోనించి కొన్నాళ్ళకు మనసు మళ్ళించుకోగలిగింది. అప్పుడింక రాజమ్మ ఆలోచనలన్నీ పిల్లల మీదకు పోవటం మొదలైంది.

ఇన్నేళ్ళూ ఎవరి ఉద్యోగాలు, ఎవరి సంసారాలూ వాళ్ళు చేసుకుంటూ సుఖంగా ఉన్నారు. ఏవో చిన్న చిన్న సమస్యలు, అనారోగ్యాలు వచ్చినా వాళ్ళలో వాళ్ళు పరిష్కరించుకుంటున్నారు. ఒకళ్ళకి ఒకళ్ళు సాయంగా ఐకమత్యంగా ఉంటున్నారు. తన మనుమలందరు బుద్ధిమంతులు, చక్కగా చదువుకుని పైకి వచ్చారు. వాళ్ళల్లోనూ పెళ్ళయి సంసారం చేసుకుంటున్న వాళ్ళున్నారు. అయిదుగురు పిల్లల కుటుంబాలను చూసి రాజమ్మ, భర్త తృప్తిపడేవారు. రాజమ్మ భర్తకి ఎనభైయవ పుట్టినరోజు పండుగ చేశాక, ఇంక స్వంత ఊరు, స్వంత ఇల్లు అంటూ మీరిద్దరే ఉండటానికి వీల్లేదని పిల్లలు పట్టుపట్టారు. అందరూ కలసి పెద్దకొడుకు దగ్గర ఇద్దరూ స్థిరంగా ఉండాలని, ఓపికని బట్టి మిగతా పిల్లల్ని వచ్చి చూడవచ్చునని తీర్మానించారు. భర్త మరణం తరవాత రాజమ్మకి పిల్లల గురించిన ఆలోచనలు ఎక్కువయ్యాయి.

"ఇవాళ ఇంటికి డ్రైవ్ చేసుకుని వస్తుంటే ఎడం వైపున ఉన్న ఆటో బాగా దగ్గరకి వచ్చేదాకా కనిపించలేదురా. ఒక్క క్షణం కంగారు పడ్డాను. వెంటనే పక్కకి తిప్పేశాననుకో" పెద్దకొడుకు రాఘవ సాయంత్రం తనని కలవాలని వచ్చిన తమ్ముడితో చెప్తున్నాడు.

"కేటరాక్ట్ ముదిరిందేమో చూపించుకోవాలేమో అన్నయ్యా. ఎప్పుడు వెళ్ళాలనుకుంటావో చెప్పు. నేను వచ్చి తీసుకెడతాను. చీకటిపడ్డాక కారు డ్రైవ్ చెయ్యకు. పిల్లల్నెవరినైనా తీసుకుని వెళ్ళు." అన్నగారికి సలహా ఇచ్చాడు మురళి.

ఆ సంభాషణ విన్న రాజమ్మ మనసు కలతపడింది.

రాఘవ ముందు పుట్టాడు గనుక పెద్దవాడయ్యాడు గాని, వాడికేమంత వయసైందని? ఇంక డెబ్బై ఏళ్ళు కూడా రాలేదు వాడికి. అప్పుడే కన్ను కనిపించకపోవటం ఏమిటి? అప్పుడే ముసలివాడైపోయాడా? తన భర్తకి చివరిదాకా కళ్ళకి ఏ సమస్యా లేదు. తన దుద్దుశీల కిందపడిపోయినా ఆయన కళ్ళకి అది ఏమూలనుందో కనిపించేది. తనకి మొన్న మొన్ననే ఇంకా పదేళ్ళు కూడా కాలేదు, కంటికి శుక్లాల ఆపరేషన్ చేసి. రాఘవకి మా పోలిక రాలేదా?

పెద్ద కొడుకు గురించిన ఆలోచనలే నిలవనియ్యకుండా చేస్తుంటే మూడోవాడు భద్రానికి ఆపరేషన్ జరిగిందన్న వార్త పూర్తిగా మనసుకి స్థిమితం లేకుండా చేసింది. వాడికి కడుపులో ఆపరేషన్ జరిగిందని భద్రం ఆస్పత్రినుంచి ఇంటికి వచ్చాక రాజమ్మకి చెప్పారు. ఎంత కంగారు పడిపోయిందో. ఆ కంగారులో ఇన్నాళ్ళు తనకి చెప్పనందుకు కోపం తెచ్చుకుంది.

"ఏం భయం లేదత్తయ్యా ఇది కత్తితో కడుపు కోసే ఆపరేషన్ కాదు. కరెంట్‌తో చేస్తారు. ఆ రోజంతా మీ పెద్దబ్బాయి, మురళి, పిల్లలంతా అక్కడే ఉన్నారు. ఇంటికి వచ్చేశాడుగదా, లేచి కూర్చుంటున్నాడు. మనం రేపు వెడదాం. మీరో నాలుగురోజులు భద్రం దగ్గరుండండి. అతను లేచి నడవటం చూసి వద్దురుగాని" పెద్దకోడలు చెప్పినా, భద్రాన్ని చూసేదాకా తన మనసులో అలజడి తగ్గలేదు.

అక్కడున్నన్నాళ్ళు మాటిమాటికీ, "ఏం నాన్నా నెప్పిగా ఉందా? డాక్టరు దగ్గరకు వెళ్ళాలా?" అని అడుగుతూనే ఉంది.

"నెప్పి లేదమ్మా, అంతా తగ్గిపోయింది. అప్పుడప్పుడు ఒంగిలేస్తుంటే నరంలాగుతుంది. నాలుగురోజుల్లో అదే తగ్గిపోతుందన్నారు డాక్టరుగారు."

భద్రం ధైర్యం చెప్పినా పిల్లవాడు బాధపడుతున్నాడేమో తను భయపడుతుందని నిజం చెప్పటంలేదేమో అని అనుమానపడేది.

ఆ బెంగ తీరింది. భద్రం మళ్ళీ మామూలుగా ఆఫీసుకి వెడుతున్నాడని కాస్త ఊపిరి తీసుకునేవేళకి, చిన్న కూతురు రాధమ్మ భర్త ఆఫీసులో మెట్లమీదనుంచి పడ్డాడని, కాలు విరిగితే ఆపరేషన్ చేశారని మరొక కబురు తెలిసింది. ఆపరేషన్ అయిపోయిన మర్నాడు తనకి చెప్పారు.

"బావకి ఏక్సిడెంట్ అయిందని, ఆస్పత్రిలో చేర్చామని రాధ ఫోన్ చేస్తే నేను, సరోజ వెంటనే వెళ్ళాం. ఆపరేషన్ అయాక రెండురోజులు ఉండి నేను వచ్చాను. ఇప్పుడేమీ ప్రమాదం లేదు. కాకపోతే రెండు నెలలు మంచం మీదే ఉండాలి. తోడుగా ఉంటుందని సరోజని అక్కడే వదిలి వచ్చాను. నువ్వేం కంగారుపడకు" ఊర్నించి వచ్చాక మురళి వచ్చి పక్కన కూర్చుని వివరంగా అన్నీ చెప్పాడు.

"ఇంత జరిగినా నాకెందుకు చెప్పలేదురా?" అంది నిష్ఠూరంగా.

"కంగారు పడతావని చెప్పలేదమ్మా, అన్నయ్య, అక్కకూడా ఆపరేషన్ అయాక నీకు చెప్తామన్నారు"

మురళి ఎంత ధైర్యం చెప్పినా రాజమ్మ మనసు రాధ దగ్గరకు వెళ్ళిపోయింది.

'చిన్నపిల్ల, మంచంలో ఉన్న రోగికి ఎన్ని చూడాలో, ఎలా చేయగలడో దాని పిల్లలిద్దరూ ఇంకా చదువుకుంటున్నారు. ఎన్నాళ్ళని కాలేజీలు మానేస్తారు. తను వెళ్ళి సాయం చెయ్యాలి, కనీసం తోడుగానైనా ఉండాలి. మనిషికి మనిషి తోడు' ఇలా ఆలోచించి

"నన్ను రాధ దగ్గరికి పంపరా, సాయంగానైనా ఉంటాను" అంది రాఘువతో.

"ఇంకో వారంలో చిన్న బావని ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేస్తారమ్మా నువ్వు, నేను భాగ్యం అప్పుడు వెడదాం. కావాలంటే నువ్వు కొన్నాళ్ళు రాధ దగ్గరుందువుగాని" కొడుకు సమాధానం విని నిరాశపడింది మనసేమో రెక్కలు కట్టుకునైనా రాధమ్మ దగ్గరకు వెళ్ళాలని ఆరాటపడిపోతోంది. కనీసం పిల్లకి తోడుగానైనా ఉండలేనా, పని చెయ్యలేకపోవచ్చుగాని- అనుకుంది

ఆ తరవాత రాఘువ భార్యతో "అమ్మ రాధ దగ్గరకు వెడతానంది, మనతోనే తీసుకెడతానని అన్నాను" అని చెప్పటం వింది.

"ఆవిడ ఇప్పుడు వెళ్ళటం ఎందుకు? ఇప్పుడు వెడితే రాధకి అత్తయ్యని చూసుకోవటం ఒక పని, అదొక టెన్షను రాధ ఆస్పత్రిలోనే ఉండి పోతోందని చెప్పాడు మురళి" కోడలి జవాబు వినిపించింది.

నా బాధ వీళ్ళకి అర్థంకావటం లేదు, కూతురికి ఇంత కష్టం వస్తే నేను సుఖంగా ఇక్కడ కూర్చోనా! పిల్లలకి ఎలాంటి సాయం చెయ్యలేని చేతకానిదానినా? రాజమ్మకి కోపం, బాధ తన్నుకొచ్చాయి.

పెద్దకూతురు అన్నపూర్ణ తనని చూసేందుకు వస్తే, "చూడవే మీ అందర్నీ నేను పెంచాను. ఇవాళ వీళ్ళు నువ్వేం చెయ్యగలవు, నువ్వెందుకు అంటున్నారు. ఏం జరిగినా నాకు ఎప్పటికోగాని చెప్పటంలేదు" అంటూ తన బాధ వెళ్ళబోసుకుంది.

"అమ్మా, నీ దగ్గర ఎవరూ ఏమీ దాచటంలేదు. కాకపోతే వెంటనే చెపితే నువ్వు కంగారు పడతావని, నీ ఆరోగ్యం చూసుకోవాలని చెప్పటంలేదు తప్ప నీకు చెప్పకూడదని కాదు. నేను రేపు బయలుదేరి వెళ్ళి మరిదిగారు ఇంటికి వచ్చాక వస్తాను. నేను వెళ్ళాక సరోజ తిరిగి వస్తుంది. రాధ ఆడపడుచుకూడా వచ్చి ఉందట. నువ్వేం బెంగపడకు. రాధకి ఎవరో ఒకళ్ళం సాయంగా ఉంటున్నాం. దాన్ని, మరిదిగారిని అందరూ జాగ్రత్తగానే కనిపెట్టి ఉంటున్నారు" చాలాసేపు దగ్గర కూర్చుని ధైర్యం చెప్పింది. రాధ దగ్గరకి వచ్చిన రెండోరోజునించి రాజమ్మకి మరో బాధ ఎదురైంది. రాధ మెట్లు కష్టంగా దిగటం చూసింది.

"ఎందుకమ్మా కుంటుతున్నావు? కాలికి దెబ్బతగిలిందా?" అని అడిగింది.

"దెబ్బకాదమ్మా. ఆర్నెల్లై మోకాలు నెప్పి వచ్చింది. ఆర్థరైటీస్ అన్నారు. గబగబా నడవటం, కింద కూర్చుని లేవటం ఇబ్బందిగా ఉంటోంది"

"అదేమిటే ఈ వయసులో నీకు మోకాలు నెప్పి ఏమిటి? అరవై యేళ్ళు దాటాక గాని మోకాళ్ళ నెప్పులు రావంటారు. నాకు, మీ నాన్నకి ఎనభై ఏళ్ళు దాటాక మోకాళ్ళ నెప్పులు వచ్చాయి" ఆశ్చర్యపోయింది రాజమ్మ.

"మీరు అదృష్టవంతులమ్మా, మీ అలవాట్లు మీ తిండి అలాంటివి. ఈ రోజుల్లో రోగాలకి వయస్సుతో పనిలేదు. ఏ రోగం ఏ వయసులోనైనా రావచ్చు. అయినా నా వయస్సేం తక్కువా! నాకూ ఏభై ఏళ్ళు వస్తున్నాయి ఇంకో రెండేళ్ళకి"

రాధ సమాధానానికి విస్తుపోయింది.

రాధకి ఏభై యేళ్ళా? నిన్న మొన్నటి పిల్ల. ఇలా కష్టపడతూ కుంటుకుంటూ మంచంలో ఉన్న మనిషికి సేవలు చేస్తుంటే చూడటం కష్టంగా ఉంది.

"పోనీ ఎవరైనా మనిషిని పెట్టుకోకూడదే?" అంది ఉండబట్టలేక.

"ఎవరొస్తారమ్మా, ఆయన కొద్దిగా లేచి కూర్చుంటున్నారు. బాత్‌రూమ్ అవసరాలకి పిల్లలిద్దర్లో ఎవరో ఒకరు ఉంటున్నారు. ఇంక అన్నం పెట్టటం కాఫీ ఇవ్వటం ఇదేగా నేను చేస్తున్న పనులు" తేలికగా కొట్టిపారేసింది.

ఒకరోజు రాధ స్నేహితురాలు చూడటానికి వచ్చింది. నాన్నని చూడమని చిన్నకొడుకుని కూర్చోబెట్టి స్నేహితురాళ్ళిద్దరూ గదిలో కూర్చుని మాట్లాడుకున్నారు. గదిలో స్నేహితురాలితో మాట్లాడుతున్నా రాధ మధ్య మధ్యలో వచ్చి చూసి వెడుతోంది.

వెళ్ళేముందు ఆ అమ్మాయి వచ్చి కొంతసేపు రాజమ్మ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పింది మాటల మధ్యలో.

"పెద్దమ్మగారూ మీరెలా ఉన్నారు? మీరుంటే రాధకి ధైర్యంగా ఉంటుంది" అంది.

"ఉండి నేనేం చేస్తున్నానమ్మా?" అంది రాజమ్మ.

"మీరేం చెయ్యాలండీ? మీరుండటమే ఒక పెద్ద ఆసరా. రాధ చాలా అలసిపోతోందని మీరు బాధపడుతున్నారా? కన్నతల్లిగదా మీరలా అనుకోవటం సహజం. కానీ రాధ తన భర్తకే చేస్తోంది. వేరెవరికో ఆయన్ని చూడమని ఎలా అప్పచెపుతుంది? మీరనుకుంటున్నట్టు రాధ నీరసపడిపోవటంలేదు. తన ఆరోగ్యం విషయం తను జాగ్రత్తగానే చూసుకుంటోంది. దిగులుపడకండి" మరికొంతసేపు కూర్చుని ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

"నీ స్నేహితురాలికి నా గురించి ఏం చెప్పావే?" ఆమె వెళ్ళిపోయాక రాధని అడిగింది.

"ఏం చెప్తానమ్మా, నువ్వు నా గురించి ఊరికే తాపత్రయపడిపోతున్నావని అన్నాను. అందుకే నీతో అలా మాట్లాడి ఉంటుంది."

"అమ్మని గదే నీ గురించి బాధపడకుండా ఎలా ఉండగలను?"

"అమ్మవి గనకే నీ గురించి నా బాధ. రాత్రి ఎంత లేటయినా నేను అన్నం తినేవరకు నువ్వు మేలుకునే ఉంటావు. నేను నిద్రపోతున్నానో లేదో అని మధ్య రాత్రి లేచి వచ్చి చూస్తావు. నీ పనితో నాకేం బాధలేదన్నా వినవు. నీక్కూడా వయస్సు పైబడుతున్నా నాన్నకి ఏ అవసరం వచ్చినా నువ్వే లేచి ఆయనపని చూసేదానివికాదా? అలాగే నేనూ నా భర్తకి సేవచేస్తే ఎందుకు అలసిపోతాను. నీలాగే నేనూ నా పని నేను చేస్తున్నాను. దీనికి నువ్వెందుకు బాధపడిపోతావు?"

రాధ మాటలు వింటూ రాజమ్మ అలాగే ఉండిపోయింది. కొంత సేపైనాక, రాధ ఏం చెపుతోందో అర్థమై రాజమ్మ మొహంలో చిరునవ్వు వెలిగింది.

"బాగా చెప్పావే. రాజమ్మ కూతురు రంగనాథం భార్య అని గుర్తుచేశావు. నేనావిషయం మర్చిపోయి నిన్ను నా కూతురిలాగానే చూడటం వల్లనే ఈ బాధంతా. అందుకే నువ్వు కష్టపడిపోతున్నావని నేననుకుంటూ బాధపడుతున్నాను. కానీ అమ్మా నేను మిమ్మల్ని కన్నతల్లిని. మీరెప్పుడూ నాకళ్ళకి నా ఒళ్ళో ఆడుకుంటున్న పిల్లల్లానే కనిపిస్తారు. రాఘవ కళ్ళకి శుక్లాలు వచ్చాయన్నా, భద్రానికి ఆపరేషన్ జరిగిందన్నా, మీ ఆయనకి కాలు విరిగిందన్నా, నా పిల్లలకి కష్టంకలిగినందుకు నా మనసు విలవిల్లాడిపోతుంది. నీకు మోకాళ్ళ నెప్పులంటే మీకింత వయసు వచ్చిందా అని నాకు ఆశ్చర్యం వేస్తోంది. అది నా తత్త్వమేమో? కన్నతల్లి పడే తాపత్రయమేమో? నేనున్నంతకాలం నా పిల్లల గురించిన ఈ తాపత్రయం ఆరాటం నాతోనే ఉంటాయి."

రాజమ్మ చెప్పటం ముగించగనే రాధ వచ్చి తల్లి భుజాలు చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకుంది.

"పిచ్చి అమ్మా, నువ్విలాగే ఉండాలి. కానీ మామూలంగా నువ్వు ఆరోగ్యం పోగొట్టుకోకూడదు. నీ తాపత్రయం మాకు ధైర్యాన్నిస్తుంది. మమ్మల్ని గురించి ఆలోచించే, మాకు అండగా ఉండే అమ్మ మాకుంది అన్న భరోసా మా కష్టాల్ని, సమస్యల్ని తేలికగా దాటిస్తుంది. నువ్వు పక్కనుంటే చాలనిపిస్తుంది. అలా అని నిన్ను మా సమస్యలలోకి లాగలేము. అందుకే నీవు బాధపడే ఇలాంటి విషయాలు నీకు ఆలస్యంగా చెప్తాం తెలిసిందా?"

"మీ నాన్న ఎప్పుడూ ఒకమాట అనేవారు. మనిషి దారేషణ, పుత్రేషణ, ధనేషణలనుండి తప్పించుకోలేడని, ఇవన్నీ భ్రమలని నాకు ఇవి ముఖ్యంగా పుత్రేషణ భ్రమకాదనిపిస్తుంది. ఎందుకంటే నేను అనుభవిస్తున్నాను కనుక."

రాజమ్మ ప్రేమగా కూతుర్ని కౌగిలించుకుంది.

# స్వల్పజ్ఞుడు

తాడికొండ కె. శివకుమార శర్మ

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

"సహస్ర శీర్షా పురుషః| సహస్రాక్ష స్సహస్రపాత్|" అంటుంది వేదం.

"ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు," అన్నాడు అన్నమయ్య.

"ఎవరని నిర్ణయించిరిరా, నిన్నెట్లారాధించిరిరా?" అనడిగాడు త్యాగరాజు.

చర్చ్‌లో లైన్లో నిల్చొని ఆ ముగ్గురూ ఏమన్నారో మురళి గుర్తు చేసుకోవడానికి కారణం అతని చేతిలో వున్న ఎనిమిది పేజీల ప్రోగ్రాం.

ఆ ప్రోగ్రాం అతణ్ణక్కడికి రప్పించిన అతని పక్కింటి — టెక్నికల్‌గా చెప్పాలంటే ఇప్పుడు నటాషా పక్కింటి — డేవిడ్‌ది. అంటే, చెయ్యి పట్టుకునో, ముక్కుకి తాడేసో, ప్రలోభపెట్టో డేవిడ్ మురళిని లాక్కొచ్చాడని కాదు. 'ఎప్పుడో, ఎక్కడో తెలుసుకుని వచ్చి నిన్ను నువ్వు గౌరవించుకో' అని మాటలతో కాకుండా మురళి మనసులోకి తంతిని పంపి. అంతే!

వేదాలు తండ్రి గొంతులో ఘోషిస్తున్నా, త్యాగరాజు కీర్తనలు అక్కయ్య గొంతులో వెలువడుతున్నా, అన్నమయ్య కీర్తనలు "జో అచ్యుతానంద"తో మొదలుపెట్టి చిన్నప్పుడు ఉయ్యాలలూపిన తల్లి గొంతులో వినబడుతున్నా వాటిని పట్టించుకోవాలని అయిదేళ్ల క్రితందాకా మురళికి ఏమాత్రం అనిపించనూలేదు, అవకాశమూ రాలేదు కూడా; అదే, నటాషా "వుయ్ నీడ్ టు సెపరేట్!" అనేదాకా. ఇరవయ్యేళ్ల సాహచర్యం విధించిన అయిదేళ్ల ఎడబాటుకు పునాది లేసింది.

"వేర్ విల్ యూ లివ్?" అనడిగాడు మురళి.

"రైట్ హియర్. యూ నీడ్ టు గెటవుట్!" అన్నది ఆ 'యూ'ని వత్తి పలుకుతూ.

అమెరికాలో ఇలాంటి పరిస్థితుల్లో మురళికే గాక ఏ మగాడికయినా గానీ 'నా యిల్లు, నా సంపాదన!' అనగలిగే అవకాశాలు తక్కువ. పైగా, నటాషా ఏమీ సంపాదించకుండా వూర్కేనే కుర్చోలేదు. ఆమె కాలక్షేపానికి మొదలుపెట్టిన రియాల్టర్ వుద్యోగం రియలెస్టేట్ బూమ్‌లో డాలర్ల వర్షాన్ని కురిపించింది. ఇప్పుడంత రాబడి లేకపోయినా ఒక ఇంటిని అమ్మితే చాలు – అయిదంకెల్లో కమిషనొస్తుంది. దానికి తోడు పిల్లలు శ్యామ్‌కీ, కాత్యాకీ వుండడానికి విశాలమయిన చోటు అక్కడే దొరుకుతుంది; తగిన చోటు కూడా అదే. ఇప్పుడా ఇద్దరూకూడా సెలవులకి తప్ప ఆ యింటికి రారు, అది వేరే సంగతి. ఈ పరిస్థితు లతన్ని రామయ్య వైపు తోశాయి.

ఈ రామయ్యకి చేతిలో కోదండం లేదు గానీ, వేదాన్నీ, ఆ వాగ్గేయకారులనీ పట్టించుకునే అవకాశాన్ని మాత్రం తాళ్లతో కట్టిపడేసి మురళి ముందు హాజరు పరచే శక్తి వుంది. మురళిని కట్టిపడేసి వేదం ముందూ, వాగ్గేయకారుల అసమాన ప్రతిభల ముందూ హాజరు పరచగల శక్తి వుందన్నా తప్పులేదు. భక్తెక్కువయిందని రామయ్యని బయటి గ్గెంటింది అతని భార్య. అమెరికాలో బొట్టు పెట్టుకుని ఆఫీసు కొస్తాడని చెప్పగానే రామయ్య ఎవరికయినా ఇట్టే అర్థమయిపోతాడు. ఇద్దరూ ఒక చిన్న ఎపార్ట్‌మెంట్లో సర్దుకోవడానికే గాక ఒకే కార్లో రోజూ కలిసి ఆఫీసుకు వెళ్లిరావడానికి వీలయ్యింది. వేరేగా వున్నా ఇంటి ఖర్చూ, పిల్లల ఖర్చూ, వాళ్ల అవసరాలూ భరించాలి గనుక 'వాళ్ల ' రెండు కార్లు కాస్తా 'అతని ' రెండు కాళ్ల బండీగా మారడంతో మురళికి కారు అవసరం ఎంతో వుంది. రెంటికీ కలిపి అతను చెల్లించవల్సిన ధర, రామయ్య కార్లో కూర్చున్నంతసేపూ ఆడియోలో మాత్రమే కాక, ఎపార్ట్‌మెంట్లో వున్నంత సేపూ టీవీలో విడియోలో కూడా భక్తి చానెల్లో ప్రవచనాలు వినడం. టీవీ కూడా రామయ్యదే మరి.

మురళి అలా చర్చ్ లో లైన్లో నిల్చోవడానికి దాదాపు రెండు గంటల ముందు –

భుజంమీద చెయ్యిపడితే ఆశ్చర్యపోతూ చూసి, "హాయ్ కాత్యా!" అన్నాడు మురళి. "స్టాప్ కాలింగ్ మి బై దిస్ ఫన్నీ నేమ్, ఒకే, డాడ్? మై నేమ్ ఈజ్ కాట్యా!" కోపంగా అన్నది అతని పక్కన కూర్చుంటూ. చుట్టూరా చాలామంది వున్నారని గమనించి చెవిలో మెల్లిగానే అన్నది. నటాషా అతణ్ణి ఇంట్లోంచి వెళ్లగొట్టినప్పటినించీ శామ్యూల్‌ని శామ్ అని గాక శ్యామ్ అనీ, కాట్యాని కాత్యా అనీ అనడం మొదలుపెట్టాడు. మురళి గొంతులో ఆ పిలుపు వినడానికి శామ్ అవకాశ మివ్వలేదు గానీ, అప్పుడప్పుడూ కాట్యాని కలిసినప్పుడు మురళి అలా పిలవడం, తనకు నచ్చడంలేదని కాట్యా చెప్పడం జరుగుతూనే వున్నాయి.

"సీ, కాత్యా ఈజ్ షార్ట్ ఫర్ కాత్యాయని. అలాగే, శామ్ కంటే, శ్యామ్ అనడం నాకు బావుంటుంది. థింక్ ఆఫిట్ యాజె నిక్ నేమ్," మురళి జవాబిచ్చాడు.

"ఎన్ని వందలసార్లో చెప్పావ్. వుయ్ డోంట్ లైకిట్, ఒకే? చిన్నప్పటినించీ అలవాటు చెయ్యాల్సింది!" అన్నది కాత్యా కోపంగా చూస్తూ. 'ఇది కాబట్టి ఇంకా నా పక్కనే కూర్చుంది. శ్యామ్ అయితే ఈపాటికి విసురుగా లేచి వెళ్లిపోయేవాడు,' అనుకుని మురళి నిట్టూర్చి చుట్టూ కలయజూశాడు. అతననుకున్నట్టుగానే దూరంగా నటాషా, శ్యామ్ కనిపించారు. 'ఇండియాలో అయితే మా నలుగురిదీ మంచి రంగనే అనేవాళ్లు – నటాషాది నాకంటే కొంచెం తక్కువ రంగే అయినా గానీ. ఇక్కడ మాత్రం, తెల్ల కలువల మధ్యలో నల్ల కలువలం నలుగురం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాం,' అనుకున్నా డతను.

కమల్‌హాసన్ "మరోచరిత్ర"లో చెప్పిన నల్లపొణ్ణు నటాషా.

"అక్కడ వున్న అమ్మాయినే చేసుకోవాలంటే 'అమెరికా అమ్మాయి సినిమాలో లాగా తెల్లపిల్ల దొరకలేదట్రా?" అనడిగారు మురళి బాగోగులు కోరుకుంటున్నామన్న అతి దగ్గర బంధువులు కూడా. అప్పటికే అతని అక్కయ్యకి పెళ్లవడం, ఆమెకి పిల్లలు కూడా పుట్టడం వాళ్ల అదృష్టమనుకున్నారు అతని తల్లిదండ్రులు.

సిరి తా వచ్చిన వచ్చును, సరసంబుగ నారికేళ సలిలము భంగిన్ – అన్న లైన్లు గుర్తుకొస్తయ్ నటాషా తన జీవితంలో ప్రవేశించడం గూర్చి మురళి ఆలోచించినప్పుడల్లా. ఎప్పుడో చిన్నప్పుడు నేర్చుకున్న పద్యం. ఇలాంటి పద్యాలని అతని మెదడులోంచి తవ్వి బయటికి తీసినవి రామయ్య వల్ల చెవిలో పడిన ప్రవచనాలు. నటాషా అతణ్ణి వెళ్లగొట్టిన మొదట్లో అవి అతనికి కొద్దిగా శాంతినిచ్చెయ్.

వింటున్న కొద్దీ వేదాంతం, తత్త్వం, భక్తీ అన్నీ కలగలిపి వుంటాయ్ ఈ ప్రవచనాల్లో నని మురళికి త్వరగానే అర్థమయింది. తత్త్వశాస్త్రం అంటే ఫిలాసఫీ కదా! నటాషా మేజర్ అదే. కాలేజీలో వున్నప్పుడు మురళి తత్త్వాన్ని పట్టించుకోవాలని నటాషా మొదట్లో ఏమాత్రం అనుకోలేదు. మురళి రూమ్మేట్ అఫ్తాబ్ గర్ల్‌ఫ్రెండ్‌కి ఫ్రెండ్. ఆ యిద్దరు అమ్మాయిలూ కలిసే తిరుగుతూండేవాళ్లు సాధారణంగా. నటాషా బాయ్‌ఫ్రెండ్ బాస్కెట్‌బాల్‌తో ఎప్పుడూ బిజీగా వుండడంతో మురళిని ఇంకో మగాడిగా గుర్తించి, నటాషాకి బోర్ కొట్టకుండా తమతో సినిమాలకీ, కాన్సర్ట్‌లకీ తీసుకెళ్లేవాళ్లు ఆ ముగ్గురూ. గర్ల్స్‌ని గర్ల్‌ఫ్రెండ్స్‌గా మార్చుకోవాలంటే వాళ్లతోబాటు డాన్స్‌లకీ, కాన్సర్ట్‌లకీ వెళ్లాలి అని తారకమంత్రా న్నుపదేశించాడు అఫ్తాబ్. "మరి స్పోర్ట్స్‌కి టైమ్ ఎప్పుడు దొరుకుతుంది? వాళ్లు వాటికి రారు కదా!" అనడిగాడు మురళి. "ఈ డాన్స్‌లూ, కాన్సర్ట్లూ పెళ్లయేదాకానే!" జవాబిచ్చాడు అఫ్తాబ్ కన్నుగొట్టి.

కన్నుమీద ఎవరో కొట్టారని స్పష్టంగా కనిపిస్తుండగా మురళి ఎపార్ట్‌మెంట్‌కి వచ్చి, ప్రైవసీకోసం నటాషా అతని బెడ్రూంలోకి వచ్చిందొకసారి. ఎపార్ట్‌మెంట్లో అతను తప్ప ఎవరూ లేరు ఆ సమయంలో. కంటికి అడ్డంగా పెట్టుకొచ్చిన కర్చీఫ్‌ని లోపలికొచ్చిన తరువాత గానీ తొలగించలేదు. ఎందుకలా అయిందని అతను అడగ్గానే ఏడ్చేసింది. బాయ్‌ఫ్రెండ్ కొట్టాడంది. పోలీస్ కంప్లైంట్ ఇవ్వమన్నాడు. వాడు కాలేజీకి బాస్కెట్ బాల్ ఆడతాడు గనుక తనని పట్టించుకునే వాళ్లుండరంది. ఆమెని అక్కడే కూర్చోబెట్టి మురళి లెంటిల్ సూప్‌లో ఉల్లిపాయలు, టమోటాలూ వేసి, గరం మసాలాని కొంచెం చిలకరించి, రెఫ్రిజిరేటర్లోంచి నాన్‌ని తీసి వేడి చేసి పట్టుకెళ్లిచ్చాడు. నటాషా మౌనంగానే తిన్నది. స్థిమితపడ్డ తరువాత ఆమె తన ఎపార్ట్‌మెంట్‌కి వెళ్లింది.

"యూ ఆర్ వెరీ నైస్. నీ పొజిషన్లో వేరెవరయినా వుండుంటే ఎడ్వాంటేజ్ తీసుకు నుండేవాళ్లు," అన్నది తరువాత కొన్నాళ్లకి కలిసినప్పుడు. అర్థం కాలేదని చెబుతున్న అతని మొహాన్ని చూసి, "అదే, ఓదార్చడంకోసం కావలించుకుని," అని నవ్వింది. 'జంగిల్ బుక్' సినిమాలో చివర్లో మౌగ్లీని ఓరగా చూస్తూ బిందెని పడేసిన అమ్మాయి వెనుక మౌగ్లీ పరుగెత్తడాన్ని చూసి బేర్ భల్లూ, "షి డిడిట్ ఆన్ పర్పస్!" అంటుంది షేర్ ఖాన్‌తో. నటాషా నవ్వుకి పర్పస్ అదే అయుంటే మాత్రం మురళికి చాలా నచ్చింది. అది, అతణ్ణి కావాలనుకునే వాళ్లు ఈ ప్లానెట్ మీదున్నా రనడానికి ప్రూఫ్ మరి!

తరువాత డేటింగ్ పీరియడ్‌లో, హిందూయిజం అంటే ఏమిట నడిగింది నటాషా. "ఫిలాసఫీ చదువుతున్నావు, ఆ మాత్రం తెలియదా?" అని జోకేశాడు ఆమె చేతిని పట్టుకుని ప్రేమగా వంగి ముద్దుపెట్టుకుంటూ, తెల్లమొహాన్ని ఆమె చేతికి మాత్రమే కనపడేలా జాగ్రత్తపడుతూ. "ఎమర్సనూ, వాల్ట్ విట్మనూ, హెన్రీ డేవిడ్ థొరోలు దాన్ని బయటినించీ స్టడీ చేశారు. నువ్వు ప్రాక్టీసింగ్ హిందూవి కదా అని అడిగాను," అని నటాషా జవాబిచ్చింది.

అలాంటి దాటెయ్యడాలు చాలా గుర్తుండడం వల్ల కావచ్చు, "నువు మాట మార్చడంలో ఎక్స్‌పర్ట్‌వి. ఈసారి మాత్రం కుదరనివ్వను. వాట్స్ యువర్ ప్రాబ్లమ్?" అని మురళిని నిలదీసింది దాదాపు అయిదేళ్ల క్రితం – శామ్ కాలేజీకి అప్లై చెయ్యకుండా ఏదో బ్యాండ్ గ్రూప్‌లో చేరి తిరుగుతానంటే మురళి, 'కుదరదు, కాలేజీలో చేరాల్సిందే!' నని పట్టుబట్టి నప్పుడు. శామ్ మొండికేశాడు. నటాషా సర్ది చెప్పడానికి ప్రయత్నించింది – పోనీ ఒక ఏడాది అలా చెయ్యనిద్దామని. చదువుకి ఏడాదిపాటు బ్రేక్ వస్తే ఇంక మళ్లీ పుస్తకం పట్టుకోవడం కష్ట మన్నాడు మురళి. "కాలేజీలో చేరి ఏడాదిపాటు అన్ని

సబ్జెక్ట్స్‌లోనూ ఫెయిలయితే బావుంటుందా?" తండ్రిమీద కచ్చతోనే అలా చేస్తాననేలా వార్నింగ్ నిస్తూ అడిగాడు శామ్. మురళికి కోపమొచ్చి, "నామీద అంత కోప మున్న దన్నమాట!" అన్నాడు.

"కాదు. లవ్! నీచేత ముప్పైవేల డాలర్లు తగలబెట్టించడం ఇష్టం లేక!" శామ్ జవాబిచ్చాడు.

"లుక్, వై డోంట్ యు లెట్ హిమ్ లెర్న్ హిజ్ లెసన్? యూ మే బి రైట్. బట్ హి నీడ్స్ హిజ్ ఛాన్స్!" అన్నది నటాషా.

"హిజ్ ఛాన్స్ టు బి ఎ బెగ్గర్!" అన్నాడు మురళి కోపంగా. "సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమేటిక్స్ అన్నింటినీ కలిపి STEM ప్రోగ్రాంకే భవిష్యత్తు మెర్రో అని పొలిటీషియన్లు కూడా మొత్తుకుంటుంటే మాలో మ్యూజిక్ జీన్స్ వున్నాయంటూ వాణ్ణి మ్యూజిక్‌లో దింపీ, లుక్! హౌ క్విక్లీ హి మూవ్స్ అంటూ బాస్కెట్ బాల్ మీద ప్రతీ సాయంత్రమూ వీకెండ్‌లోని ప్రతీ గంటా ఆ కోర్ట్‌లో గడిపినా అడ్డం చెప్పకుండానూ, వాణ్ణి చదువుకి దూరం చేసావ్! ఇప్పుడనుకుని ప్రయోజనమేముంది?" మురళి అగ్నిమీద ఆజ్యం పోశాడు.

"యూ రేసిస్ట్ పిగ్!" అన్నది నటాషా ముక్కుపుటా లదురుతుండగా, రెండు చేతులనీ నడుంమీద ఆనించి నిలబడి. "నువ్వింత స్టీరియోటైప్ చేస్తా వనుకోలేదు!" అని మాటల కోసం తడుముకుంటూ, అంతలోనే తేరుకుని, " కర్నటాక మ్యూజిక్ కూడా పాడాడు, అది మర్చిపోయావ్!" అన్నది. (కర్ణాటక కాస్తా ఆమె నోట్లో అలా పలుకుతుంది!) నిజమే. ఏటా గుళ్లల్లో త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో తెలుగు పదాలని స్పష్టంగా పలుకుతూ పాడే నల్ల పిల్లవాడు వాళ్ల చుట్టుపక్కల వున్నది శామ్ ఒక్కడే! అతి సన్నని రింగులు తిరిగే వాడి జుట్టుని చూసి నటాషా జీన్స్ వచ్చెయ్యని చెప్పడం అతి తేలిక. అందుకే, 'ఒక ఏడాది క్లీవ్‌లాండ్‌లో జరిగిన ఆ ఆరాధనోత్సవాల్లో వీడు ప్రైమ్ ఎగ్జిబిట్,' అనుకున్నాడు మురళి.

"సో వాట్? మీవాళ్లల్లో ఎంతమందికి కాలేజీ డిగ్రీలున్నయ్? ఇప్పుడు వీడుకూడా వాళ్లల్లో ఒకడవుతాడు. ఇంకో రెండేళ్లకి కాట్యా!" మురళి రిటార్ట్ చేశాడు. నటాషా అన్నదమ్ముల్లో, అక్కచెల్లెళ్లల్లో ఎవరికయినా కాలేజీ డిగ్రీల మాటటుంచి, హైస్కూల్ డిప్లొమాలు కూడా లేవు. బ్యూటీ పార్లర్ నడిపేవాళ్లొకళ్లు, హెయిర్ కటింగ్ సెలూన్లని నడిపేవాళ్లిద్దరూ, టాక్సీ డ్రైవర్లిద్దరు. 'ప్రెసిడెంట్ కాండిడేట్లూ, పొలిటీషియన్లూ ఆకాశాని కెత్తేసే స్మాల్ బిజినెస్‌లంటే వీళ్లు నడిపేవే!' రాజకీయ నాయకుల ప్రసంగాలు విన్నాప్పుడల్లా మురళి మండిపడుతూంటాడు.

"వాళ్లు నీమీద ఆధారపడుతున్నారా?" నటాషా కోపంగా అడిగింది.

"లేదు. కానీ, హరికేన్ కట్రినా వచ్చినప్పు డేమయిందో మర్చిపోయావా?" మురళి తీవ్రంగానే జవాబిచ్చాడు.

నటాషా కుటుంబ సభ్యులందరూ న్యూ ఆర్లీన్స్‌లో రాబడి తక్కువ వున్నవాళ్లుండే లోతట్టు ప్రాంతాల్లో వుండేవాళ్లు. ఆ హరికేన్ మూలంగా ఇళ్లన్నీ మునిగిపోయి ఫుట్‌బాల్ స్టేడియంలో తలదాల్చుకుని, హీనాతిహీనమైన పరిస్థితుల్లో పదిరోజులకి పైగా గడిపి, తరువాత మురళి–నటాషాల యింటికొచ్చి రెణ్ణెల్లకి పైగా వున్నారు. వాళ్లకి స్కిల్స్ పెద్దగా లేకపోవడంవల్ల కొన్నేళ్లు కష్టపడాల్సొచ్చింది కొద్దిగానయినా నిలదొక్కుకోవడానికి.

హఠాత్తుగా నటాషా బుర్రలో లైట్ వెలిగినట్లుంది, "నిన్నెప్పుడూ అడగలేదు. వాట్ డు యు థింక్ ఆఫ్ మై డిగ్రీ?" అనడిగింది.

ఆ గుగ్లీని జాగ్రత్తగా ఆడుతూ, "యు ఆర్ స్మార్ట్. దట్స్ ఎ గ్రేట్ డిగ్రీ!" మురళి జవాబిచ్చాడు.

"తప్పించుకోవాలని చూడకు!" కోపంగా అన్నది.

"ఇంకేమని జవాబు చెప్పమంటావ్? నువ్వు తెలివితేటలు లేనిదానివనీ, నీ డిగ్రీ ఎందుకూ పనికిరాదనీ చెప్పమంటావా?" వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలన్నది ఆక్షణాన అతని అభిప్రాయం కాదుగానీ, కొడుకు భవిష్యత్తుని గూర్చిన ఆందోళన అతన్నలా ప్రేరేపించింది.

"నువు మాట మార్చడంలో ఎక్స్‌పర్ట్‌వి. ఈసారి మాత్రం కుదరనివ్వను. వాట్స్ యువర్ ప్రాబ్లమ్?" వెనక్కి తగ్గడానికి సిద్ధంలేనని ప్రకటిస్తూ నటాషా అతణ్ణి నిలదీసింది.

"ఇట్స్ నాట్ మై ప్రాబ్లమ్. అమెరికా డబ్బున్న దేశమే గానీ ప్రజల్లోనే తెలివితేటలు లోపిస్తున్నాయని ఋజు వవుతోంది. లేకపోతే, ఇంజనీరింగ్, ఫిలాసఫీ డిగ్రీలు రెండింటికీ ఒకే ట్యూషన్ ఫీజా? ఇండియాలోనే నయం. బి.ఎ., బి.కామ్ డిగ్రీలు ఎందుకూ పనికిరావని అందరికీ తెలుసు గనక వాటికి తక్కువ ట్యూషన్ ఫీజులని కడుతూంటారు. అంతెందుకు? నీ డిగ్రీకి కాస్ట్-బెనిఫిట్ ఎనాలిసిస్ చెయ్యి. నువ్వు ఖర్చు పెట్టిన దెంత? నువ్వు సంపాదిస్తున్న దెంత? నువ్వు చదువు కోసం చేసిన అప్పుని మొన్నీమధ్యదాకా తీరుస్తూనే వున్నావు కదా!" మురళి తీవ్రంగానే అడిగాడు.

"అంటే సంపాదించేలా చెయ్యగలిగేదే చదువా?" నటాషా అంతకన్న తీవ్రంగా ప్రశ్నించింది.

"కోటి విద్యలు కూటికొరకే! అని తెలుగులో ఒక సామెతుంది. ఇట్స్ ఎలిమెంటరీ మై డియర్ వాట్సన్!" వ్యంగ్యంగా అన్నాడు.

"నేను సంపాదిస్తూనే వున్నాను గదా!" నటాషాకు తనలో లోప మెక్కడ వున్నదో అర్థం కాక అడిగింది.

"నీ వుద్యోగానికి ఆ డిగ్రీ అవసరమా? నీతోటి రియాల్టర్లల్లో మాస్టర్స్ డిగ్రీల మాటటుంచి ఎంతమందికి బాచెలర్స్ డిగ్రీ లున్నయ్? అధిక శాతం హైస్కూల్‌తో ఆపేసిన వాళ్లే గదా!"

"ఆ చదువు నా కిచ్చిన నాలెడ్జ్‌కి నువ్వు కట్టే ఖరీదు ఇదన్నమాట!"

"నువ్వే ఆలోచించు, గత అయిదేళ్లల్లో రియలెస్టేట్ బూమ్ రాకపోయుంటే నీ ఆదాయ మెంతుండేదో! అదే ఇంజనీరింగ్ చదివి ఎంబీయే చేశావనుకో, నీ తెలివితేటలకీ, డిగ్రీలకీ మైనారిటీ స్టేటస్‌ని జత కలిపి ఈనాడు ఓ కంపెనీకి సి.ఈ.వో. కూడా అయ్యుండేదానివి."

"అంటే నా విలువని నా ఆదాయంతోనూ, నా మైనారిటీ స్టేటస్‌తోనూ ముడేస్తున్నావన్న మాట!" ముక్కుపుటా లదురుతుండగా అన్నది.

"పొరబడుతున్నావు. స్వంత నాలెడ్జిని పెంపొందించుకోవడానికి గానీ, ఆత్మానందం కోసం జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి గానీ పెట్టే ఖర్చుకి సమాజం విలువ నివ్వదని గుర్తుచేస్తున్నాను. పొట్టపోసుకోవడానికి ముందర ఒక విద్య కావాలంటున్నాను. సమాజం నీ మైనారిటీ స్టేటస్‌కి విలువ నిస్తానంటే ఎందుకు తీసుకోకూడదంటున్నాను." మురళి, తను చాలా లాజికల్‌గానే జవాబిచ్చా ననుకున్నాడు.

ఆ తరువాత ఏవో అరుపులూ, కేకలూ, ఏడుపులూ, తలుపులు గట్టిగా ముయ్యడాల మధ్య ఇంకేం సంభాషణ జరిగిందో మురళికి అంతగా గుర్తులేదు. కానీ, కాలేజీలో మ్యూజిక్ డిగ్రీ ప్రోగ్రాంలో చేరి డాన్స్‌తో కలిపి డబుల్ మేజర్ చేస్తూ కూడా కాట్యా ఇవాళ్ల అతని పక్కన కూర్చున్నదంటే, అప్పుడు అతనికీ, నటాషాకీ మధ్య జరిగిన వాగ్యుద్ధాన్ని కాట్యా ప్రత్యక్షంగా చూడకపోవడం వల్లనే. చూశాడు గనుకనే శామ్ తండ్రి నిప్పటికీ శత్రువుగానే పరిగణిస్తాడు. అందుకనే అప్పట్నించీ తండ్రితో మాట్లాడ్డం మానేశాడు. శామ్ తీసుకున్న ఒక ఏడాది బ్రేక్ కాస్తా చదువులో బ్రేక్ వస్తే అది పర్మనెంట్ అవుతుందనే మురళి నమ్మకాన్ని బలపరుస్తూ అసలు కాలేజీ మొహం చూడకుండా వుండడంలోకి మారింది. నాలుగేళ్ల బట్టీ న్యూయార్క్‌లోనే చిన్నచిన్న

వుద్యోగాలు చేసుకుంటూ గడుపుతున్నాడు. బ్యాండ్‌తో కలిసి ఇచ్చే ప్రోగ్రాములు ఫేస్‌బుక్‌లో పెడుతూంటాడు. గుడ్డిలో మెల్ల – మురళి ఫ్రెండ్ రిక్వెస్ట్‌ని శామ్ యాక్సెప్ట్ చేశాడు. ఈ మధ్య శామ్ పాటలకి మురళి లైక్‌లు కొడుతున్నాడు గానీ, అలా చేస్తున్న వందలమందిలో తనని ప్రత్యేకంగా పట్టించుకోవడం కష్టమని మురళి నమ్మకం. వాడొక సీడీని త్వరలోనే రిలీజ్ చెయ్యబోతున్నట్లుగా కూడా ఫేస్‌బుక్ ద్వారానే మురళికి తెలిసింది.

ఇప్పటికీ మురళికి, తను అన్నదాంట్లో తప్పేమీ కనిపించదు. నల్లజాతి వాళ్లే కాక ఇండియానుంచీ, చైనానుంచీ, సౌత్ అమెరికా దేశాలనుంచీ వచ్చి అమెరికాలో సెటిలయిన వాళ్లు కూడా 'మేం మైనారిటీలం' అంటూ కంపెనీలని పెట్టి, ఆఖరుకి తెల్లవాళ్లు కూడా భార్యలని సీ.ఈ.వో. లుగా చూపించి గవర్నమెంటు కాంట్రాక్టులని తెచ్చుకొంటుంటే, నటాషా తన ఆలోచనల్ని ఎందుకంత అఫెన్సివ్‌గా తీసుకున్నదో మురళికి ఇప్పటికీ అర్థం కాదు.

★ ★ ★

గొంతు తగ్గించి జరుపుతున్న సంభాషణలు కూడా ఠక్కున ఆగిపోవడంతో మురళి కళ్లు తెరిచి చూశాడు. వాళ్లకి కుడిపక్కగా రెండు బెంచీల వరుసల మధ్యలోంచి డేవిడ్ భార్యా, పిల్లలూ, పాస్టర్ వెనుకగా నడుస్తూ స్టేజీ వైపుకు నడిచి వెళ్లి ముందు వరుసలో కూర్చున్నారు.

మురళికి అప్పుడు గుర్తొచ్చింది – అతనికే గాక, శ్యామ్‌కీ, కాత్యాకీ కూడా చర్చ్‌కి వెళ్లడం అలవాటు లేదని. చదివిన ఫిలాసఫీని వంటబట్టించుకుని, నటాషా చర్చ్‌కి వెళ్లడాన్ని పెళ్లిళ్లకి మాత్రం పరిమితం చేసింది. తీరికున్నప్పుడల్లా ఫ్రెడరిక్ డగ్లస్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌తో బాటు, ప్లేటోనీ, రోబ్స్పియర్‌నీ, మాక్స్ ముల్లర్‌నీ, వివేకానందనీ చదువుతూండేది. కానీ, పిల్లలు హిందూ దేవుళ్ల మీద అల్లిన భక్తిపూరితమైన కీర్తనలని నేర్చుకోవడమే గాక, వాటిని పాడడానికి కూడా అతనితో బాటు గుళ్లకి వచ్చారు. వాళ్ల వెనకే నటాషా కూడా వచ్చేది. తేడా అల్లా, ఆ పాడడం ముందో, వెనుకో గానీ, అతనొక్కడే ఆ దేవుళ్లకి దణ్ణం పెట్టింది.

ఆలోచనల్లో పడి సర్వీస్‌లో మొదటి ప్రార్థనకి మురళి యాంత్రికంగా లేచి నుల్చొని, అయిన తరువాత కూర్చున్నాడు గానీ, pastor పలికిన మొదటి వాక్యాలు అతణ్ణి ఈ లోకంలోకి తీసుకొచ్చాయి. చేతికిచ్చిన ప్రోగ్రాం కాపీలో మూడవ పేజీలో మొదటి పేరాలో వున్న వాక్యాలు అవి.

"We gather in the name of Jesus to worship, to proclaim Christ crucified and risen, to remember before God our brother David, to give thanks for his life, to commend him for our merciful redeemer, and to comfort one another in our grief." అతను మాట్లాడుతుండగానే మురళి తన చేతిలో వున్న ప్రోగ్రాంలో మొదటి వాక్యంలో inతో మొదలుపెట్టి తరువాత వచ్చిన పన్నెండు పదాలనీ అండర్లయిన్ చేశాడు. ఆ పదాలని తొలగించినా కూడా ఏం చెయ్యడానికి ఆ హాల్‌లో వాళ్లు సమావేశ మయ్యారో స్పష్ట మవుతూనే వుంది.

Pastor కంటిన్యూ చేశారు. "Eternal God, maker of heaven and earth who formed us from the dust of the earth, who by your breath gave us life, we glorify you."

ఈ అనంత సృష్టికి కారకుడయిన విశ్వప్రకాశుని గూర్చే 'పెంజీకటి కావల ఎవ్వడేకాకృతి దాల్చున్' అని ఎవరో అన్నారని మురళికి గుర్తొచ్చింది.

ఇంకొక్క నిముషం కూడా కాకముందే, "Either He will shield you from suffering or He will give you unfailing strength to bear it," అన్న ఆయన వాక్యాలు, మొన్నీమధ్య whatsappలో ఎవరో షేర్ చేసిన తనికెళ్ల భరణిగారి ఉపన్యాసంలోని "కష్టం వచ్చినప్పుడు భగవద్గీత చదివితే కష్టం పోతుందని కాదు, ఆ కష్టాన్ని తట్టుకునే శక్తి వస్తుందని!" అన్న వాక్యాన్ని మురళికి గుర్తుకు తెచ్చాయి. భిన్నంగా కనిపిస్తున్న ఈ

రెండు మతాల సమన్వయాన్ని అతను ఎవరితో నయినా పంచుకో గలిగితే అది ఒక్క నటాషాతోనే. 'ఇఫ్ ఓన్లీ షి న్యూ హౌ మచ్ ఐ మిస్ హర్! ఐ స్టిల్ లవ్ హర్!!' అనుకుని అతను నిట్టూర్చాడు.

డేవిడ్ జీవితాన్ని గుర్తు చేసుకుని గర్వపడేటందుకు అతని హైస్కూల్ క్లాస్‌మేటు, అతనితో బాటే వియత్నాం యుద్ధంలో పాల్గొని ఒక చేతిని పోగొట్టుకున్న దాదాపు జీవిత కాలపు స్నేహితుడు, క్రిస్టఫర్ ముందుకొచ్చాడు. దుఃఖం గొంతుని నొక్కేస్తుండగా కష్టపడుతూ మాట్లాడాడు. శ్రీకృష్ణుని నిర్యాణ వార్తని అర్జునుడు అంత దుఃఖంతో ధర్మరాజుకు తెలియపరచి వుంటాడా అని మురళికి అనిపించింది. వాళ్ల స్నేహంలోని మధుర ఘట్టాల్లో ఒకదాన్ని పంచుకుని, డేవిడ్ తన భార్యగూర్చి ఎంత గొప్పగా చెప్పేవాడోననీ, ఆమె అతని జీవితంలో ఎంత వెలుగుని నింపిందోననీ అంతులేని సంతోషాన్ని వ్యక్తం చేసేవాడనీ క్రిస్టఫర్ చెప్పాడు. కాత్యా కర్చీఫ్‌తో కళ్ల వెంబడి కారుతున్న నీళ్లని తుడుచుకుంటూ మురళి భుజంమీదకు వాలింది.

అతని తరువాత డేవిడ్ కూతురు సూసన్ మాట్లాడింది. ఎంత గొప్ప తండ్రిని పోగొట్టుకున్నదో మాటలని దుఃఖంలో ముంచి తీస్తూ చెప్పింది. తరువాత ఆమె తమ్ముడు జార్జ్ తండ్రిమీద ఒక జోక్‌తో నవ్వుతూ మొదలుపెట్టి, కొంచెం సేపట్లోనే గంభీరంగా మారి, గొంతు గద్గద మవుతూ, కళ్లల్లో నీళ్లు చిప్పిలుతుండగా ముగించాడు. తన మెమోరియల్ సర్వీసప్పుడు శ్యామ్‌కి గానీ, కాత్యాకి గానీ చెప్పడానికి ఇంత గొప్ప విషయాలు ఏమీ వుండవు అని అనుకుంటూ మురళి నటాషా వైపు చూశాడు. ఆమె కూడా కళ్లనీళ్లని తుడుచుకుంటోంది.

నటాషాకే గనుక అవకాశమిచ్చి వుంటే మానవత్వానికి ప్రతీకగా డేవిడ్‌ని సజీవంగా అందరిముందూ నిలబెట్టేది – వాళ్లకే కాక ఆ నైబర్‌హుడ్‌లో కనీసం సగంమందికి ఒక మరువలేని సంఘటనని గుర్తుచేసి.

హరికేన్ కత్రీనా బాధితులైన నటాషా అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ల కుటుంబాలు మురళి–నటాషాల నాలుగు బెడ్రూములున్న సింగిల్ ఫ్యామిలీ హవుస్‌లో కొంతకాలం సర్దుకుని వున్నప్పుడు వాళ్లకోసం రెండు పాత కార్లని కొన్నది నటాషా. దానివల్ల వాళ్లు చుట్టుపక్కల చిన్నచిన్న ఉద్యోగాలని వెదుక్కోవడానికి వీలయింది. అయితే, ఈ కార్లని వాళ్ల యింటి డ్రైవ్‌వేలో పార్క్ చెయ్యడానికి కుదరక రోడ్డు పక్కన పార్క్ చెయ్యవలసి వచ్చేది. అందరికీ రెండు కార్లు పట్టే గరాజ్ లున్నప్పుడు రోడ్డుమీద అసలు కార్లెందుకు పార్క్ చెయ్యాలన్న అభిప్రాయం వున్నవాడు ఆ రోడ్డుని ఫేస్ చేస్తూ వుండే ఒక యింటి ఓనర్ జెఫ్రీ. అందుకని తన యింటి ముందర, పబ్లిక్ రోడ్డు మీద అయినా సరే, వేరే వాళ్ల కార్లుండడాన్ని సహించలేదు. హోమ్ ఓనర్స్ అసోసియేషన్ మీటింగ్‌లో చర్చకు పెట్టాడు. ఆ వార్త తెలిసి, మురళి, నటాషా తమని తాము డిఫెండ్ చేసుకోవడానికి వెళ్లారు. ఆ నైబర్‌హుడ్‌లోని వాళ్ల రంగులో తాము లేకపోవడం అసలు కారణమని మురళి నమ్మకం. నటాషాకి అనుమానమో, నమ్మకమో ఏదయినా వుంటే ఆమె దాన్ని అతనితో పంచుకోలేదు.

"మన రోడ్డుమీద ఈ మధ్య తుక్కు కార్లని పార్క్ చెయ్యడం మొదలయింది. దానితోబాటే, ఒక యింట్లో అసలు ఎంతమంది వుంటున్నారో కూడా తెలియకుండా పోతోంది. నాకు కనిపించినంత వరకూ కనీసం ఐదుగురు మగవాళ్లూ, నలుగురు ఆడవాళ్లూ, ఆరేడుగురు పిల్లలూ ఆ యింట్లోకి వచ్చి వచ్చి వెడుతున్నారు. నేను చూడనప్పుడు ఎంతమంది వచ్చి వెడుతున్నారో – గాడ్ ఓన్లీ నోస్! ఈ పరిస్థితి మన హోమ్ ఓనర్స్ రూల్స్‌కి వ్యతిరేకం. ఈ విషయాన్ని పట్టించుకోకుండా ఈ బోర్డు ఏం చేస్తోంది?" అని జెఫ్రీ ఆ బోర్డుని తీవ్రంగా ప్రశ్నించాడు.

ప్రెసిడెంట్ తమని సంజాయిషీ అడుగుతాడు, అప్పుడు మాట్లాడదామని మురళి అనుకుంటుండగానే డేవిడ్ గొంతు విని అతనివైపు చూశారందరూ.

"ఈ ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో మొదటిస్థానంలో వున్న మనం, హరికేన్ కత్రీనా వల్ల ప్రపంచంలోని అతి బీద దేశాల్లో కూడా అనుభవించనంతటి అధ్వాన్న పరిస్థితుల్లో న్యూ ఆర్లీన్స్ ప్రజలు విలవిల్లాడడాన్ని ప్రత్యక్షంగా టీవీలో చూశాం. ఏ ప్రకృతి వైపరీత్యం వల్ల నయినా గానీ

అమెరికన్లు కట్టుబట్టలతో మాత్రం మిగలడాన్ని మనమెవరం ఊహించలేం. కానీ, ఆ అనుభవం నటాషా బంధువులని కొత్తగా వేసిన తారు రోడ్డుమీద కాలుపెట్టినప్పుడు అంటుకున్న తారులా పట్టుకుని వదలకుండా పీడిస్తోంది. ఎక్కడో భూకంపం వచ్చిందనీ, బంగ్లాదేశ్‌లో మళ్లీ వరద లొచ్చెయ్యనీ మనం విరాళాల నిస్తూంటాం – వాళ్లెవరో మనకు తెలియకపోయినా గానీ. నటాషా మనకు నైబర్ కనుక ఆమె అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు మనకూ కావలసినవాళ్లే. మనమే వాళ్ల పరిస్థితిలో వుంటే మనకెలాంటి సహాయం కావా లనుకుంటాం? Do unto others as you would have them do unto you అన్నాడు జీసస్. వాళ్లకి విరాళంగా నేను ఈ వెయ్యిడాలర్ల చెక్కు నిస్తున్నాను. మీలో ఎవరయినా కూడా వాళ్లకు సహాయం చెయ్యగలిగితే నేను సంతోషిస్తాను. అలా చెయ్యలేని పక్షంలో వాళ్ల చేత ఒక జాజ్ కాన్సర్ట్ ఏర్పాటు చేసి ప్రొసీడ్స్‌ని వాళ్ల కిద్దాం. నటాషా బ్రదర్స్‌లో ఒకళ్లు శాక్సఫోన్ వాయిస్తే, ఇంకొకళ్లు డ్రమ్స్ వాయిస్తారు. బ్రదరిన్లా పియానో వాయిస్తాడు. దే ఆర్ గుడ్ మ్యుజీషియన్స్ హూ ప్లేడ్ ఇన్ న్యూ ఆర్లీన్స్ జాజ్ బార్స్. లెట్స్ హెల్ప్ దెమ్!" అన్నాడు డేవిడ్. ఇల్లు పీకి పంది రేద్దామని ఊగిపోతూ వచ్చిన జెఫ్రీని కాలికింద చీమలాగా నలిపేశాడు – ఏ ఆయుధంతోనూ కాక మలినం లేని మానవత్వంతో. పైగా, ఆ క్రిస్మస్ బ్రేక్‌లో ఇంట్లో అల్లుడూ, కోడలూ, మనవళ్లూ, మనవరాళ్లూ వున్నప్పుడు డేవిడ్ తన బేస్‌మెంట్‌లో ఆ జాజ్ ప్రోగ్రాం అరేంజ్ చేసి అది బెస్ట్ క్రిస్మస్ ఎవర్! అని చెప్పాడు. ఆ క్రిస్మస్ గూర్చి నటాషా, మురళి గూడా చాలాసార్లు మాట్లాడుకున్నారు.

⋆ ⋆ ⋆

Pastor ప్రోగ్రాంలో వున్న Psalm 23ని చదవడం మొదలుపెట్టారు. "The Lord is my shepherd: I shall not want. He maketh me to lie down in green pastures: He leadeth me in the path of righteousness for his namesake." ఆ చివరి లైన్ శ్యామ్ నేర్చుకున్న "నిత్య–అనిత్యములను బోధించి, కృత్య–అకృత్యములను తెలిపించి," అంటూ సాగిన "పట్టి విడువరాదు, నా చెయ్," అన్న త్యాగరాజ కీర్తన అర్థాన్ని స్ఫురింప జేస్తోందని మురళి గుర్తించాడు.

పాతికేళ్ల క్రితం నటాషా వేసిన "నువ్వు ప్రాక్టీసింగ్ హిందూవి కదా, హిందూయిజం అంటే ఏమిటో చెప్పలేవా?" అన్న ప్రశ్నకు గత అయిదేళ్లల్లో పోగుచేసుకున్న జ్ఞానాన్ని రంగరించి తనిప్పుడు జవాబు చెప్పగల ననుకున్నాడు మురళి. అయినా అలా చెప్పాలంటే ముందు నటాషా అతనితో మాట్లాడాలి గదా!

మెమోరియల్ సర్వీస్ అయిన తరువాత పక్కన హాల్లో డేవిడ్ కుటుంబ సభ్యులు అక్కడకు వచ్చిన వాళ్ల పరామర్శనీ, సంతాపాన్నీ అందుకున్నారు. అలా వాళ్లని కలవడానికి ఏర్పాటయిన లైన్లో నటాషా, శ్యామ్ తనకీ, కాత్యాకీ పదిమంది ముందర లైన్లో ఉన్నారని మురళి గుర్తించాడు.

ప్రోగ్రాంలో చదివిన, pastor కంఠంలో వెలువడిన భావాలు మురళికి తను విన్న ప్రవచనాల్లోని కొన్ని వాక్యాలతో, భావాలతో, భాష్యాలతో – అతణ్ణి బాగా ఆకట్టుకున్నవాటితో – సమన్వయం చెందడానికి ప్రయత్నించాయి. "నేను నా చుట్టు పక్కల వున్న మనుషుల, జంతువుల బాగు కోరుకుంటున్నాను. ... ఆ పరబ్రహ్మం నిరాకారమైనది, నిర్మలమైనది, నిత్యమైనది ... సదసద్రూపిణి ___ సత్+అసత్+రూపిణి ___ ఉన్నదీ, లేనిదీ అయిన రూపం గలది ___ సృష్టికర్త అయిన బ్రహ్మని సృష్టించేది, ఆ బ్రహ్మని అంతం చేసేది, మళ్లీ అలాంటి బ్రహ్మని సృష్టించేదీ ... పరమాణువంత చిన్నదీ, ఈ అనంత విశ్వం నిండా వ్యాపించినదీ, ఈ విశ్వంలో భాగమయినదీ, ఈ విశ్వానికి వెలుపల వుండి దాన్ని సృష్టించేదీ ... ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచు ...

అడుగడున గుడి వుంది, అందరిలో గుడి వుంది
ఆ గుడిలో దీపముంది, అదియే దైవం, అన్న కృష్ణశాస్త్రిగారి పాట –

గుడి కాకపోతే చర్చ్. లేకపోతే మాస్క్. అసలీ దీపానికి సహజంగా వుండే చిన్న గూడు తప్ప వేరే కట్టడ మెందుకు? చిచ్చు పెట్టడానికి కొరివి కావాలి గానీ చీకటిని పారద్రోలడానికి చిన్న దీపం చాలదూ? అందరిలో దైవముంటుందన్న అభిప్రాయాన్ని ఆచరణలో అతనికి గుర్తుండేలా తెలియజేసిం దెప్పుడో మురళికి గుర్తొచ్చింది. అది, శ్యామ్ తమిళియన్ సంగీతం టీచర్ వాడు ఆయనకు చేసిన నమస్కారానికి ప్రతినమస్కారం చేసినప్పుడు. అదేమిటండీ, మీరు వాణ్ణి ఆశీర్వదించకుండా అలా చేతులు జోడిస్తా రేమిటి అని మురళి అడిగాడు. ఆయన వాడిలోని దేవుడికి నమస్కరిస్తున్నాను జవాబిచ్చారు. అప్పుడంతగా పట్టించుకోలేదు గానీ, ఇప్పుడు, మనుషులు దేవుడి గుర్చిన జిజ్ఞాసలో, రూపం గుర్చిన ఆలోచనలో మునిగిపోయి, తత్త్వం గుర్చిన చింతనకి దూరమవుతున్న సంగతి గమనించ రెందుకని? అని మురళికి అనిపించింది.

ఈ విషయం అన్నమయ్యకి ఎరుకే! "తలతురు నిను వేదాంతులు పరబ్రహ్మం బనుచు" అని అన్నాడు గదా, "ఎంత మాత్రమున" అన్న కీర్తనలో!

త్యాగరాజు మాత్రం? "శివుడనో, మాధవుడనో, కమలాభవుడనో, పరబ్రహ్మమనో" అన్నాడు మరి, "ఎవరని నిర్ణయించిరిరా" అన్న కీర్తనలో.

"సహస్ర శీర్‌షా పురుషః" అంటే ఆ సత్యప్రకాశునికి వెయ్యి తలలున్నయ్యని కాదు! ఇక్కడ వెయ్యి అంటే లెక్కలేనన్ని అని అర్థం. అంటే, ఈ క్షణాన ఈ సభలో కూర్చున్న మీ అందరి రూపాల్లో దేవుడున్నాడనీ, నా మాటలు విని ఆనందిస్తున్నాడనీ, నన్ను ఆశీర్వదిస్తున్నాడనీ అనుకుంటే నాకెంత ఆనందంగా వుంటుంది? అందుకే, రుద్రమ్‌లో అన్నట్టుగా నమస్తిష్ఠభ్యః – అంటే వచ్చి కూర్చున్న వాళ్లల్లోని దేవుడికి నమస్కరిస్తున్నాను!" అన్న షణ్ముఖ శర్మ గారి వాక్యాలు కూడా మురళికి గుర్తొచ్చాయి.

ఎప్పుడో మాస్టర్స్ డిగ్రీ చెయ్యడానికి అమెరికాకి రాకముందు విన్న కృష్ణశాస్త్రి గారి పాట దగ్గర్నుంచీ గత అయిదేళ్లల్లో విన్న ప్రవచనాల్లోని విషయాలదాకా గుర్తుండడమే గాక అవి సీక్వెన్స్‌లో అమరే పేకముక్కల్లాగా అలా వరుసలో జ్ఞాపకం రావడం మురళికి ఆశ్చర్య మనిపించింది. అవన్నీ కలిపి కొంత జ్ఞానా న్నిచ్చిన భావన అతనికి కలిగింది. తనలాగా కొంచెం జ్ఞానాన్ని పోగుచేసుకున్న వాళ్ల నేమంటారోనన్న ప్రశ్న అతని మదిలో చోటుచేసుకుంది. "సర్వజ్ఞుడు" అంటే అన్నీ తెలిసిన వాడని గుర్తుంది గనుక తనకది వర్తించదని మురళి గుర్తించాడు. కొంచెం జ్ఞానం వున్నవాణ్ణేమంటారో నని ఆలోచించాడు. "కొంచెం-జ్ఞుడు" అన్న పదం ఎక్కడా వినలేదనిపించి నచ్చలే దతనికి. "కొంచెం"కి పర్యాయ పదాలని గుర్చి ఆలోచిస్తూ "అయామ్ ఫర్గెటింగ్ మై మదర్ టంగ్! " అనుకుని స్మార్ట్ ఫోన్ సహాయంతో ఆన్‌లైన్ డిక్షనరీని ఆశ్రయించితే " స్వల్పం" అన్న పదం అతనికి దొరికింది. " స్వల్పజ్ఞుడు" అన్న పదం వినడానికి బానేవున్న దనుకుని చిన్న నవ్వు నవ్వబోయి అప్పటికి డేవిడ్ భార్యని పరామర్శించడానికి తన వంతు రావడంతో దాన్ని పెదవి వెనకాలే నిలిపేశాడు.

డేవిడ్ భార్యనీ, పిల్లలనీ పలకరిస్తున్నప్పుడు మురళి కళ్లు చెమర్చాయి. బయటకు వచ్చి పార్కింగ్ లాట్‌లోకి అడుగు పెట్టిన తరువాత నటాషా, శ్యామ్ అక్కడ కాత్యా కోసం వెయిట్ చేస్తూ కనిపించారు. "నువ్వెలా వెనక్కు వెడతావ్?" అని తండ్రి నడిగింది కాత్యా. "రామయ్యకి ఫోన్ చేస్తే వచ్చి తీసుకెడతాడు. అతను బిజీగా వుంటే ఊబర్ వుండనే వుంది," మురళి జవాబిచ్చాడు. అతనికి కారు లేదని ఆ ముగ్గురికీ గుర్తే. నటాషా వుంటున్న ఇంటికి సమ్మర్లో లాన్ కట్ చెయ్యడానికీ, నవంబర్లో రాలిపడిన ఆకులని పోగెత్తడానికీ వెళ్లినప్పుడు రామయ్య అతన్నక్కడ దింపి వెడితే, కాత్యా అక్కడుంటే మాత్రం మురళిని తన ఎపార్ట్‌మెంట్‌కి జేర్చేది.

తన జ్ఞాన సముపార్జనలో నటాషా పాత్రని మురళి మరచిపోలేదు. ముందు ఆమెలోని దేవుడికి దూరంనించీ మాత్రమే నమస్కారం పెడదా మనుకున్నాడు గానీ, అది ఆ దేవుడు చూస్తుండగా పెడితే పుణ్యమూ, పురుషార్థమూను అని గుర్తించి కాత్యాతో కలిసి ఆమె దగ్గరకు వెళ్లాడు. ఆ పరిణామం నటాషాకే గాక వెంట నడుస్తున్న కాత్యాకి కూడా ఆశ్చర్యాన్ని కలిగించింది. అతను నటాషాకి రెండడుగుల దూరంలో నిలబడి, "యు డిడ్ ఎ గ్రేట్ ఫేవర్

ఫర్ మి బై త్రోయింగ్ మి అవుట్ ఫైవ్ యియర్స్ బాక్, థాంక్యూ!" అన్నాడు ఆ చివరి పదం దగ్గర దగ్గర కొచ్చేటప్పటికి చేతులు జోడించి. ప్రతి ఒక్కరిలోనూ దేవుడున్నాడని నమ్మినా గానీ, ఎవరి దగ్గరికయినా వెళ్లి "నీకు నమస్కరిస్తున్నాను" అని కాక "నీలోని దేవుడికి నమస్కరిస్తున్నాను," అంటే ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో అతనికి ఎరుకే. ఆ లోనున్న దేవుడికి కూడా కోపమొస్తుంది – వ్యక్త మవుతున్న నా రూపాన్నీ, గుణాన్నీ గుర్తించ వెందుకని అని. అప్పుడా కోపాన్ని ఆ వ్యక్తిద్వారా తెలియపరుస్తాడు. ఇక్కడ నటాషాకి తెలిపిన కృతజ్ఞత ఆ దేవుడికి తప్పకుండా చేరుతుందని మురళి నమ్మాడు. వెలిబుచ్చిన అతని భావాలు నచ్చితే అది వ్యక్తమయేది కూడా నటాషా ద్వారానే కదా! అయితే, అది అంత త్వరగా జరిగేది కాదని అతని నమ్మకం. కోపమొచ్చినంత త్వరగా ప్రసన్నత చేకూరదు గదా మరి!

నటాషాకి ఆశ్చర్యమేసిందని ఆమె మొహంలోని భావాలు తెలిపాయి. మురళి మాటల్లో అపాలజీ వినబడలేదే అన్న సందేహం ఆ భావాల్లో ఒకటని అతని నమ్మకం. 'దుక్కిన భూమిలోనే విత్తనం మొలిచినట్లుగా వినడానికి సిద్ధంగా వున్నప్పుడే గదా అపాలజీకి ఫలితం లభించేది!' అని అతనికి అనిపించడం తప్పు కాదని ఎవరయినా అంటారు. ఒక వాక్యానికి మించి అతని వద్దనుంచీ ఏమయినా వినడానికి నటాషా సిద్ధంగా వున్నదో, లేదో మురళికి తెలియదు గదా! అందుకే ధన్యవాదంతో మొదలుపెట్టాడు, అంతటితోనే ఆపేశాడు.

ఆమె ఆ సందిగ్ధంలో వుండగానే మురళి శ్యామ్‌వైపు తిరిగి అన్నాడు – "హేయ్ శామ్! నువ్వు నీ బాండ్‌తో మొదటి సీడీని రిలీజ్ చెయ్యబోతున్నందుకు కంగ్రాచ్యులేషన్స్! హోప్ యూ విల్ బి ది నెక్స్ట్ బీటిల్స్!" వాళ్లు మురళి యుగంవాళ్లే గానీ, ఎంత కుర్రాళ్లయినా గానీ, మ్యూజిక్‌తో పరిచయం వున్నవాళ్లకి బీటిల్స్ ఎవరో తెలియకపోరు.

మురళి, కాత్యా భుజంమీద చెయివేసి దగ్గరకు తీసుకుని నుదుటిమీద ముద్దుపెట్టుకుని అన్నాడు – "కాట్యా! నీ డాన్స్ విడియోలని చూశాను. కెనెడీ సెంటర్లో నిన్ను నట్‌క్రాకర్లో చూడాలనుంది. మేబి యు విల్ బి ది మోస్ట్ ఫేమస్ కోరియాగ్రఫర్ అండ్ కంపోసర్ వన్ డే," అని శ్యామ్‌వైపూ, కాత్యావైపూ చూపిస్తూ అన్నాడు – "అండ్ ఐ విల్ బి నోన్ యాజ్ యువర్ డాడ్! ఆల్ ది బెస్ట్!!"

వాళ్లు అతనికి ఏం జవాబివ్వాలన్న సందిగ్ధంలో వుండగానే పాలిటీషియన్ల లాగే వాళ్లు పట్టించుకున్నా లేకపోయినా మురళి బై చెబుతూ గాల్లో చేతిని పైకెత్తి వూపి, వెనక్కు తిరిగి వాళ్లనుండీ దూరంగా నడుస్తూ జేబులోంచి ఫోన్ తీశాడు రామయ్యకు కాల్ చెయ్యడానికి.

ఆ ముగ్గురితో మాట్లాడిన మూడు వాక్యాలతో అతనిలోని మార్పుమీద వాళ్లకి ఏమయినా నమ్మకం కుదరడానికి ఆస్కారం తక్కువ అని మురళికి తెలుసు గానీ, చొచ్చుకొచ్చిన ఒక కిరణం మబ్బు వెనుక దాగిన ప్రేమ అనే సూర్యుని వునికిని గూర్చిన ఆసక్తిని కలిగిస్తే మాత్రం, "'డాడ్, వుయ్ కెన్ డ్రాప్ యూ ఆఫ్!' అంటూ కాత్యా గొంతు వినిపించాలి," అనుకున్నా డతను అలాగే ముందుకు అడుగేస్తూ.

## అష్టావక్ర — రవి కొప్పరపు

పుట్టిన బిడ్డ ఏడుపు వినపడుతోంది గదిలోనుంచి.

"డాక్టరిని పిలిచారా?" ఎవరో అడిగారు. ఇంతలో "రండి డాక్టరు గారు" హడావిడిగా లోపలికి వస్తూనే తల్లి దగ్గరికి వెళ్ళారు డాక్టర్.

అప్పుడే పుట్టిన బిడ్డ ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు. "చాలా సేపటినుంచి ఏడుస్తున్నాడు బిడ్డ, ఎంతసేపటికీ ఆపట్లేదు..".

డాక్టరు పిల్లవాడి దగ్గరికి వచ్చి, ఎత్తుకొని కొంచెం సేపు చూసారు. మొహంలో కొంచెం ఆందోళన. అక్కడ చుట్టూ ఉన్నవాళ్ళు డాక్టరుగారు ఏమిచెప్తారా అని చూస్తున్నారు.

ఆయన తల పైకెత్తి కోపంగా "ఈ పిల్లవాడి మొహం మీద ఏదైనా పడిందా, లేదా ఎవరైనా పడేసారా?".

చుట్టూ ఉన్నవాళ్ళు మొహాలు చూసుకున్నారు. "లేదండీ, మేము చూస్తూనే ఉన్నాం, పుట్టిన కొద్ది సేపటినుంచి తల్లి తప్ప ఎవరూ పిల్లవాడిని ఎత్తుకోలేదు. అయినా పుట్టి ఒక గంటే అయింది".

డాక్టరు తల్లి వైపు చూసి నెమ్మదిగా, "ఏమ్మా, నీకు తెలియకుండా బాబు మీద పడుకున్నావా?".

తల్లి ఏడుపు ఆపుకుంటూ "లేదు డాక్టరు గారు, ఏమైంది నా బిడ్డకు? ఎందుకు ఏడుపు ఆపట్లేదు?".

కొంచెం సేపు మౌనం. ఎలా చెప్పాలా అని తటపటాయించి, ధైర్యం తెచ్చుకొని, "చూడమ్మా, బాబు ప్రాణానికి అంత భయం లేదుకాని.....".ఆగారు

"కాని? ఏమైంది డాక్టరు గారు?"

ఆయన ఒకసారి బాబు వైపు చూసి తల్లితో " బాబు మొహం లో కొన్ని కండరాలు సరైన చోట లేవమ్మా. మెలికపడి, ఉండాల్సిన ప్రదేశంలో లేవు. ఆ నొప్పితో బాబు ఏడుస్తున్నాడు. ఎవరూ బాబు ని ముట్టుకోలేదని చెప్తున్నారు, అంటే ప్రసవమప్పుడే ఏదో జరిగింది బాబుకు".

తల్లి ఇంకా పెద్దగా ఏడుపు. "ఏమవుతుంది నా బిడ్డకు? ఏం చెయ్యాలో చెప్పండి".

డాక్టరు నిస్సహాయంగా "నేనేమి చెయ్యలేనమ్మా, ఎవరూ ఏమీ చెయ్యలేరు ఇప్పుడే. ఇంతలో అంబులెన్స్ పిలుద్దాం. బాబు కొంచెం పెరిగాకా సర్దుకోవచ్చు"

ఇంతలో బాబు ఏడుపు తగ్గింది. ఆశ్చర్యంగా డాక్టరు బాబు వైపు చూశారు. ఆయనకి ఏం జరుగుతోందో ఒక్క నిమిషం అర్థం కాలేదు. చూసే దృశ్యం భయం వేసింది. కళ్ళ ముందు జరుగుతోంది నిజమో, కాదో నమ్మకం కలగడం లేదు.

"బాబు ఏడుపు తగ్గింది డాక్టరు గారు. ఏం చేసారు?" తల్లి అడిగింది. ఆయన తేరుకొని, మెల్లగా తల్లి వైపు చూసి,

"నే...నేనేమి చెయ్యలేదమ్మా, బాబే చేసాడు".

### 10 సంవత్సరాల తరువాత...

స్కూల్లో పిల్లలు ఆడుతున్నారు. గంట మోగడానికి ఇంకా టైముంది. ఇంతలో ఒక పదేళ్ళ పిల్లోడు ఏడుస్తూ, దగ్గర్లో ఉన్న టీచరు దగ్గరికి వెళ్ళి "విక్కిగాడు నన్ను కడుపులో గుద్దాడు మేడం"

"ఎందుకు గుద్దాడు?"

"మాతో ఆడతానన్నాడు, మేము వద్దన్నాము. అందుకు కొట్టాడు".

టీచరు నిట్టూర్చి, "సరే, నాతో పద", అని తనతో తీసుకెళ్ళింది.

చాల మంది పిల్లలు ఆడుతున్నారు. చుట్టూ చూస్తూ "ఏడి వాడు?" అని అడిగిందావిడ.

"అదిగో, ఆ గళ్ళ చొక్కా వేసుకొని ఆడుతున్నాడే, వాడే".

ఆవిడ ఆ అబ్బాయి దగ్గరికి వెళ్ళి, పట్టుకొని తిప్పింది. వాడు విక్కీ కాదు, ఎవరో ఇంకో పిల్లోడు.

దెబ్బ తిన్న అబ్బాయితో టీచరు "ఎక్కడ్రా వాడు?".

ఆ అబ్బాయికి అర్థం కాక. "ఇక్కడే ఉండాలి మేడం, ఇదే చొక్కా వేసుకున్నాడు" ఆ గళ్ళ చొక్కా అబ్బాయిని పరీక్షగా చూస్తూ అన్నాడు.

టీచరు ఆ గళ్ళ చొక్కా అబ్బాయిని అడిగింది "నువ్వు విక్కీ ని చూసావా?".

తల అడ్డంగా ఊపాడు ఆ అబ్బాయి, చూడలేదని. "సరే అటు పద చూద్దాం" అని టీచరు తీసుకెళ్ళింది.

వాళ్ళు వెళ్ళగానే, ఆ గళ్ళ చొక్కా అబ్బాయి మొహం మీద చిన్నగా నవ్వు...!!

## 20 సంవత్సరాల తరువాత

"నీకసలు బుద్ధిలేదా, కాలేజికి వచ్చేది ఇలాంటి చెత్త పనులు చెయ్యడానికేనా? నువ్వు తెలివైనవాడివై ఉండి కూడా, ఇలా పక్క దోవ పనులేంటి? రేపు కాలెజి నుంచి వెళ్ళినతరువాత నీ తెలివి తేటలు చాలవ్. కష్టపడక పోతే, బికారివై ఊళ్ళు తిరగాల్సొస్తుంది." లెక్చరర్ తిడుతూ వెళ్తున్నారు.

విక్కీ క్లాసు ముందు తలదించుకు వున్నాడు. అతని బ్యాగులో లెక్చరర్ గారి పర్సు దొరికింది, అందుకే ఆయన కోపం.

"సార్, నేను మళ్ళీ చెప్తున్నా, నేను చెయ్యలేదు సార్..నిజం సార్...అయినా, మీ పర్సు కొట్టేసి, కాలేజీలోనే వుండి, అదీ మీ క్లాసులో మొదటి బెంచి లో ఎందుకు కూర్చుంటాను సార్?".

ఆయనకవేమీ పట్టలేదు. పర్సు దొరికింది విక్కీ దగ్గర, పైగా విక్కీ కొట్టేస్తున్నపుడు చూసానని అనంత్ చెప్పాడు.

"వెళ్ళి ప్రిన్సిపల్ గారిని కలుద్దాం పద" అన్నారు లెక్చరరు.

వెళ్తూ, వెళ్తూ అనంతుకేసి చూశాడు విక్కీ. అనంత్ రెండు చేతులు తల వెనక్కి పెట్టుకొని కులాసాగ కూర్చుని చిన్నగా నవ్వుతున్నాడు. పక్కనే ఫ్రెండు అన్నాడు. "బాబాయ్, ప్రిన్సిపల్ గారు నమ్ముతారంటావా?".

అనంత్ గట్టిగా ఊపిరి తీసుకొని "ఎందుకు నమ్మర్రా, దొరికింది వాడి దగ్గరే కదా. మనం కూడా చూసామని చెప్తాం. తెలుసుగా మీకు, ఏం చెయ్యాలో. అయినా మన కాలేజి కల్చరల్ ప్రోగ్రాం కమిటీ ప్రెసిడెంట్ గా నాతో పోటీ ఏంటి? పైగా నాకు వార్నింగ్ ఇస్తాడా?. ఇప్పుడు చూద్దాం, దేనికి ప్రెసిడెంట్ అవుతాడో".

నెల రోజుల తరువాత ఇంజినీరింగ్ ఫైనల్ ఎగ్జాం. అడ్వాన్సడ్ ఆపరేటింగ్ సిస్టం పరీక్ష మొదలయ్యేముందు రోజు, అనంతు బాగా దగ్గుతూ ఆ కోర్సు లెక్చరర్ గారి రూములోకి వచ్చి. "సార్, మిమ్మల్ని ప్రిన్సిపల్ గారు పిలుస్తున్నారు" అని చెప్పాడు.

ఆయన లేస్తూ అనంతుతో "బాగా దగ్గుతున్నావ్, నీ గొంతు కూడా సరిగ్గా లేదు. రేపు పరీక్ష, కాస్త మందేసుకో" అని చెప్పి రూములోంచి బయటకెళ్ళారు. అనంతు సరేనని తల ఊపి ఆయన వెళ్ళేవరకు అక్కడే వుండిపోయాడు.

గంట తరవాత, ప్రిన్సిపల్ గారి రూములో ఆ లెక్చరర్ గారు, అనంతు ప్రిన్సిపల్ గారి ముందు నిల్చొని వున్నారు. "అనంతు, శ్రీనివాసరావు గారి రూములోంచి రేపటి క్వశ్చెన్ పేపరు ఒకటి ఎవరో ఎత్తుకెళ్ళారు. మాస్టారు గారేమో రూములోంచి బయటకి వస్తున్నప్పుడు నిన్నే కలిసారని అంటున్నారు. నువ్వు లెక్చరర్ గారితో నేను పిలిచానని ఎందుకు చెప్పావ్? నిజం చెప్పడమే మంచిది నీకు".

అనంత్ అర్థం కాని మొహంతో "నేనెప్పుడు వెళ్ళాను సార్ ఆయన రూముకి? అసలు గంట క్రితం నేను కాంటీన్ లో ఉన్నా మా ఫ్రెండ్సు కోసం వెయిట్ చేస్తూ".

ప్రిన్సిపల్ గారు చిరాగ్గా "మాస్టార్ గారే కాదు, నువ్వు ఆయన రూములోంచి బయటకి వస్తున్నపుడు అటెండరు రాములు కూడా చూసాడు".

అనంత్ "నేనసలు అటు వెళ్ళలేదు సార్".

లెక్చరర్ శ్రీనివాసరావు గారు అనంతుతో "ఏవయ్యా, నువ్వు దగ్గుతూ నా రూంలోకి వచ్చావా లేదా? పైగా ఇప్పుడు బానే మాట్లాడుతున్నావ్".

గందరగోళంగా వుంది అనంతు పరిస్థితి. చివరకు, ప్రిన్సిపల్ గారు అనంతుని సస్పెండు చేసి, పేరెంట్సు ని తీసుకొని రమ్మన్నారు. మెల్లగా బయటకి వచ్చాడు అనంతు. ఏం జరుగుతుందో అర్థం కాకుండా వుంది.

"ఏంటి, ఒంట్లో బాలేదా? మొహం అలా వుంది?" తలెత్తి చూశాడు అనంతు. ఎదురుగా విక్కీ .

అనంతుకి పట్టరాని కోపం వచ్చింది. విక్కీ కాలరు పట్టుకొని, "రేయ్, నువ్వేనా చేసింది? నిన్నేంచేస్తానో చూడు", విక్కీ కాలరు విడిపించుకొని, ముందుకు వంగి అనంతు చెవిలో లోగొంతుతో "నువ్వేమి చెయ్యలేవు అనంతు, ఎందుకంటే, మనిషిని పోలిన మనుషులు ఉంటారట, నిజంగా" చిన్నగా నవ్వుతూ వెనక్కి వచ్చాడు విక్కీ.

అనంతు ఎదురుగా చూసి భయంతో కంపించిపోయాడు. తన మొహం తడిమి చూసుకున్నాడు. నోట మాట రావడంలేదు. "నువ్వు...నువ్వు...ను.."

విక్కీ నవ్వుతూ "నిన్ను నువ్వే గుర్తుపట్టలేవా.........అనంత్?" అన్నాడు.

### 30 సంవత్సరాల తరువాత

"ఈ వీడియో లో మనిషిని మళ్ళీ చూడండి, మీరే కద?" ఎస్సై అడిగారు.

"నేను కాదు సార్, నన్ను నమ్మండి. అసలు నేను బ్యాంకులోనే లేను. నాలాగే ఉన్నవాడెవడో వచ్చి నా అకౌంట్లో వున్న డబ్బు తీసుకెళ్ళాడు" మొత్తుకుంటున్నాడు స్టాక్ బ్రోకర్.

"మరి మీ సంతకం, ఐడి కార్డు?"

"నా దగ్గరే వున్నాయి..చూడండి"

ఎస్సై అవి చూసి, అనుమానంగా "మీరు వేరే చోట వున్నానడానికి ఏమైనా ఆధారాలున్నాయా?"

"నేను నా ఆఫీసులో వున్నా సార్, ఎవరు చూసారో ఆఫీసులో వాళ్ళని అడిగితే తెలుస్తుంది"

"మీరు ఆఫీసులో వున్నట్టు అందరినీ నమ్మించి, మెల్లాగా జారుకొని, బ్యాంకుకి వెళ్ళి డబ్బులు డ్రా చేసి వుండచ్చుగా? ఏదైనా ఇన్సూరెన్సు కంపెనీ నుంచి పోయిన డబ్బుని తీసుకోవడానికి ప్లానా?"

"సార్, అన్ని తెలివితేటలు వుంటే, మీ దగ్గరికి ఎందుకు వస్తాను? అదేదో ఇన్సూరెన్సు కంపెనీతోనే పెట్టుకొనేవాడిని కదా, నన్ను నమ్మండి సార్, ఆ వీడియోలో వున్నది నేను కాదు"

ఎస్సై ఏదో అనబోయెంతలో, "తెలుసు మీరు కాదని" అని వినిపించింది వెనక నుంచి.

వెనక్కి తిరిగి చూస్తే, టేబుల్ మీద ఆపిల్ పండు తింటూ, కూర్చున్న ఒక ముప్పై-నలభై ఏళ్ళ మధ్య వున్నతను కనిపించాడు. మంచి బాడి, హైటూ, నల్ల ఫుల్ హ్యాండ్స్ టి-షర్టు, జీన్సు వేసుకొని, ఏదో బాలివుడ్ హీరో లాగ వున్నాడు. పండు తినేసి చెయ్యిని షర్టుకు రాసుకొని "రోహిత్, స్పెషల్ క్రైం ఇన్వెస్టిగేటివ్ బ్రాంచ్, ఢిల్లీ సెంట్రల్ కమాండ్ నుంచి. ఈ కేసుకి సంబధించి ఇక మీదట నేను సూపర్ వైసర్ ని" ఆర్డర్ పేపర్లు ఎస్సై కిచ్చాడు. ఎస్సై వాటిని చూసి, సెల్యూట్ చేసి, "కేసు గురించి.." అని ఏదో అనబోయాడు.

"తెలుసు, ఇలాంటి క్రైంస్ ముంబై లో కూడా జరిగాయి. ఇవన్నీ ఒకతనే చేసుంటాడని అనుకుంటున్నాము."

"సార్, ఈ కేసులో ఇంకో విషయం వుంది సార్. ఆ వీడియోలో వున్నతనికి ఎవరో అమ్మాయి హెల్ప్ చేస్తోంది. బ్యాంకు ముందర వున్న కెమెరా లో, ఒక కార్ కనిపించింది. ఆ వీడియోలో వున్నతను ఆ కారెక్కి వెళ్ళాడు. ఆ అమ్మాయే డ్రైవ్ చేసింది" ఎస్సై అన్నాడు .

రోహిత్ వీడియో దగ్గరికి వెళ్ళి, పరీక్షగా చూసి, చిన్నగా నవ్వుకొని, "ఆ కార్ లైసెన్స్ నంబరు మీద ఎంక్వైరి చెయ్యండి, అన్ని పోలీస్ స్టేషన్లకి పంపించండి" ఇంకా ఏదో అనబోతుంటే, సెల్ ఫోను మోగింది. టెక్స్ ట్ మెస్సేజ్. అది చూసి, ఒక క్షణం ఆలోచించి ఎస్సై తో "ఓకె, నేను బ్యాంకు కి వెళ్ళి వస్తాను" అని స్టాక్ బ్రోకర్ వైపు చూసి "అన్నట్టు, మీకు సంబంధించిన క్యాష్ వివరాలు వేరే బ్యాంకు లో కూడా వుంటే అవన్నీ నాకు ఇచ్చి వెళ్ళండి. అవన్నీ వెంటనే సెక్యూర్ చెయ్యాలి. ఒక వేళ ఎవరైనా వస్తే వెంటనే మాకు బ్యాంకు వాళ్ళు అలెర్ట్ చేస్తారు".

స్టాక్ బ్రోకర్ ఒక కాగితం మీద వివరాలు రాసి, రోహిత్ కి ఇచ్చాడు.

అవి తీసుకొని, రోహిత్ వెళ్ళుతూ "ఇంక మీరు ఇంటికి వెళ్ళండి. కేసు వివరాలు నేను వచ్చి చెప్తా మీకు" అన్నాడు.

తరువాత రోజు అదే పోలిస్ స్టేషన్ లో ఎస్సై కూర్చుని ఫైల్స్ చూస్తూ వుంటే, ఎదురుగా లోపలికి ఎవరో వస్తున్నట్టు కనబడింది. సూటు వేసుకొని ఎవరో వస్తున్నారు. కొంచెం సరిగ్గా కనబడేసరికి ఎస్సై వెళ్ళి "సార్, అన్నీ పోలీస్ స్టేషన్లకి కార్ నంబర్ పంపించాను సార్. అది ఎవరో బ్యాంకు ఆఫీసరు పేరు మీద రిజిస్టర్ అయి వుంది, కాని...:" అని ఇంకా ఏదో చెప్పబోతోంటే, ఆ వచ్చినతను చెయ్యెత్తి ఆపి "ఆగండి, నేనవరో మీకు తెలుసా?". ఎస్సై అయోమయంగా "అదేంటి సార్, నిన్ననే గా మీరొచ్చారు? ఆ వీడియో కూడా చూసారు కదా. కారు నంబరు మీద ఎంక్వైరీ చెయ్యమన్నారు, చేసాము"

"అసలు నేనెవరనుకుంటున్నారు?" అడిగాడు వచ్చినతను

"రోహిత్, స్పెషల్ క్రైం ఇన్వెస్టిగేటివ్ బ్రాంచ్, ఢిల్లీ సెంట్రల్ కమాండ్ నుంచి..." ఇంకా ఎస్సై ఏదో చెపుతూనే వున్నాడు.

వచ్చినతనికి అర్థం అయ్యింది. ఒకసారి కళ్ళు మూసుకొని, గట్టిగా ఊపిరి తీసుకొని ఎస్సై తో, "లోపలికి పదండి, మీతో కొంచెం మాట్లాడాలి".

లోపలికి వెళుతూంటే, నిన్న వచ్చిన స్టాక్ బ్రోకర్ కారు లోంచి దిగి పరిగెత్తుకొని వస్తూ "సార్, ఏంటి సార్ ఇది, నా బ్యాంకు నంబర్లు తీసుకొని, మొత్తం క్యాష్ అంతా ఖాళీ చేయించారు. నా డబ్బులు సేఫేనా సార్?" అని అడిగాడు వచ్చినతన్ని.

"లెట్ మి గెస్...నిన్న నేను ఈ వివరాలన్ని మిమ్మల్ని అడిగాను కదా?".

తల ఊపాడు స్టాక్ బ్రోకర్ .

ఆ వచ్చినతని పెద్దగా నవ్వుతూ "మనకంటే ముందున్నాడు, లోపలికి పదండి. మాట్లాడుకోవల్సినవి చాలా వున్నాయి"

"అగ్రిమెంట్ ప్రకారం, నీ 30% షేర్ ఇదిగో" అన్నాడు విక్కీ ఒక బ్యాగ్ ఇస్తూ.

బ్యాగులోకి చూసి, "కరెక్టు లెక్కేనా?" అడిగింది సునంద.

"నమ్మకపోతే లెక్క పెట్టుకో"

"మొహాలు మార్చేవాడివి, నిన్ను నమ్మడమా? తరువాత లెక్క పెట్టుకుంటా కాని, ఇప్పుడు నెక్స్ ట్ జాబ్ ఏంటి?"

బ్యాగు సర్దుకుంటూ అన్నాడు విక్కీ " రేపు మాల్ లో కలు చెప్తా" అని వెళ్ళబోయాడు ..

"ఏడాది పైనే అయ్యింది, మనిద్దరం ఇప్పటిదాక మూడు జాబ్స్ చేశాం కలిసి. అయినా నమ్మవా?"

విక్కీ తల మాత్రం తిప్పి "నమ్మకం ఇచ్చేది కాదు. సంపాదించేది. అయినా తొందరేముంది, రేపు కలుస్తాం కద, అప్పుడు చెప్తా".

బ్లూమింగ్డేల్ మాల్.

'చాట్ స్టాప్ ' దగ్గర కూర్చొని వుంది సునంద తింటూ.

వెనక నుంచి విక్కీ వచ్చి "ఎస్ ఆర్ కె ఇండస్ట్రీస్ ఎం డి గారింట్లో పెళ్ళంట...వెళ్దామా?" అన్నాడు.

సునంద తింటూ "చాలా మంది ఉంటారు, నగలు తీయడం కష్టం".

"కాని ఎం డి గారికి కష్టం కాదు కదా. ఆయన చెప్తే వాళ్ళమ్మాయి చక్కగా తీసి ఇస్తుంది" అన్నాడు నవ్వుతూ.

"మరి నేనేంచెయ్యనక్కడ?" అడిగింది సునంద

"ఎం డి గారిని దర్జాగా కారులో తీసుకెళ్ళు" నవ్వుతూ అన్నాడు విక్కీ.

"ఎన్నింటికి?"

"పెళ్ళి మండపం బయట పదింటికల్లా ఉంటే చాలు, ఎం డి గారొస్తారు".

సునంద ఫోన్ చూస్తూ "టైం అయ్యింది ఇంక. సీ యు టుమారో" అని వెనక్కి చూసి "మీరు వెళ్ళి పెళ్ళి కి రెడీ అవ్వండి ఎం డి గారు" అంది.

తరువాత రోజు పదిగంటలు. కారు స్టీరింగు మీద వేళ్ళతో మెల్లగా తడుతోంది సునంద. పది దాటుతోంది. ఇంకా 'ఎం డి ' గారు రాలేదు. ఇంకో రెండు నిముషాల తరువాత గబ గబా వచ్చారు ఎం డి ఒక బ్యాగు తీసుకొని.

"పోని తొందరగా"

సునంద కదల్లేదు .

"పద, ఏంటి లేటు? భోజనం కూడా చేద్దామనా ? అంత టైం లేదు..పద..పద.."

అయినా కదల్లేదు సునంద. ఇంతలో కారు డోరు తీసి లోపలికి వచ్చాడు రోహిత్. 'ఎం డి ' పక్కనే కూర్చున్నాడు.

"హల్లో, నేను రోహిత్. నీకు తెల్సునకుంటా.." అన్నాడు నవ్వుతూ

'ఎం డి ' గారి మొహం లో అయోమయం . "నేనవరనుకుంటున్నారు? ఎస్ ఆర్ కె ఇండస్ట్రీస్ ఎం డి ని...మీరెవరు? ముందు కారు దిగండి"

"అందరం దిగుదాం కాని, ఒక ప్రశ్న, నువ్వు ఎం డి అయితే, మరి కారు వెనక వున్నాయన ఎవరు?"

చప్పున వెనక్కి తిరిగి చూశాడు 'ఎం డి '. చాలా మంది పోలీసులు, వాళ్ళతో పాటు ఎం డి ఉన్నారు.

ఎక్కడ లోపం జరిగింది?

"యు ఆర్ విక్కీ? రైట్? నీకు ఇంకో పేరు వుందని విన్నాం. వాట్ ఈస్ ఇట్? ఆ.. అష్టావక్ర. వెరీ గుడ్ నేం. నీకో టాలెంట్ వుందని విన్నాం. నువ్వు ఎనిమిది  కండరాలతో మొహాలు మార్చుకోగలవని. అద్భుతమైన విద్య. కాని ఆవిడ లాగా మంచి పనికి ఉపయోగించుకోవచ్చు కదా?" సునంద ని చూపిస్తూ అన్నాడు రోహిత్.

అదిరిపడ్డాడు విక్కీ. చూస్తుండగానే సునంద మొహం మారిపోయింది.

" ప్లీస్ మీట్ సమైరా, మా బెస్ట్ డిటెక్టివ్" అన్నాడు రోహిత్

సమైరా అంది " నేచర్ ఈస్ క్లెవెర్ విక్కీ. ప్రకృతి కి స్త్రీ జాతి అంటే ఇష్టమేమో. మాకు ఎక్కువ రెసిస్టన్స్ వుంటుంది. నాకు తెలుసు, నువ్వు మొహం మార్చుతున్నప్పుడల్లా నొప్పిగా వుంటుందని. అందుకేనేమో, నాకు నొప్పి తగ్గడానికి ఎక్కువ కండరాలు మార్చే వీలుంది. అందుకే నీకంటే నేనే ఇంకా స్పష్టంగా మార్చగలను.."

విక్కీ చూస్తూ మాట్లాడలేక పోయాడు తన మొహమే కనపడేసరికి.

## క్షమయా ధరిత్రీ

గాయత్రి(క్రొవ్విడి)చెనిమిళ్ళ

వణికే చేతులతో పిట్టగోడ అంచుని పట్టుకుని కిందకి చూసింది స్నిగ్ధ. తొమ్మిది అంతస్థులకిందవున్ననేల గిర్రున తిరిగినట్టైంది. గట్టిగా తల విదిల్చింది.

'ఓహ్ గాడ్..., ఎలా.. ఎలా చేసుకుంటారీ జనాలందరూ ఆత్మహత్యలు..!!' అనుకోగానే ఒళ్ళు మొత్తం జలదరించిందామెకి. 'ఇంతకీ తన సంగతేంటి..? అసలు ముందుగా తన తల పగులుతుందా..? లేక.. కాళ్ళు చేతులు విరుగుతాయా..! అసలు నొప్పి తెలుస్తుందా..? లేదా ఆలోపే ప్రాణం పోతుందా..? ఏమో..!! దారిలో గాలివాటుకి తన శరీరం వేరే ఫ్లాట్ల కిటికీలకీ, ఏ.సీ. మెషిన్లకీ తాకి చిట్లుతుందా..? మెదడు బయటికి వచ్చి భయానకంగా మారిపోతుందా..?', కళ్ళు గట్టిగా మూసుకుంది.

'తన వాళ్ళు.. చూసి ఎలా రియాక్టవుతారు?' గుండెల్లో ఏదో కలుక్కుమన్న ఫీలింగ్. అమ్మా, నాన్న గుర్తొచ్చారు, వాళ్ళ గుండెలు పగిలిపోతాయి అనుకుంది బాధగా. ఏమనుకుంటారు?  'ఈ రోజు కోసమా మేము ఇన్నేళ్లూ అంత కష్టపడినదీ, అన్ని అవమానాలు సహించినదీ.. ఇది చూడడానికా, ఇందుకేనా..? అని అయితే ఖచ్చితంగా అనుకుంటారు. అన్నయ్య, వదిన.., అక్క, బావ.. వాళ్ళ పిల్లలూ.., చిన్నప్పట్నుంచీ తనతో పెరిగిన గీతా, రేవతీ...' అంటూ తనవారందర్నీ తలుచుకుంది.. వాళ్ళందరి ముఖాలు ఆమె కళ్ళముందు కదిలాయి.

'లేదు, అసాధ్యం.., ఇక నావల్ల కాదు.. ఈ పోరాటం సాగించడం నాతో అవదు. ఇన్నేళ్ళ పోరాటం తర్వాత జీవితం ఒక దరికి చేరుతున్నవేళ నా ఈ నిర్ణయం..?? ఊహు.. తప్పదు.. చాలు.. ఇక నేను ఈ జీవితానికి ఓ కొత్త ఆహ్వానం పలకలేను.. ఎన్నటికీ...

...ఆ వ్యక్తి ఎంత గొప్పవాడైనా సరే, ఎంత మంచివాడైనా సరే.., పెళ్ళీ , సంసారం, పిల్లలూ.., ఊహు.. కానేకాదు.. నా వల్ల కాదు..  సో.. కాదనిచెప్పి ఇంట్లోవారిని బాధించే కంటే ఇదే మంచిది.. చాలా బెటర్, కొంతకాలం బాధపడ్డా తర్వాత సర్దుకుంటారు. కనీసం అప్పటినుంచైనా వారి

జీవితాలు సాఫీగా సాగిపోతాయి..' అలా ఆలోచించగానే ఆమెకి చాలా హాయిగా, తేలికగా అనిపించింది. 'అసలు నాకీ ఆలోచన ముందే వచ్చివుంటే ఎంత బాగుండేది. అందరికీ ఎన్ని కష్టాలు తప్పేవి.., ఛ.. ఎంత పెద్ద డంబ్ హెడ్ ని నేనూ.. ఛ..ఛ..', తనని తాను తిట్టుకుంటూ మళ్ళీ కిందకి చూసింది. ఈసారి కళ్ళు తిరగలేదు. భయం కూడా వేయలేదు. ఓ మంచి నిర్ణయం తీసుకున్నానే తాత్కాలిక తృప్తితో మనసు తెరిపిన పడి సంతోషం వేసిందామెకి.

నెమ్మదిగా కదిలి కాలు లేపి, పాదం పిట్టగోడ మీద ఆనించగానే మళ్ళీ ఆమెలో ఏదో సన్నటి వణుకు. అంతలోనే ఏదో తెలియని తెగింపు ఆమెలో ప్రవేశించిగా, తలవిదిల్చి, గోడ అంచుని పట్టుకుని తన చివరి మజిలీకోసం ముందుకి కదలబోతుంటే.., "తొమ్మిదో ఫ్లోరు.. సరిపోదు స్నిగ్ధా..!" అంటూ ఖంగుమంది కల్పనగారి గొంతు. తుళ్ళిపడి, గభాల్న కాలుదించి కంగారుగా వెనక్కితిరిగింది స్నిగ్ధ. చేతులు ఫోల్డ్ చేసుకుని టెర్రాస్ తలుపుకి ఆనుకుని నిలబడివున్నారామె. సిగ్గుతో కుంచించుకుపోయింది స్నిగ్ధ. కల్పన నిలబడ్డ పొజిషన్ చూస్తే చాలాసేపట్నుంచీ అక్కడే నిలబడ్డట్టుంది. ఎంతసేపట్నుంచి తనని గమనిస్తున్నారో అర్థంకాలేదు. తల వంచుకుంది గిల్టీగా.

తాపీగా నడిచి వచ్చి కిందకి చూసారు కల్పన., "ప్చ్... కష్టం స్నిగ్ధా.. చావడానికైతే సరిపోదు..! మొన్ననే అనుకుంటా ఒకామె 24 అంతస్థుల పైనుండి దూకింది కదూ.. ఫేస్ బుక్, వాట్సాప్.. మొత్తం అవే ఫార్వార్డ్స్, నువ్వు చూడలేదా? 49 ఫ్రాక్చర్స్ తో షీ సర్వైవ్డ్..! ..సో.. తొమ్మిది ఫ్లోర్స్ అంటే ఛాన్సెస్ వున్నాయిగానీ గ్యారెంటీ ఐతే లేదు.. వేరే ఆప్షన్స్ ఏవైనా ఆలోచించి చూడు.." చాలా మామూలుగా చెప్పింది. 'ఈ డ్రెస్ బాలేదు, వేరేది వేసుకోమన్నంత క్యాజువల్ గా. స్నిగ్ధ ముఖం ఎర్రగా కందిపోయింది. తలెత్తి ఆవిడవైపు చూసింది.

**కల్పన**.., దరిదాపుగా 47-48 ఏళ్ళుంటాయావిడకి. కాకపోతే, చక్కటి ఫిట్నెస్ తో కనీసం ఓ పదేళ్ళు తక్కువగా కనిపిస్తుంది. యాభైమందికి పైగా లేడీస్ వుండే ఆ వర్కింగ్ విమెన్స్ హాస్టల్ కి ఓనర్ కమ్ వార్డెన్ ఆవిడ. ఖచ్చితంగా-కాస్తంత మృదువుగా, సూటిగా-కానీ సున్నితంగా వుండే ఆవిడ తీరే ఆ హాస్టల్లో వుండాలని వచ్చే వారి సంఖ్య ప్రతి సంవత్సరం పెంచుతోంది. అందరికీ ఆవిడంటే ఎంతో గౌరవం, మర్యాద. ఇంట్లో వాళ్ళకే కాదు, అక్కడవుండే తామందరికీ కూడా ఆవిడన్నా, ఆవిడ అందరినీ చూసే విధానమన్నా ఎంతో మన్నన.

అలాంటి ఆవిడ ముందు ఇలా పిరికిగా స్యూసైడ్ అటెంప్ట్ చేస్తూ దొరికిపోవడం చాలా నీచంగా, నిస్సహాయంగా తోచింది స్నిగ్ధకి. ఆ మాటల వెనుక, ఆవిడ ప్రెజెన్స్ వెనుక అంతర్లీనంగా వున్న తీవ్రతవల్లో, లేక తన నిస్సహాయతకో తెలీదుగానీ కాసేపటి క్రితం వరకూ తనలో వున్నాయనుకున్న తెగింపూ, ఓపికా ఎవరో ఊదేసినట్టే మాయమవగా నిలబడ్డచోటే కూలబడింది స్నిగ్ధ.

అప్రయత్నంగా తన కళ్ళని తడుముకుంది, 'ఇదేమిటి కొత్తగా..? నా కళ్ళల్లో..., నా కళ్ళలో నిండుగా నీళ్ళా..? ఏనాడో తడి ఆరిపోయిన వాటిల్లో ఇంకా నీరుందా.. !!' ఒక్కో కన్నీటిచుక్కా తన గుండెని తడుపుతుంటే నిశ్చలంగా అక్కడే కూర్చుండిపోయింది.

------------------------------000000--000000------------------------------

కొద్ది నిమిషాలపాటు స్నిగ్ధనే పరిశీలనగా చూస్తుండిపోయింది కల్పన. స్నిగ్ధ ఆమెకు కొత్తకాదు. దాదాపు నాలుగేళ్ళ క్రితం తండ్రితోపాటూ సిటీకివచ్చి, కొత్తగా జాబ్ జాయిన్ అయ్యేముందు, హాస్టల్ లో చేరేందుకు వచ్చినప్పటి ఆమె రూపం ఇంకా తన మనసులోంచి చెరిగిపోలేదు.

స్నిగ్ధ ముఖం, ముఖ్యంగా ఆమె కళ్ళు.., ఆకళ్ళలో నిర్లిప్తత, వుదాసీనత తనని విస్మయపరిచాయి. ఆమెలో ఏదో గూడుకట్టుకున్న విషాదం, దాన్ని దాచే స్థైర్యం సమానంగా ప్రతిబింబిస్తుంటాయి. హాస్టల్ లో ఎందరో అమ్మాయిలనీ, రకరకాల సమస్యల్లో వున్న స్త్రీలనీ చూసినా, స్నిగ్ధమాత్రం ఓ విలక్షణమైన అమ్మాయిగా తన దృష్టిలో ఆ క్షణం నుండే నిలిచిపోయింది.

అందరితోనూ వున్నా, ఆమె చుట్టూ ఏదో కనిపించని అభేద్యమైన గోడ కట్టుకున్నట్టే వుండేది. ఎప్పుడైనా సరే.. తన వర్క్, తన రూమ్, తన వ్యాపకమేదో తనది, అంతే. అందర్నీ ఏదో కాస్త ఫార్మల్ గా పలకరించడం, స్నేహపూర్వకంగా రెండు మాటలు మాట్లాడడం, అంతే.., ఎవరైనా అంతవరకే. కొంతమంది అమ్మాయిలు ఆమెతో స్నేహం పెంచుకోవాలని ప్రయత్నించి కుదరకవదిలేసారు.

కానీ చిన్న, చిన్న సమస్యలు ఎదురైనపుడు.., అంటే మాలతి కి ఫిట్స్ వచ్చినప్పుడూ, డైటింగ్ ఎక్కువై రేఖ కళ్ళుతిరిగి పడిపోయినప్పుడూ, సిటీలో కర్ఫ్యూ వల్ల వంటవాళ్ళూ, పనివాళ్ళూ రాలేని సమయంలో హాస్టల్ లో భోజనాల అరేంజ్మెంట్స్ దగ్గరనుండి, క్లీనింగ్ వరకూ,

ఇలా అన్ని సందర్భాల్లో ఆమె అందించిన చేయూత, తోడ్పాటులతో అందరికీ అర్ధమైంది ఆమె అహంభావి కాదు కేవలం రిజర్వ్డ్ పర్సన్ మాత్రమే అని. మిస్ రిజర్వ్డ్ లేడీ ఆఫ్ ది హాస్టల్ గా స్నిగ్ధ అందరికీ ప్రత్యేకమే. వారంతా అలా చూసినా తనకి మాత్రం ఆమె ఓ విరాగిణిలా కనిపించేది.

కానీ ఈరోజు ఎందుకో ఆమెలో ఏదో మార్పు. ఇన్నేళ్ళలో ఎన్నడూ చూడని తేడా.. ఆమెలో ఎప్పుడూ కనిపించే నిర్లిప్తత స్థానే కాస్త అలజడి, ఏదో కంగారు కనిపించేసరికీ తనకి ఆశ్చర్యం వేసి కొద్దిగా శ్రద్ధగా గమనించింది. తీరా చూస్తే ఇదిగో ఇక్కడ, ఇలా.., ఇంత దారుణానికి ప్రయత్నిస్తూ కనిపించింది. "**ఒక హాస్టల్ వార్డెన్ గా తను గుర్తించిన మార్పు తమ పిల్లల్లో తల్లితండ్రులు గుర్తించగలిగితే ఎన్ని స్యూసైడ్స్ ఆగుతాయో కదూ..!**" చిన్నగా నిట్టూర్చింది కల్పన.

"ఎంత చూసినా, ఎన్ని మనసులు తరచినా స్త్రీ జీవితం మొత్తం ఓ సమస్యా తోరణం.. బాధా నిలయం.., కష్టాలు, కన్నీళ్ళూ .., కడగళ్ళూ.. సాధింపులూ, వేధింపులూ, వేదనలూ... ఇవేగా వారి తోడూ, నీడా.

కానీ, ఏంటిది..? తమ జీవితాలని చక్కదిద్దుకునే సామర్ధ్యం, సావకాశం వున్న ఇలాంటి వారు కూడా ఆత్మహత్యే శరణ్యం అనుకుంటే ఈమాత్రం అవకాశం కూడాలేని అభాగ్యుల మాటేమిటి..? వారి గతి ఏమిటి..?" దిగులుగా అనిపించిందావిడకి.

"వారి సంగతి ఆలోచించడం తర్వాత, ముందుగా స్నిగ్ధని తమాయించాలి. ఆమెలో ఇదివరకు చూసిన స్థైర్యం తిరిగి తేవాలి. అదీ తన ముందున్న ప్రస్తుత కర్తవ్యం.., అలా చేయాలంటే ముందామె కష్టమేమిటో తెలియాలి.

కొద్దిరోజుల్లో ఆమెని చూసుకోవడానికి పెళ్ళివారు వస్తున్నారనీ, ఆమెకి తగిన సంబంధం అనీ ఆమె తండ్రి లాస్ట్ వీక్ వచ్చినప్పుడు ఎంతో సంతోషంగా, తడికళ్ళతో చెప్పడం గుర్తొచ్చింది. అయితే ఆమె ఈ దారుణమైన నిర్ణయానికి కేవలం అదే కారణమా, ఏదైనా ప్రేమ వ్యవహారమా, లేక ఇష్టంలేని వివాహమా.., అయినా చక్కగా చదువుకుని , సిటీలో మంచి వుద్యోగం చేస్తున్న ఈ అమ్మాయిలో అంతటి బేలతనమా..! తానెక్కడైనా తప్పుగా అంచనా వేసిందా ఆమెలో కనిపించిన స్థైర్యం విషయంలో...?" తన థాట్స్ పక్కకి పెడుతూ స్నిగ్ధ వైపు నడిచింది కల్పన. మెల్లగా వంగి "పద స్నిగ్ధా" అంటూ ఆమె భుజంచుట్టూ చేయివేసిలేవదీసింది.

------------------------------000000--000000--------------------------------

"నిజం చెప్పు స్నిగ్ధా! ఇన్నాళ్ళూ నీ కళ్ళలో కనిపించే విషాదఛాయల గురించి ఎప్పుడూ నేనేమీ ప్రశ్నించలేదు. కానీ ఈ రోజు.., ఇంత వీక్ గా నిన్ను చూసాకా అడగకుండా వుండలేకపోతున్నాను. ఏం జరిగింది? ఎవర్నన్నా ప్రేమించి మోసపోయావా..? లేక ఇంట్లో కలతలా.., లేక.. ఏదైనా సరే.. ప్లీజ్ షేర్ విత్ మీ టుడే.. ఏమిటి నీ సమస్య..?" సూటిగా ప్రశ్నించింది కల్పన.

మౌనంగా నిలబడ్డ స్నిగ్ధ తలతిప్పి చూసింది. "నా గురించి తెలుసుకోవాలనుందా మేడమ్..?, ...అయితే రండి నాతో...", అంటూ వేగంగా కల్పనగారి చేయి పట్టుకుని తన రూమ్ వైపు దారితీసింది.

బీరువా తాళాలు తీసి లాకర్ లోపల దాచివుంచిన ఓ పెద్దకవరు లోంచి చాలా పాతగా వున్న కొన్ని న్యూస్ పేపర్లు తీసి కల్పన చేతుల్లో వుంచింది.

తన వైపు అయోమయంగా చూసి వాటిని తిప్పి చూసి, మడిచిపెట్టివున్నవైపు వున్న న్యూస్ ఐటమ్స్ చదివి రిలేట్ చేసుకోవడానికి చూస్తున్న ఆవిడ ప్రయత్నాలని గమనించి మరో పేపర్ లోంచి చదవాల్సిన మేటర్ ఆవిడవైపు కి తిప్పి అందించింది స్నిగ్ధ. అందులో ఓ మూలగా పెద్ద అక్షరాలతో రాసిన ఒక చిన్న వార్త...

**"పద్నాలుగేళ్ళ పాప పై జరిగిన ఘోరమైన అఘాయిత్యం...**

*...ట్యూషన్ నుండి తిరిగివస్తున్న బాలికని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి, చెరచి, తీవ్రంగా హింసించి, అపస్మారకమైన స్థితిలో ఊరిచివర పొలాల్లో విసిరేసారు..."*

పాప ఎవరో అర్ధమౌతూనే ఆవిడ కళ్ళలో కన్నీరు చిమ్మి అక్షరాలు మసకబారాయి. నిశ్చేష్టురాలై తలెత్తి స్నిగ్ధ వైపు చూసింది, "ఇ.. ఇదంతా.." అతికష్టం మీద గొంతు పెగుల్చుకుంటూ అంది కల్పన అస్పష్టంగా. స్తబ్దంగా గోడనానుకుని ఆవిడవైపు చూసి తలూపింది స్నిగ్ధ.

"..నిజమే మేడమ్.. ఆ పాప.., నేనే.. అది నా కథే.., ఆ గాయం ఈ శరీరానికి అయ్యి పదమూడేళ్ళు దాటుతున్నా మనసులో మాత్రం ఇప్పుడే తగిలినంత పచ్చిగా, పుండులా ఈ రోజుకీ సలుపుతూనే వుంది. నా ఫ్యామిలీ, కావలసినవారు, ఎందరో డాక్టర్లు, నర్సులు, ఎక్స్ పర్ట్స్, సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు, ఛైల్డ్ కౌన్సిలింగ్ స్పెషలిస్టులు, సోషల్ వర్కర్లు.. ఎందరో నా కోసం తపనపడ్డారు, కష్టపడ్డారు..., అందరి కృషీ, శ్రమా నన్నైతే నిలబెట్టాయి గానీ నాలోంచి ఆ గతం తాలూకు నీలినీడలని మాత్రం చెరపలేకపోయాయి..." చెప్పింది స్నిగ్ధ చాలా కష్టం మీద అన్నాళ్ళుగా తన గాయానికి కప్పివుంచిన తెరని తొలగించే ప్రయత్నం చేస్తూ.

నిస్త్రాణగా పక్కనున్న మంచంమీద కూర్చుండిపోయింది కల్పన. 'అంతటి ఘోరమైన, భయంకరమైన ఎక్సపీరియరియన్స్ తర్వాత ఏ ఆడపిల్లైనా ఎలాంటి రంపపుకోతని అనుభవిస్తుందో ఊహించడం ఒక స్త్రీకి మాత్రమే సాధ్యం.., ఓ స్త్రీగా తాను అందంతా వూహించగలదు. ఒక పసి హృదయపు బాధ లోతుని గ్రహించనూగలదు..,

..ఇలాంటి దుస్సంఘటనల తర్వాత ఎందరో అమ్మాయిలు బ్రేక్ అయిపోతారు, విరిగిపోయి, కృంగిపోతారు.. కానీ.. తనముందున్న ఈ అమ్మాయి... ఎంత గొప్ప సాహసి, ఎంతటి సహనశీలి.., అసలు..అసలెలా..ఎలా తట్టుకుంది..!! ఎలా నిలబడింది..?' క్షణకాలం క్రితం బేలగా కనపడ్డ స్నిగ్ధ వ్యక్తిత్వం అమాంతంగా తానూహించనంత ఎత్తుకి ఎదిగిపోగా మతిపోయినట్టైంది. ఆమె కష్టపులోతు తన మనసుని తాకగా కన్నీటి పర్యంతమయ్యింది కల్పన.

నిదానంగా కదిలివెళ్ళి ఆవిడపక్కన కూర్చుంది స్నిగ్ధ. ఆర్తిగా స్నిగ్ధచేతిని తన చేతుల్లోకి తీసుకున్నది కల్పన "ఎ..ఎలా..అస..అసలెలా తట్టుకున్నావు స్నిగ్ధా..?", వణికే గొంతుతో బాధగా ప్రశ్నించింది. నిర్వేదంగా చూసింది స్నిగ్ధ. కరిగికన్నీరవ్వాల్సిన సమయంలో ఆమె కళ్ళు ఒక్క చుక్కనీరుకూడా లేకుండా నిస్తేజంగా నిలిచాయి. కానీ, ఆ క్షణం ఆ చిరు స్పర్శే వారి మధ్య ఏదో తెలియని ఓదార్పుకి వారధయింది.

ఆవిడ వైపు చూసింది, ఆ క్షణం కల్పన మనసులో రేగిన అలజడి స్నిగ్ధకి క్లియర్ గా తెలుస్తోంది.. 'తను పడ్డ యాతనలనీ, నరకాన్నీ ఓ స్త్రీగా వూహించి, తలుచుకునీ కదిలిపోయిందావిడ.., సహజమే.., కష్టానికి వెంటనే మనసు స్పందించడం మానవసహజం.. కానీ, ఆ కష్టపులోతు అర్ధమవ్వాలంటే మాత్రం ఆ మనిషి ఖచ్చితంగా సెన్సిబుల్ వ్యక్తి అయి వుండాలి..

అలా కాని వారిని, కాస్తంత కూడా దయలేని పాషాణాలవంటివారినీ, అందులో గొప్పగొప్ప స్త్రీ మూర్తులనీ, త్యాగధనుల్నీ ఎందరినో కూడా తన ఈ పయనంలో చూసింది.., వారివల్ల ప్రతిసారీ, మరింతగా గాయపడింది, బాధపడింది. మరెంతో నేర్చుకుంది, మనుషుల గురించీ, వారి మనస్తత్వాల గురించీ.

కానీ ఏ మనిషైనా, కాస్త సెన్సిబుల్ అయితే మాత్రం.., కొంతైనా విచక్షణ కలిగివుంటే మాత్రం.. ఒక పసి హృదయపు బాధలోతునీ, అంతటి గాయపు నొప్పినీ తప్పక గ్రహించగలరు..

తన ముందున్న స్త్రీ అలాంటి రేర్ జెమ్ అని తనకు తెలుసు. అందుకేనేమో బహుశా ఇన్నేళ్ళలో తనకుతానుగా మొదటిసారి ఇలా ఓపెనప్ అయినదీ, తనకు జరిగిన ఘోరాన్ని చెప్పిందీ.. కల్పనగారి ముందే.. ఇది ఖచ్చితంగా ఆవిడ తనని ఆత్మహత్యాయత్నం చేస్తుంటే చూసినందుకో, ఆపినందుకో ఇచ్చే సంజాయిషీ అయితే మాత్రం కాదు..'

కొద్దిసేపటి నిశ్శబ్దం తర్వాత, నిర్లిప్తంగా చెప్పసాగింది స్నిగ్ధ,

"..అందుకే మేడమ్, అందుకే, నాలో ఇంత అలజడి.. నాకుటుంబం నాకోసం చాలా చేసింది., నాకు అనుక్షణం తోడై, నీడై నిలిచింది., నా కారణంగా, కేవలం నావల్ల ఊరంతా గుచ్చి గుచ్చి చూసే చూపులనూ, పరామర్శ పేరుతో చులకన చేసే మాటలనూ, హేళనలనూ తట్టుకుంది. నా గాయాలు చిందించిన ప్రతి రక్తపుచుక్కా వారు వారి కన్నీటితో కడిగారు..

నాకోసం కోర్టుల చుట్టూ తిరిగారు., పోలీసుల కాళ్ళపడ్డారు, నానా కష్టాలూపడి నాపట్ల దుర్మార్గం చేసిన వారికి శిక్ష పడేలా చూసారు. నా శారీరక, మానసిక సమస్యలన్నింటి కోసం ఎన్నో హాస్పిటళ్ళకీ, ఎందరో డాక్టర్ల దగ్గరకీ తిరిగారు. అసలు మంచంలోంచి లేవడానికే చాలాకాలం పట్టిన నాకు ఎంతో సేవ చేసారు.., డబ్బూ, శ్రమా, కష్టమూ, బాధా అన్నీ అనుభవించారు. ఎంతో చేసారు..,

చాలా మంది ఆడపిల్లలకు అలాంటి పరిస్థితుల్లో కొన్నిసార్లు కుటుంబమే శత్రువై దూరమవుతుంది. కానీ, నేను మామూలు మనిషిని కావడానికి వారే మూలమై నిలిచారు., నాలో ధైర్యమై నిలబడ్డారు.,

నావల్ల అన్నయ్యకీ, అక్కయ్యకీ పెళ్ళిళ్ళు కావడం కూడా చాలా కష్టమైంది. వారికీ, అమ్మానాన్నలకీ ఎన్నో అవమానాలు ఎదురయ్యాయి. అవన్నీ నాకోసం భరించి, సహించిన వాళ్ళు.., వాళ్ళు.. ఈ రోజు నానుంచి ఇన్నేళ్ళలో నా తిండి, చదువు, వుద్యోగం, ధైర్యంలాంటివి కాకుండా నన్ను మొదటిసారి ఒకటి కోరారు... అదీ నాకోసమే.., కానీ.. చూశారా... అదే.. అదే నాకు అసాధ్యమైంది... వారడిగినది.. "**నా ..నా పెళ్ళి**.." స్నిగ్ధ గొంతు వణికింది., ఒక్కక్షణం ఊపిరి తీసుకుని, మళ్ళీ మాట్లాడసాగింది, "..ఎలా మేడమ్..! ఎలా ఔనను.., ఎలా కాదనను? వారి జీవితం పూర్తయ్యేలోపు నాకో తోడు అందివ్వాలనీ, నీడ ఏర్పరచాలని అమ్మా, నాన్నల కోరిక. కానీ... వారు కోరేదానికి నా శరీరం గానీ, మనసుగానీ సిద్ధంగా లేవు.

అసలు నాలాంటి వారిని కోరి చేసుకునేదెవరులే అనే వుద్దేశ్యంతో, వారి ప్రయత్నాలు గమనించినా, ఫలితం ఎలాగూ వుండదనే నమ్మకంతో ఇన్నాళ్ళూ నేనూ పెద్దగా పట్టించుకోలేదు.

కానీ, ఇదుగో, ఇప్పుడు ఇన్నేళ్ళుగా వారు చేస్తున్న ప్రయత్నాలకి సమాధానంగా ఓ వ్యక్తి ముందుకు వచ్చాడు. అతడు చాలామందిలా నా ఉద్యోగం, సంపాదన కోసం కాక నాలాంటి దెబ్బతిన్న గతం వున్న అమ్మాయినే చేసుకోవాలనే కోరికతో పట్టుదలగా వెతుకుతూ, నా గతంతెలిసి నన్ను కోరాడట., నన్నే చేసుకుంటానని పట్టుబట్టాడట.

అతను చాలా మంచి ఫ్యామిలీ నుండి వచ్చాడట., కాకపోతే ఓ యాక్సిడెంట్ లో తన కాలుని కోల్పోయి, అదే కేసులో రెండు సంవత్సరాల జైలు జీవితాన్ని గడిపి తిరిగివచ్చిన వ్యక్తి. ఆ తర్వాత ఫ్యామిలీ బిజినెస్ లో చాలా షైన్ అయ్యాడట. ఒక అనాధాశ్రమం నడుపుతూ ఎందరికో సహాయపడుతున్నాడట. అతని కోసం ఎన్నో మంచి సంబంధాలు కూడా రావడం మొదలయ్యాయనీ, చాలామంది చక్కటి అమ్మాయిలనీ, శీలవతులనీ కాదని అతను నా ప్రొఫైల్ ఛూజ్ చేసుకున్నాడనీ మధ్యవర్తులు చెప్పారు. అసలైతే అతని ఇంట్లో వాళ్ళెవరికీ ఓ చెడిపోయిన అమ్మాయిని తమ ఇంటికోడలిగా తెచ్చుకోవడం – అది తమ జైలుకెళ్ళివచ్చిన కొడుకు కోసమైనా సరే, ఏమాత్రం ఇష్టంలేదట. కాకపోతే అతని పట్టుదలకి తలవొగ్గి మావాళ్ళ దగ్గరకి వచ్చారు, సంబంధం అడగడానికి.

మావాళ్ళు మోర్ దాన్ హ్యాపీ.., నా గతం కారణంగా సరైన సంబంధాలు రాని నాకు అంతమాత్రపు సంబంధం రావడంతో వారు చాలా ఆనందంగా వున్నారు. నేను కూడా వెంటనే ఒప్పేసుకోవాలని వారి ఆశ. పాపం వారి ఆత్రం అలాంటిది. అసలు అతను నాతో విడిగా మాట్లాడతాను అని అనకపోతే ఈసరికి పెళ్ళి ఏర్పాట్లు కూడా చేసేసేవారేమో కూడా..!

అతను నన్ను కలవడానికి రేపు వస్తున్నాడు. చాలా కల్లోలంగా వుంది మేడమ్.., కాదని నాకోసం అన్ని కష్టాలూ పడ్డ వాళ్ళని బాధపెట్టనూలేను., అవునని మనసు చంపుకుని పెళ్ళి చేసుకోనూలేను.. ఏం చెయ్యలేక, ఏం చేయాలో తోచక, ఒక్క క్షణం బలహీనమై స్యూసైడ్ చేసుకోవాలనుకున్నాను. సరిగ్గా అప్పుడే మీరొచ్చారు.." పూర్తి చేసింది స్నిగ్ధ.

లాలనగా ఆమె తలనిమిరి దగ్గరకి తీసుకుంది కల్పన. అప్రయత్నంగా ఆవిడ ఒడిలోకి పసిపిల్లలా చేరి, ముడుచుకుని పడుకుంది స్నిగ్ధ. కొద్దిరోజులుగా దరిచేరనీయని నిద్ర క్షణాల్లో ఆమెని ఆదరించింది. అలాగే తెల్లవారింది. హఠాత్తుగా మెలుకువ వచ్చి చూసేసరికి ఐదయ్యింది. కంగారుగా లేచి కల్పనగారివైపు చూసింది, చిరునవ్వు నవ్వింది కల్పన. "సారీ.." అంటూ ఆవిడని అంతసేపు అలా కూర్చోబెట్టేసినందుకు గిల్టీగా ఫీలవుతూ సంజాయిషీ ఇవ్వబోతున్న ఆమెని వారిస్తూ, "త్వరగా ఫ్రెష్ అయ్యిరా మా ఇంటికిరా స్నిగ్ధా.. కాఫీ రెడీ చేస్తాను..", క్లుప్తంగా చెప్పి సమాధానంకోసం చూడకుండానే వెళ్ళిపోయింది కల్పన.

చేసేదేమీలేక, లేచి టవల్ అందుకుని ఫ్రెష్ అవడానికి కదిలింది స్నిగ్ధ. కల్పన మీద వున్న గౌరవమో, లేక మరేమీ ఆలోచించలేని స్థితికి చేరుకున్న మనసుతో అలా రూమ్ లో వుండడం అనవసరం అనిపించిందో, లేక మరేమో గానీ కొద్ది నిమిషాల్లోనే ఆవిడ ఇంటికి వెళ్ళడానికి సిద్ధమై కదిలింది.

ఇల్లంటే ఎక్కడో దూరంగా లేదు. ఆ తొమ్మిదంతస్థుల హాస్టల్ బిల్డింగ్ లో మొదటి ఫ్లోర్లో ముందుభాగం ఆఫీస్ కి కేటాయించి వెనుకవైపు తనకంటూ ఓ అందమైన ఇంటిని ఏర్పాటు చేసుకుంది కల్పన.

స్నిగ్ధ వెళ్ళేసరికీ మెయిన్ డోర్ తీసేవుంది, 'బహుశా తనరాక కోసమేనేమో. ఆవిడ హాల్లో ఐతే లేరు.', అనుకుంది స్నిగ్ధ. పిలిచే ప్రయత్నం చేయలేదామె. నిశ్శబ్దంగా హాల్లోనే ఆగిపోయి తాను ఇదివరకు చూసినదే అయినా ఆ ఫ్లాట్ ని మరోసారి పరికిస్తూ నిలబడింది.

విశాలమైన ఆ ఫోర్ బెడ్ రూమ్ ఫ్లాట్ లో ఒక బాల్కనీ నిండా అందమైన రంగురంగుల పూల మొక్కలు చిన్ని చిన్ని డిజైనర్ ఫ్లవర్ పాట్స్ లో అమరిఒకవైపు, గ్రిల్స్ వెంబడి పరుచుకున్న చిక్కటి క్రీపర్స్ మరోవైపూ అందంగా కొలువుతీరి లోపలికి అడుగుపెడుతూనే ఎదురుగావున్న పెద్ద పెద్ద ఫ్రెంచ్ డోర్స్ అద్దాల్లోంచి కనిపిస్తూ వచ్చినవారిని పలుకరిస్తుంటాయి.

మరో వైపు రిలాక్స్ అవడానికి మాత్రమే కేటాయించిన మరో బాల్కనీ లో రెండు కేన్ ఛైర్స్.. ఎదురుగా చిన్న టీపాయ్ , నీట్ గా మెరిసే అద్దాల వెనుకనుంచి ఆహ్వానిస్తున్నట్టుంటాయి.

ఎక్కడా కూడా బట్టలవైర్లు, చెప్పులూ, చెత్తా చెదారంలాంటివి బయటికి కనిపించకుండా నీట్ గా వుండే ఆవిడ ఇంటిని చూస్తే ప్లెజెంట్ గా అనిపిస్తుంది.

మొత్తం బ్లాక్ అండ్ వైట్ కాంబినేషన్ లో, కళాత్మకంగా , పాత వంశీ మూవీ సెట్టింగ్స్ ని జ్ఞప్తికితెచ్చే ఇంటి అలంకరణ ఆవిడకున్న మంచి టేస్ట్ ని రిప్రెజెంట్ చేస్తుంటుంది.

నాలుగు బెడ్రూమ్స్ లో ఒక రూమ్ పూర్తిగా తన లైబ్రరీకి కేటాయించేసింది కల్పన. అధునాతనమైన బుక్ షెల్ఫ్స్.., వాటిని ఎప్పుడూ నీట్ గా మెయింటెయిన్ చేసే ఏర్పాట్లూ, రీడింగ్ టేబుల్, ఓ కంప్యూటర్, రైటింగ్ డెస్క్ , వీటితో పాటూ కిండిల్ లాంటి లేటెస్ట్ బుక్ రీడింగ్ గ్యాడ్జెట్స్ కూడా ఆవిడ బుక్ గ్యాలరీలో భాగాలే.

మరోవైపు చక్కటి మోడర్న్ ఎక్విప్మెంట్ తో చిన్న కిచెన్, అందమైన అంలకరణతో సింపుల్ గా, నీట్ గా కనిపించే బెడ్రూమ్స్, ఇల్లూ.. నిశ్శబ్దంగా అన్నీ పరికిస్తూ చూస్తున్న స్నిగ్ధ కల్పన వచ్చిన అలికిడికి తలతిప్పింది. చేతిలో చిన్న కాఫీ ట్రేతో వచ్చి, "రా స్నిగ్ధా ", అంటూ హాల్లో నుండి తన రీడింగ్ రూమ్ లోపలికి దారితీసారావిడ. మౌనంగా ఆవిడని అనుసరించిందామె.

సన్నటి ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ లీలగా ప్లే అవుతోందా రూమ్ లో. నిశ్శబ్దంగానే కాఫీ తాగడం పూర్తిచేసారు. స్నిగ్ధ కాఫీ తాగడం పూర్తయ్యేవరకూ ఆగి, కప్పు పక్కనుంచగానే లేచి రీడింగ్ టేబుల్ మీదున్న కొన్ని ఫైల్స్ అందుకుని ఆమె ముందుంచింది కల్పన, "ఒక్కసారి ఇవేంటో చూడు .." అంటూ.

అభావంగా తన ముందుంచిన బండిల్ లో పైన వున్న ఫైల్ ఓపెన్ చేసి తిరగేసింది. ఆమె ఒళ్ళు జలదరించి, ఒక్కసారిగా చల్లబడిపోయింది.

అతి దారుణమైన ఫొటోలవి.., ..కాలిపోయిన ముఖాలు, చీలిపోయిన శరీరభాగాలు, భయంకరమైన, హృదయవిదారకమైన కథనాలతో వున్నాయా ఫైల్స్, రకరకాల దాడుల్లో గాయపడిన స్త్రీల వ్యథలవి.., కొన్ని పేజీలు కష్టంమీద తిరగేసి, ఇక తనవల్ల కాక గబుక్కున ఫైల్ క్లోజ్ చేసి అరచేతుల్లో ముఖం దాచుకుంది. అరచేతుల్లో వాలిన నీటి ముద్రలు, ఆమె కన్నీళ్ళు--- మేమున్నామంటూ ఆమె ముఖాన్ని మరోసారి వెచ్చగా తడిమాయి.

కొద్దిసేపటికి తేరుకుని చివ్వున తెలెత్తింది, "ఏమిటవన్నీ.. ఎ..ఎందుకు మేడమ్.. వై..?" కోపం, బాధ గొంతులో పోటీపడుతుండగా రోషంగా ప్రశ్నించింది కల్పనవైపు చూసి.

"వెరీ సారీ స్నిగ్ధా.., నిన్ను మరింత బాధ పెట్టాలనో, లేక నీ సఫరింగ్ ని తక్కువ చేసి చూపాలనో నేను ఇవన్నీ నీ ముందుంచలేదు. ప్రతి కష్టంలోనూ, బాధలోనూ మనకంటే ఎక్కువ బాధల్లో వున్నవారిని తలుచుకుని ధైర్యం తెచ్చుకోవాలని పెద్దలు చెప్తారు చూడు, అదే నీకు చూపాలనుకున్నాను. అంతే.. ! ప్లీజ్.., తప్పుగా అనుకోకు..,

నీకు కలిగిన కష్టం సామాన్యమైనది కాదు స్నిగ్ధా.., ఐనా, నువ్వు పోరాడి, గెలిచావు. అతి తక్కువమందిలో మాత్రమే అంత పెద్ద కష్టాన్ని ఎదుర్కునే సాహసం వుంటుంది. నీ స్థానంలో నేనుండివుంటే ఏనాడో గివప్ చేసేసేదాన్ని.

నీకు నీ కుటుంబం ఇచ్చిన ఆసరా కూడా సామాన్యమైనదేమీ కాదు. అసలు ఎంతోమంది అదిలేనందుకే రోడ్డున పడ్డవాళ్ళూ, ఒంటరితనం, కష్టాలూ తట్టుకోలేక మతిస్థిమితం పోగొట్టుకున్నవారు వున్నారు. ఎందరో ఆదరించే తోడు లేక అష్టకష్టాలు పడుతున్నారు..

చూడు స్నిగ్ధా..! నీ బాధా, నీ వాళ్ళ తపనా రెండూ జెన్యూన్ యాస్పెక్ట్స్.. **కాలంతో పాటూ కొన్ని విషయాలు దాటి ప్రయాణించడం మనిషి ధర్మం. గతాన్ని కాలికి బండరాయిలా కట్టుకునేవుంటే ఈ జీవితసంద్రాన్ని ఎదురీదలేవు.**

**ఎన్నటికీ గతంలో నిలిచిపోవాలి అనుకోవడం తప్పే కాదు, నేరం కూడా.** నీకు వచ్చిన కష్టం నీకు కాక వేరొకరికి వస్తే ఏం సలహా చెప్తావు..?

ఆ దుర్మార్గులు సైతం చట్టం తమకు విధించిన శిక్షని అనుభవించేసి, మళ్ళీ తమ తమ జీవితాలవైపు వెళ్ళిపోయారు. నువ్వెన్నాళ్ళీ చీకటి చాటున దాక్కుంటావు చెప్పూ..?

ఈరోజు మీ వాళ్ళు సూచించిన వ్యక్తినే ఎంచుకోమని నేను చెప్పట్లేదు, **అదేవిధంగా పెళ్ళి చేసుకుంటేనే జీవితాన్ని బాగు చేసుకున్నట్టు అనీ, లేక పెళ్ళే జీవిత పరమావధి అని కూడా బోధించట్లేదు..**

జరిగినదాన్ని ఓ యాక్సిడెంట్ లా తలచి, మూవ్ ఆన్ మై కిడ్.., మూవ్ ఆన్.,. ***Invite your Life with open arms***..., అందరిలాగా **నీ జీవితాన్నిచేతులు చాపి ఆహ్వానించు**. అది పెళ్ళేకానీ, ప్రేమే కానీ, నీ మనసుచెప్పేది ఏదైనా కానీ, అసలు ముందంటూ నీ మనసుని తెరిచివుంచు. అప్పుడే నీకేం కావాలో, నువ్వేం చేయాలో నీకే తెలుస్తుంది. నువ్వు కష్టపడకుండా, నీ వారు బాధపడకుండా ఎలా జీవితాన్ని మలుచుకోవాలో అర్థమవుతుంది.

***Just leave your past where it is and live your life, with life. Don't just merely exist, start living every moment..***

నీకివే మాటలు ఎంతోమంది, ఎన్నోసార్లు చెప్పేవుండచ్చు., మరొక్కసారి స్నిగ్ధా.. మరొక్కసారి ప్రయత్నించు, **ఎవరికోసమో కాదు నీకోసం..** ఏ నేరమూ చేయని నీ జీవితం కోసం.

తప్పు చేసినవారే తలెగరేసి తిరుగుతున్న ఈ లోకంలో ఏతప్పూ చేయని నువ్వెందుకు శిక్ష అనుభవించాలి? అందరిలాంటి జీవితం నీకెందుకు దూరమవ్వాలి, నీవెందుకు కలలు కనకూడదు? నువ్వెందుకు ఆశలు చంపుకుని శిలలా బతకాలి., ఆ బాధల శిలువెందుకు మోయాలి?? వీల్లేదు. అలా జరగకూడదు.

నీ ధైర్యం ఎందరో గాయపడ్డ వారికి బోధన కానివ్వు, ఓదార్పు కానివ్వు. నీ జీవితం దెబ్బతిని, లేచి నిలబడాలనుకునేవారికి ప్రేరణ కానివ్వు.

అంతేకానీ, అంత నిర్లిప్తతతో యాంత్రికంగా ఒక్కో మెట్టే నువ్వెక్కినా జీవంలేని ఆ ప్రయాణంలో చివరివరకూ సాగలేవు. సాగినా అది సార్థకంకాదు.

ప్రయత్నించు స్నిగ్ధా.., ఇకనుంచి నీ సంతోషంకోసం, నీకోసం, ప్రయత్నించు. నీకు తోడుగా మేమంతా వున్నాం..

**Leave your Past, Live your Present and Love your Future.. ",**

చెప్పడం పూర్తిచేసి, స్నిగ్ధ కళ్ళలోకి నిశితంగా చూసింది కల్పన. మౌనంగా కళ్ళు దించుకుందామె. ఖాళీ కప్పులు తీసుకుని, "మరో కప్పు కాఫీ తీసుకునివస్తానూ..", అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది కల్పన, కాసేపు స్నిగ్ధని తన ఆలోచనలతో ఒంటరిగా వదిలేస్తూ...

నిశ్శబ్దంగానే ఆవిడ తీసుకొచ్చిన కాఫీ తాగాలనిపించి వెళ్తానంటూ తన రూమ్ కి వెళ్ళడానికి లేచి కదిలింది స్నిగ్ధ. గుమ్మం వరకూ తనని సాగనంపడానికి వచ్చిన కల్పనవైపు చూసి, చాలాసేపటి తర్వాత మౌనాన్ని ఛేదిస్తూ నెమ్మదిగా చెప్పింది, తడబడే గొంతుతో ఒక్కో పదాన్ని అతికష్టం

మీద పేర్చుకుంటూ, "ప్రయత్నిస్తాను మేడమ్.. ", ఆగింది.., "...నాకూ అందర్లాంటి జీవితం కావాలి.. ఇకనుంచీ నేనూ జీవమున్న జీవితాన్ని జీవించడం ప్రారంభిస్తాను.., నా కోసం నేను జీవించడానికి ప్రయత్నిస్తాను. దానివైపు సాగే దారిలో ఎదురయ్యే ప్రతి అవకాశాన్నీ భయపడకుండా గమనిస్తాను. అందుకు మొదటి అడుగుగా ఓపెన్ మైండ్ తో అతన్ని కలుస్తాను..!". కల్పన ముఖం విప్పారింది. తనలో కలిగిన ఆనందం మొత్తం గొంతులో తొణుకుతుండగా, "ఆల్ ద బెస్ట్ స్నిగ్ధా..", అంటూ ఆప్యాయంగా స్నిగ్ధ చెంపను చిన్నగా తట్టి చెప్పింది.

---

చిన్న కాఫీ జాయింట్ అది. ప్లెజెంట్ గా, నీట్ గా వుంది. కాఫీ గుబాళింపుతో నిండిన ఆ వాతావరణం చాలా హాయిగొలుపుతోంది.

"మా వాళ్ళు మీకేం చెప్పారో తెలీదుగానీ.. పూర్తి డీటెయిల్స్ అయితే ఖచ్చితంగా చెప్పివుండరని తెలుసు.. కామన్ కదా.. అందుకే పర్సనల్ గా కలవాలని వచ్చాను..", చిరునవ్వుతో చెప్పాడతను.

మొహమాటంగా నవ్వి వీలైనంత మామూలుగా వుండడానికి ప్రయత్నిస్తూ, "కూర్చోండి మిస్టర్ శరత్.. ప్లీజ్.." చెప్పింది స్నిగ్ధ. తలూపి ముందున్న ఛైర్ లో కూర్చున్నాడు.

చెదరని చిరునవ్వు, చామనఛాయ, సన్నగా, పొడుగ్గా వున్నాడు. చేతిలో మడిచివున్న చిన్న స్టిక్.., ఆర్టిఫీషియల్ లెగ్ వుండడంతో కాస్త తేడాగా వున్న నడకైనా, బాగా గమనిస్తే తప్ప అతనికి ఒక కాలు లేదనే విషయం తెలియట్లేదు.

"నా గురించి మీకు ఎంతవరకు తెలుసు..?" ప్రశ్నించాడతను.

"మ్..., అంటే మీరు.. బిజినెస్ చేస్తారనీ.., అదే.. గార్మెంట్స్ షాప్స్ అవీ వున్నాయనీ.., ఆక్సిడెంట్ లో మీకు.. ప్రమాదం జరిగిందనీ, .. రెండేళ్ళు..", ఆగిపోయింది.

"హా.. చెప్పండి, రెండేళ్లూ..?" రెట్టించాడతను.

"అదే.. ఐ మీన్.. అదే రెండేళ్ళు శిక్ష పడింది ఆ యాక్సిడెంట్ చేసినందుకు అనీ.. చెప్పారు.." అంది సందిగ్ధంగా.

"ఎస్.. రెండేళ్ళు.., ప్లస్.. ఒక కాలు..", ఆగి ఆమె వైపు చూసాడతను, ఆమె ముఖంలో జాలి మాటల్లోకి మారేలోపు వచ్చిందని మాట బుల్లెట్ లాగా, "చాలా.. చాలా... అతితక్కువ శిక్ష .. నేను చేసినదానికి.." చెప్పాడతను. ఆశ్చర్యంగా చూసిందతనివైపు.

"అవును.. మీరు విన్నది కరెక్టే స్నిగ్ధా.., నేను చేసింది చిన్న తప్పుకాదు. నాతో జీవితం గడపబోయే అమ్మాయికి , కనీసం గడపాలి అనుకోవడానికి ముందే నేనేంటో తెలియాలి. నా తప్పులని దాచేస్తూ మా వాళ్ళు చెప్పే సగం-సగం నిజాలు కాదు.., నాకు నేనుగా చెప్పుకునే పూర్తినిజం విన్నతరువాత నన్ను స్వీకరించగలిగితే మనం ముందుకు వెళ్తాం. లేకుంటే స్నేహితులుగా మిగిలిపోదాం.. సరేనా..?" మృదువుగానే ఐనా సూటిగా అడిగాడు.

"తప్పకుండా..", అతని ఆలోచనలో స్పష్టతకి మనసులోనే ఐనా మెచ్చుకోకుండా వుండలేకపోయింది.

"..ఒక పార్టీ వెళ్ళి వస్తూ, బాగా తాగిన మత్తులో కారు నడిపాను.. ఎంత తాగినా కంట్రోల్ తప్పనన్న అహం.., డ్రైవింగ్ లో పెర్ఫెక్ట్ అనే పొగరూ, ఒంట్లో వున్న వయసు వేడీ.., ఆ రాత్రి ఓ పసిపిల్లవాడితోపాటూ షాప్ కి వెళ్తున్న ఓ వ్యక్తి బైక్ ని దారుణంగా గుద్దేశాను.., నా కారూ బోల్తా పడి పల్టీకొట్టింది..,

కళ్ళు తెరిచేసరికీ.., మొత్తం జీవితమే తల్లకిందులైపోయింది.. అది సామాన్యమైన ఆక్సిడెంట్ కాదూ.., ఆ ఇద్దరు అమాయకులనీ నా నిర్లక్ష్యం నిలువునా మింగేసిందని స్పృహవచ్చాకే తెలిసింది.."

కామ్ గా వింటున్నదల్లా తుళ్ళిపడిచూసింది, "గాడ్.., అంటే..!? ప్రాణాలు తీసినంత పెద్ద యాక్సిడెంటా అది..?" అనేసింది అప్రయత్నంగా పైకే. రెండు సంవత్సరాల జైలు శిక్ష అంటే బహశా అవతలి వ్యక్తికి కూడా శరత్ కి జరిగినట్టే ఫిజికల్ గా మేజర్ డ్యామేజ్ జరిగుంటుంది అన్న తన గెస్ ని దాటేస్తూ అతను చెప్పిన అంత పెద్ద రియాలిటీ ఆమె ఊహకి కూడా అందనిది.

ఆమె రియాక్షన్ తో సంబంధం లేనట్టే ఎటోచూస్తూ చెప్పుకుపోతున్నాడతను ఓ కన్ఫెషన్ లాగా, "...వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారా దారుణంలో.. నా కారణంగా.., .. నా మూలంగా ఓ కుటుంబం.. సర్వనాశనం అయిపోయింది.., భర్తనీ, బిడ్డనీ శాశ్వతంగా కోల్పోయిందో స్త్రీ.., ఆ

కుటుంబంలో ఇద్దరి నిండుప్రాణాల్ని నిలువునా మింగేసిందా యాక్సిడెంట్.., ఇంకా పొత్తిళ్ళలో వున్న పసివాడైన చిన్న కొడుకుతో కోర్ట్ కి వచ్చినరోజు ఆమె నన్ను చూసిన చూపు జన్మజన్మలకీ మర్చిపోలేను.

ఆ దుర్ఘటనలో నాకాలు పోవడం అనేది మా వాళ్ళకి పెద్ద ఆయుధమే అయి పనిచేసింది. నేను హాస్పిటల్ లో వుండగానే నా కేస్ చాలా బలంగా బిల్డ్ చేశారు. నాకు దేవుడే ఆల్రెడీ శిక్ష వేశాడనీ, ఇంకా ఎక్కువ శిక్షవేయొద్దంటూ పిటిషన్ల మీద పిటిషన్లు వేసి, అప్పీళ్ళు వగైరాలతో ఏదో ఒకలా మొత్తానికి నాశిక్ష తగ్గించేశారు. మొత్తం విచారణలో నాకు ఎక్కడా మాట్లాడే అవకాశం లేకుండా జాగ్రత్తపడ్డారు. ముందు నాకదంతా అర్ధంకాలేదు. నావల్ల జరిగిన దారుణాన్నీ తలుచుకుని కొంత, కాలు పోయిందన్న దుఃఖంలో కొంత, నాలో నేనే కుంగిపోయి చుట్టూ ఏమీ గమనించలేదు.

కానీ, శిక్షపడ్డాకా, జైల్లో వున్నరోజుల్లో మొత్తం అర్ధమైంది. ఆవిడ చూసిన ద్వేషపుచూపు పదేపదే గుర్తుకురాగా గుండెకోసినట్లైంది. తెగించి ఆవిడకో క్షమాపణ ఉత్తరం రాసి పంపాను. జవాబుగానీ, క్షమాపణగానీ రాదని తెలుసు. నేను చేసినది సామాన్యమైన అన్యాయమేమీకాదుగా, అంత తేలిగ్గా ఎవ్వరూ క్షమించలేరు.., క్షమించకూడదు కూడా.., రెండు.. రెండు.. నిండు ప్రాణాలవి..", గొంతు దుఃఖంతో పూడుకుపోగా ఆగాడతను. కళ్ళల్లో నీటితెర. కర్చీఫ్ తీసి కళ్ళు అద్దుకున్నాడు. స్తబ్దంగా చూస్తూ అతను చెప్పేది వింటోంది స్నిగ్ధ.

"...జీవితాంతం వారి క్షమాపణ కోసం ప్రయత్నిస్తూనే వుంటాను దొరుకుతుందనే ఆశతో..., ఐనా స్త్రీని **క్షమయా ధరిత్రీ..** అంటారు కదా..! అందుకే.., జరగదని తెలిసినా ఏనాటికైనా ఈ నీచుడిని ఆవిడా, ఆకుటుంబం క్షమిస్తారనే నా ఆకాంక్ష. వారికోసం ఏదైనా చేయాలి అనుకున్నాను.. ఫైనాన్షియల్ గా కానీ, లేక పిల్లవాడి చదువు, ఇల్లు., ఏదైనా.. అని ట్రైచేశాను. వారు తిరస్కరించారని తెలిసింది.

శిక్షముగించుకుని తిరిగివచ్చాకా, ఇంక చేసేదిలేక బిజినెస్ మీదకి నా దృష్టి మరల్చాను. బిజినెస్ ఎక్స్పాన్షన్, తర్వాత ఓ ఇబ్బందుల్లో వున్న అనాథాశ్రమాన్ని టేకప్ చేసాను. ఆతర్వాత ఆర్టిఫీషియల్ లెగ్.., అలా వాటన్నింటితో నెమ్మదిగా జరిగిన విషయం మరుగున పడింది. ఇంట్లోవాళ్ళు పెళ్ళి అన్నారు. వినగానే ఒక్కసారి ఖంగారుపడ్డాను, 'నాలాంటి దుర్మార్గుడికి పెళ్ళా..!!', అనుకున్నాను. తర్వాత బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను. నావల్ల ఎవరికైనా వుపయోగపడేవిధంగా అయితే చేసుకుంటానని చెప్పాను.

పేదింటి అమ్మాయిలు, నావంటి లోపాలువున్నవారు.., ఏవేవో.., ఎన్నో సంబంధాలు వచ్చాయి. కానీ నాకెందుకో ఎక్కడో అసంతృప్తి. నేను అనుకున్నది నెరవేరట్లేదని అనిపించింది. అప్పుడే నాకు ఎందుకో ఓ ఆలోచన వచ్చింది. ఓ గాయపడ్డ స్త్రీని స్వీకరించాలనే కోరిక కలిగింది. **వేరే, ఇతర లోపాలకి కాస్తంతయినా జాలిచూపే మన సమాజం, దగాపడి, తమ తప్పులేకుండా అన్యాయమైన ఆడవారి విషయంలో మాత్రం తేడాగా బిహేవ్ చేస్తుంది. అక్కడ మాత్రం గాయపడ్డవారే మళ్ళీ, మళ్ళీ శిక్షింపబడతారు..** అందుకే అలాంటి స్త్రీనే చేసుకుంటానని పట్టుబట్టి వెతికాను, మీ సంబంధం గురించి తెలియగానే చేసుకుంటానని చెప్పేశాను, ఐ మీన్ మీకు అభ్యంతరం లేకపోతేనే అనుకోండి..

అందుకే ఇన్నిరోజులుగా ఎవర్నీ కలవని నేను, నా గురించి నేనే మీకు డైరెక్ట్ గా చెప్పాలని మిమ్మల్ని విడిగా కలుస్తానన్నాను..

మీ వాళ్ళకి నేను ఓ.కే. అని నాకు తెలిపారు. నా గురించి మొత్తం విన్నారుగా. మరి మీ నిర్ణయం ఆలోచించి చెప్పండి..., ఏదైనా స్వీకరించడానికి సిద్ధంగా వున్నాను.." పూర్తిచేసాడతను.

అతని కళ్ళల్లో తన నిర్ణయం కోసం కనిపిస్తున్న ఆత్రం గమనిస్తే కాస్త వింతగా అనిపించింది స్నిగ్ధకి. తన పెళ్ళికోసం తనవాళ్ళు పడిన తపన గుర్తొచ్చింది.., 'ఎన్ని తిరస్కారాలు.., ఎన్నెన్ని అవమానాలు.., ఆ ప్రయత్నాలలో వారు పడిన ఇక్కట్లూ..', అన్నీ లీలగా కళ్ళముందు మెదిలాయి.

'ఎక్కడో ఒకటో, రెండో సంబంధాలు వచ్చినా అవి కేవలం తన సంపాదన కోసం వచ్చిన ఓపెన్ అండ్ క్లియర్ డీల్సే తప్ప, తనుగా కావాలని వచ్చిన మొదటి వ్యక్తి ఇతనే కదూ.., అది కూడా తన బాధతో సహా..', చిన్నగా నిట్టూర్చింది.

"మీ పరిస్థితులు అన్నీ చాలా నిజాయితీగా చెప్పారు.., మీ ఫ్రాంక్నెస్ కి ఐ రియల్లీ అడ్మైర్ యూ.., మీరు తీసుకున్న నిర్ణయమూ బాగుంది.. చాలా ఉత్తమమైనది.., కానీ..", తటపటాయిస్తూ ఆగింది.

అతని భృకుటి ముడిపడింది., "అంటే.., అంటే ఇష్టంలేదుకదూ మీకూ..", అంటూ ఇంకేదో చెప్పబోయిన అతన్ని వారిస్తూ, "ప్లీజ్.. నేను చెప్పేది కూడా పూర్తిగా వినండి.. మీ డెసిషన్ బాగుంది.. కానీ ఛూజ్ చేసుకున్న పర్సన్ రాంగ్.. అంతే..", చెప్పింది స్పష్టంగా.

అతన్నే సూటిగా చూస్తూ కంటిన్యూ చేసింది, "మీకు క్షమాపణ దొరకలేదూ అన్నారు కదూ.. ?", ఆమె ఆ ప్రశ్న ఎందుకు అడుగుతోందో అర్థంకాక అయోమయంగా చూసి తలూపాడు.

"బహుశా.. ఎప్పటికీ దొరకదేమో.." చెప్పింది స్థిరంగా., " నాకు అన్యాయంచేసిన వారిలో ఎవరైనా నన్ను క్షమాపణకోరితే.., గాడ్.. అసలు ఆ ఊహే.. భరించలేకుండావుంది.., నేను.. నేను.. జన్మజన్మలకీ క్షమించలేను..,

**ఈ ప్రపంచంలో ఎక్కడైనా.., దేనికైనా క్షమాపణ వుంటుందేమోగానీ, ప్రాణానికీ, శీలానికీ, జీవితానికీ క్షమాపణలుండవు.. చట్టం, ప్రభుత్వం, వ్యవస్థా క్షమించవచ్చేమో కానీ.., మామూలు మనుషుల్లో అంత శక్తివుండదు. అది ఆశించడం కూడా అనవసరం.. అన్యాయం కూడా.. వ్యక్తిగతానికి-వ్యవస్థాగతానికీ వుండే తేడా అదే..**

మీ వెర్షన్ వినకపోతే మీరు ఇది నాకు అందిస్తున్న తోడుగా భావించి, అనాలోచితంగా ఒప్పుకునేదాన్నేమో.., మీ వెర్షన్ చెప్పి మీరు, నాకు-మీకు కూడా చాలా మేలు చేశారు., తర్వాత లైఫ్ లాంగ్ మనం బాధపడకుండా కాపాడారు శరత్..

మీ స్థానంలో మీరు కరెక్టే.., కనీసం మీరా నేరం వేరొకరికి హాని చేయాలనే దురుద్దేశంతోనో, మీ స్వార్థంతోనో, అహంతోనో లేక సుఖం కోసమో చేయలేదు... మీ పశ్చాత్తాపం, మీ నిర్ణయం.. రెండింటిలో చాలా గొప్పనిజాయితీ వుంది.. వాటిని నేను మనస్ఫూర్తిగా గౌరవిస్తున్నాను.

కానీ, అలాగని మీ నిర్లక్ష్యానికి జరిగిన డామేజ్ కీ వెలకట్టలేనూలేము,. ఆ అన్యాయాన్నీ, నష్టాన్నీ.. ఏ శిక్షతోనూ, ఏ కాంపెన్సేషన్ తోనూ పూడ్చనూలేము..

ఆలోచించి చూస్తే నాలో కూడా అంత క్షమ లేదు. **స్త్రీని క్షమయా ధరిత్రీ అంటారు నిజమే.., కానీ ఆ క్షమకీ, సహనానికీ కూడా ఓ హద్దుంది.. భరించలేని బరువుకి భూమికూడా బ్రద్దలౌతుంది. సహించలేని కష్టానికి ఏ స్త్రీ అయినా అంతే..** ఫర్ దట్ మ్యాటర్.. స్త్రీయే కాదు.. ఏవ్యక్తయినా ఇదే నిజం.. బహుశా ఆ సేయింగ్ కి ఇది నేనిచ్చే, లేదా నాలాంటి వారిచ్చే కొత్త డెఫినిషన్ ఇదేనేమో తెలియదు గానీ.. ఇదే ప్రస్తుతం, ఈనాటి నిజం.. ప్రెజంట్ డే ట్రూత్..

మరో మాట శరత్..!! మనం కలిసి సాగలేము.., మీరు వేరేలా భావించవద్దు.., అర్థం చేసుకుంటారనుకుంటాను. అయినా ఇది మీకు సంబంధించిన నిర్ణయంకాదు. నాకు సంబంధించినది. ఒక నేరాన్ని క్షమించలేని నేను, మరో నేరపు పశ్చాత్తాపానికి బంధువుని కాలేను. ఆ పశ్చాత్తాపం ఎంత నిజాయితీతో కూడినదైనాసరే..!

కాకపోతే, మీ ఆలోచనతో నాకో కొత్త మార్గం చూపారు. ఎంతసేపూ 'జరిగిన సంఘటన-నష్టం-శిక్ష-క్షమ-బాధ-వేదన..' ఇవే తలుచుకుంటూ, ... వీటితోనే, వాటి చుట్టే జీవితాంతం గడిపెయ్యకుండా, మరొకరికి ఉపయోగపడాలనే మీ ఆలోచన.. చాలా గొప్పది, లోతైనది, అందరికీ మార్గదర్శకం..,

ఒక గొప్ప స్త్రీ చీకటిలో మగ్గుతున్న నాకూ, నామనసుకి వెలుగునిస్తే, మీరు-మీదారిలో సాగుతూనే, నాకూ ఓ మార్గం తోచేలా చేశారు. అయామ్ రియల్లీ ఇన్ డెటెట్ టూ యూ...

...ఇక గతాన్ని తరుస్తూ కూర్చోను, దగాపడి ధైర్యంతెచ్చుకోలేని వారికి తోడౌతాను. నాజీవితాన్ని హ్యాపీగా మలుచుకోవడం ఒక్కటే కాదు, నావల్ల అయినంతవరకూ వేరేవారికీ వుపయోగపడడానికి ప్రయత్నిస్తాను. నాకు దారిచూపిన మీ సాయాన్ని మాత్రం ఎప్పటికీ మర్చిపోను, మరువలేను. వుంటాను.. థ్యాంక్స్ ఎ లాట్.." అంటూ చెప్పడంపూర్తిచేసి లేచింది స్నిగ్ధ తృప్తినిండిన మనసుతో, తెరిపినపడ్డ ఆలోచనలతో.

"అంటే.., అంటే మీరు జీవితాంతం పెళ్ళే చేసుకోకుండా ఓ.. ఓ సేవికలా గడిపేస్తారా..", షాకింగ్ గా, ఒకింత జాలిగా చూస్తూ అడిగాడు.

"ఛ..ఛ.. లేదు.., పరిస్థితులవల్ల మీతో కలిసి సాగలేనన్నానుగానీ పెళ్ళే వద్దు అని అనట్లేదిప్పుడు, ఇకమీదట అననుకూడా. తప్పకుండా చేసుకుంటాను. అయితే ఇప్పుడే కాదు.., నా మనసుకి నచ్చిన, మీలాగే నన్ను నేనుగా కావాలనుకున్న వ్యక్తి తారసపడ్డరోజు, ష్యూర్ గా.., మరిక వెళ్తానూ.., బై మిష్టర్ శరత్..", చిరునవ్వుతో చెప్పింది.

ఆమె మాటల్నీ, నిర్ణయాన్నీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న అతను ఇంకా ఆమె వైపు షాకింగ్ గా చూస్తూనే యాంత్రికంగా లేచి నిలబడ్డాడు. ఆమె రూపం కనుమరుగయ్యేవరకూ అలాగే చూస్తుండిపోయాడు.

"స్నిగ్ధా.., ఎక్కడున్నావ్..? హౌ వాజ్ యువర్ మీటింగ్..? ఏ సమస్యా లేదుగా..?", సెల్ లో కంగారుగా వినిపించిన కల్పన గొంతువిని చెప్పింది స్నిగ్ధ,"...ఇక నాకే సమస్యలూ, భయాలూ, బాధలూ.. ఏమీ లేవు.., వుండవు కూడా మేడమ్. నావారికీ, నాకూ, ఇంకా ఎందరికో మేలుచేయగలననే నమ్మకంతప్ప...", చిరునవ్వు నవ్విందామె. ఆ గొంతులో తొణికిసలాడిన పరిపూర్ణమైన మార్పుని గుర్తించి తృప్తిగా ఫోన్ డిస్కనెక్ట్ చేసింది కల్పన.

గమ్యం దొరికిన స్థైర్యంతో, పెదవులపై మెరుస్తున్న చిరునవ్వుతో అక్కడ్నుంచి కదిలింది స్నిగ్ధ...

# అదిగదిగో గగనసీమా! ఎన్నెల

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

నేను క్లాస్ కి వెళ్ళే సంకేతంగా బెల్ మోగింది. నాకు ఆందోళనతో అసలు కదలాలని లేదు. టేబుల్ మీద చేతులానించి తల చేతుల మధ్య పెట్టుకున్నా. సునీత వచ్చి “మేడం మీ క్లాస్ టయిం అయింది” అంది. సునీత మా కరెస్పాండెంట్ కి దగ్గరి చుట్టం. 10 వ తరగతి చదువుకుందనుకుంటా. కానీ పీ హెచ్ డీ వాళ్ళని కూడా గడగడలాడించేస్తుంది. తను స్టాఫ్ రూం కి వచ్చిందంటే చాలు ‘అయ్యో ఒక బ్లాక్ మార్క్ పడిందే అకవుంట్లో’ అని బాధ పడతారందరూ. అలా సునిత దృష్టిలో పడిన వాళ్ళకి మాధవ్ సార్ దగ్గరనించి పిలుపొస్తుంది. "క్లాస్ కి టయిం కి వెళ్ళకపోతే పిల్లలకి రెస్పెక్ట్ ఉండదండీ. వాళ్ళు ఎల్కేజీ పిల్లలో హైస్కూల్ పిల్లలో కాదు కదా ? డిగ్రీ కాలేజ్ పిల్లల్ని ఖాళీ సమయం లో కంట్రోల్ చెయ్యడం సునీత వల్ల కూడా కాదు. ఒక క్లాస్ అయేటప్పటికి ఇంకో లెక్చరర్ క్లాస్ ముందు నించోవాలి. ఇంక మీరు వెళ్ళచ్చు" అంటాడట సినిమాలో జగ్గయ్య గారి లెవెల్ లో.. నా అదృష్టం కొద్దీ ఇప్పటి దాకా అలా అనిపించుకోలేదు ఎప్పుడూ. చాలా గౌరవంగా మాట్లాడతారాయన.

నాకు అసలు క్లాస్ కి వెళ్ళాలని లేదు. విషయం ముందే తెలిసుంటే వచ్చేదాన్ని కాదు సిక్ లీవ్ అని కాల్ చేసేదాన్ని. నేను ప్రతి సారీ నిరాశ పడుతున్నానని సుబ్బు ఈ విషయం నాకు చెప్పలేదు. దేవుడా దేవుడా అనుకుంటూ క్లాస్ కి వెళ్ళాను. దార్లో డాక్టర్ వయొలండ్ కనిపించింది. “ఏంటండీ అంతా వోకేనా?” అంది నవ్వుతూ..

“ఆ వాకే అండీ” అన్నా నేను నవ్వు పులుముకుంటూ.

"మేడం నిన్న ఇచ్చిన హోం వర్క్ చెయ్యలేదు ఇవాళ ఇంగ్లిష్ టెస్ట్ కి చదువుకున్నాము. ఇప్పుడు చెయ్యచ్చా?" అన్నారు ముందు వరుసలోని ఇద్దరు పిల్లలు.

“ఎంత మంది చెయ్యలేదు?” అని అడిగాను.

చేసిన వాళ్ళు చెయ్యని వాళ్ళకి హెల్ప్ చేసే పద్ధతి మీద సరే అన్నాను. పిల్లలందరు గుంపులుగా విడిపోయి సాల్వ్ చేస్తున్నారు. అమ్మయ్య అనుకున్నా. అటూ ఇటూ పచార్లు చేస్తున్నా. భార్య నెప్పులు పడుతుంటె డెలివరీ రూం ముందు భర్త పచార్లు చెయ్యడం సీన్ గుర్తొచ్చింది సినిమా లోంచి. అనుకోకుండా నవ్వొచ్చింది పెదాల మీదకి. "మేడం ఏంటీ నవ్వుకుంటున్నారు? "అనడిగింది ఒకమ్మాయి.

"మేమూ ఇలాగే కలిసి చదువుకునేవాళ్ళం తెలుగు నించి ఇంగ్లిష్ మీడియం కి మారిన కొత్తల్లో! కొత్త పదం కనిపిస్తే ఆ పదం లో ఏదో కిటుకుంది ఆ కిటుకు తెలియకపోవడం వల్లనే లెక్క రావట్లేదు అనుకునేవాళ్ళం. అవి మామూలు పదాలని తెలిసాక ఆ పదాలు సరదా తిట్లా లా మారిపోయాయి మా స్నేహితుల మధ్య"అన్నాను.

"అవేం పదాలు మేడం" అందరూ నా వైపు చూసారు ఆసక్తిగా. "ఇంటర్ ఆలియా(inter-alia) విస్ -అ - విస్ (vis-a-vis)అనే పదాలు. వాటి వల్ల లెక్కకి ఏ సంబంధం లేదని తెలిసాక వాటిని తిట్లుగా ఉపయోగించేవాళ్ళం "అని చెప్పాను. పిల్లలు సరదాగా నవ్వారు. "ఇంక మేము అలా తిట్టుకోవచ్చన్న మాట" అంటూ.. మనసు కొంచెం మళ్ళింది ఆందోళన నించి. ఎవరో డవుట్ అడగడం తో గంట ఎలా గడిచిందో తెలియలేదు.

వెనక్కి వెళుతూనే "నాకు ఫోన్ వచ్చిందా?" అని అడిగాను శైలని.

"అవును నువ్వు రాగానే చెప్దామనుకున్నా సుబ్బు గారు చేసారు. వెంటనే చెయ్యమన్నారు" అంది.

నేను ఎంత వేగంగా ఫోన్ అందుకున్నానో నాకే తెలియదు. కానీ ఫోన్ ఎంగేజ్ వస్తోంది. అదృష్టం కొద్దీ ఈ గంట ఫ్రీ. మళ్ళీ మళ్ళీ చేయగా సుబ్బు ఎత్తాడు. ఏం చెప్తాడో అని ఒకటే టెన్షన్.

"ఇంటికొచ్చెయ్ పావనీ! పని అయిపోయింది" అన్నాడు.

నా చెవులు నేనే నమ్మలేదు. ఒక నిమిషం మెదడు బ్లాంక్ అయింది. నో రియాక్షన్...!!!

"పావనీ.. ఆర్ యూ ఓకే?" శైలు అడిగింది.

నేను గొంతు పూడుకుపోవడంతో ఏడ్చేస్తున్నాను.. తను దగ్గరకొచ్చింది. చేతి మీద చెయ్యేసి “పావనీ!!??” అని ఖంగారు పడింది. మెల్లిగా "సుబ్బు వెళ్ళిన పని అయింది" అని చెప్పా.. శైలు మొఖం వెలిగిపోయింది..

"ఎవరికీ చెప్పకు మనిద్దరి మధ్యే "అన్నా.

"ప్రామిస్ నేనెవ్వరికీ చెప్పను" అంది.. "ఐ యాం సో హాప్పీ "అంది సంతోషం గా..

"ఇంటికెళ్ళాలి ఎలా?" అన్నా.

"నువ్వు ఎవరితో ఏమీ చెప్పకుండా సునీత దగ్గరికెళ్ళి ఒంట్లో బాగాలేదని చెప్పెయ్. నీ క్లాస్ పద్ము తీసుకుంటుందిలే తనకి నెక్స్ట్ పీరియడ్ ఖాళీనే గా "అంది.

"పాపం తనకి ఇబ్బంది కదా వరుసగా 3 క్లాస్ లు అయ్యాయి" అన్నా.

"నీ మొహం లే అదేమీ అనుకోదు.పైగా సంతోష పడుతుంది .అందరూ వచ్చే ముందు నువ్వు పో.." నా పర్స్ చేతికిచ్చి గడప వైపు తోసింది.. ఒకే మరి బై అంటూ నేను రివ్వున పరిగెత్తాను.

ఆఫీస్ దగ్గర ఆగగానే సునీత "ఏంటి మేడం అలా ఉన్నారు? ఒంట్లో బాగలేదా?" అంది.

నా కళ్ళు ఎర్రబారినట్లున్నాయి. "అవును సునీతా.. అందుకే ఇందాక కూడా క్లాస్ కి వెళ్ళలేకపోయా లాస్ట్ క్లాస్ పద్మ మ్యానేజ్ చేస్తా అంది నేను ఇంటికి వెళ్ళనా?" అన్నాను.

"సరే వెళ్ళండి పద్మ మేడం కి నేను చెప్తాలే" అంది. మళ్ళీ నువ్వు చెప్పేదేంటి అన్నిట్లో నీ చెయ్యి ఉన్నట్టు ఫీలింగ్ కాకపోతే అనుకుంటూ పరుగు తీసాను.

ఆటో తీసుకుని ఇంటికొచ్చేవరకూ మనసు మనసులో లేదు. సుబ్బు బయట రెడీ గా ఉన్నాడు

"పద పోదాం "అన్నాడు.

"అదే ఆటో లో వెళదాం.. బండి మీద రావడం కష్టం "అన్నాడు. సరే అన్నాను.

"ఏమైనా తిని వస్తావా? "అన్నాడు.

"అక్కరలేదు ఆకలి దాహం ఏం లేవు పద. నేను ఉద్యోగం ఎప్పుడు మానాలి "అనడిగా..

"వెంటనే "అన్నాడు.

"అసలెంత అదృష్టం తెలుసా 20 రోజులట" అన్నాడు.

"నిజమా మరి ఎలా ఒప్పుకున్నారు?" అన్నాను.

"మనిద్దరం చాలా మంచివాళ్ళమని చెప్పాడుట చక్రవర్తి. అయినా వాళ్ళు పట్టించుకునే పరిస్థితిలో లేరుట" అన్నాడు.

"సరిపోయింది లే" అన్నా సంతోషం గా.

ఆటో దిగగానే ఒకతను ఇంట్లోంచి బయటికొచ్చి “రండి రండి” అని తీసుకెళ్ళాడు. కుర్చీలేసాడు ఒక పెద్దాయన. ఇద్దరు బుజ్జి బుజ్జి పిల్లలు ఆడుకుంటున్నారు. వాళ్ళని వాళ్ళ అక్క అజమాయిషీ చేస్తూ ఆట నేర్పిస్తూ ముద్దు చేస్తోంది. కుర్చీలో కూచుంటూ నేను పిల్లల్ని గమనిస్తూ దగ్గరికి రమ్మని పిలిచా. చిన్న వాళ్ళిద్దరూ నువ్వెవరు అన్నట్టు చూసారు. వాళ్ళక్క వాళ్ళని భుజాల మీద చేతులేసి నా దగ్గరికి తీసుకొచ్చింది “ఆంటీ పిలిస్తే వెళ్ళాలి” అంటూ. అబ్బో పెద్ద ఆరిందానే అనుకున్నా. “నమస్తే పెట్టు” అని తను కూడా “నమస్తే” అంది.

6 యేళ్ళు ఉంటాయేమొ అప్పుడే ఇద్దరు పిల్లలకి ట్రెయినింగ్ ఇస్తోంది నవ్వుకున్నా. చిన్న దాని చెయ్యి పట్టుకుని “పేరేంటీ?” అన్నా.

"చంద్ర వదన" అంటూ మా ఇద్దరికీ మంచి నీళ్ళు తెచ్చింది పెద్దది.

“అబ్బో నీ పేరేంటో!?” అన్నా..

“వెన్నెల” అంది వెన్నెల కురిసినట్టు చిరునవ్వు నవ్వుతూ.

“భలే ఉన్నాయే మీ పేర్లు. మరి ఈ చిన్నారి పేరు పున్నమా?” అన్నా పిల్లని చూపిస్తూ.

“ కాదు ..ఉషా కిరణ్” అంది.

“అదేంటీ అది అబ్బాయిల పేరు కదా!?” అన్నా తమాషాగా.

“ఉహూ కాదు. కిరణానికి ఆడ మగ తేడా ఉండదని తాతయ్య చెప్పాడు” అంది పరిశోధన చేసినట్టు.

“అబ్బో నీకు చాలా తెలుసే!?” అన్నా. ముఖం లో సిగ్గుతో కూడిన గర్వం తొంగి చూసింది.

మా చేతుల్లో గ్లాస్ లు తీసుకుని వంటింట్లో పెట్టి వచ్చి చంద్ర వదన చేతులకి అంటిన మట్టి తన గవునుతో తుడిచింది. కుంచమంత కూతురుంటే మంచం దగ్గరికే కూడు అన్న లలితా మేడం మాటలు గుర్తొచ్చాయి. ఈ లోపు పెద్దాయన లోపలికెళ్ళాడు. నా సంతోషం ఒక్క నిమిషంలో ఎగిరిపోయింది. గదిలోంచి పెద్దగా ఏడుపులు వినిపిస్తున్నాయి. ఏమయి ఉంటుందో ఊహించగలను కానీ నో పెయిన్ నో గెయిన్ కదా. మనసు దిగులుతో నిండిపోయింది. వచ్చిన పని అవుతుందా కాదా. అనుమానం ఎక్కడో వేధిస్తోంది. దిగులుగా సుబ్బు వైపు చూసాను. ఫర్వాలేదు ఉండు అన్నట్టు చూసాడు. చూపు తిప్పి వెన్నెల ని చూపించాడు. అ చిట్టిది నా కుచ్చెళ్ళు పట్టుకుని నా చీరపైనున్న పువ్వులని ఏరడానికి ప్రయత్నిస్తోంది. భలే క్యూట్ కదా అని సుబ్బు ని చూసి నవ్వాను.

చాలా సేపు నిరీక్షించాక పెద్దాయన బయటికి వచ్చాడు. “అమ్మా లోపలికి పో” అన్నాడు. కాళ్ళు వణుకుతుండగా “వస్తావా!?” అంటూ సుబ్బు వంక చూసాను. వద్దు నువ్వెళ్ళు అన్నట్టు సైగ చేస్తూ గది వైపు చేతులు చూపాడు. గుబులు గుబులుగా గుండె చెదరగా అన్నట్టు తడబడే అడుగులతో నా బిడ్డని కలవడానికి వెళ్ళాను. శోక దేవతలా ఉన్న స్త్రీమూర్తిని ఆమె చేతిలో మణి దీపం లా మెరిసిపోతున్న బంగారు తల్లిని చూసాను. పక్కనే ఉన్న ఆమె తల్లి ఆమె భుజం మీద చెయ్యేసి ఓదారుస్తోంది. కానీ ఆమెకి దుఖం కట్టలు తెంచుకుంటోంది.

“నా కూతురి కాపురం నిలబెట్టడానికి మిమ్మల్ని దేవుడు పంపాడమ్మా! నిన్ను నీ బిడ్డనీ దేవుడు వెయ్యేళ్ళు చల్లగా చూడనీ” అంది పెద్దావిడ. నా కళ్ళు ఆ బిడ్డని చూసి మిలమిలా మెరిసాయి. చేతులు జాపాను అప్రయత్నంగా. ఆ శోకమూర్తి వెక్కిళ్ళు పెడుతూ బిడ్డని నా చేతుల్లో పెట్టి

రోదిస్తూ పక్క మీద వాలిపోయింది. తల్లి ఊరుకోబెడుతోంది. "పాడు దేవుడికి దయలేకపోతే ఏం చేస్తాం తల్లీ.. నీ కాపురం ముఖ్యం కదా! కొంచెం ధైర్యం తెచ్చుకో. నీ పిల్లల జీవితాలు తండ్రి నీడన గడచిపోయే అదృష్టాన్ని వాళ్ళకి ప్రసాదించు. అదే నీ కర్తవ్యం" అన్నది ఆవిడ.

నాకు గుండెల్లో చెయ్యిపెట్టి ఎవరో తిప్పినట్టయ్యింది. పాపని తల్లి వడిలో ఉంచి పెద్దావిడ చెయ్యి పట్టుకుని గబ గబా పక్కనున్న వంటింట్లోకి తీసుకుపోయాను చొరవగా. పిల్లని ఒళ్ళోకి లాక్కుంటూ తెల్లబోయి చూసిందా తల్లి.

"అమ్మా! 10 ఏళ్ళుగా పిల్లలు లేరని మొక్కని దేవుడు లేదూ ఎక్కని కొండా లేదు. ఎన్ని సార్లు ప్రయత్నించినా దొరికినట్టే దొరికి కులం వల్లో తలితండ్రులు మనసు మార్చుకోవడం వల్లో, ఇంకెవరో డబ్బున్న వాళ్ళు దొరికో ఏదో కారణాల వల్ల దత్తత తీసుకోలేకపోయాము. అన్ని ఫలించి ఎవరో పిల్లని దత్తత కి ఇస్తారని ఒక స్నేహితుడి ద్వారా తెలిసి వచ్చాము. కొన్ని విషయాలు చెప్పాడు కానీ దత్తత ఎందుకిస్తున్నారంటే మాత్రం తెలీదన్నాడు. ఇక్కడ పరిస్థితి చూస్తే సగం అర్థం అయినట్టూ సగం కానట్టూ ఉంది. ఇంతకీ దత్తత ఎందుకిస్తున్నట్టు అన్నాను. ఉద్యోగం చెయ్యక్కరలేదు కానీ చదువుకున్న పిల్ల కావాలని చేసుకున్నారు. మొదటి మగ పిల్లాడు పుట్టలేదని సూటీ పోటీ మాటలు అన్నా మగ సంతానం ఉందని జాతకం లో ఉందని ఊరుకున్నారు. రెండో కానుపులో కవల పిల్లలు ఆడపిల్లయ్యే సరికి అమ్మాయిని చాన్నాళ్ళు తీసుకెళ్ళలేదు. అల్లుడ్ని బతిమాలుకుంటే కవలల్ని తీసుకురాకపోతే రమ్మన్నాడు. అది వెళ్ళనన్నా మేమే బలవంతం గా పంపించాము.

10 రోజుల్లో పిల్లలు బెంగ పెట్టుకున్నారని చెప్తే దింపి పోయాడు. మళ్ళీ కడుపొచ్చిందని తెలిసి ఈసారి మగ పిల్లాడు పుట్టకపోతే నలుగురు పిల్లలతో పుట్టింట్లోనే ఉండు రావక్కరలేదని చెప్పి వెళ్ళారు. ఆ నాటి నించీ వచ్చింది లేదు చూసింది లేదు. మగ పిల్లాడు పుడితే చెప్పి పంపండి అప్పుడొచ్చి చూస్తా. ఆడ పిల్ల పుడితే చెప్పక్కరలేదు నా పెళ్ళాం పిల్లలు పోయారనుకుంటా అని చెప్పి వెళ్ళాడు. ఆ నాటి నుండీ నా బిడ్డ తిండీ నిద్ర సరిగ్గా లేక ఒకటే బెంగ పెట్టుకుంది. దేవుడు కరుణించకపోతాడా అని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకున్నాం తీరా 20 రోజుల క్రితం మళ్ళీ మహలక్ష్మి పుట్టింది. దాని దురదృష్టం ఏం చేస్తాం.." కొంగుతో కళ్ళు తుడుచుకుంది పెద్దావిడ.

"మరి ఇప్పుడెలా!?" అన్నాన్నేను అవాక్కయిపోతూ. ఇద్దరు పెద్దమనుషుల్ని తీసుకుని భయంభయంగా వెళ్ళారు మా వారు విషయం చెప్పడానికి. అదృష్టం కొద్దీ వాళ్ళ ఊర్లో ఇద్దరు పెద్దమనుషులు కూడా వెంట వెళ్ళారుట. అసలు నవ్వు లేని ఈయన మొహం చూడగానే "ఎందుకొచ్చారు చెప్పద్దన్నాగా?" అన్నాడుట. వచ్చిన పెద్దమనుషులు నలుగురు కూచుని "చదువుకున్న వాడివి ఇలా చేస్తే ఊరికి చెడ్డపేరు కదా" అని బాగా ప్రాధేయపడితే, "ఇద్దరు పిల్లల్ని మించి భరించే శక్తి నాకు లేదు. ఒక పిల్లతో వస్తే మళ్ళీ ఇంకో ప్రయత్నానికి గడువిస్తాను. అప్పుడు పిల్లాడు పుట్టకపోతే ఇంక దానికీ నాకూ చెల్లు" అని వరమిచ్చాడు.

"నలుగురు పిల్లల్ని భరించే శక్తి మా పేద కుటుంబానికి లేదు. ఈ పుట్టిన బిడ్డని మీకిస్తే ఇంకో ఇద్దరు ఆడ పిల్లల్ని నేను చూసుకుంటూ చంటిదాన్నిచ్చి పంపుతాము. ఏంచెయ్యగలం!?" అంతకంటే అంటూ ఆవిడ కళ్ళు తుడుచుకుంది.

నాకు ఒళ్ళు దహించుకుపోతోంది. మగ పిల్లాడు పుట్టే దాకా వరమిచ్చాడా.. ఏం మాట్లాడుతున్నారు వీళ్ళసలు. ఈ విషయం మా మావగారికి కనక తెలిస్తే ఎంత ఖర్చైనా ఫర్వాలేదు ఆ పురుష పుంగవుణ్ణి కటకటాల వెనక పెట్టిచ్చేదాక వదలరు.

నేను పిల్లని తీసుకెళ్ళడానికొచ్చానని ఒక నిమిషం మర్చిపోయాను. ముందు గదిలోకి వచ్చి సుబ్బు పక్కని కుర్చీలో కూచుండిపోయా.

"అమ్మా! ఏమీ అనుకోకపోతే మీ అమ్మాయిని ఒక సారి ఇక్కడికి రమ్మంటారా?" అన్నాను.

ఆవిడ వెళ్ళి కూతురిని తీసుకొచ్చారు. ఇందాక చూడలేదు కానీ బంగారు బొమ్మలా ఉంది ఆ బాలెంత. అందుకే ఈ బుడిబుడి బుజ్జాయిలందరూ ఇంత కళగా ఉన్నారని అనిపించింది. ఎదురుగా ఉన్న కుర్చీలో కూచుంది. నా కంటే బాగా చిన్నది.

"మాకు దేవుడి దయవలన ఆదాయానికి లోటు లేదు. మీ పిల్లల్లో ఒకళ్ళని కాకుండా ఇద్దరిని తీసుకుంటే మీకు అభ్యంతరమా?" అన్నాను.

సుబ్బు ఆశ్చర్యంగా నా వైపు చూస్తూ వాళ్ళు ఏమనుకుంటారో అని ఖంగారు పడ్డాడు.

"నా భర్త నేను మా ఇద్దరి మధ్య ఆడ మగ అని తేడా లేదు. నేను ఏ నిర్ణయం తీసుకున్నా అతను కాదనడు అది అతనికి నా నిర్ణయం మీద ఉన్న నమ్మకం అందుకే అతన్ని విడిగా అడగాల్సిన అవసరం రాలేదు నాకు మీకు ఇష్టమయితే ఇద్దరిని తీసుకుంటా" అన్నాను. ఆవిడ కొంచెం టయిం కావాలి అంది. పెద్దావిడ ముఖం లో ఇంకొంచెం బాధ్యత బరువు తీరుతాయని సంతోషం కనిపించింది. "పోనీ లేమ్మా మీ దగ్గర పిల్లలు సలక్షణం గా పెరుగుతారని ధైర్యం గా ఉంది" అనేసింది భరోసా ఇస్తున్నట్టు.

"సరే మరి మేము వెళ్ళి రామా!?" అన్నాను, బిడ్డని చేతికిస్తూ ఘొల్లున ఏడ్చింది ఆవిడ. బిడ్డని ఊరికే తీసుకెళ్ళకూడదని తెచ్చిన ప్యాకెట్ పురిటి మంచం మీద పెట్టి బిడ్డని ఎత్తుకున్నా. పాపాయికి సంబంధించిన కాసిని బట్టలు దంచిన సాంబ్రాణి ,11 వ రోజు ఇంట్లో ఆముదపు దీపం పెట్టి చేసిన కాటుక, సగ్గుబియ్యం తో చేసిన చాదు బొట్టు డబ్బా పాపాయి కోసం విసిరిన సున్నిపిండి సర్ది ఉంచిన బుట్టని చేతికిస్తూ వస్తువులని వివరించింది పెద్దావిడ. అమ్మా ధన్యవాదాలు మమ్మల్ని ఆశీర్వదించండి అని బిడ్డని ఎత్తుకుని ఆవిడా పాదాలు తాకాను.

"నువ్వు కూడా ఈ నాటితో నా బిడ్డవయ్యావు తల్లీ ఏ నాటి బంధమో!" ఇది అన్నారావిడా ఆర్ధ్రతగా.

ఇంటికి బయల్దేరిన మా ఇద్దరికీ కొండంత సంబరంగా ఉంది. ఎవరెస్టు శిఖరం ఎక్కినట్టు గాల్లో తేలుతున్నాట్టు, దేవుడు దిగి వచ్చి అద్భుతమైన మణిని మా చేతిలో పెట్టినట్టు అపూర్వంగా అనిపిస్తోంది. అసలు ఈ ఆనందాన్ని ఎలా వర్ణించాలో తెలియట్లేదు. కొంచెం ఎక్కడో చిన్నగా బాధ లాంటిది కలుగుతోంది కానీ ఈ ఆనందం ముందు అది తేలిపోతోంది. "పాపం ఆ తల్లి ఎంత బాధ పడుతోందో" అన్నా.

"మనం చీకట్లని వెనుక వదిలి ఈ  ఆ లేత చంద్ర కిరణంతో ముందుకు పోయి వేల పున్నములు సృష్టిద్దాం అవన్నీ తలుచుకోకు ఇంక మనకి వెలుగే వెలుగు" అన్నాడు సుబ్బు.

"అవును కదా!" అని పాపని దగ్గరికి తీసుకున్నా.. ఆటోలో పాపని నేను పొదివి పట్టుకుంటే సుబ్బు ఒక చేతిని నా భుజాల మీద వేసి నన్ను దగ్గరగా పొదువుకుంటూ ఇంకో చేయి పాప మీద వేసి అద్భుతాన్ని చూసినట్టు చూస్తున్నాడు..

"ఏయ్ అలా చూడకు బిడ్డకి దృష్టి తగులుతుంది" అన్నా..

"నాన్న దృష్టి తగలదు పిల్లా తల్లి దృష్టి గడపదాటదంట నేను ఎంత చూసినా ఫర్వాలేదు. నువ్వు మాత్రం చిట్టి తల్లిని తదేకంగా చూడబోకు" అన్నాడు సుబ్బు నన్ను ఆటపట్టిస్తూ...హాయిగా నవ్వుకున్నాము ఇద్దరమూ.

సుబ్బు వచ్చేముందు స్నేహితుడు సంపత్ కి ఏం పురమాయించి వచ్చాడో కానీ ఇంటికెళ్ళేటప్పటికి అమ్మ, నాన్న, అత్తయ్య, మావయ్య గారు, బావ గారు, అక్క అందరూ వచ్చి ఉన్నారు. అత్తయ్య మా ముగ్గురికీ ఎర్రనీళ్ళు దిష్టి తీసి , మా ఇద్దరినీ పేర్లు చెప్పమన్నారు.

"నేను సుబ్బు పాపాయి వచ్చాం తలుపు తీయండి" అంటూ సుబ్బు పేరు చెప్పడానికి బోల్డు సిగ్గుపడిపోయాను నేను. పాపాయిని అందరూ తనివితీరా చూసుకుంటున్నారు. బాల శశిరేఖలా ఉంది శశిరేఖ అని పెడదామా పేరు అన్నారు మావయ్య గారు. నాన్నా కొంచెం తేడా శశి కిరణ్ అని పెడదామన్నాడు సుబ్బు. బ్రహ్మాండంగా ఉందని అందరూ ఒప్పేసుకున్నారు. మర్నాడు శనివారం 21 వ రోజు కాబట్టి ఈ దేవత నాకే పుట్టినట్టు 21వ రోజు చేసే సంబరాలన్నీ చేయించారు అమ్మ అత్తయ్యా కలిసి. పేరు పెట్టడం ఉయ్యాల్లో వెయ్యడం తో బాటు దత్తత తీసుకోవడం కూడా పూర్తి అయింది. మా కుటుంబం కాక ఇంకో చుట్టుపక్కల ఉన్న 10 కుటుంబాలే అయినా ఒక రోజులో అన్ని ఏర్పాట్లు ఎలా జరిగాయో అసలది కలో నిజమో నాకు అర్థం కావట్లేదు. మెళకువ వస్తే కల పోతుందేమో అన్నట్టు నేను అదో ట్రాన్స్లో ఉన్నట్టున్నా.  నాన్న, మావయ్య గారు, బావగారు ,సుబ్బు బయట పనులు, అమ్మ, అత్తయ్య అక్క ఇంట్లో పనులూ చూసుకుంటే ఎందుకవవు. ఆదివారం పూర్తిగా పాపాయిని వదలకుండా ఉన్నా. వంటింట్లోకి అసలు వెళ్ళను కూడా లేదు.

శుక్రవారం ఒంట్లో బాగోలేదని వచ్చేసా కాబట్టి శనివారం సిక్ లీవ్ అనేసుకుని ఉంటారు కానీ ఆదివారం దాటాక మర్నాడు సోమవారం కాలేజ్ కి వెళ్ళాల్సి వచ్చింది. స్వర్గం లోంచి ఎవరో బలవంతం గా లాక్కెళుతున్న ఫీలింగ్ వస్తోంది. ఇంక రానని చెప్పినా ఇంకొకళ్ళు దొరికేవరకైనా వెళ్ళాలి. ఒక వారం అయినా పడుతుంది. అమ్మని అత్తయ్యని ఒక వారం ఉండమన్నా. ఎందుకుండరూ బంగారు బొమ్మ దొరికితేనూ. అత్తయ్యని ఎప్పటినించో "వచ్చెయ్యండి అత్తయ్యా" అని అడిగేదాన్ని. "మీ ఇద్దరి మధ్యలో ఎందుకమ్మా అవసరం వచ్చినప్పుడు వస్తాలే" అనే వారు.

ఇంక వదులుతానేంటీ నా దగ్గరే అని అక్కతో  గట్టిగా చెప్పేసా కూడా. అమ్మ సరే సరీ ఏదో వంక చెపుతుంది ఎప్పుడూ ఈ సారి ఆ పప్పులేం ఉడకవు.

క్లాస్ కి వెళుతూ పద్దుతో "ఈ క్లాస్ తర్వాత నీకు శైలు కీ నాకు ముగ్గురికీ ఖాళీయే కదా! కింద క్యాంటీన్ కి వెళదాం" అన్నా.. అలాగే అంది. క్యాంటీన్ లో కూచుని మళ్ళీ టయిం అయిపోకముందే అన్ని సంఘటనలూ గబ గబా చెప్పేస్తున్నా. వాళ్ళని అసలు మాట్లాడనియ్యకుండా మాట్లాడినా ఇంకా బోల్డు మాటలు పుట్టుకొచ్చేస్తున్నాయి వేగంగా. ఇద్దరూ అబ్బురబడి వింటున్నారు.

"వాడిని నరికెయ్యాలి" అంది శైలు కోపంగా..

"మళ్ళీ వెళతానంటోందా పతివ్రత?" అంది ఈసడింపుగా..

"ఆ అమ్మాయి ఏమీ అనట్లేదే వాళ్ళమ్మ మాత్రం తండ్రిలేని పిల్లల లాగా పెరగడం ఇష్టం లేదు. కాబట్టి పంపుదామనే అనుకుంటోంది" అన్నా.

"ఇప్పుడు నలుగురిని భరించలేని వాళ్ళు మళ్ళీ పిల్ల పుడితే ఐదుగురిని ఎలా పెంచుతారుట?" అంది శైలు మళ్ళీ. మా ముగ్గురిలో పద్దు కి చాలా ఓర్పు. ఎవరినయినా కూల్ చేస్తుంటుంది. పెద్ద కుటుంబంలోంచి వచ్చి ఉమ్మడి కుటుంబం లో ఉంటుంది.

"శైలూ ఆగవే తల్లీ అంత కోపం తో ఇప్పుడు పిల్లలకి చదువేం చెప్తావు" అంది.

"నాకు చెప్పు తాడో పేడో తేల్చిపడేస్తా కేస్ పెట్టేద్దాం వాడి మీద తెలిసాక మనకి కూడా బాధ్యత ఉంటుంది కదా మంచి పౌరులుగా" అంది శైలు.

"తొందర పడకు శైలు నిదానంగా ఆలోచిద్దాం" అంది పద్దు.

క్లాస్ అయ్యాక ఫ్రీ పీరియడ్ లో మాధవ్ సార్ దగ్గరికెళ్ళా.

"చెప్పండి మేడం" అన్నారు.

"సార్ నేను ఉద్యోగం మానెయ్యాలనుకుంటున్నా. మీకు చెప్దామని వచ్చా" అన్నాను.

"అయ్యో మీకు మేము ఏమైనా ఇబ్బంది కలిగిస్తున్నామా మేడం?" అన్నారాయన.

" అయ్యో అదేం లేదు సార్. నేను పాపని దత్తత తీసుకుంటున్నా. మరి తనని చూసుకోవడానికి టయిం ఉండాలి కదా" అన్నా.

"ఓహ్ అవునా.. హార్టీ కంగ్రాజులేషన్స్ మేడం" అన్నారు.

"కానీ మాకు ఇంకోళ్ళు దొరికేవరకైతే చేస్తారుగా!?" అన్నారు.

"ఒక వారం ఉంటానండీ! అంతకంటే ఉండలేను.. క్షమించండి" అన్నాను.

"సీనియర్ లెక్చరర్లు దొరకడం కష్టం మేడం. ఏదైనా ఆలోచించాలి" అన్నారు.

"పద్మ మేడం చాలా యేళ్ళుగా పని చేస్తున్నారు కదా సార్! నా సబ్జెక్ట్లు ఆవిడకి ఇచ్చి ఇంటర్ కి చెప్పేవాళ్ళని చూద్దామా? ఫ్రెషెర్స్ అయినా ఫర్వాలేదు కద సార్ఁ అలా కొంచెం ఈజీ అవుతుందేమో" అన్నాను.

"గుడ్ ఐడియా మేడం. మీరు వెళ్ళినప్పుడు పద్మా మేడం ని పంపండి. ఆవిడ ఒప్పుకుంటే ఇంటర్ లెక్చరర్ కి ఆడ్ వేయిస్తాను. రేపు పేపర్ లో మీకు ఎవరైనా తెలిసినా చెప్పండి" అన్నారు.

"తప్పకుండా సార్ థ్యాంక్ యూ" అని వచ్చేసాను. పద్దుకి తెలిస్తే ఎగిరి గంతేస్తుంది కానీ, ఇస్తారో ఇవ్వరో తెలియకుండా నేను చెప్పడం బాగోదు.

"ఈ వారలో గట్టిగా ప్రయత్నిస్తామండీ.. మీ లాంటి మేడం ని పోగొట్టుకోవడం మా దురదృష్టం.. మీరు మళ్ళీ ఎప్పుడు రావాలనుకున్నా రావచ్చు. మా కాలేజ్ తలుపులు మీ కోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయి" అన్నారు మాధవ్ సార్.

"థ్యాంక్ యూ సార్." అని బయటికి వచ్చేసి పద్దుతో "మాధవ్ సార్ నిన్ను కలవమన్నారు" అన్నా..

"అలాగే కానీ.. ఏంటే బాబూ శ్రీముఖం ఏమన్నా ఇస్తారా?" అంది..

"ఏమో తెలీదు క్లాస్ ల గురించేదో అనుకుంటా అన్నా ..."

రెండు రోజుల పాటు లంచూ బ్రేకూ ఖాళీ పీరియడ్లలో బుర్ర తినేస్తున్నానేమో, "బుధవారం సాయంత్రం అక్కడికెళదామా ఒకసారి?" అంది పద్దు.

"బస్ ల కోసం వెయిట్ చెయ్యద్దు ఆటో లో వెళదాం. శశి ని చూడాలి" అన్నాన్నేను. సరే అన్నారిద్దరూ.

పెద్దవిడ వచ్చింది.

"అమ్మా! మీ అమ్మాయితో మాట్లాడాలి" అన్నాను.

"రండి!" అని కుర్చీలు చూపించింది.

ఆ అమ్మాయి వచ్చింది. పూర్తిగా వాడిన మల్లె తీగలాగా కళా విహీనంగా ఉంది.

"అమ్మయ్య మీరు ఉన్నారు.. వెళ్ళిపోయి ఉంటారేమో అని భయపడ్డా" అన్నా.

"పాప ఎలా ఉంది?" అని అడిగింది దీనంగా.

"బంగారం లా ఉంది అమ్మ అమ్మమ్మ పెద్దమ్మ ముగ్గు రి సేవలు పగలు, అమ్మ నాన్న మెళకువగా ఉండి రాత్రి సేవలు.." నవ్వించడానికి ప్రయత్నించా. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయామెకి.

వీళ్ళు నా క్లోజ్ ఫ్రెండ్స్. మిమ్మల్ని చూస్తానంటే తీసుకొచ్చా" అన్నా.

"ఇంకో పిల్లని దత్తత అడగడానికొచ్చారేమో!" అన్నట్టు చూసిందామె.

"సారీ అండీ ఇంక పిల్లల్ని ఇవ్వను" అంది.

"అదేమీ మీరు వెళ్ళరా అత్తగారింటికి?" అన్నాను.

"లేదండీ వెళ్ళను" అంది..

"అదేమీ?" అంది పద్మ అనునయంగా.

"ఆడ మగ అని తేడా లేకుండా ఒకేలా కష్టపడి కన్న పిల్లని అందరూ ఆహ్వానించాలని తల్లికి ఆశగా ఉంటుంది కదండీ.. మళ్ళా పుట్టేది పిల్లా పిల్లాడా అని టెన్షన్ పడుతూ అక్కడ ఉండలేను" అంది ఆమె.

"వెరీ గుడ్!" అంది శైలు.. "అసలు నేను అది చెప్దామనే వచ్చాను" అంది.

ఆమె సన్నగా నిర్వేదంగా నవ్వింది. "కానీ నేను నా పిల్లలు అమ్మా నాన్న కి బరువు అందుకని..." ఆగిందామె.

"అందుకని..!?" రెట్టించింది పెద్దావిడ.

ఆమె నోటి నుంచి ఏంవస్తుందో అని ఖంగారు పడుతూంటే...

"ఉద్యోగం చేద్దామనుకుంటున్నా ఇక్కడే ఉండి కానీ...." అంది ఆ అమ్మాయి.

చప్పట్లు కొట్టింది పద్దు, "సెహబాష్ నేను అసలు ఎక్స్పెక్ట్ చెయ్యలేదు" అంటూ.

"కానీ ఏంటి మళ్ళీ?" అంది శైల ..

"అంటే ఇప్పటి వరకూ ఏమీ చెయ్యలేదు కదా! ఇప్పటికిప్పుడు ఏం దొరుకుతాయని?" అంది

".ఏం చదువుకున్నారు?" అని అడిగా.

"ఎం కాం" అంది.

"ఎప్పుడైనా పని చేసారా?" అన్నా.

"లేదు ఫయినల్ పరిక్ష మర్నాడే పెళ్ళయింది. తర్వాత వరసగా పిల్లలు" అంది.

"ఇంటర్మీడియట్ కి అకవుంట్స్ చెప్పగలరా?" అన్నాను.

"చెప్పగలనండీ! బీ కాం, ఎం కాం చేస్తున్నప్పుడు ట్యూషన్లు చెప్పేదాన్నండీ!" అంది నిదానంగా.

"అమ్మాయీ! నువ్వలా ధైర్యంగా ఉండు.. వెంట మేము ముగ్గురం ఉంటాము. నీ తోబుట్టువులనుకో" అంది పద్దు.

"వీళ్ళిద్దరి సహాయం తీసుకుని మెత్తగా ఆగిపోతావేమో నా సాహాయం తీసుకోవాలమ్మాయ్ వాడిని వదిలేది లేదు! మళ్ళీ నేనొక్కదాన్నొస్తా మాట్లాడదాం" అంది శైలు.

"మావయ్యగారిని కూడా పంపుతా! నువ్వెప్పుడొస్తావో చెప్తే?" అన్నాన్నేను ధైర్యంగా.

"చీకటయింది వెళ్ళొస్తాం!" అన్నాన్నేను. ఆమె గడప దాకా వచ్చింది.

ఆ అమ్మాయి కళ్ళళ్ళో నిబ్బరంతో మెరిసిన మెరుపుకి చందమామకి సందేహం వచ్చినట్టుంది. "నన్ను చందమామ అంటూనే వచ్చింది పోయింది అని స్త్రీ లింగం తో పిలుస్తారు నేను స్త్రీలింగమా పుల్లింగమా?"మా అని మబ్బు చాటుకెళ్ళి తారతో గుసగుసలాడాడు.

"నువ్వు ఏ లింగమైనా ఆ అమ్మాయి కళ్ళలో మెరుపులా వెలుగియ్యడమే నీ పని ఆ వెలుగుకి లింగ బేధం లేదు." అంటూ చెవి మెలిపెట్టి మబ్బు చాటు నుండి ఇవతలికి లాగింది తార. ఆకాశ లో వెన్నెల చల్లగా నవ్వింది.

# అపురూపం

డా.లక్ష్మీరాఘువ

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

"రత్నా! ఒక్కసారి నీవు లాకర్ నుండీ తెచ్చిన బ్యాగ్గు తీసుకు రా "

"ఇప్పుడెందుకులే అత్తయ్యా" రత్న అంది అత్తయ్య శారదమ్మ తో

"ఒక్కసారి నీకు చూపెట్టేస్తాను..."

"వద్దు అత్తయ్యా రజనిని రాన్నివ్వండి. ఇంకెన్నాళ్ళు? ఐదారు రోజులలోపు మన దగ్గర వుంటుంది"

"కాదమ్మా రత్నా, నేను కూడా చూసి ఎన్ని రోజులైందో...ఒకసారి చూసి అన్నీ సమానంగా ఇచ్చేసాననుకో..నా బాధ్యతా తీరుతుంది."

"అత్తయ్యా అలా చెయ్యద్దండి. మొదట రజితకు చూపించండి. తనకు ఏది నచ్చుతుందో అది తీసుకోన్నివ్వండి మిగిలింది నాకు...అంతే కదా"

"అది ఇష్టపడిన వన్నీ దానికి ఇచ్చేసానంటే తనకూ నీకూ సమానంగా ఎలా పంచగలను?? కోడలిగా వారసత్వంగా పొందాల్సిన దానివి నువ్వు... కొన్ని వస్తువులు నీకే చెందాలి, అందుకే మొదట నేను చూసి ఏది నీకివ్వాలో నిర్ణయిస్తాను...."

ఇక విధిలేక లేచి సంచీ తేవడానికి లోనికి వెళ్ళింది రత్న.

డెబ్బై ఏళ్ళ శారదమ్మ ఈమధ్య తరచూ అనారోగ్యం పాలవుతూంది. కోడలు రత్న మంచిపిల్ల కాబట్టి అత్తగారిని చక్కగా చూసుకుంటూ వుంది. శారదమ్మ కూతురు రజిత పెళ్ళైన తరువాత అమెరికా వెళ్లి ఆరేళ్ళవుతూవుంది. రెండుసార్లు ఇండియాకి వచ్చి వెళ్ళింది. గత రెండేళ్లుగా రాలేదు. ఫోనులో మాట్లాడినప్పుడు రజిత తో చెప్పింది రత్న 'ఒకసారి వచ్చి అమ్మను చూసి వెళ్ళమ'ని

అందుకని రజిత ఈ సారి అమెరికానుండీ వస్తోంది కూతురు శ్రావ్య తో కలిసి. వాళ్ళు వస్తారని తెలిసి నాటి నుండీ తన దగ్గర వున్న వెండీ, కొద్ది బంగారూ కూతురికీ, కోడలికీ పంచి ఇచ్చేయ్యాలని నిర్ణయానికి వచ్చేసింది శారదమ్మ. రత్నను లాకరు లోని తన సంచీ తెప్పించుకుంది. అది తెరిచి సమానంగా రెండు భాగాలు చెయ్యాలని చెబుతున్నా రత్న ముందు ఆడబిడ్డ నే ఎంచుకుంటే బాగుంటుందని అభిప్రాయ పడుతూంది..

సంచీ తీసుకుని వచ్చిన రత్నతో ఒక పెద్ద ప్లేటు తీసుకుని రమ్మని చెప్పింది. రత్న తేగానే దానిలోకి సంచీలోని సామాన్లను గుమ్మరించింది. వెండి మరచెంబుతో సహా గలగలా పడ్డాయి. అందులో వున్న చిన్న పర్సుని ఒక పక్కగా పెట్టి " ఇందులో కొద్దిగా బంగారం వుంది రత్నా, మాకు వచ్చే జీతాలతో బంగారం కొనేంత స్తోమత వుండేది కాదు. చేర్చుకున్న కొద్ది బంగారమూ రజితకు పెళ్ళిలో ఇచ్చాము. నీ పెళ్లి కి మాత్రం ఒక చైను, కమ్మలూ మాత్రమే పెట్టగాలిగాము" అంది.

"అత్తయ్యా మనలాటి మధ్యతరగతి కుటుంబాలలో బంగారం కంటే విలువైన అనురాగ,ఆత్మీయతలు వుంటాయి. అవి చాలవా"అంది రత్న.

ప్లేట్లో వున్న వెండి సామాను తీసి చూపుతూ

"ఈ మరచెంబు మా అత్తగారు నాకు ఇచ్చినది దీన్ని నీకు ఇస్తాను తరాలుగా మన ఇంట్లోనే వుంటూంది. ఈ చిన్నిగౌరీ శంకర పీటం కూడా మనింట్లో పండగలప్పుడు గణపతిని పెట్టి పూజ చేస్తాము..ఇది నీకే ! ఈ పంచపాత్ర, అర్ఘ్య పాత్ర మా నాన్నగారు మా ఆయనకు ఇచ్చింది. వెండి చెంబు కూడా ఇచ్చారు కానీ ఏదో అవసరానికి అమ్ముకున్నాము. మా ఆత్తగారు ఇచ్చినవి మాత్రం అమ్మేయకుండా కాపాడాను.ఇవన్నీ నీకు చెందాల్సినవి.

మిగిలిన ఈ నాలుగు వెండి గ్లాసులూ, ఉగ్గు గిన్నె, ఈ చిన్ని కలశం చెంబు రజితకు ఇస్తాను...ఈ ఉగ్గుగిన్నే కావాలని ఎంత సతాయించానో మా వారిని...ఇక ఈ వెండి తట్ట రజిత అన్నప్రాసనకు మా నాన్న గారు ఇచ్చింది. ఇవన్నీ రజితకే, ఇలా అయితే మీ కిద్దరికీ సమానంగా ఇచ్చినట్టు వుంటుంది. ఈ రెండు రకాలూ రెండు కవర్లలో సర్దు" అంటూ చిన్ని పర్సు తీసి తెరిచింది శారదమ్మ

"ఇంటి ఖర్చులకు ఇచ్చిన డబ్బుతో పొదుపుచేసి రెండు జతల బంగారు కమ్మలు తీసి పెట్టాను మనవరాళ్ళ కు ఇద్దామని. ఒకటి శ్రావ్యకూ, ఇంకోటి నీ కూతురు శ్రావణికి, అంతమాత్రమే నేను ఇవ్వగలిగేది"

"మీరు ఏదైనా ఇవ్వాలని ఎప్పుడూ కోరుకోలేదు అత్తయ్యా. మీరు ముందు చూపుతో కష్టపడి పొదుపుచేసి మాకిచ్చే ప్రతిదీ అపురూపమే" తృప్తిగా అంది రత్న.

పర్సులో నుండీ ఒక చిన్న వెండి డబ్బీ తీసి దానిని రత్నకు చూపింది శారదమ్మ.

అందులో నక్షత్రం లా మెరుస్తూ వున్న చిన్ని బిళ్ళ!!

దానిని చేతులోకి వేసుకుని చూపితే అది కెంపులూ, పచ్చలూ పొదిగిన బిళ్ళ!! చిన్నదే అయినా చాలా ముచ్చటగా వుంది.

"ఈ జడ బిళ్ళ కోసం వారం రోజులు ఏడ్చి కొనిపించు కున్నాను మా నాన్న దగ్గర...దాన్ని తలపైన చిన్న జడతో బిగించి కింద జడకు మల్లెమొగ్గల పూల జడ వేసుకుని పట్టు పావడా తో ఎంత మురిసి పోయానో చిన్నప్పుడు..." ఆనందంగా చెబుతున్న అత్తగారిని సంతోషంగా చూసింది రత్న ఎంత వయసు వచ్చినా అలనాటి జ్ఞాపకాలు ఎంత అపురూపమో గదా అనుకుంటూ!

"ఈ బిళ్ళ రజితకు ఇవ్వడం కన్నా నీకు ఇస్తే నాకంటి ఎదురుగా వుంటుంది అనుకుంటున్నా..రజిత చిన్నప్పుడు పెట్టి మురిసాను. ఇప్పుడు నీ కూతురు శ్రావణి కి వుంచేసుకుందాం. ఈ రెండు కవర్లూ ఈ పర్సూ మళ్ళీ సంచీలో నే పెట్టి దాచు రజిత వచ్చినప్పుడు ఇద్దాం."

"రజితకు అన్నీ చూపుదాం..తనకు కావాల్సిన వేదైనా అడిగితే మీరు కాదనకండి"అంది సంచీ లో సర్దుతూ రత్న..

"సరేలే... నీవూ మొండి దానివే, అలాగే చూపుదాం "అని లేచింది శారదమ్మ.

రజిత, శ్రావ్య వచ్చినరోజు ఇల్లంతా సందడే! చెల్లి ని తీసుకు రావడానికి ఆఫీసుకు సెలవు పెట్టాడు ప్రభాకరం.

శ్రావణి, శ్రావ్యా ఒకరితో ఒకరు బాగా కలిసిపోయి ఆడుకున్నారు. అమ్మ తోనూ, అన్నయ్య వదినలతో బోలెడన్ని అమెరికా విశేషాలు పంచుకుంది రజిత.

వారం రోజులు ఇక్కడ గడిపి, ఇంకో వారం అత్తగారింటికి వెళ్లి తిరిగి వచ్చి మరు రోజే వెళ్లి పోతున్నానని తన ప్రోగ్రాం చెప్పింది రజిత..'మరీ రెండు వారాల ట్రిప్' అనేసరికి అందరికీ నీరసం వచ్చింది

వచ్చిన మూడో రోజున శారదమ్మ తన దగ్గర వున్న సొమ్ముల గురించి చెబితే చూస్తానన్నది రజిత.

రత్న అత్తగారు అడిగిన సంచీ తెచ్చి ఇచ్చి వెళ్ళబోతూ వుంటే "వుండు రత్నా .."అంది.

"రెండు సెట్లు గా అమ్మ చెప్పినా, రెండూ చూసి నీకు కావాల్సినవి నీవు తీసుకో రజితా.." అంది రత్న

అవి చూస్తున్నప్పుడు శ్రావ్య వచ్చి చూస్తూ గౌరీ శంకర పీటం చూసి "ఇది చాలా బాగుంది అమ్మమ్మా నేను తీసుకోనా?"అని అడిగింది. శారదమ్మ మాట్లాడేంతలో రత్న "నీకు నచ్చితే తీసుకో శ్రావ్యా" అంది

చివరిగా జడ బిళ్ళ చూస్తూ "ఇది శ్రావ్యకు బాగుంటుంది. భారత నాట్యం నేర్పిస్తామనుకుంటున్నా శ్రావ్యకు..తీసుకోనా?" అన్న రజిత తో

"అదీ.....?" అని శారదమ్మ జవాబిచ్చేంతలో

"తప్పకుండా రజితా! భారత నాట్యమప్పుడు తలపై చక్కగా అమరుతుంది." అంది రత్న సంతోషంగా.

శారదమ్మ విభజనలో ఒక్క గౌరీ శంకర పీటం, జడ బిళ్ళా తప్ప మిగిలినవన్నీ అలాగే కుదిరాయి...

వారం రోజుల తరువాత అత్తగారింటికి వెళ్లి, వూరికి వెళ్ళే ముందు రోజు వచ్చింది రజిత. పొద్దున్న అంతా ప్యాకింగ్ చేసి సాయంత్రం "కొంచెం షాపింగ్ వెడదాము వదినా " అని రత్నను అడిగింది.

శారదమ్మతో "అమ్మా నీవు ఇచ్చిన వెండి మార్చుకుని నాకు కావాల్సినది ఏదైనా ఒక వస్తువు కొనుక్కుంటానే.."అనంటే శారదమ్మ మాట్లాడలేదు ఒక క్షణం...తరువాత అనుకుంది నిజమే కదా...పాతవి పెట్టుకుని ఏమి చేస్తారు? కొత్తవి అయితే వాడుకుంటారు అని.

వెండి సామాను తీసుకుని రత్నతో కలిసి షాపుకు వెళ్ళింది. పాతవి అన్నీ తూకం వేయించ బోతూ వుంటే అందులో నుండీ గౌరీ శంకర పీటం పక్కకు పెట్టింది రత్న "ఇది శ్రావ్యకు నచ్చింది కదా!"అంటూ.

"వేసెయ్యి వదినా శ్రావ్యకు గుర్తు కూడా వుండదు. కొత్తది తీసుకుంటున్నా కదా! " అంది.

గౌరిశంకర పీటం వెనుక వున్న కథ రజితకు తెలియదు కదా అని అనుకుంది రత్న.

పాత వెండి తూకం వేసి వాల్యూ చెప్పాక వెండి బౌల్ ఒకటి కొనుక్కుంది రజిత.

తరువాత బగారు నగలు వున్న సెక్షన్ వైపుకి నడిచారు. అక్కడ షో కేస్ లో అన్నీ చూస్తూ "ఈ బిళ్ళ తీయండి చూడాలి " అని సేల్స్ అబ్బాయిని అడిగింది. అది రాళ్ళు పొదిగిన జడబిళ్ళ. దాన్ని రత్నకు చూపుతూ

"ఇది లేటెస్టు గా, అందంగా వుంది ఇది తీసుకోనా?" అని అడిగింది

"అమ్మ ఇచ్చిన బిళ్ళ వుంది కదా"

"అది చిన్నది, పాతది కూడా...ఇది తీసుకుంటే ఇంకా బాగుంటుంది." అని పర్సులోనుండీ పాత బిళ్ళ వున్న డబ్బీ తీసి

"దీనిని వాల్యూ చెయ్యండి అని చెప్పింది..."

"ఇది చాలా పాతది అమ్మా. బంగారం ఎక్కువ లేదు కానీ ఆంటీక్ వాల్యూ ఎక్కువ "అన్నాడు.

"పర్వాలేదు...ఎంత వస్తుందో చెప్పు..ఈ కొత్త బిళ్ళ నాకు నచ్చింది " అంది రజిత సేల్స్ బాయ్ యజమాని దగ్గరకు ఆ బిళ్ళ తీసుకుని వెడుతూంటే ' ఇప్పుడే బాత్రూం వెళ్ళివస్తా" అని సేల్స్ బాయ్ వెనుకనే వెడుతూ ఇందాక వెండి కొన్న సేల్స్ మాన్ ను బాత్రూం ఎక్కడో అడిగి వెళ్ళింది రత్న. వెనక్కి వచ్చేసరికి రజిత డబ్బులు ఇచ్చే కౌంటర్ దగ్గర కనిపించింది. ఇంటికి వచ్చాక తను కొన్న వెండి బౌల్ శారదమ్మ కు చూపించింది రజిత. ఎందుకో బంగారు బిళ్ళ చూపలేదు.

మరురోజు రజిత, శ్రావ్య లను ఫ్లయిట్ ఎక్కించి ఎయిర్ పోర్టు నుండీ నేరుగా బంగారం షాపుకు వెళ్లి ఇంటికి వచ్చారు రత్న, ప్రభాకరం లు.

రాత్రి భోజనాల తరువాత గౌరీ శంకర పీటము, జడబిళ్ళ శారదమ్మ చేతికి ఇస్తూ

"అత్తయ్యా, రజిత ఎయిర్ పోర్టు లో ఈ రెండూ నా చేతిలో పెట్టి వెళ్ళింది" అంది రత్న

"ఎంత మంచి ఆలోచన చేసింది రజిత! ఇవి రెండూ ఇక్కడే వుండాలని కోరుకున్నాను నేను.." సంతోషంగా అనింది శారదమ్మ.

"మీరు కోరుకున్నట్టే జరిగింది కదా...మళ్ళీ ఈ విషయం రజితను అడక్కండి.." తృప్తిగా అంది రత్న.

రాత్రి పడుకున్నప్పుడు బోడిగా వున్న తన వుంగరపు వేలును చూసుకుంటూ ...ఎయిర్ పోర్టు నుండీ నేరుగా బంగారపు షాపుకు వెళ్లి సేల్స్ అబ్బాయికి చెప్పివుంచిన విధంగా ఆ రెండు వస్తువులనూ తీసుకుని, దగ్గర వున్న డబ్బు సరిపోక తన ఉంగరం అమ్మేయాల్సిన రావటం గుర్తుకు తెచ్చుకుంది... పక్కనే నిద్రపోతున్న ప్రభాకరం వైపు ప్రేమగా చూస్తూ తనతో సహకరించడమే కాదు "ఈ సారి బోనస్ రాగానే నీకు ఉంగరం కొంటాను రత్నా! నీ మంచిమనసుకు సాక్షిగా... మా ఇంటి రత్నానివి కదా " అనటం గుర్తుకు వచ్చి అతనికి దగ్గరగా జరిగి ప్రేమగా భర్త మీద చెయ్యివేసింది రమ.

వంశపారంపరంగా వచ్చే కొన్ని వస్తువులు వారసులకు చేరాలనే తాపత్రయం పెద్దవారికి వుండటం సహజమే.. అంతేకాదు మధ్యతరగతి కుటుంబాలలో ప్రతి వస్తువు వెనకా ఒక జ్ఞాపకం..సంకల్పం ..కష్టం ఎన్నో వుండవచ్చు...వాటికి విలువనిస్తూ కాపాడుకునే వారు కొందరు. పాత రోత, కొత్త ప్రియం అంటూ కొత్తదనానికి ఇష్టపడేవారు కొందరు..మానవనైజాలు పలురకాలు ..దేనినీ తప్పులు పట్టలేం.. కొందరు రత్నలు , కొందరు రజితలు వున్నంత వరకూ పాత, కొత్తలు కలుస్తూనే వుంటాయి!!

## ఆపరేషన్ వసుధైక కుటుంబకం — గిరిధర్ రాజేష్

*టైం ఉదయం 11:18 అవ్వడానికి సరిగ్గా ఓ గంట ముందు, వేసవికాలం...విశాల విశ్వంలోఉన్న, కోటాను కోట్ల galaxyల్లో (నక్షత్ర మండలాల్లో), పాలపుంత అనే ఒక galaxyలోని, ఓ నీలి రంగు చుక్కలో ఉన్న అనేక వేల నగరాల్లో ఒక నగరం.*

"ఎప్పుడు చూసినా ఈ దేవతా కాలనీ లో ఉన్న అన్ని పంచాయితీలకీ పెదరాయుడు రేంజ్ లో తీర్పులివ్వడమే తప్ప, నా గురించి ఎప్పుడైనా పట్టించుకున్నారా?"

అని అలిగింది సరస్వతీ దేవి. అప్పుడు గానీ వెలగలేదు బ్రహ్మ దేవుడికి, ఆ రోజు సరస్వతీ దేవి పుట్టిన రోజని.

"పట్టించుకోకపోవడమేంటోయ్, చూడు నీకోసం ఇవాళ నేనే వంట చేస్తా" అంటూ వంటింట్లోకి వెళ్ళాడు బ్రహ్మ.

ఒక్క క్షణంలో కోటానుకోట్ల light elementsని (కాంతి మూలకాలని) high temperatures and pressures (తీవ్రమైన ఉష్ణోగ్రత, పీడనాల) దగ్గర ఉడికించి నక్షత్రాలని తయారుచేసి...వాటితో 'హ్యాపీ బర్త్ డే సరు' అని రాసి సరస్వతీ దేవి దగ్గర మార్కులు కొట్టేసాడు బ్రహ్మ. ఆ చుక్కలే కొన్ని కోట్ల సంవత్సరాల తరువాత ఈ భూమి, భూమి మీద జీవరాశి సృష్టించబడటానికి కారణమయ్యాయంటూ" పాఠం మొదలు పెట్టాడు కేంద్రీయ విద్యాలయంలో సైన్సు టీచర్.

"మన శరీరం అనేక పరమాణువుల కలయిక. ప్రతి పరమాణువు అనేక అణువుల అందమైన అల్లిక. ఆ అణువులన్ని ఆకాశంలో మినుకు మినికుమంటూ మెరిసే ఆ నక్షత్రాలనుండి వచ్చినవే.

ప్రతి రాత్రి మనకి తమ మెరుపులతో హాయ్ చెప్పి, వెలుగులతో పలకరించే ఆ మెరిసే చుక్కలన్నీ మన చుట్టాలే...అదే...మనకి అమ్మమ్మలూ, తాతయ్యల వరసనమాట! అందుకేనేమో పండు వెన్నెల్లో ఆరుబయట పడుకుని ఆకాశంలో నక్షత్రాలని చూస్తుంటే, అమ్మమ్మ ఒడిలో పడుకుని పేదరాసి పెద్దమ్మ కథ విన్నంత హాయిగా ఉంటుంది. మనమే కాదు, ఈ భూమి మీద ఉన్న ప్రతి జీవరాశికి మూలం ఒకటే. వేకువజామునే తన సంగీతంతో మనని నిద్రలేపే కోయల, వర్షం రాబోతుందనే చల్లటి కబురుని...చినుకు కంటే ముందు తన చప్పట్లతో మనకి చిరుగాలి ద్వారా తెలియచేసే చెట్లు, తొలకరి చినుకుకి తడిసానన్న ఆనందాన్ని...కమ్మని సువాసన ద్వారా మనతో పంచుకునే ఈ మట్టి....అన్నీ...అన్నీ ఒకే మాదిరి అణువులతో సృష్టించబడ్డాయ్.

*ఒకటే రక్తం ప్రవహించే వాళ్ళంతా ఒక కుటుంబం అయితే మరి ఒకటే అణువులతో చేయబడ్డ మీరూ, నేను, ఈ చెట్లు, పక్షులు, జంతువులూ, ఆ నక్షత్రాలు అందరమూ ఒకటే కుటుంబం అవుతాం కదా!*" అంటూ పాఠం కొనసాగించాడు టీచర్.

### 11:18 A.M.....*అదే ప్రదేశం*

హఠాత్తుగా పెద్ద పెద్ద అరుపులు "కదలొద్దు కదిలితే చంపేస్తాం" అంటూ గుర్తుతెలియని వ్యక్తులు స్కూల్ని ముట్టడించారు.

ఊహించని పరిణామంతో అందరి గుండెలు రెట్టింపు వేగంతో కొట్టుకోసాగాయి.

"ఎవరు కదిలినా, ఈ బాంబ్ పేల్చేస్తామంటూ" తమ చొక్కాల్లోపల అనేక వైర్ల తో ఉన్న బాంబుల్ని చూపిస్తూ బెదిరించారు...నల్లటి ముసుగులతో ఉన్న ఆ ఆత్మాహుతి దళం.

"సిటీలో ఉన్న అన్ని స్కూల్స్ ని ముట్టడించాం, సరిగ్గా 60 నిముషాల్లో ముఖ్యమంత్రిని మాకు అప్పగించాలి. యువర్ టైం స్టార్ట్స్ నౌ" అంటూ... తెలీని నెంబర్ నుండి బెదిరింపు కాల్ వచ్చింది సిటీ పోలీస్ కమీషనర్ కి.

అదే రోజు...ఒక థర్మల్ పవర్ స్టేషన్ శంకుస్థాపనకోసం సిటీకి వచ్చిన ముఖ్యమంత్రి మరియు వివిధ శాఖల మంత్రులకి ఇవ్వాల్సిన భద్రతా పనుల్లో మునిగి ఉన్న కమీషనర్, ఇది కచ్చితంగా ఎవరో ఆకతాయి పనే అనుకునే లోపు...తన మొబైల్ కి వరుసుగా మరిన్ని కాల్స్ రావడం మొదలయ్యాయి. మొత్తం అన్ని స్కూల్స్ నుండి ఇదే రకమైన బెదిరింపు రావడంతో కంగారు పడ్డ కమిషనర్ ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్తితుల్లో పడ్డాడు.

"ఇంటలిజెన్స్ నుండి కూడా ఎటువంటి వార్నింగ్ లు లేవు, ఎవరయి ఉంటారు?...ఎవరయినా గాని పక్కా ప్లానింగ్ తో చేసారు, ఉన్న పోలీసుల్లో సగం మంది శంకుస్థాపన కార్యక్రమం లోనూ...మిగతా సగం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికొచ్చిన సినిమా హీరోకి భద్రత కల్పిస్తుండగా...సిటీలో అల్లకల్లోలం సృష్టించడానికి ఇంతకంటే మంచి అవకాశం ఏముంటుంది.!" అన్న కమిషనర్ ఫోన్ మళ్ళీ మోగింది.

ఇప్పుడేం వినాల్సి వస్తుందో అన్న భయంతో ఫోన్ లిఫ్ట్ చేసాడు కమిషనర్.

"ఇప్పటికైనా అర్ధమైందిగా ఇది మాకు కాలక్షేపం కాదని. ఎక్కువగా టైం వేస్ట్ చేయకుండా నేను చెప్పినట్టు ముఖ్యమంత్రి ఇక్కడుండకపోతే, 2004లో...రష్యాలోని Beslan స్కూల్ లో జరిగిందే ఇక్కడ రిపీట్ అవుతుంది. ఇంకా 55 నిముషాలే మీకు టైం ఉంది, ఆ తర్వాత ఒక్కో నిముషం ఖరీదు, ఒక్కో ప్రాణం అవుతుంది" అన్నాడు వాళ్ళ లీడర్.

వెంటనే చీఫ్ సెక్రటరీకి ఫోన్ చేసి విషయాన్ని వివరించాడు, కమిషనర్.

"ఈపాటికే మీడియాకి, విషయం తెలిసిపోయుంటుంది. ఇంక ఆలస్యం చేయకుండా, C.M గారికి విషయం చెప్పడం మంచిదని" నిర్ణయించుకున్నారిద్దరూ.

అనుకున్నట్టుగానే, శంకుస్థాపన ప్రోగ్రాం దగ్గరా...అన్ని స్కూల్స్ దగ్గర మీడియా ప్రత్యక్షమైంది.

విషయం విన్న C.M "*రేపటి తరం మొత్తం వాళ్ళ చేతుల్లో ఉంది*. బదులుగా వాళ్ళడిగింది నన్నుక్కడినేగా! ఎంత రిస్క్ అయినా...నేను వెళ్ళడమే కరెక్ట్. ఈ నిర్ణయం సరయినదా...కాదా...అని ఆలోచించే సమయం లేదు. ఆలస్యం చేయకుండా అక్కడకి బయలుదేరడం మంచిదని" నిర్ణయించడంతో, C.M తో పాటు, మొత్తం మంత్రులూ, ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం అంతా కేంద్రీయ విద్యాలయానికి బయలుదేరారు.

11:25 A.M, *నగరశివార్లలో....ఓ హైవే...*

ఓ మెర్సిడీస్ బెంజ్ కార్...ఆకస్మికంగా స్లో అవుతూ...రోడ్ పక్కకి కి ఆగింది. కార్ నెంబర్ ప్లేట్ బట్టి అది కొన్నాళ్ళు ఢిల్లీలో రిజిస్టర్ అయినట్టు అర్థమవుతుంది. డ్రైవర్ సీట్లో ఉన్న నడి వయసు వ్యక్తి ఊపిరి తీసుకోడానికి ఇబ్బంది పడుతూ.....స్పృహ కోల్పోయి పక్కకు ఒరిగిపోయాడు. హైవే మీద వేగంగా వెళ్ళే వాహనాలు ఏవి తన అవస్థని గమనించలేకపోయాయి.

11:35 A.M, *శంకుస్థాపన కార్యక్రమం నుండి కేంద్రీయ విద్యాలయానికి వెళ్ళే దారిలో...*

ఆ ఆత్మాహుతి దళం ఇచ్చిన సమయానికి సరిగ్గా చేరుకోవాలనే తొందరలో, మెయిన్ రోడ్ నుండి కాకుండా షార్ట్ కట్ దారి లో మొదలయిన ముఖ్యమంత్రి మరియు మిగిలిన మంత్రులకి చుక్కెదురయ్యింది. రోడ్ వైడ్నింగ్ పేరిట వందల ఏళ్ళు ఈ భూమికి కాపు కాసిన చెట్లని కొట్టేయడంతో...ఆ రోడ్ మూసి వేయబడి ఉంది. వాహనాలు వెళ్ళే పరిస్థితులు లేవు. ముఖ్యమంత్రి ఇటుగా వస్తారని ముందుగా ఎటువంటి ప్రణాళికా లేకపోవడంతో, అధికారులకి ఏం చేయాలో పాలు పోలేదు.

"మొత్తం రోడ్డు, వాహనాలు వెళ్ళేలా సరి చేయడానికి చాలా సమయం పట్టేలా ఉంది...ఈ దారి లో నడుచుకుంటూ వెళ్ళినా 20 నిముషాల్లో వెళ్లిపోవచ్చన్న" కమీషనర్ సలహాతో అందరూ కాలినడకన కేంద్రీయ విద్యాలయానికి బయలుదేరారు.

*మిట్ట మధ్యాహ్నం 12:18, కేంద్రీయ విద్యాలయం....*

ఏంతో మంది పేరెంట్స్, మీడియా, పోలీసులతో ఆ స్థలం కిక్కిరిసిపోయింది. AC కార్లు వదిలి...ఎండలో నడిచి రావడం వల్ల మంత్రులంతా వడదెబ్బకి కుప్పకూలిపోయారు.

"దయ చేసి...త్వరగా బయటకొచ్చి మీ డిమాండ్స్ ఏంటో చెప్పండి! ఏదో పాదయాత్రలు చేసిన అనుభవం ఉండటం వల్ల...కేవలం ముఖ్యమంత్రిగారు మాత్రమే కాస్త మాట్లాడే ఓపికతో ఉన్నారు. ఇంకా ఆలస్యం చేస్తే మీకాసౌకర్యం కూడా ఉండదంటూ" వేడుకున్నాడు సిటీ పోలీస్ కమీషనర్.

ముసుగు తీసి బయటకొచ్చాడు వాళ్ళ లీడర్. *తన కళ్ళు...వేయిపిడుగుల వెలుగుతో మెరుస్తున్న ఆశల ఆకాశానికి చిరునామా! తన ఊపిరి...కోటి సూరీళ్ళు ఉదయించిన వేకువ వెచ్చదనం!* తన ఆవేదనతో కట్టిన మాటల మూటను విప్పడం మొదలుపెట్టాడు. అన్ని న్యూస్ ఛానల్స్ లో లైవ్ టెలికాస్ట్ మొదలయింది.

"*కాకినాడలో ఉన్నోడికి కాశ్మీర్ లో చలి అర్థమవుతుందా...AC కారుల్లో తిరిగే వాడికి ఎండ దెబ్బ తెలుస్తుందా? అరనిముషం AC లేకుండా బ్రతకలేని బలహీనతని టెక్నాలజీ అందామా?..సాయంత్రం ఆరు దాటితే గాని బయట తిరగలేని దౌర్భాగ్యాన్ని...అభివృద్ధి అందామా?* ఇరవై నిముషాలు...కేవలం ఇరవై నిముషాలు AC కార్లు వదిలేస్తేనే...వీళ్ళ పరిస్థితి ఇలా ఉందంటే...అసల ACల ఊసే ఎత్తలేని సామాన్యుడి ఆవేదన మీకు ఇప్పటికయినా అర్థం అయిఉంటుందని అనుకుంటున్నాను. 2002 వేసవి వేడికి దేశంలో 643 మంది చనిపోతే...అందులో 600 మంది మన రాష్ట్రం వాళ్ళే. వీల్లెవరికీ బాధ తెలియలా...వాళ్ళకి తగల్లేదుగా! 2003 వడదెబ్బకి దేశంలో 1426 మంది చనిపోతే...వాళ్ళలో 1300 మంది ఈ రాష్ట్రం నుండే. మనకి చీమ కుట్టినట్టు కూడా అనిపించలా...మనవాళ్లేవరూ పోలేదుగా! 2002 నుండి 2014 వరకు దేశం మొత్తం మీద వడదెబ్బకి 6529 మంది చనిపోతే, ఒక్క మన రాష్ట్రంలోనే 4769 మంది చనిపోయారు...అంటే దాదాపు 73%. దేశంలో మనమే టాప్...అసల పోటీనే లేదు మనకి!

ఇప్పటికీ నిద్రలేవకుండా...సహజ వనరులనారగించి...గాలిలో $CO_2$ ని పెంచి, భూ ఉపరితలంలో ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణం అయ్యే...ఈ కర్మాగారాన్ని ప్రారంభించడం సిగ్గుచేటు. 2003 వడదెబ్బ సమస్యకి ఎక్స్ గ్రేషియా (ex-gratia) తో చేతులు దులుపుకోకుండా...దాని వెనక కారణాలు అన్వేషించి...భవిషత్తులో...అలాంటి సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలు తీసుకుని ఉండి ఉంటే...ఇవాళ ఉష్ణోగ్రతల్లో కొంతలో

కొంత అయినా మార్పు ఉండేదేమో! గ్లోబల్ వార్మింగ్ పరిణామమయిన...మన రాష్ట్రం లోని 2003 వడదెబ్బని ఇతర దేశాల్లో...పాఠంగా చదువుకుంటున్నారు. మన రాష్ట్రం లో ఎంత మందికి గ్లోబల్ వార్మింగ్ మీద అవగాహన ఉందో మీకే తెలియాలి.

గత పదేళ్ళలో కరువు...త్రాగు నీటి సమస్య...దారుణంగా పెరిగాయి. అనేక రకాల పక్షులు, జంతువులు, మొక్కలు అంతరించిపోతున్నాయి. వసుధైక కుటుంబకం అన్న గొప్ప భావం ఉన్న ఒక్క మన భారత దేశంలోనే...దాదాపు 552 జీవ జాతులు ప్రమాదం అంచున ఉన్నాయ్. ఇవి మాత్రమే కాదు...కొత్త...కొత్త తుఫాన్ల పేర్లు మనకి పరిచయం అవ్వడానికి...అవి తరచుగా సంభవించడానికి కూడా...గ్లోబల్ వార్మింగే కారణం. మే 2010 'లైలా' తుఫాను, నవంబెర్ 2012 'నీలం' తుఫాను, అక్టోబర్ 2013 'ఫైలిన్' తుఫాను,నవంబెర్ 2013 'హెలెన్' తుఫాను, మరియు 'లేహర్' తుఫాను, అక్టోబర్ 2014 'హుద్ హుద్' తుఫాను, మే 2016 'రోను' తుఫాను, డిసెంబర్ 2016 'వార్ధా' తుఫాను...ఇవన్నీ మనకి హెచ్చరికలే. *ఒక్క హుద్ హుద్ దెబ్బ చాలదా...ఇంకో హుద్ హుద్ వచ్చే దాకా వేచి చూడాలా ?*

గత 25 సంవత్సరాల్లో...ముందెన్నడూ లేని విధంగా దాదాపు 40 కొత్త వ్యాధులు ఈ భూమి మీద ఉద్భవించాయ్. థర్మల్ పవర్ స్టేషన్లూ, ఆయిల్ రిఫైనరీలూ...మోటారు వాహనాలు విడుదల చేసే వాయువులు, కాన్సర్ మరియు గుండె జబ్బులకు కారణమవుతాయి. కేవలం ఒక్క వాయు కాలుష్యం వల్లే ఏటా దాదాపు 55 లక్షలమంది చనిపోతున్నారని, కొత్త పరిశోధనలో తేలింది. ఇకనయినా సహజ వనరులను వదిలి పెట్టి పునరుత్పాదక వనరులు (renewable resources) గురించి ఆలోచించాలి.

*ఆ మార్పు మొదట ప్రభుత్వం నుండే మొదలవ్వాలి. సిగరెట్ అలవాటున్న తండ్రి, సిగరెట్ కాలుస్తున్న కొడుకుని దండించలేడుగా!*

ఇక నుండి వచ్చే ప్రతీ ప్రభుత్వ ఆఫీసూ...గ్రీన్ బిల్డింగ్ అయి ఉండాలి. అసాధ్యమయిన పరిస్థితుల్లో భవనాల నిర్మాణానికి చెట్లు కొట్టివేయాల్సివస్తే...కొట్టేసిన ప్రతి చెట్టుకి బదులు కనీసం ఐదు చెట్లయినా...నాట గలిగిన వేరే ప్లేస్ లో నాటాలి. ప్రతీ ఆఫీస్లో...ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి. అన్ని ఆఫీసుల్లో వీలయినన్న మొక్కలు పెంచాలి, టెర్రస్ గార్డెనింగ్ ని తప్పనిసరి చేయాలి. గవర్నమెంట్ ఆఫీసులో వాడే ప్రతీ పేపరూ, రీ సైకిల్ చేయబడిన పేపరే అయిఉండాలి. *ఇవే పద్ధతులు...తమ ఇళ్ళల్లో పాటించిన ప్రజలకి టాక్స్ బెనిఫిట్స్ ఇచ్చి ప్రోత్సహించాలి.* అలాగే...గ్లోబల్ వార్మింగ్ గురించి ప్రజలలో అవగాహన తీసుకొచ్చే కార్యక్రమాలు చేపట్టాలి.

వాయు కాలుష్యానికి కారణం శిలాజ ఇంధనాలు (fossil fuels) వాడకం. 2020 సంవత్సరం కల్లా...తమ దేశాల్ని పెట్రోల్ ఫ్రీ దేశంగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్న...జర్మనీ...స్వీడన్...లాంటి దేశాలని స్ఫూర్తిగా తీసుకోవాలి. వేస్ట్ నుండి తయారు చేయబడే బయోడీజిల్...నదుల దిగువలో...టర్బైన్స్ వాడి ఉత్పత్తి చేసే టైడల్ పవర్...అసలు ఇంధనమే అవసరం లేకుండా నడిచే ప్లగిన్-హైబ్రిడ్-వెహికల్స్...లాంటి ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలి. బంజరు భూమిలన్నిటిలోనూ...సోలార్ పానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ ని ఉత్పత్తి చేయాలి. సిటీల్లో...వర్టికల్ ఫార్మింగ్ ని ప్రోత్సహించాలి. తద్వారా గాలిలో $CO_2$ ని తగ్గించుకోవటమే గాక...ఎంతో మందికి ఉపాధి అవకాశం కూడా దొరుకుతుంది. ఇవాళ మీరు ఈ ప్రాజెక్ట్ ప్రారంభిస్తే మీ చేతుల్తో మీరే పర్యావరణానికి తూట్లు పొడిచిన వారవుతారు. ఈ పవర్ స్టేషన్ ప్రారంభించదలిచిన స్థలంలో...సోలార్ పానెల్స్ ఏర్పాటు చేసి వాటి నుండి పవర్ ఉత్పత్తి చేయాలి...పర్యావరణాన్ని కాపాడుకోడానికి మీరు వేసే తొలి అడుగు ఇదే కావాలి. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి...ఇవాళ ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన మీరు...మా ఆవేదనని అర్ధం చేసుకుంటారనుకుంటున్నాను.!" అంటూ తన ప్రసంగాన్ని ముగించాడు ఆ ఆత్మాహుతి దళం లీడర్.

"ఇందంతా నువ్వెందుకు చేస్తున్నావ్?...మీ వాళ్ళెవరైనా....?" అంటూ ముఖ్యమంత్రి అడగదలిచిన ప్రశ్న పూర్తవకముందే...ప్రతిస్పందించాడు ఆ లీడర్.

"మన దేశ రాజధాని మరియు ప్రపంచంలోనే అత్యంత కలుషితమయిన నగరమయిన ఢిల్లీలో, సంవత్సరానికి దాదాపు 30,000 మంది వాయు కాలుష్యానికి బలవుతున్నారు...ఈ ప్రాజెక్ట్ ఆపాలీ...అంటే, ఆ చనిపోయినవారు....నా వాళ్ళే అయిఉండాలా?....ఇందాకే ఒక టీచర్ పిల్లలకి పాఠం చెబుతున్నాడు...*ఈ భూమి ఉన్న ఒక్క మనుషులే కాదు...ప్రతి జీవరాశి ఒకటే కుటుంబం అనీ...అదే వసుధైక కుటుంబకం అని !*

ఇంతలో "సార్ ముఖ్యమయిన ఫోన్ కాల్" అని ముఖ్యమంత్రికి కంగారుపడుతూ ఫోన్ ఇచ్చాడు చీఫ్ సెక్రటరీ.

ఆ ఫోన్లో మాట్లాడుతుండగా...ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఆ ఫోన్ మాట్లాడం పూర్తవగానే "ఇవాల్టి శంకుస్థాపనను ఆపేస్తున్నాను! ఇక నుండి ప్రభుత్వం చేసే ప్రతి పని గ్లోబల్ వార్మింగ్ ని దృష్టిలో ఉంచుకునే చేస్తాం.!" అని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఆ తరువాత ఆ లీడర్ పై ప్రశ్నల వర్షం కురిపించింది మీడియా.

"మీరంతా ఎవరు?....మీ దగ్గరున్న బాంబులు ఎక్కడ నుండి వచ్చాయి?...మీరు అడిగిన డిమాండ్స్ అన్ని సాధ్యపడగలవనే మీరు అనుకుంటున్నారా?" అని మీడియా ప్రశ్నించింది.

"మేమంతా ఇంజనీరింగ్ స్టూడెంట్స్...అవన్నీ ఇంటర్నెట్లో చూసి తయారు చేసినవి, ఒరిజినల్గా కనిపించే డూప్లికేట్ బాంబులు. మా డిమాండ్స్...మన ఎకానమీకి సాధ్యపడవనుకుంటే...రేపు ఎకానమీ ఎంత పెరిగినా....అనుభవించడానికి...రేపటి తరం ఉండబోదు. ప్రతి మనిషి తమ జీవితాంతం కష్టపడేది...తమ పిల్లలు సంతోషం కోసమే! త్రాగడానికి స్వచ్ఛమైన నీరు...పీల్చడానికి స్వచ్ఛమైన గాలి...ఈ నేల మీద స్వేచ్ఛగా ఎప్పుడైనా తిరగగలిగే స్వాతంత్ర్యం...రేపటి తరానికి ఇవ్వగలమన్న నమ్మకం ఎంతమందికి ఉంది ఇవాళ?

రేపటి తరానికి నువ్వు వారసత్వం గా ఇవ్వాల్సింది పరిశుభ్రమయిన వాతావరణం. భూ ఉపరితల ఉష్ణోగ్రత ఇప్పటికే 0.8° C పెరిగింది...అది గనుక 2°C చేరక ముందు కట్టడి చేయలేకపోతే...ఈ భూమి మనుగడే ప్రశ్నార్ధకం అవుతుంది. *ఇదంతా ప్రకృతి విపరీత్యం కాదు...మానవుడి పైశాచికత్వం అని ప్రజలకి చెప్పాలనుకున్నాం...అంతే"* అంటూ అక్కడనుండి విరమించాడు ఆ లీడర్.

*ఈ స్పీచ్ కి 18 నిముషాల ముందు....ఇందాక చెప్పిన నగరశివార్లలోని హైవే...*

రోడ్ ప్రక్కన ఆగిపోయిన బెంజ్ కారుకి కాస్త దూరంలో ఒక పూరిల్లుంది. ఇల్లు చిన్నదేగాని వాళ్ళ మనసు మాత్రం చాలా పెద్దది. ఆ ఇంటి బయట మూగ జీవులకు కోసం రెండు బక్కెట్ల నీళ్ళు పెట్టాడు...ఆ ఇంటాయన.

అవి త్రాగడానికి...ఆ చుట్టుపక్కలున్న పశువులు, పక్షులు రావడం మొదలెట్టాయ్. ఆ నీళ్ళు త్రాగడానికి...ఒక లేగ దూడ...తన తల్లిని వదిలి...వేగంగా ముందుకు పరిగెట్టడం మొదలు పెట్టింది. సరిగ్గా అదే సమయానికి ఆ కారులో ఉన్న వ్యక్తి సెల్ ఫోన్ రింగ్ అవడం మొదలయింది. ఆ సెల్ ఫోన్ సౌండ్ కే ఆగిందో లేక పక్కకు ఒరిగిపోయిన ఆ మనిషిని గమనించి ఆగిందో తెలీదు కాని...ఎవరో చెప్పినట్టు...ఆ కారు దగ్గరకి రాగానే ఆగింది...ఆ పరిగెత్తిన లేగ దూడ. ఆ కారులోని వ్యక్తి ఎవరో తనకి తెలియక పోయినా...ఏదో తన వారికి ఆపద వచ్చినట్టు అరవడం మొదలు పెట్టింది. అది చూసి దాని తల్లి కూడా అక్కడే ఆగింది. ఆ తరువాత వెనక వచ్చిన మిగిలిన పశువులు, పక్షులు కూడా ఆ కారు దగ్గరే ఆగి...వింతగా ప్రవర్తించడం మొదలు పెట్టాయి.

అది గమనించిన ఆ పూరింటి యజమాని వెంటనే...ఆ కార్ దగ్గరకి వెళ్లి, సరయిన టైం కి హాస్పిటల్ కి తరలించి ఆ వ్యక్తిని కాపాడాడు. ఆ వ్యక్తి స్పృహ కోల్పోవడానికి కారణం ప్రాధమిక దశలో ఉన్న లంగ్ క్యాన్సర్. గత పదేళ్ళగా...ఢిల్లీలో ఉంటూ అనేక ఫ్యాక్టరీస్ నడుపుతున్న ఆ వ్యక్తి...ఎవరో కాదు, ముఖ్యమంత్రి కొడుకు. ఇందాక ఆయన ఫోన్లో మాట్లాడాక, కంట తడి పెట్టడానికి ఇదే కారణం!

తన కొడుకు ఆరోగ్యం దెబ్బ తినడానికి కారణం, ఢిల్లీ లోని కలుషిత వాతావరణం అని డాక్టర్లు కచ్చితంగా నిర్ధారించకపోయినా, బహుశా అటువంటి ఆలోచనేదో ముఖ్యమంత్రి నిర్ణయానికి కారణమయిందేమో!

*మధ్యాహ్నం 1:18, కేంద్రీయ విద్యాలయం గేటు ముందర...*

పిల్లలందరూ పరగున వాళ్ళ తల్లి దండ్రుల దగ్గరకి చేరుకున్నారు.

*"డాడీ..ఈ భూమి మీద ఉన్న చెట్లు, పక్షులు, జంతువులూ, ఆకాశంలో నక్షత్రాలు అంతా ఒకటే ఫ్యామిలీ అని మా టీచర్ చెప్పారు. మరి ఈ మనుషులు చెట్లని ఎందుకు నరుకుతున్నారు?...వాళ్ళు చెప్పేదంతా నిజమేనా..? మేము రేపు స్వేచ్ఛగా తిరగలేమా?"* అని అడిగాడో పిల్లాడు.

*ఆ ప్రశ్నలకి సమాధానమ్ పొందే అదృష్టం లేకపోయినా...ఆలోచింపచేసే శక్తి మాత్రం కావలసినంత ఉందని నా అభిప్రాయం.*

మా బ్రెదర్స్, మన ముఖ్యమంత్రి గారబ్బాయిని సేవ్ చేసిన ఇన్సిడెంట్ ని టీవీల్లో పదే పదే డిస్కస్ చేస్తుంటే...మా పెద్దాళ్ళు మాకు చిన్నప్పుడు వసుధైక కుటుంబకం గురించి చెప్పిన మాటలు జ్ఞాపకం వస్తున్నాయ్. మా పెద్దాళ్ళు ఎవరూ...ఇప్పుడు లేరు! వాళ్లే కాదు...మా చుట్టాల్లో కూడా చాలా మంది ఇప్పుడు లేరు. దానికి కారణం మీ మానవులే అని మీ మీద నాకు ద్వేషం లేదు...ఎందుకంటే...మీరు కూడా మా ఫ్యామిలీనే కదండీ! అన్నట్టూ...నన్ను నేను పరిచయం చేసుకోవడం...మరిచేపోయాను.

*నేను ఆరడుగులుండనూ...కనీసం సిక్స్ ప్యాక్ కూడా లేదు! అయినా...అమ్మాయిలంతా నా వెంటే పడతారు!*

*నా దగ్గర Kinder Joy కాదు కదా...ఆశ చాక్లేట్ కూడా లేదు! కాని...పిల్లలంతా నా చుట్టూనే తిరుగుతారు!*

*నేను కొన్ని వేల కిలోమీటర్లు...ఏ టికెట్టు లేకుండా ఫ్రీ గా ప్రయాణించగలను!*

*నేనండీ...మీ ఆశల హరివిల్లుని నా రెక్కల్లో దాచుకున్న సీతాకోకచిలుకనీ. లాస్ట్ టైం నన్ను మీరెప్పుడు చూశారో ఓ సారి గుర్తుచేసుకోండి?*

నేను...ఆ లీడర్ వాళ్ళింటి పెరట్లో ఉంటాను. వాడికి మేమన్నా...మొక్కలన్నా మహా ఇష్టంలెండి. వాళ్ళ ఫ్రెండ్స్ అందరూ కలిసి...ఈ ఆపరేషన్ కి సంభందించిన మంతనాలన్నీ జరిపింది...మా పెరట్లోనే! ఆ ప్లాన్ ఎలా అమలుపరుస్తాడో...లైవ్లో చూద్దామని ఇలా వచ్చాను.

వాడన్నట్టు...రేపు నేను తిరగడానికి...ఈ రంగుల లోకం ఉంటుందా లేదా అనే డౌటయితే నాకు లేదు. *ఎందుకంటే...గొంగళిగా ఉన్న చివరి రోజుల్లో నాకూ...అదే సందేహం వచ్చింది...ఈ ప్రపంచం అంతమయిపోతందేమో అనీ...కాని ఆ మరుక్షణమే...స్వేచ్ఛగా తిరగగలిగే సీతాకోకచిలుకగా మారిపోయాను నేను! మంచి రోజులొస్తాయని నాకు నమ్మకముందండి. మనుషులు కచ్చితంగా మారతారు. వాళ్ళు రేపటినుండి చేసే ప్రతి పనీ...ప్రకృతిని దృష్టిలోపెట్టుకునే చేస్తారని ఆశిద్దాం...ఉంటానండీ...ఇంక శెలవు మరి!* *ఇట్లు,*

*మీ రంగుల కలల కోక కట్టుకున్న....సీతాకోకచిలుక!*

## చేసినపాపం

### తెలుగు సేత: సూరపరాజ రాధాకృష్ణ మూర్తి

### మూలం:Fyodor Dostoevsky

ఆయన మా టౌన్లో పెద్ద అధికారి.చాలాకాలంగా ఇక్కడ పనిచేస్తూ ఉన్నాడు. సంపన్నుడు. ఉదారుడు.ఊళ్ళోని అనాథశరణాలయాలకూ ఉచితాన్నదానసంస్థలకూ విరివిగా విరాళాలు యిచ్చేవాడు. అతడంటే అందరికీ గౌరవం.దయాగుణం కలవాడు.అవసరంలో అనేకులను ఆదుకున్నాడు.(ఆయన దయాగుణం ఆయన పోయిన తరువాతనే తెలిసింది.) ఏభై ఏళ్ళుండవచ్చు.భార్య, ముగ్గురు పిల్లలు. ఒకరోజు సాయంత్రం హఠాత్తుగా తలుపు తోసుకుని నా గదిలోకి వచ్చాడు. ఎందుకొచ్చాడో తెలియదు. గంభీరంగా ఉన్నాడు. ముఖంలో ఒక తీవ్రత కనిపిస్తోంది. కూర్చుంటూ అన్నాడు:

'ఈ మధ్య మీరు ఈ టౌన్లో, కొందరి యిళ్ళకు వెళ్లడం, వారితో వాళ్ళ కష్టసుఖాలు మాట్లాడడం చూస్తున్నాను. మీరు వాళ్ళకు చెపుతున్న మాటలు వింటున్నాను కూడా. మీరు సామాన్యవ్యక్తి అనిపించడం లేదు. మీది దృఢమైన ధార్మికప్రవృత్తి. మీలో సత్యనిష్ఠ కనిపిస్తున్నది.మీరు చేసిన పని అందరూ చేయగలిగింది కాదు. పరువు నష్టమనీ, నలుగురూ చులకన చేస్తారనీ తెలిసి కూడా, మీరు చేయదలచుకున్నది చేసేస్తారు.అలా చేయడానికి చాలా ధృతి ఉండాలి'.

'అదేం లేదండీ. మీరంటున్నంత గొప్ప విషయమేమీ కాదది.నన్ను ఎక్కువగా పొగుడుతున్నారు', అన్నాను.

ఇక్కడ నా గురించి కొంత చెప్పుకోవాలేమో? నేను నిన్నమొన్నటిదాకా ఒక ఆర్మీ ఆఫీసర్ని.నేను ఒకప్పుడు ఒక అమ్మాయిని ప్రేమించాను. ఆమెను మరొకడు సొంతం చేసుకున్నాడు.నాకు వాడిమీద విపరీతమైన కోపం వచ్చింది. 'బలాబలాలు తేల్చుకుందాం రా' , అని వాణ్ని ఛాలెంజ్ చేశాను.మర్నాడు ఉదయాన్నే ఊరి చివర కలుసుకుందాం అనుకున్నాం.ఆ రాత్రి సరిగా నిద్రపోలేకపోయాను. తెల్లవారితే ప్రేమప్రత్యర్థితో జరగబోయే బలపరీక్ష గురించి చాలా సేపు ఆలోచించాను.నన్ను ప్రేమించని అమ్మాయికొరకు పోట్లాట ఏమిటి? పైగా ఒక వేళ నేను అతన్ని చంపాననుకో? ఏం చేసినట్టు? ఆమె జీవితాన్ని దు:ఖమయం చేయడమే కదా? అలాజరుగకూడదనుకున్నాను.తెల్లారింది. నేను నా ప్రత్యర్థి కలుసుకుందామనుకున్న చోటికి చేరాం. రాత్రి నిర్ణయించుకున్నట్లే అతనితో నేను పోటీనుండి విరమించుకుంటున్నాను అని చెప్పేశాను. క్షమించమనికూడా అన్నాను. ఆ సందర్భంలో అవతల వ్యక్తి నన్ను ఎంత నీచంగా అవహేళన చేస్తాడో తెలుసు. అందులో, నేనొక ఆర్మీ ఆఫీసర్ని కూడా.ఆర్మీలో కూడా యిటువంటి పిరికిమనుషులుంటారా అని అతడే కాదు బయటకూడా నన్ను అవహేళనచేస్తారు. అయినా అనుకున్నది చేసేశాను. ఇది జరిగిన తరువాత నాకు సైన్యంలో పనిచేయాలనిపించలేదు.రాజీనామా చేశాను. ఇప్పుడీ పెద్దమనిషి నాగురించి అంటున్న మహత్కార్యం ఆనాడు నా ప్రేమప్రత్యర్థిని నేను క్షమించమని అడగడం గురించే .

'లేదు.లేదు.ఎక్కువ ఏమాత్రము కాదు.మీరు చేసిన పని చేయగలగడానికి చాలా చాలా మనోబలం కావాలి.మీరనుకున్నంత తేలికేమీ కాదు. నిజానికి నన్ను మీ దగ్గరికి తీసుకొచ్చింది ఆ బలమే. చూడండి, మిమ్మల్ని విసిగిస్తున్నానేమో? మీ వ్యక్తిగత విషయంలోకి తలదూరుస్తున్నాననుకొంటారేమో కాని, మిమ్మల్ని ఒకటి అడగాలని ఉంది.ఆనాడు అతన్ని మీరు క్షమించమన్నప్పుడు మీ మనస్థితి ఎటువంటిదో , మీ మనసులో ఏ భావాలు కలిగాయో చెప్పగలరా? ఈ విధంగా అడగడంలో నాదొక రహస్యప్రయోజనం ఉంది. దాని గురించి తరువాత సమయం వచ్చినపుడు,మనం యింకా దగ్గరవడం భగవంతుడి సంకల్పమైతే, చెబుతాను', అన్నాడు.

'అప్పటి నా మనస్థితి ఏమిటి అని అడుగుతున్నారు.ఇక్కడ, నేను ఇంతవరకు ఎక్కడా చెప్పని విషయం ఒకటి మీకు చెప్పాలి. నా ప్రత్యర్థిని ఛాలెంజ్ చేసి వచ్చిన ఆ రాత్రి జరిగిన ఒక సంఘటన నా జీవితాన్ని మార్చేసింది. అది నా జీవితంలో నేను ఊహించి ఉండలేని గొప్ప మలుపు.అతణ్ణి ఛాలెంజ్ చేసి యింటికి వచ్చానా? ఆ సాయంత్రం అంతా కోపంతో ఊగిపోయాను. ఉన్నట్టుండి అకారణంగా, నాదగ్గర పనిచేసేవాణ్ణి ముఖంమీద రెండు గుద్దులు గుద్దాను. వాడి ముఖమంతా రక్తం. నిశ్చేష్టుడై నిలబడి పోయాడు వాడు. ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు. పక్కమీదినుంచి లేచి పోయాను. మనసంతా అలజడి. నా పనివాణ్ణి కొట్టడమేమిటి? వాడు నా లాంటి మనిషే కదా? పాపం, కొడుతుంటే, వాడు చేయి కూడా ఎత్తలేదు.కవాతులో నిలుచున్న సైనికుడిలా కదలకుండా ఉండిపోయాడు. నా మీద నాకే అసహ్యం వేసింది. నేను చేసిన పని తప్పు అని తెలుసుకున్నాను.తెల్లవారగానే వాడి కాళ్లమీద పడి క్షమించమన్నాను.వాడికి చాలా ఆశ్చర్యం కలిగివుంటుంది. వాడు చాలా యిబ్బంది పడిపోయాడు. నాకు మతిచెడిందేమోనని అనుమానించినా అనుమానించి ఉండవచ్చు. కాని నా మనసులో అలజడి ఆగిపోయి తేలికపడింది. ఆ తరువాత నా ప్రత్యర్థిని క్షమించమని అడగడం నాకు సులభం అయింది. ముందే దారి చేసుకుని ఉన్నాను కనుక. దారి చేసుకుని మొదటి అడుగు వేయడంలోనే ఉన్న కష్టమంతా. తరువాత దారి సులభం. నా ప్రత్యర్థితో అలా ప్రవర్తించడంలో అవమానం కాదు, ఆనందం ఉండింది', అన్నాను.

నేను యిదంతా చెబుతున్నపుడు అతడు నావైపు ఎంతో ఆసక్తితో విన్నాడు. ' మీరు మాట్లాడడం వినడం చాలా బాగుంది. అప్పుడప్పుడూ వస్తుంటాను' అని వెళ్ళిపోయాడు.

అప్పటినుండి అతడు ఇంచుమించు ప్రతిరోజు సాయంత్రం నన్ను కలవడానికి వచ్చేవాడు. మేము యింకా చాలా దగ్గరి స్నేహితులం అయ్యేవాళ్ళమే. కాని అతడు తనగురించి ఏమీ మాట్లాడేవాడు కాదు. నాగురించి అడుగుతూ ఉండేవాడు. శ్రద్ధగా వినేవాడు. అయినా అతడంటే నాకు యిష్టంగానే ఉండేది. నా గురించి నేను చాలా మనసు విప్పి మాట్లాడేవాణ్ణి. అతని జీవితరహస్యాలు నాతో చెప్పుకోవలె అని నేనెందుకనుకోవాలి? అతని

మంచితనం సరళస్వభావం స్పష్టంగా తెలుస్తున్నాయి.పైగా, నాకంటే వయసులో హోదాలో పెద్దవాడు.అయినా, సమవయస్కుడితో లాగా పెద్దరికం చూపకుండా మాట్లాడుతున్నాడు. ఎక్కువ విన్నది అతడైనా, ఎక్కువ నేర్చుకున్నది నేను. అతడు ఉదాత్తుడు. అతడు నేలమీద నడుస్తున్నా, అతని తల స్వర్గంలో ఉన్నది అనిపించేది.

ఒకరోజు అన్నాడు, హఠాత్తుగా: 'ఆ జీవితం ఉందే, అది , అది స్వర్గం. దాన్ని గురించే ఆలోచిస్తుంటాను. నిజానికి అది తప్ప మరోవిషయం గురించి ఆలోచించడం లేదు.' అంటూ, నా వైపు చూచి చిన్నగా నవ్వాడు. 'నీకంటే దానిపై నాకు ఎక్కువ నమ్మకం. ఎందుకంటున్నానో తరువాత చెబుతాను.'

అతడేదో చెప్పాలనుకుంటున్నాడనిపించింది.

' దివ్యలోకం దాగి ఉంది. ఎక్కడో కాదు, మనలో. ఇక్కడ, ఇప్పుడు ఈ క్షణం నాలో ఉంది.నా గుండెలో. నేను సంకల్పిస్తే , రేపు అవతరిస్తుంది,శాశ్వతంగా .'

నేను అతని వైపే చూస్తూ ఉండిపోయాను.అతడు చాలా ఉద్రేకంతో మాట్లాడుతున్నాడు.

'అవును. నీవంటూ ఉంటావే, అది నిజం. మనం మన కర్మలకే కాదు, లోకంలో అందరి కర్మలకు అందరి పాపపుణ్యాలకు బాధ్యులం.ఈ సత్యం, దాని బహుముఖప్రాధాన్యం ఇంత చిన్న వయసులో నీవు తెలుసుకోగలగడం ఆశ్చర్యం. ఇది తెలిసిన మరుక్షణం అప్పటివరకు కలగా ఉండిపోయిన ఆ దివ్యలోకం దిగివస్తుంది.'

'ఎప్పుడు అది వచ్చేది? అసలు వస్తుందా?' అన్నాను, కొంత అపనమ్మకంతో , కొంత అసహనంతో.

'అంటే, నీవు నమ్మవన్న మాట? నీవు నలుగురికీ నమ్మకం కలిగిస్తావు, కాని నీకు నమ్మకంలేదు? విను.తప్పక వస్తుంది.కాని వచ్చే ముందు ఈ వెలివేత , ఈ భయంకరమైన ఒంటరితనం తప్పదు.'

'వెలివేతా? ఏ వెలివేత?'

' మనిషి మనిషిని వెలివేయడం. మనిషి మనిషితో కలిసి బతకలేకపోవడం. వెలిగా వెలితిగా బతకడం.లోకమేమైపోయినా సరే, నేనుబాగుంటే చాలు అనుకోడం.'

అతడు నన్ను కలవడానికి రావడం ఎక్కువయింది.నేనూ అతడి రాక కోసం ఎదురు చూసేవాడిని. అతడేదో ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకొనే విషయంలో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు అనిపించేది. నేను ఆ విషయంలో ఏమీ ఆరాలు తీయవలెనని ప్రయత్నం చేయకపోవడం అతడికి నచ్చింది.కాని అతడు ఎప్పటికప్పుడు నాతో ఏదో చెప్పాలనే అనుకుంటున్నట్టు అనిపించేది నాకు.

ఒక రోజు అన్నాడు,'నీకు తెలుసా? మన సమావేశాలగురించి ఊళ్ళో వాళ్ళు చాలా మాట్లాడుకుంటున్నారు. మనం యింత తరచుగా ఎందుకు కలుస్తున్నామో ఏం మాట్లాడుకుంటున్నామో తెలుసుకోవలెనని చాలా కుతూహలంతో ఉన్నారు.ఉండనీ.ఉండనీ.సమయం వచ్చినపుడు తెలుస్తుంది.'

మాట్లాడుతూ మాట్లాడుతూ ఒక్కోసారి అతడు ఉన్నట్టుండి ఉద్విగ్నుడయేవాడు. అట్లాంటి సమయాలలో హఠాత్తుగా లేచి వెళ్ళిపోయేవాడు. ఒక్కోసారి నా కేసి తీక్ష్ణంగా చూస్తూ ఉండిపోయేవాడు. అటువంటపుడు అనిపించేది,' ఇప్పుడేదో చెప్పబోతున్నాడని.వెంటనే ఏదో పిచ్చాపాటీలోకి దిగిపోయేవాడు. చాలాసార్లు అతడికి విపరీతమైన తలనొప్పి వచ్చేది.

ఒక రోజు చాలాసేపు ఏవో విషయాలు ఉద్రేకంతో మాట్లాడుతూ ఉన్నాడు.ఉన్నట్టుండి అతడి ముఖం వివర్ణమయింది.మూర్ఛవచ్చే వాడికి లాగా ఒళ్ళు, ముఖం వణుకుతున్నాయి.నావైపు చూస్తాడు,చూపుపక్కకు తిప్పుకుంటాడు.మళ్ళీ చూస్తాడు.

'ఏమయింది? ఎలాఉంది?' అన్నాను.

' నేను...నేను ...నీకు తెలుసా? నేను ఒకరిని హత్య చేశాను', అంటూ ఒక పేలవమైన నవ్వు నవ్వాడు.

అతడన్న మాటకు నిర్ఘాంతపోయాను.కాని ఆ మాట దాని అర్థం నా తలకెక్కే లోపల అతడి నవ్వు నన్ను పట్టుకుంది. నవ్వడమేమిటి? ఎందుకు నవ్వుతున్నాడు?

' ఏమన్నావ్?', అరిచాను.

'చూశావా,ఆ మాట నానుండి బయటపడడానికి ఎంత కష్టపడ్డానో! ఇప్పుడు చెప్పేశాను. మొదటి అడుగు వేశాను. ఇక నడిచేస్తాను', అన్నాడు.

వినగానే నేను నమ్మలేదు.ఆ తరువాత కూడా చాలాసేపు నమ్మలేదు నేను. ఆ తరువాత వరుసగా మూడు రోజులు వచ్చాడు.జరిగిందిచెప్పాడు. అతడికి మతి చలించిందేమో అనుకున్నాను.కాని నమ్మక తప్పలేదు. అతడు చేసింది చాలా ఘోరమైన నేరం.

పధ్నాలుగు సంవత్సరాల క్రితం అతడు ఒక స్త్రీని హత్యచేశాడు.ఆమె భర్త చనిపోయాడు. బాగా ఉన్నవారు. పెద్ద యిల్లు. తోట. ఆమె అందంగా ఉండేది. వయసులో ఉన్నది. ఇతడు ఆమెను గాఢంగా ప్రేమించాడు. తన ప్రేమను ఆమెకు చెప్పుకున్నాడు. పెళ్లికి ఆమెను ఒప్పించాలని ప్రయత్నం చేశాడు.కాని ఆమె అంతకు ముందే మనసు మరొకరికిచ్చేసింది.పెళ్ళి కూడా నిశ్చయం అయింది. ఆమె వరుడు సైన్యంలో పెద్ద పదవిలో ఉన్నవాడు.దూరప్రాంతంలో సేవలో ఉన్నాడు. త్వరలో వచ్చి ఆమెను వివాహం చేసుకోబోతున్నాడు.ఇతడి ప్రేమను స్వీకరించలేనని చెప్పి, దయచేసి తనను కలుసుకోడానికి రావద్దని చెప్పింది.ఆమెను కలవడం మానేశాడు.కాని యిల్లు, యింటితోట, ముందు ద్వారం, వెనుకవైపు దారి అన్నీ బాగా తెలుసు అతనికి. ఒక రాత్రి చాలా సాహసం చేశాడు. యింటివెనుక తోటలోనుండి వచ్చి , వెనుక తలుపు తీసిఉండడం గమనించి, ఆమె గదిలోకి వెళ్ళిపోయాడు. ఆమె ఒక్కతే ఉంది గదిలో, పక్కపై ఒత్తిగిలి పడుకుని. ఆమెను చూడగానే అతడి కోరిక ఉవ్వెత్తుగా ఎగిసింది.అసూయ రేగింది. కోపం తాచులా తలెత్తింది.ఉన్మత్తుడిలా చేతిలో కత్తి ఆమె గుండెలో కసక్కని దింపాడు. ఆమె అరవనుకూడా లేదు.ఆమె ప్రాణం పోయింది. అతడు దయ్యపు సాహసము,పిశాచపు తెలివి ప్రదర్శించాడు. డబ్బుకోసం చేసిన హత్యలాగా కనిపించడం కోసం, ఆమె పర్సులో డబ్బు తీసాడు .ఆమె దిండుకింద ఉండిన తాళపుచెవులు తీసుకొని బీరువాలు తెరిచి వాటిలో పెద్ద పెద్ద నగలు తీసుకున్నాడు. చిన్నవి చాలానే ఉండినవి. కాని, వదిలేశాడు.ఆస్తుల పత్రాలు తాకలేదు. ఈ దొంగతనం పత్రాల విలువ తెలియని చదువురాని వెధవలెవరో చేసిఉంటారన్న అనుమానం కలగాలి.ఇవన్నీ భ్రమ కలిగించడానికి.ఇవి కాక, తనకు కావలసిన తనకు మాత్రమే విలువగలిగిన వస్తువులు కొన్ని తీసుకున్నాడు. వచ్చినదారినే వెళ్లి పోయాడు.

మర్నాడు కాని ఆతరువాత కాని ఎన్నడూ యితనిమీద ఎవరికీ యింతవరకూ కలలోకూడా అనుమానం కలగలేదు.అతడి ప్రేమ విషయం కూడా ఎవ్వరికీ తెలియదు.ఎందుకంటే, అతడు ఎప్పుడూ ఎవరితోను కలిసేవాడు కాదు. మనసు విప్పి మాట్లాడుకునే మిత్రులూ ఎవరూ లేరు. హత్యచేయబడిన స్త్రీ దగ్గర పనిచేసే వాడి ప్రవర్తన సరిగా లేకుంటే, హత్యకు రెండు రోజులు ముందు ఆమె పనిలోనుండి తీసేసింది. అందరూ ఈ హత్య వాడి పనే అనుకున్నారు. మర్నాడు వాడు ఊరి చివర తప్పతాగి ఒళ్ళు తెలియని స్థితిలో పడి ఉండినాడు. వాడి జేబులో ఒక కత్తి కూడా దొరికింది. వాడి కుడిచేతిన నెత్తురుమరకలుండినాయి.ఏమిటి యీ రక్తం అంటే, రెండు రోజులనుండి ముక్కున రక్తం కారుతూ ఉండింది అన్నాడు. వాడి కథ ఎవరూ నమ్మలేదు.అరెస్టు చేశారు.ప్రాథమిక విచారణలో హత్య అతడే చేశాడని నిర్ధారణ అయింది.ఈ లోపల అతడికి జబ్బుచేసి హాస్పిటల్లో చేర్చారు. మూడో రోజు చనిపోయాడు.కేసు మూసేశారు.

అప్పుడు శిక్ష మొదలైంది.

నా మిత్రుడు ( అవును, ఇప్పుడు ఆ పెద్దాయన నాకు చాలా దగ్గరైనాడు) అన్నాడు:

' ఇది జరిగిన తరువాత కొన్నాళ్ళవరకు నా అంతరాత్మ నాతో ఏమీ గొడవపడలేదు. బాధ పడ్డాను.కాని ఎందుకు? నేను ప్రేమించిన మనిషిని చంపుకున్నందుకు.ఆమెపై ప్రేమ నా నరాలలో యింకా ప్రవహిస్తూనే ఉండింది. నేను చంపుకున్నది నా ప్రేమను.కాని నేను ప్రేమించిన మనిషి మరొకరికి భార్య అయితే నేను సహించగలనా? చంపకుండా ఎలా ఉండగలను? ఇక ఆ అమాయకుడి విషయమా? అతడు అరెస్ట్ అయినప్పుడు కొంచెం ఆందోళనచెందాను. అతడి అనారోగ్యం ,ఆ తరువాత అతడు త్వరలో చనిపోవడంతో ఆ ఆందోళన కూడా సమసిపోయింది. అతడు జబ్బు పడడానికి చనిపోవడానికి అతడి అరెస్టు కారణం కాదు అని కూడా నిర్ధారణ చేశారు. అతడికి అంతకు ముందే ఏదో జబ్బు ఉండింది.ఎలాగూ పోయేవాడే.ఇక నేను తెచ్చేసుకున్న డబ్బు, నగలు. నేనేమీ డబ్బుకు కక్కుర్తి పడి దొంగిలించలేదు. హత్యను దొంగతనంలో భాగంగా విచారణను పక్కదోవ పట్టించడానికి చేశాను. దొంగిలించిన సొమ్ము స్వల్పమే. ఆ సొమ్ము మొత్తం వెంటనే శరణాలయాలకు దానం చేశాను. కనుక చాలాకాలం వరకు నా అంతరాత్మ నన్నేమీ యిబ్బంది పెట్టలేదు.ఎటువంటి అశాంతి లేకుండా చాలాకాలం గడిచిపోయింది.ఆ తరువాత ఒక స్వచ్ఛందసేవాసంస్థలో చేరి సేవచేశాను. అంటే, కాయకర్మ. ఇలాంటిపనులలో గతాన్ని యించుమించు మరచిపోయాను. అప్పుడప్పుడూ అది గుర్తొచ్చేది. కాని తోసెయ్యడానికి ప్రయత్నించేవాణ్ణి.ధర్మకార్యాలలో ఎక్కువ చురుకుగా పాల్గొనేవాణ్ణి. ఎన్నో సంస్థలు స్థాపించి పట్టణాభివృద్ధికి చేయగలిగిందంతా చేశాను. చాలా సంస్థలకార్యవర్గాలలో సభ్యుడిగా ఎన్నుకున్నారు నన్ను.ఇలా ఎన్ని చేసినా ఎన్ని పనులలో మునిగి తేలుతున్నా , గతం గుర్తుకురావడం మానలేదు. దాన్ని తోసెయ్యడం అంతకంతకూ కష్టమయింది.ఆ స్థితిలో ఒక అమ్మాయిని చూచాను. తెలివైన మనిషి. పరిచయమైన కొద్ది రోజులలోనే ఆమెను పెళ్ళి చేసుకున్నాను. సంసారంలో భార్యాపిల్లలపట్ల బాధ్యతలలో గతం మరచిపోవచ్చనుకున్నాను.కాని నా స్థితి యింకా హీనమయింది. నా భార్యకు నేనంటే అమితప్రేమ. నేనొక హంతకుణ్ణి అని తెలిస్తే? ఆమె నాతో మొదటిసారి మనకో బిడ్డ కలగబోతున్నాడు అన్నప్పుడు నేను కలవరపడ్డాను. ప్రాణం తీసిన నేను, నా ప్రాణం పోసుకుంటున్నవాడికి నా ముఖం ఎట్లా చూపించను? ఒకరి తర్వాత ఒకరు, ముగ్గురు పిల్లలు కలిగారు. వారిని ఎలా ప్రేమిస్తాను? ఎలా విద్యాబుద్ధులు చెప్పిస్తాను? మంచి గురించి, మానవత్వం గురించి వాళ్ళకు ఏం చెబుతాను, రక్తం చిందించినవాణ్ణి? ఎంత ముద్దొచ్చే పిల్లలు! దగ్గరకు తీసుకోవాలని, ముద్దుచేయాలని.కాని ఆ అమాయకపు ముఖాలలోకి చూచే యోగ్యత నాకు లేదు.

'రాను రాను నేను చిందించిన రక్తం నన్ను భయంకరంగా వెంటాడడం మొదలుపెట్టింది. ఒక యవ్వనవతి నిండుప్రాణాలు తీశాను. ఆ రక్తం ప్రతీకారం కోరుతోంది.భయంకరమైన కలలు.గుండెనిబ్బరం కలవాణ్ణి కనుక తట్టుకున్నాను. ఈ రహస్యనరకం నా పాపాన్ని ప్రక్షాళనం చేస్తుందేమో? కాని అది కూడా జరగలేదు. పోను పోను పరిస్థితి దుర్భరమయింది.

'నా ఔదార్యం,నా దానధర్మాలు, వీటి కారణంగా సమాజంలో నాకొక స్థానం ఉంది.అందరూ గౌరవం చూపేవారు. వాళ్ళు ఎంత ఎక్కువ గౌరవం చూపితే నాకు అంత దుర్భరంగా ఉండేది. ఆ గౌరవానికి నేను అర్హుణ్ణి కాదని నాకు మాత్రమే తెలుసు. అప్పుడప్పుడూ చచ్చిపోదామనుకునే వాణ్ణి. ఆ ఆలోచనరాగానే, దాని వెంటనే ఇంకో ఆలోచన వచ్చేది. బయటికి వెళ్ళి అందరినీ పిలిచి ' నేనొక హత్య చేశాను' అని చెప్పేస్తే?అప్పుడప్పుడూ కల కూడా వచ్చేది, అలా చెప్పినట్టు. ఈ ఆలోచనలు, రకరకాల రూపాలలో, దాదాపు మూడు సంవత్సరాలు వెంటపడ్డాయి. చివరకు అనుకున్నాను.ఒక్కసారి చేసినపాపం చెప్పేస్తే , ఇక ఆ పై ప్రశాంతంగా ఉండవచ్చు, అని.అనుకోడం సులభమే.కాని నేరం ఒప్పుకోడం? వణికిపోయాను.

' ఈ స్థితిలో, నీ ప్రేమఛాలెంజ్ ఉదంతం. అక్కడ జరిగింది చూశాక, ఒక నిశ్చయానికి వచ్చేశాను', అని ఆగిపోయాడు.

' అంత చిన్న సంఘటన ఇంత పెద్ద నిర్ణయానికి కారణం కాగలుగుతుందా?' అన్నాను.

' నా నిర్ణయం గత మూడు సంవత్సరాలుగా పెరుగుతూ ఉండింది. నీ కథ దానికి ముగింపుమాత్రమే యిచ్చింది.నిన్ను చూసి నన్ను నేను నిందించుకున్నాను. అసూయపడ్డాను'.ఈ మాటలంటున్నపుడు అతడి ముఖంలో చిరుకోపం కనిపించింది.

' కాని, నీవు ఇప్పుడు నిజం చెప్పినా ఎవడూ నమ్మడు. పధ్నాలుగేళ్ళనాటి మాట', అన్నాను.

' నా దగ్గర ఆధారాలున్నాయి.బలమైన ఆధారాలు. అవి చూపిస్తాను', అన్నాడు.

అమాంతంగా లేచి అతణ్ణి ఆలింగనం చేసుకున్నాను.

' ఒక్కటి చెప్పు. ఒక్కటి', అన్నాడు, ఏదో అంతా నా మీదనే ఆధారపడినట్టు. ' అలా చేస్తే నా భార్య , నా పిల్లలు ? నా భార్య కుంగి కుంగి కృశించి చచ్చిపోతుంది.నా పిల్లలు, వాళ్ళ ఆస్తులు అంతస్తు అలాగే ఉంటాయి. కాని, వారు ఒక హంతకుడి బిడ్డలుగా బతకవలసిందే కదా, జీవితమంతా? వాళ్ళ మనసులలో నా గురించి ఎటువంటి ముద్ర వేసిపోతాను?'

నేనేం పలకలేదు.

' వాళ్ళను వదిలేసి వెళ్ళిపోతాను కదా, శాశ్వతంగా.తెలుస్తోందా, శాశ్వతంగా?

నేను నిశ్చలంగా కూర్చుండి మనసులోనే ప్రార్థన చేశాను.భయమేసింది. కూర్చోలేక లేచి నిలబడ్డాను.

'ఏమంటావు? ', అని, నా ముఖంలోకి చూచాడు.

' వెళ్ళు. వెళ్ళి అంతా చెప్పేసెయ్.ఏదీ ఉండిపోదు.నిజమొక్కటే నిలిచిపోయేది.నీ పిల్లలు ఎదుగుతారు.నీ ఔన్నత్యాన్ని అర్థం చేసుకుంటారు', అన్నాను.

ఒక నిశ్చయానికి వచ్చేసాడు. వెళ్ళిపోయాడు.

ఆ తరువాత పదిహేనురోజులు నన్ను కలవడానికి ప్రతిరోజు వచ్చేవాడు. ఆ క్షణాన్ని ఎదిరించడానికి యింకా సిద్ధంగా లేదు. అతని తెగని అంతస్సంఘర్షణ చూస్తే నాకు చాలా బాధ కలిగేది.ఒకరోజు అనే వాడు:' నేను నిశ్చయించుకున్నాను.ఏమైనా సరే చెప్పేస్తాను', అనే వాడు. మర్నాడు:'నాకుతెలుసు, ఆ క్షణంనుండి యిక నాకు స్వర్గమే.పధ్నాలుగేళ్ళుగా యీ నరకం అనుభవిస్తున్నాను.శిక్షను స్వీకరిస్తాను.జీవించడం మొదలుపెడతాను. తప్పుచేసి తప్పుతో ఎంతకాలమైనా బతకొచ్చు.కాని అది బతుకుకాదు. నేను బతకాలి. బహుశా నా పిల్లలు నేనెటువంటి శిక్షననుభవించానో అర్థం చేసుకుంటారు. వాళ్ళు నన్ను నిందించరు.'

నేనన్నాను,' అందరూ అర్థం చేసుకుంటారు. వెంటనే కాకపోయినా, తర్వాత. ఎందుకంటే, నీవు సత్యాన్ని పట్టుకున్నావు, ఈ లోకపుసత్యం కాదు. పై లోకపు సత్యం.' నా మాటతో బరువు దించుకొని ఆ రోజు వెళ్ళిపోయేవాడు. మర్నాడు మళ్ళీ వచ్చేవాడు.ముఖంలో కాంతి ఉండదు. స్వరం వికటం.

' నేను వచ్చినప్పుడల్లా, నీవు నన్ను గుచ్చిగుచ్చి చూస్తావు. ఇంకా వీడు బయటపడడేమి అనుకుంటావు కదూ? ఆగు.నన్ను తేలికచేయొద్దు. అది అనుకున్నంత సులభమేమీ కాదు. అసలు ఎప్పటికీ నేను బయటపెట్టలేకపోవచ్చు...నీవు వెళ్ళి చెప్పవు కదా? చెబుతావా?'

గుచ్చే చూపులు కాదు,అసలు అతడి వైపే చూడలేకపోయాను.నాలో అతడి గురించి ఆందోళన పెరిగిపోతోంది, అతడికి ఏమవుతుందోనని.జాలేస్తోంది. నాకు రాత్రులు నిద్రపట్టడం లేదు.

మళ్ళీ వచ్చాడు మర్నాడు:' ఇప్పుడే యింటినుండి వస్తున్నాను. నా భార్య గడప దగ్గర నిలబడి నా వైపే చూస్తోంది. భార్య చూపు అంటే తెలుసా నీకు? నీకు తెలీదు. పిల్లలు, 'నాన్నా త్వరగా వచ్చెయ్.పిల్లల కథల పుస్తకం వినిపించాలి', అన్నారు.నీకు అర్థమవుతోందా? కాదు.ఈ లోకంలో ఒకడి బాధనుండి మరొకడు ఏమీ నేర్చుకోలేడు.'

అతడి కళ్ళు తడిశాయి. పెదవులు వణుకుతున్నాయి.ఉన్నట్టుండి టేబుల్ మీద బలంగా ఒక గుద్దు గుద్దాడు.టేబుల్ మీది వస్తువులన్నీ పైకెగిరాయి. అతడలా చేయడం అది మొదటిసారి.అతనిది మృదుస్వభావం.పైకెగిరిన వస్తువులు పట్టించుకోకుండా అతడు:

' అసలు అవసరమా? ఏమయింది చెప్పనందువల్ల? నా నేరానికి మరొకడు శిక్ష అనుభవించలేదే? అతడు జ్వరంతో పోయాడు. నా శిక్ష నేను అనుభవించాను ఇన్నాళ్ళుగా.అయినా ఇప్పుడు నేను చేశానని చెప్పినా నా మాట ఎవడు నమ్ముతాడు? నా ఆధారాలు ఎవడు నిజమనుకుంటాడు? అనవసరంగా నా భార్యాపిల్లలకు జీవితాలలో సుఖము శాంతి లేకుండా చేయడం తప్ప ఒరిగేదేముంది? పొరపాటు పని కాదా ? ఏది ఒప్పు ఏది తప్పు? జనం ఏమంటారు? మెచ్చుకుంటారా? నా మంచితనాన్ని గుర్తిస్తారా? నా నిర్ణయాన్ని గౌరవిస్తారా? '

'దేవుడా!' అనుకున్నాను. ఇప్పుడుకూడా ఇతడు ఇతరుల గౌరవం గురించి ఆలోచిస్తున్నాడు.అతన్ని ఆ స్థితిలో చూస్తుంటే జాలివేసింది. అతని బాధను పంచుకోవాలని ఉంది.అతని బాధకు ఉపశమనం కల్గించాలని ఉంది. కాని ఎలా? అతడు తన వశంలో లేడు. అతని దుర్భరమైన అంతస్సంఘర్షణ అర్థమైంది, కొంత అనుభవిస్తున్నాను కూడా.

'నేనేం చెయ్యాలి ? నీవు నిర్ణయించు', అని ఆక్రోశించాడు.

'వెళ్ళు. వెళ్ళి బయట ప్రపంచానికి చెప్పు', అన్నాను, దృఢస్వరంతో కాదు. టేబుల్ మీద ఉన్న పుస్తకాన్ని తీసుకొని, తెరిచి చూపించాను.

24. గోధుమగింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును; అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును

25. తన ప్రాణమును ప్రేమించు వాడు దానిని పోగొట్టుకొనును, ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్యజీవముకొరకు దానిని కాపాడుకొనునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

చదివి, ఒక నవ్వు నవ్వాడు.ఆ నవ్వులో బాధ, అసహనం, ఉపహాసం.

'నిజం.గొప్ప గ్రంథాలు. నా కోసం ఘోరమైన నిజాలు పట్టుకుంటావు ఆ గ్రంథాలన్నీ వెదికి వెదికి. ఈ గ్రంథాలు నా ముఖం మీద కొట్టడం నీకు సులభమే.అవును, ఎవరు రాశారు ఈ గ్రంథాలు ?దేవదూతలు! రాస్తారు.వాళ్ళకు సంసారాలుండవు. వాళ్ళకేం తెలుసు?'

ఈ సారి అతని ముఖంలో నా పట్ల అసహ్యం కూడా కనిపించింది. కుర్చీలోనుంచి లేచాడు.

' మంచిది.వస్తాను.బహుశా మళ్ళీ మన కలయిక పరలోకంలో. పధ్నాలుగు సంవత్సరాల నరకం రేపటితో ముగుస్తుంది', అంటూ వెళ్ళిపోయాడు. అతన్ని ఆలింగనం చేసుకోవాలనిపించింది. కాని ధైర్యం చాలలేదు.

వెళ్ళిపోయాడు. నేను కుర్చీలో కూలబడిపోయాను. మనసులో ప్రార్థన చెప్పుకున్నాను, అతడికి అవసరమైన నిబ్బరం కలగాలని. నా కళ్ళవెంట నీరు కారుతూనే ఉండినాయి. అలానే కూర్చుండిపోయాను. అర్ధరాత్రి అయింది. హఠాత్తుగా తలుపు తెరుచుకుంది. నాకు ఆశ్చర్యం వేసింది.అతడు మళ్ళీ వచ్చాడు.

' ఎక్కడికి వెళ్ళివస్తున్నావు?', అని అడిగాను.

'ఇక్కడేదైనా మర్చిపోయానా నేను? నా కర్చీఫ్?... పోనీ.ఏమీ మర్చిపోలేదేమో?... నేను కొంతసేపు ఇక్కడ ఉంటాను', అన్నాడు.

అతడు కూర్చున్నాడు.నేను అతడి పక్కనే నిలబడ్డాను. 'నీవూ కూర్చో', అన్నాడు. కూర్చున్నాను.రెండు నిమిషాలు నిశ్శబ్దం. నన్ను తదేకంగా చూసి, చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు నాకు బాగా గుర్తు. ఆ తరువాత లేచాడు.నన్ను ఆలింగనం చేసుకున్నాడు.

' జ్ఞాపకం ఉంచుకో.నేను నీ కోసం రెండోసారి వచ్చాను. వింటున్నావా? గుర్తుంచుకో,రెండోసారి', అంటూ వెళ్ళిపోయాడు.

'రేపు',నా మనసులో మెదిలింది.

అవును, ఆ మరుసటి రోజే. అతడు వచ్చివెళ్ళిన సాయంకాలం నాకు తెలీదు ఆ మరుసటి రోజు అతడి పుట్టిన రోజని. అతని పుట్టినరోజు ఎప్పుడూ ఘనంగా జరుగుతుంది.పెద్ద సమావేశం. ఇంచుమించు టౌనంతా హాజరవుతుంది.ఈ రోజు కూడా.రాత్రి విందు ముగిసిన తరువాత అతడు హాలు మధ్యకు వచ్చాడు. చేతిలో ఒక కాగితం .ఆ నాడు తాను చేసిన హత్య గురించి పూర్తి వివరాలున్న ఆ పత్రం, తను పనిచేస్తున్న ప్రభుత్వశాఖ ముఖ్యాధికారికి రాసినది. దాన్ని అక్కడ చేరిన వారందరి మధ్య నిలుచుని చదివి వినిపించాడు.చదవడం ముగించి:

' ఒక రాక్షసుడిలా ప్రవర్తించాను.మనిషికి మానవత్వానికి నన్ను నేను దూరం చేసుకున్నాను.ఇప్పుడు నాకు భగవంతుని ఆదేశం అందింది.నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను. పాపఫలం స్వీకరిస్తాను', అన్నాడు.తరువాత అతడు ఆ హత్య చేసిన రోజు ఆమె యింటినుండి తెచ్చి

యిన్నేళ్ళు భద్రంగా దాచిన వస్తువులన్నీ , తను చేసిన హత్యకు సాక్ష్యాధారాలు అని అతడనుకున్నవి, తెచ్చి అక్కడ బల్లమీద ఉంచాడు––హత్య చేయబడిన స్త్రీ నగలు, ఆమెకు కాబోయే భర్త బొమ్మ ఉన్న ఆమె మెడలో ఉండిన లాకెట్టు, ఒక శిలువ, ఆమె డయరీ,ఆమెకు కాబోయే భర్త త్వరలో వస్తున్నాను అని ఆమెకు రాసిన ఒక ఉత్తరం, దానికి ఆమె రాసిన అసంపూర్ణ ప్రత్యుత్తరం. ఎందుకు ఉంచుకున్నాడు ఆ ఉత్తరాలు? కాదనలేని ఈ సాక్ష్యాధారాలు ఎవడైనా చింపివేయకుండా ఇన్నేళ్ళు ఎందుకు భద్రంగా దాచుకుంటాడు?

అయితే, ఆ తరువాత ఆ రోజు అక్కడ జరిగిందేమిటి? విన్నవారు అవాక్కయినారు. అతడు చెప్పిన కథ ఎవరూ నమ్మలేదు. 'ఈయనకు మతి చలించింది అనుకున్నారు.కాని కథ ఆసక్తికరంగా ఉంది,విన్నారు.కొన్ని రోజులు గడిచాక టౌన్లో అందరు నిర్ధారణ చేసుకున్నారు, అతడికి మతి స్థిమితం తప్పింది అని.న్యాయాధికారులు ఉపేక్షించలేరు కనుక విచారణ చేశారు.కాని ఆ ఆధారాలు బలమైనవి కావని కేసు మూసేశారు. ఆమె నగలు, ఆ ఉత్తరాలు నేరాన్ని ఖచ్చితంగా నిరూపించలేవు. అవి అతడికి ఒక స్నేహితుడికిచ్చినట్లు కానుకలుగానో భద్రపరచమనో యిచ్చి ఉండవచ్చు. కేసు మూసేసిన తరువాత హత్యచేయబడిన స్త్రీ దగ్గరి బంధువులు ఆ నగలు ఆమెవే అని నిస్సందేహంగా గుర్తించారు. ఏమయినా, ఆ వ్యవహారం అంతటితో ముగిసింది.

అయిదు రోజుల తరువాత, టౌన్లో అందరూ అనుకుంటున్నారు, అతడు జబ్బుపడ్డాడని, బతకడని. జబ్బేమిటో తెలీదు. గుండెజబ్బన్నారు. కాని అతడి భార్య అతడి మానసికస్థితిని కూడా పరీక్షించమని అడిగిందట వైద్యుల్ని.అన్ని పరీక్షలు చేసి, చివరకు అది మానసికవ్యాధి అని తేల్చారు. జబ్బేమిటో నాకు తెలిసి ఉంటుందని ఊళ్ళో కొందరు నా దగ్గరకు వచ్చారు. నేనెవరితోను ఏమీ అనలేదు. అతణ్ణి కలవడానికి వెళ్లాను. కాని అతని భార్య నన్ను యింటిలోపలికి రానివ్వలేదు. నేనంటే మండిపడుతోంది.

' నీవల్లే ఆయనకు ఈ జబ్బు. నీవే కారణం. ఏడాదినుంచి మనసు సరిగా లేదాయనకు.వింతగా ప్రవర్తించేవాడు. ఊళ్ళో అందరికీ తెలుసు. నీ ప్రవచనాలు ఆయనను ఈ గతికి తెచ్చాయి. మరీ ఈ నెలరోజులుగా కొంపలో కంటే నీ దగ్గరే ఎక్కువ ఉంటున్నాడు', అన్నది.

ఆమె మాత్రమే కాదు.ఊళ్ళో చాలామంది అదే అనుకుంటున్నారు.'నీవల్లే యిదంతా జరిగింది', అంటున్నారు.

నాకు లోపల సంతోషం. భగవంతుడు అతణ్ణి కరుణించాడు. తనకు దూరమైన బిడ్డ తిరిగి చేరవస్తే తండ్రికి అంతకంటే ఆనందమేముంటుంది? అతడికి మతితప్పిందంటే నేను నమ్మలేదు. నేను ఎట్లాగైనా అతణ్ణి ఒక్కసారి కలవాలనుకున్నాను. అతడు కూడా , ప్రాణం పోయేలోపల నన్నొకసారి చూడాలనుకుంటున్నాడని తెలిసింది. వెళ్ళాను. అతన్ని చూడగానే తెలిసింది, రోజులు కాదు గంటలలో ఉంది అని. బలహీనంగా ఉన్నాడు.ఒళ్ళు పాలిపోయి ఉంది. చేతులు వణుకుతున్నాయి. ఊపిరిపీల్చడం కష్టంగా ఉంది. కాని ముఖంలో కాంతి ప్రశాంతి ఉన్నాయి.

' చేసేశాను' అన్నాడు,నన్ను చూస్తూనే.'నీ కోసం రోజూ ఎదురు చూస్తున్నాను.ఎందుకు రాలేదు యిన్ని రోజులు?'

నన్ను రానివ్వలేదు అని అనలేదు నేను.

అతడన్నాడు:' భగవంతుడికి నామీద దయ కలిగింది.నన్ను తన దగ్గరికి తీసుకుంటున్నాడు.నేను చనిపోతున్నాని తెలుసు.కాని ఎంత కాలం తరువాత మళ్ళీ ప్రశాంతి సంతోషం!నా పని నేను చేశాను. మరుక్షణమే దివ్యలోకం దిగివచ్చింది నాలోకి. ఇప్పుడు నేను నా పిల్లలను ప్రేమించగలను. వాళ్ళను ముద్దుపెట్టుకోగలను.నా భార్య న్యాయమూర్తులు, ఎవ్వరూ ఒక్కరుకూడా నమ్మలేదు నేను హంతకుణ్ణి అని. నా పిల్లలు కూడా ఎప్పటికీ నమ్మరు. అదీ, వారిపై భగవంతుని కృప. నేను చనిపోతాను.కాని నా పిల్లలపై ఎటువంటి మచ్చవదలకుండా పోతున్నాను. స్వర్గంలో ఉన్నట్టుంది నాకు. నా కర్తవ్యం నేను నిర్వర్తించాను.'

అతడికి మాట్లాడడం కష్టంగా ఉంది. ఊపిరి అందడంలేదు. నా చేతిని తన చేతిలోకి తీసుకుని ప్రేమగా ఒత్తాడు. చాలాసేపు మేం మాట్లాడలేదు. అతడి భార్య మాటిమాటికి తొంగి చూస్తున్నది. కాని అవకాశంచూసుకొని,నాతో రహస్యంగా అన్నాడు: ' నీకు జ్ఞాపకం ఉందా? నేను ఆ రాత్రి నీ దగ్గరికి రెండవసారి వచ్చాను.గుర్తుంచుకో అని కూడా అన్నాను. నీకు తెలుసా నేను ఆ రాత్రి రెండవసారి ఎందుకొచ్చానో?....నిన్ను చంపడానికి! '

నేను ఉలిక్కి పడ్డాను.

' ఆ రోజు నీదగ్గరనుంచి వెళ్ళిపోయానా? బయట చీకటి. వీధులవెంట తిరిగాను. నాలో నేను ఘర్షణ పడ్డాను. ఉన్నట్టుండి నీ మీద విపరీతమైన ద్వేషం కలిగింది. భరించలేనంత.: 'ఈవేళ నన్ను కట్టిపడేస్తున్నది అతడొక్కడే. నా విధిని నిర్ణయించే న్యాయనిర్ణేత అయినాడతడు. ఇంత జరిగిన తరువాత, రేపు నలుగురి ఎదుట నా నేరం ఒప్పుకోక తప్పదు. వాడికి అంతా తెలుసు.' అనుకున్నాను. నీవు నా నేరాన్ని బయటపెట్టేస్తావని భయపడలేదు. నాకు ఆ ఆలోచనకూడా రాలేదు. కాని అనుకున్నాను:'నా గురించి యింత తెలిసిన తరువాత నా ముఖం అతనికి ఎలా చూపించను? ముఖం చూడనక్కరలేదు. అతడు దూరంగా ధృవప్రాంతంలో ఉన్నా ఈ ఆలోచన భరించడం దుర్భరం.' నీవే కారణం ఈ దుర్భరవేదనకు అనుకున్నాను. ఈ వేదన అంతం కావాలంటే నిన్ను అంతం చేయాలి. అప్పుడు రెండోసారి వచ్చాను నీ దగ్గరికి. నీ టేబుల్ మీద కత్తి ఉండడం గుర్తు ఉండింది. వచ్చి కూర్చొన్నాను.నిన్నూ కూర్చోమన్నాను. ఒక నిమిషం, నిమిషమంతా ఆలోచించాను. ఆ క్షణంలో నిన్ను చంపి ఉంటే, వెనుకటి హత్యమాట ఎట్లా ఉన్నా, ఈ హత్యతో సర్వనాశనం అయిపోయేవాణ్ణి.కాని ఆ క్షణం అదేమీ ఆలోచించలేదు నేను.కేవలం నీ మీద పగతీర్చుకోవాలన్న ఆలోచనమాత్రమే. భగవంతుడు ఆ క్షణం నా లోపలి దయ్యాన్నుండి నన్ను కాపాడాడు. కాని, తెలుసా? ఆ రోజు నీవు మృత్యువుకు దగ్గరగా ఉన్నంతగా ఎప్పుడూ లేవు.'

ఒక వారం తరువాత అతడు చనిపోయాడు. టౌన్ మొత్తం శవయాత్రలో పాల్గొంది. అక్కడి ముఖ్య పూజారి అతన్ని గురించి ఆర్ద్రంగా మాట్లాడాడు. అందరూ ఆ మాయదారి జబ్బును నిందించారు.ఆయన అకాలమరణానికి సంతాపం చెందారు. ఊళ్ళోని జనమంతా నా మీద చాలా కోపంగా ఉన్నారు, అతని మరణానికి కారణం నేనేనని వారి దృఢభావం. నన్ను చూడడానికి కూడా యిష్టపడడంలేదు. కొందరు మాత్రం అతడు ఆనాడు చెప్పింది నమ్మారు. నమ్మినవారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. నా దగ్గరకు వచ్చేవారు, నిజమేమిటో చెబుతానని.మనిషి పతనం వినడం జనాలకు యిష్టం కదా!నేను పెదవి విప్పలేదు. ఆ తరువాత కొద్ది రోజులలోనే నేను ఆ వూరు వదిలివెళ్ళిపోయాను.

( ఇది Dostoevsky నవల The Brothers Karamazov లోని ఒక భాగం..ఈ భాగం నవలలోని Father Zossima తన డైరీలో తన యవ్వనదశలోని తన అనుభవాన్ని రాసుకున్నది.

ఈ భాగం ఒక స్వతంత్రమైన కథగా నిలుస్తుంది అని నేననుకొంటున్నాను.ఇక్కడ నేను చేసింది ఆ కథకు ఎక్కువ భాగం అనువాదము.కొంత అనుసరణము. కొన్ని చిన్నచిన్న మార్పులు.

ఈ కథకు పేరు నేను పెట్టిందే.ఆంగ్లానువాదంలో ఈ భాగానికి The Mysterious Visitor అని పేరు. ఈ కథలో The second coming ప్రధానాంశం. ' నేను రెండవసారి వచ్చాను.గుర్తుంచుకో', అన్న మాట కథాక్రమంలో కీలకమైన మార్పు,కథార్థంలో కీలకాంశం. అది మనిషి ద్విజన్మను, అవతార పునస్సాక్షాత్కారాన్ని కూడా చెబుతుంది.ఆంగ్లంలో పేరు ఈ రెండు ముఖాలను సూచించగలదు.)

# నడక ఆరి సీతారామయ్య

టీచర్ కవితా స్వరూపాల గురించి పాఠం చెప్తున్నాడు. టకావొ మనసు పాఠం మీద లేదు. కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు. వర్షం పడుతుంది. గాలికూడా ఉధృతంగా ఉంది. ఈ వర్షాకాలానికి ఇదే మొదటి వాన.

హైస్కూలుకు అటువైపున్న 'షింజూకు జాతీయ వనం' వర్షంలో మసకగా కనబడుతోంది. వనం వెనుక ఉన్న పెద్దపెద్ద భవనాలు పెద్ద చెట్లలాగా కనబడుతున్నాయి.

టీచర్ బోర్డు మీద ఒక కవిత రాస్తున్నాడు. ఇదే మంచి సమయం అనుకుని శబ్దం చెయ్యకుండా క్లాసునుంచి బయటకు వచ్చేశాడు టకావొ. పుస్తకాల సంచి భుజాన వేసుకుని వానలో తడుచుకుంటూ రోడ్డు దాటి షింజూకు వనంలోకి పరిగెత్తాడు. అక్కడ ఒక చిన్న కొలనూ, దాని ఒడ్డు మీద అక్కడక్కడా చిన్నచిన్న పందిళ్ళూ ఉన్నాయి. దగ్గరగా ఉన్న పందిట్లోకి పరిగెత్తాడు టకావొ. అతణ్ణి చూసి పందిట్లో ఉన్న బెంచ్ మధ్యలో కూర్చుని ఉన్న యువతి పక్కకు జరిగి అతనికి చోటు చేసింది. టకావొ వాలకం చూసి తన చేతి సంచిలోంచి ఒక టవల్ తీసిచ్చి, "తల తుడుచుకో, లేకపోతే జలుబు చేస్తుంది," అంది. అతను థాంక్స్ చెప్పి, తల తుడుచుకుని, చొక్కా, పాంట్ కూడా టవల్ తో తుడుచుకున్నాడు.

ఇద్దరూ బెంచ్ మీద కూర్చుని కొలను వైపు చూస్తూ ఉండిపోయారు. కొలనులో ఐరిస్లు వానలో తడుస్తూ, గాలికి ఊగుతూ, తడిచికేరింతలు కొడుతున్న పిల్లల్లాగా చూడముచ్చటగా ఉన్నాయి. ఎంతసేపు చూసినా తనివితీరని దృశ్యం. ఇద్దరూ మంత్రముగ్ధుల్లాగా చూస్తూ ఉండి పోయారు.

వాన కొంచెం తగ్గుముఖం పట్టినప్పుడు ఆమె అతనివైపు తిరిగి, "స్కూలు ఎగ్గొట్టొచ్చావా?" అని అడిగింది. తన చొక్కామీద హైస్కూలు పేరు రాసి ఉండటం వల్ల, కొంచెం సిగ్గుపడుతూ, టీచర్ ప్రాచీన సాహిత్యం గురించి చెప్తుంటే తనకు బోర్ కొట్టిందనీ, పైగా ఇది ఈ సీజన్‌కు మొదటివాన కదా, వానలో తడవాలనిపించిందనీ, తనకు వానంటే చాలా ఇష్టం అనీ చెప్పాడు టకావొ.

లంచ్ టైం అవుతుంది కదా, ఆకలి కావడం లేదా అని అడిగి, తన బాగ్ లోంచి రెండు చాక్‌లెట్లు తీసి అతనకిస్తూ, ఆమె కూడా రెండు చాక్‌లెట్లు తీసుకుంది. ఒక బీర్ బాటిల్ కూడా బయటకు తీసింది. "మీకు లంచ్ అంటే చాక్‌లెట్లూ బీరూనా?" అన్నాడు టకావొ, నవ్వుతూ. తన బాగ్ లోంచి లంచ్ బాక్స్ బయటకు తీసి అందులో ఉన్న అన్నం ముద్దలు ఆమెకు ఇవ్వబోయాడు. ఆమె చెయ్యి అడ్డం పెట్టి, "ఫరవాలేదు, నువ్వు తిను," అంది.

తర్వాత ఇద్దరూ చాలాసేపు అక్కడే కూర్చున్నారు కొలనువైపూ, కొలనుచుట్టూ ఉన్న చెట్లవైపూ, దూరంగా కొలనువెనుక ఉన్న భవనాల వైపూ చూస్తూ. కొంచెం సేపటికి వాన ఆగిపోయింది. ఆమె లేచింది. బాగ్ చేతబట్టుకుని వెళ్ళిపోతూ,

*ఉరుము ఉరిమింది*
*మబ్బు పట్టింది*
*వానొస్తుందేమో*
*వస్తే, నాతో ఇక్కడే ఉండిపోతావా?*

అని, సమాధానం ఏంటీ అన్నట్లు చూస్తూ, వెళ్ళిపోయింది.

★

తర్వాత వాన పడిన ప్రతిరోజూ ఆ పందిరికింద ఇద్దరూ కలిశారు. అతను క్లాసులు ఎగ్గొడుతున్నందుకు విచారిస్తూ, "ఏ సబ్జెక్టులంటే ఇష్టం," అని అడిగిందామె. స్కూల్లో ఏదీ ఇష్టం లేదనీ, తనకు అందమైన షూస్ తయారు చెయ్యాలనే కోరిక ఉందనీ, ఇప్పటికే తను ఆ ప్రయత్నంలో ఉన్నాననీ చెప్పాడతను. తల్లిదండ్రులకు అతను షూస్ మీద చూపిస్తున్న మోజు అర్థం కాకుండా ఉందనీ, వాళ్ళు అతనితో సరిగ్గా మాట్లాడటం లేదనీ చెప్పాడు.

బాగా వాన పడుతున్న ఒకరోజు, ఆమె పాదాల కొలతలు తీసుకున్నాడు టకావొ. మంచి షూస్ చేసిపెడతానన్నాడు. రకరకాల షూస్ తయారుచెయ్యడానికి ఉపయోగపడే మంచి టెక్నికల్ మాన్యువల్ ఒకటి కొని, అతనికి బహూకరించింది ఆమె.

జులై చివర్లో స్కూలు సెలవులు మొదలయ్యాయి. వానాకాలం కూడా అయిపోయింది. టకావొ ఒక చిన్న షూ కంపెనీలో పార్ట్ టైం ఉద్యోగం సంపాదించాడు. డబ్బులున్నప్పుడల్లా మెత్తటి చర్మాలూ, కుట్టే పనిముట్లూ కొన్నాడు.

★

సెలవుల తర్వాత మళ్ళా సెప్టెంబర్ మొదటి వారంలో హైస్కూలు తెరిచారు. మొదటి రోజు క్లాసుకు వెళ్తున్న టకావొ ఒక పదిమంది అమ్మాయిలు బిల్డింగ్ ఆవరణలో గుమిగూడి ఉండటం చూశాడు. వారి మధ్య ఆమె నిలబడి ఉంది. అందరి ముఖాలు కాంతి విహీనంగా ఉన్నాయి. పరిగెత్తుకుంటూ అక్కడికెళ్ళాడు టకావొ. "మీరు బాగా చదువుకోండి, ధైర్యంగా ఉండండి, వీలైనప్పుడల్లా మన ప్రాచీన కవిత్వం చదవుతారు కదూ," అంటుంది ఆమె, అందరి దగ్గరా సెలవు తీసుకుంటున్నట్లు. ఆమె అక్కడనుంచి వెళ్ళిపోయింతర్వాత తమతమ క్లాసులకు వెళ్ళిపోతున్న విద్యార్థులను, "ఎవరామె?" అని అడిగాడు.

"యుకారి టీచర్ తెలియదా?" అన్నది ఒకమ్మాయి.

"ఇతనెప్పుడూ వేరే ప్రపంచంలో ఉంటుంటాడులే," అంది మరో అమ్మాయి. నిలబడి మాట్లాడిన వారినుంచి టకావొ తెలుసుకున్న విషయాలు ఇవి: ఆమె పేరు యుకారి, స్కూల్లో జపాన్ సాహిత్యంలో జూనియర్ టీచర్. ఆమె దగ్గర చదువుకుంటున్న ఒక అమ్మాయి బాయ్ ఫ్రండ్ ఆమెను ప్రేమించానంటూ వెంటబడ్డాడు. టీచర్ అతణ్ణి తిరస్కరించింది. దాంతో అతను టీచర్ మంచిది కాదనీ, తనను వల్లో వేసుకోవడానికి ప్రయత్నించిందనీ తన గర్ల్ ఫ్రండ్‌తో చెప్పాడు. ఆ అమ్మాయి క్లాసులో అందరికీ మన టీచర్ ఇలాంటిపనులు చేస్తుందట అని ప్రచారం చేసింది. విషయాలన్నీ తెలుసుకున్న యుకారికి ఏం చెయ్యాలో తోచలేదు. జరిగింది జరిగినట్లు హెడ్ మాస్టర్ కి చెప్తే తన విద్యార్థి మీద చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పాపం, ఆ అమ్మాయికి నిజం తెలియక తన మీద దుష్ప్రచారం చేసింది. నిజం తెలిస్తే అలా చెయ్యదు. ఏం చెయ్యాలో పాలుపోక, యుకారి స్కూలుకురావడం మానేసింది. కొన్నాళ్ళు దూరంగా ఉండి, చివరకు ఈరోజు స్కూలుకు రాజీనామా చేసి వెళ్ళిపోతోంది. ఇవీ అతను తెలుసుకున్న వివరాలు.

టకావొకి ఆశ్చర్యం కలిగింది, కోపం వచ్చింది. తన విషయాలు అన్నీ తెలుసుకున్న ఆమె తన గురించి ఒక్క మాటకుడా చెప్పలేదు. తనకన్నా పెద్దదిలాగా ఉండటంవల్ల, పేరూ, వివరాలు అడగడానికి తను సంకోచించాడు. గౌరవంగా మాట్లాడుతూ, మీరు అన్నాడే గాని ఎప్పుడూ పేరు అడగలేదు. టీచర్‌కు ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వకుండా పొరపాటున ఎప్పుడన్నా మాట్లాడాడేమో కూడా!

★

రెండు రోజుల తర్వాత టకావొ స్కూల్లో ఉండగా గాలివాన మొదలయింది. అతడు స్కూల్లోంచి వనంలోకి తడుచుకుంటూ పరిగెత్తాడు. అక్కడ పందిట్లో ఆమె లేదు. నిరాశ పడుతూ కొలనువైపు చూస్తూ బెంచ్ మీద కూర్చున్నాడు. చాక్లెట్లు తింటూ బీర్ తాగుతూ ఉండేదామె. మనసులో ఉన్న బాధను మర్చిపోవడానికేమో! పాపం. తన స్టూడెంట్‌కి హాని జరక్కూడదని తనమీద పడిన నిందను భరించిందిగాని, పరిష్కార మార్గం ఏంటో తెలియక స్కూలుకు దూరంగా ఉండిపోయింది. ఆమె ఎలాంటి టీచరో తనకు తెలియదు. ఆమె క్లాసు తీసుకుంటే తెలిసేది. మొన్న ఆమె చుట్టూ నిలబడి ఏడుపు ముఖాలేసుకుని ఉన్న స్టూడెంట్సుని బట్టి చూస్తే వారికి ఆమె అంటే ఇష్టం అనిపిస్తుంది. మొదటి సారి వనంలో కలిసినప్పుడు ఒక టాంకా వినిపించి



కౌముది

వెళ్ళిపోయింది. అప్పటికి తనకు అది టాంకా అని తెలియదు. తర్వాత తెలుసుకున్నా ఆమెకు దానితో సంబంధం ఏంటో ఆలోచించలేదు. అలా కవిత్వం వల్లించే వారికి భాష మీద ఎంత ప్రేమ ఉంటుందో!

ఇంతలో గొడుగు వేసుకుని యుకారి టీచర్ వచ్చింది. వర్షం భారీగా పడుతుండటంవల్ల గొడుగు ఉన్నా ఆమె బాగా తడిచిపోయింది. ఇదివరకు ఆమెదగ్గర ఎప్పుడూ ఉండే పిక్నిక్ బాగ్ ఈరోజు లేదు. "నువ్విక్కడ ఉంటావేమోనని బస్సు ఇక్కడ దిగాను. నా ఎపార్ట్మెంట్ ఇక్కడికి దగ్గిరే. వెళ్ళి తల తుడుచుకుని టీ తాగుదాం, వస్తావా?" అని అడిగింది.

★

ఎపార్ట్మెంట్ కి చేరింతర్వాత తల తుడుచుకుని పొడిబట్టలు వేసుకున్నారిద్దరూ. యుకారి టీ చేసింది. టీ తాగుతూ, తను ఆమెకోసం చేసిన స్లిప్పాన్ షూస్ బాగ్ లోంచి తీసి టేబుల్ మీద పెట్టాడు టకావొ. "ఇవి మీకోసం చేశాను, వేసుకుని, సరిగ్గా ఉన్నయ్యో లేదో చూస్తారా? అని అడిగాడు. చూడ్డానికి చాలా అందంగా ఉన్న షూస్ కాళ్ళకు బాగా మెత్తగా అనిపించాయి. "బాగున్నాయి, థాంక్స్," అందామె.

"యుకారి, నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను," అని తొందరగా అనేశాడు టకావొ. అంతలోనే అతడి ముఖం ఎర్రబడింది. గుండె వేగంగా కొట్టుకోవడం మొదలయింది.

"అదేంటీ, యుకారి అన్నావు, యుకారి టీచర్ అనాలిగదా?" అందామె, నవ్వుతూ. అతనికి అప్పటికే చెమటలు పట్టడం మొదలయింది.

"టకావొ, నువ్వెంతో మంచి వాడివి. నాక్కూడా నువ్వంటే చాలా ఇష్టం. పైగా, నీకు తెలియదుగాని, నువ్వు నాకెంతో సహాయం చేశావు. కాని, మనమధ్య ఉంది ప్రేమ కాదు," అందామె.

మరేంటీ? అన్నట్లు చూశాడతను.

"నీకు తెలియక పోవచ్చు, మన ప్రాచీన భాషలో ఇప్పుడు మనం ప్రేమ అని చెప్పుకుంటున్నామే, దాన్ని 'ఒంటరి బాధ' అని అనే వారు. మనుషులకు తమ మనసులో ఉన్న భావాలను చెప్పుకోవడానికి ఎవరో ఒకరు కావాలి. అలా చెప్పుకోలేకపోతే పడే యాతనని ప్రేమ అనే వారు. మనిద్దరం అనుభవించింది ఆ ప్రేమే. నీకు స్కూలుమీద మనసులేదు. నీ వయసులో షూస్ మీద అంత ఆసక్తి ఉండటం అసాధారణం. అందువల్లే నీ తల్లిదండ్రులు నిన్ను అర్థం చేసుకోలేదు. అందరి నడకా అందంగా ఉండాలని నువ్వు ఆశించడం, తగిన, సౌకర్యంగా, అందంగా ఉండే షూస్ తయారుచెయ్యాలనుకోవడం, ఎంత మంచి ఆలొచనో! నీలో ఉన్న కళాభిమానాన్ని నేను గౌరవిస్తున్నాను.

"ఇక నాకు నువ్వెంత సహాయంచేశావో చెప్పడం కష్టం. ఈ పాటికి నీకు తెలిసే ఉంటుంది. నా సమస్యను ఎలా పరిష్కరించాలో తెలియక నేను చాలా మానసిక క్షోభకు గురయ్యాను. నా ఒంటరితనంలో అనుకోకుండా నువ్వు తోటలోకి రావడం, నీతో మాట్లాడే అవకాశం దొరకడం, నాకెంతో ఊరట కలిగించింది. ఇక్కడ ఉద్యోగం మానుకుని తిరిగి మావూరు వెళ్దామనే నిర్ణయం తీసుకోవడం నీతో కలవకపోతే సాధ్యం అయ్యేది కాదేమో. నువ్వెలా నీ ఆశల దిశగా నడిచే ప్రయత్నం చేస్తున్నావో, నేను కూడా నా బాట ఏంటో తెలుసుకుని, ఆ దోవన మళ్ళా నడవడం నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. నువ్విచ్చిన షూస్ నా ప్రయత్నంలో సహకరిస్తాయి. నేను నీకు ఎప్పుడూ రుణపడి ఉంటాను," అందామె.

"కాని, మీరు నన్నెందుకు మోసం చేశారు? మీరు టీచర్ అని నాకెందుకు చెప్పలేదు?" అని అడిగాడతను.

"నువ్వు ఆ స్కూల్లోనే చదువుతున్నావు. నా క్లాస్ తీసుకోలేదు కాబట్టి అదృష్టవశాత్తూ నీకు నేను తెలియదు. కానీ, ఆ స్కూలుతో నా సంబంధం ఏంటో నేను నిర్ణయించుకోలేక సతమతమవుతున్న రోజుల్లో నేను అక్కడ టీచర్ని అని నీకు చెప్పాలనిపించలేదు. అంతే గాని, నిన్ను మోసం చెయ్యాలని కాదు."

ఇంతలో పెద్ద ఉరుము వినబడింది. మళ్ళా వాన ఉధృతం అవుతుందేమో.

టకావొ యుకారిని చుస్తూ,

*ఉరుము ఉరిమింది*

*వాన వచ్చినా రాకపోయినా*

*ఇక్కడే ఉంటాను*

*నీకు తోడుగా*

అన్నాడు. చూడండి, నాక్కూడా కొంచెం కవిత్వం అర్థం అవుతుంది అన్నట్లు చూస్తూ.

"చాలా బాగుంది. అంటే, నువ్వు మన్యూషా గారి కవిత్వం చదివావన్నమాట! నాకు చాలా సంతోషంగా ఉంది. మనం స్నేహితులుగా ఉందాం. నేను మా వూరు వెళ్ళాక అప్పుడప్పుడూ ఉత్తరం రాస్తాను. నువ్వుకూడా రాస్తూ ఉండు. ఎప్పుడో మళ్ళా కలుసుకుందాం. అప్పటి దాకా మనిద్దరం మన ఆశయాల దిశగా నడవడానికి ప్రయత్నం చేద్దాం," అందామె.

అంగీకారం తెలుపుతూ గౌరవసూచకంగా తలవంచాడతను.

*– ప్రముఖ జపాన్ రచయిత మకోతో షింకాయి గారి 'కొతొనొ వ నివా' (మాటల వనం) ఆధారంగా*

# ది అంగుళీయం — డా.జి. సురేశ్‌బాబు

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

**టైమెంతయ్యిందో** చూసుకోవడానికి నా చేయి వంక చూసి, వాచ్ 'కావాలనే' పెట్టుకురాలేదనే విషయం గుర్తొచ్చి నవ్వుకున్నాను. ఈ రోజుల్లో రిస్టు వాచీకి అంత ప్రాధాన్యం వుందో లేదో ఎవరూ సర్వే చేసినట్టు లేరు. ప్రపంచవ్యాప్తంగా సమయసూచిక ఇంటర్‌నెట్ ద్వారా ఇప్పుడు సెల్‌ఫోన్లో చిటికెలో లభ్యం. పైగా టైం కలుపుకోవడంగానీ, బ్యాటరీ మార్చుకోవడంగానీ, కుంజీ ఇవ్వడం లాంటివి గానీ ఇప్పుడు అవసరంలేదు. కానీ మన నరనరాల్లో జీర్ణించుకున్న అలవాటు రిస్టువాచీ వంక చూసుకోవడం మానం. రిస్టువాచీకి వున్న ఇంకో ప్రత్యేకత ఏంటంటే వందరూపాయల కన్నా తక్కువరేటు నుండి కోటికన్నా ఎక్కువ రేటు వరకు లభించడం ధరలో ఇంత వ్యత్యాసపు రేంజ్ వున్న వస్తువు ఇంకోటి లేదంటే అది అతిశయోక్తికాదు. నా విషయానికొస్తే నేనిప్పుడు అమెరికా నుండి తెచ్చుకోవాలనుకునే వాచి ధర కట్టలేనిది.

నా అమెరికా ప్రయాణానికి ముఖ్యోద్దేశం ఆ 'వాచీ'నే.

నాకు వీసా ఇంటర్వ్యూ చేసిన అధికారికి మాత్రం అబద్ధం చెప్పాను. కాన్ఫరెన్స్ అటెండ్ చెయ్యాలని. "నీ వార్షిక ఆదాయమ ఎంత?" వీసా అధికారి ప్రశ్న.

"దాదాపు పదిలక్షలు" చెప్పాను.

"ఎంత టాక్స్ కడతావు?"

"ఒక లక్ష"

"నీ వృత్తి?"

"మెడిసిన్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు బయో కెమిస్ట్రీ బోధించే అసిస్టెంట్ ప్రొఫెసర్‌ని"

"ఆర్గానిక్ కాంపౌండ్‌కి, ఇనార్గానిక్ కాంపౌండ్‌కి ఏంటి తేడా?"

ఈ ప్రశ్నకి నేను ఖంగు తిన్నాను అమెరికా వీసా ఇంటర్వ్యూలో ఇట్లాంటి 'సబ్జెక్టు' పరమైన ప్రశ్నలడుగుతారని నాకు తెలియదు. అతను నా వృత్తిని కన్‌ఫర్మ్ చేసుకోవడానికి అడుగుతున్నాడని అర్థమయ్యింది. అతని ముందున్న కంప్యూటర్ స్క్రీన్ మీద సమాధానం చదువుకుని నావంక చూసాడు ఆన్సర్ చెప్పమన్నట్టు. నాకు తోచిన సమాధానం చెప్పాను. "సర్, మీరు ప్రొఫెసర్ అంటున్నారు. కార్బన్ వుంటా ఆర్గానిక్, లేకపోతే ఇనార్గానిక్ కాంపౌండ్ అని కూడా తెలియదా?" అంటూ తల అడ్డంగా వూపాడతను.

నా గుండె డక్కమంది. ఎక్కడ వీసా రిజెక్ట్ చేసిపారేస్తాడోనని. ఆ ప్రశ్న అతను అసంకల్పితంగా సెలెక్ట్ చేసుకున్నాడు. వికీపీడియా మొదటి లైన్లు చదివి నన్ను అట్లా అనగలిగాడు కానీ, మొత్తం తెలిస్తే అతనికి నా సమాధానం సరేననిపించేది. అంతెందుకు? మనం శ్వాసలో వదిలే కార్బన్ డయాక్సైడ్‌లో కార్బన్ ఉన్నప్పటికీ అది ఆర్గానిక్ కాంపౌండ్ కాదని అతనికి తెలిసినట్టులేదు. "సో, డాక్టర్! ఇంతకీ మీరు అమెరికాకి ఒంటరిగా ఎందుకు వెళదామనుకుంటున్నారు?"

"అట్లాంటాలో జరిగే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ అటెండ్ చెయ్యాలని"

"ఒకే, హాప్పీ జర్నీ డాక్" అంటూ నవ్వి, నా పాస్‌పోర్ట్ దగ్గర పెట్టేసుకున్నాడు. దానర్థం నాకు అమెరికా సందర్శనార్థం పదేళ్ళవరకు వీసా జారీ చేసేశాడని. అమెరికా ప్రయాణంలో అత్యంత కీలక ఘట్టం - ఈ వీసా ప్రహసనమే. ఎందుకంటే ఒక్కోసారి వీసా ఎందుకు రిజెక్ట్ చేస్తారో ఎవ్వరికీ అర్థం కాదు. నాకంటే ముందు లైన్లో వున్న అమ్మాయికి అన్ని అర్హతలున్నా పాస్‌పోర్ట్ తిరిగిచ్చేసాడు.

ఫేస్‌బుక్ మెసెంజర్‌లో నా క్లాస్‌మేట్ "బృంద"కి మెసేజ్ పెట్టాను. వీసా మంజూర్ అయ్యిందని. శుభాకాంక్షలు తెలిపి సుస్వాగతం అని పెట్టింది. బృంద ఎనిమిదేళ్ళ క్రితం నా యం.బి.బియస్ క్లాస్‌మేట్. అమెరికా సంబంధం చేసుకుని 'డల్లాస్' నగరం వెళ్ళింది. కాన్సర్ వైద్య నిపుణురాలుగా బాగా సంపాదించి మొదటి భర్తతో విడాకులు తీసుకుని ఇంకో డివోర్సీని పెళ్ళిచేసుకుని 'బోస్టన్' నగరంలో సెటిలయ్యింది. చదువుకునే రోజుల్లో మేమిద్దరం పెద్దగా మాట్లాడుకున్నదైతే లేదు కానీ, ఫేస్‌బుక్ పుణ్యమా అని మేం మళ్ళీ టచ్‌లోకి వచ్చాం. నా పోస్ట్‌లన్నింటికి తను లైక్స్ కొట్టి కామెంట్స్ చేసేది. తన డైవర్స్ సమయంలో నేనిచ్చిన నైతిక స్థైర్యం తనకు బాగా హెల్ప్ అయ్యిందని కూడా చెప్పింది. అట్లా అట్లా మేమిద్దరం మానసికంగా దగ్గరయ్యాం. "సోల్‌మేట్స్"గా తయారయ్యాం. మనసులు విప్పి మాట్లాడుకున్నాం, అన్ని రకాల విషయాలు షేర్ చేసుకున్నాం. నా అమెరికా యాత్రా ప్రణాళికలో బృందని కలుసుకోవడం, తనతో నయాగరా జలపాతం దర్శించడం కోసం రెండు రోజులు కేటాయించాను. ఆమె కూడా సరేనంది. బృందతో గడపబోయే ఆ మధురమైన క్షణాల్ని ఊహించుకుంటూ అమెరికాలో అడుగు పెట్టాను.

అట్లాంటాలో ఓ హోటల్లో దిగి ఆ కాన్ఫరెన్స్ అటెండ్ అయ్యాను. ప్రపంచ వ్యాప్తంగా వివిధ నగరాల నుండి వచ్చిన సైంటిస్టులతో ఆ కాన్ఫరెన్స్ కళకళలాడుతోంది. ప్రభుత్వాల్ని, రాజకీయ నాయకుల్ని గుప్పిట్లో పెట్టుకుని తమకు కావాల్సిన విధంగా పాలసీలు మార్పించే కార్పోరేట్ సంస్థలు తమతమ స్టాళ్ళలో తమ ఉత్పత్తుల్ని (వ్యాధి నిర్ధారణకు సంబంధించిన టెస్ట్ సామాగ్రి) ప్రదర్శిస్తున్నాయి. వైద్యరంగంలో శాస్త్ర పరిశోధన ఎప్పుడో ఆయా కార్పోరేట్ సంస్థల గంపల కింద దూరిపోయింది. వాళ్ళ అవసరాల

మేరకు వైద్యం శాస్త్రమే మార్చబడుతోంది. ఉదాహరణకు, వ్యాధి నిర్ధారణలో బ్లడ్ షుగర్‌ని, కొలెస్ట్రాల్ని, విటమిన్లని హెచ్చు తగ్గుదల సంఖ్యల్ని కొద్దిగా మార్చి ఆరోగ్యవంతుల్ని కూడా భయపెట్టవచ్చు. సంబంధిత మందుల్ని కొనిపించవచ్చు. అవసరం లేకపోయినా 'డి' విటమిన్ మందులు మింగేవారు, కొలెస్ట్రాల్ పెరిగిందని గుండె టెస్టులు చేయించుకోవడానికి డయాగ్నొస్టిక్ సెంటర్లకు పరుగుపెట్టేవారు, శరీరంలో వచ్చే ప్రతి చిన్నా చితక మార్పుకు షుగర్ బూచే కారణమని మందులు డోసు పెంచేవారు మనకు ప్రత్యక్ష సాక్ష్యాలు. అందుకే ఎవరికి వారు మాది గొప్ప అంటే మాది గొప్ప అని ప్రకటించుకున్నట్టుగా అనిపించే సైంటిస్టుల ఉపన్యాసాలు - మార్కెటింగ్ విన్యాసాల్లాగా తోచి బోరు కొట్టిస్తాయి.

నా కొలీగ్ వాళ్ళ బంధువొకాయన అట్లాంటాలో వుంటాడు, పేరు రాము. నేను వచ్చిన విషయం ముందే తెలిసుండటం వల్ల నా హోటల్ కొచ్చి లగేజ్ సర్ది రూం ఖాళీ చేయించి నన్ను వాళ్ళింటికి పట్టుకెళ్ళాడు. చాలా మర్యాద, అభిమానం చూపించాడు. చక్కని భోజనం పెట్టి నా నాలిక కొస ప్రాణాల్ని రక్షించాడు. "థాంక్స్ రాముగారు, మీవల్ల నాకు అమెరికాలో మన తెలుగు వాళ్ళింట్లో భోంచేసే అదృష్టం దక్కింది" అన్నాను ఇండియానుండి తెచ్చిన స్వీట్స్, హెన్నా పాకెట్ వాళ్ళావిడ కిస్తూ. రాము వెంటనే ఏం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు. తన ఇల్లంతా తిప్పి తిప్పి చూపించాడు. మొత్తం చెక్కపలకలతో ఆధునిక టెక్నాలజీ డిజైన్లతో నిర్మించిన ఇల్లది. సెల్లార్‌లో వున్న హోమ్‌థియేటర్‌కి తీసుకెళ్ళి "ఇండియాలో అయితే బాత్రూంలో ఏడ్చేవాడిని. ఇక్కడ అప్పుడప్పుడు వచ్చి ఏడవటానికి బాగుంటుంది. సినిమాలు చూస్తూ లేదా ఇల్లు గుర్తుకొచ్చినప్పుడల్లా!" అంటూ నా వైపు చూసాడు.

హోం సిక్‌నెస్? కాలేజీకి వెళ్ళే పిల్లలు వున్నా ఇంకా స్కూల్ పిల్లాడిలా తల్లిదండ్రుల మీద మనసు పీకుటకు కారణంబేమి?

ఇంటిముందు చిన్నగార్డెన్, కార్ గ్యారేజ్, ఇంటి వెనకాతల పెద్ద గార్డెన్ ఉన్నాయి. రెండు కుందేలు పిల్లలు, రెండు జింకలు అక్కడ చెంగు చెంగుమంటూ గంతులేస్తూ తిరగడం నాకు ఉల్లాసం కలిగించింది. రాము వాళ్ళావిడ టీ ఇచ్చి నా ఎదురుగా కూర్చుంది.

"రాముగారు ఎంత హేపీగా ఉందండి మీ లైఫ్, ఈ పచ్చదనం ప్రశాంతత, పరిశుభ్రత పొల్యూషన్ లేని గాలి ఈ డిసిప్లిన్ జీవితం.. డాలర్లు" టీ చప్పరిస్తూ అన్నాను.

ఔనన్నట్టు తలుపాడు.

"మీరింత ప్రయోజకులైనందుకు మీ అమ్మా నాన్నా వచ్చి చూసి బాగా సంతోషించి ఉంటారు కదూ?" మళ్ళీ అన్నాను.

ఆ దంపతులిద్దరూ మొహాలు చూసుకున్నారు.

"డాక్టర్, మేం అమెరికా వచ్చేసి పదేళ్ళు. ప్రతి రెండేళ్ళకోసారి ఇండియా వెళ్ళొస్తున్నాం. ప్రతిసారీ పేరెంట్స్‌ని అడుగుతాం రమ్మని. వచ్చేసారి వస్తాం అంటారు. ఇద్దరు పిల్లలు పుట్టారు. రెండిళ్ళు, రెండు పడవల్లాంటి కార్లు బోలెడన్ని డాలర్లు సంపాయించాం ఏం లాభం? ఫోన్ చేసినప్పుడల్లా మమ్మల్నిక్కడ వంటరిగా వదిలి పరాయిదేశం పారిపోయారు అన్నట్లు మాట్లాడతారు. వృద్ధాప్యంలో తమని చూసే దిక్కూ మొక్కూ లేదని వాపోతారు. ఇక్కడికి వచ్చేయండి సంపాయించింది చాల్లే అంటారు. డబ్బులు అమ్మా నాన్నకే కాక, చుట్టాలకి కూడా పంపిస్తాం. వాళ్ళైతే ఇంకా ఘోరం. తమ పిల్లలకి అమెరికా వీసాకి స్పాన్సర్ చెయ్యడం దగ్గర్నుంచి వాళ్ళు ఇక్కడికొచ్చి చదివి సెటిల్ అయ్యేదాకా మాదే పూర్తి బాధ్యత అన్నట్టు ప్రవర్తిస్తారు. మా పేరెంట్స్ వంతపాడతారు ఎందుకంటే వీళ్ళకు వాళ్ళే కదా కేర్ టేకర్స్" చెప్తుండగా ఆ దంపతులిద్దరి మొఖాలు మాడిపొయ్యాయి.

అంతా విని అర్థమయ్యి తల గోక్కున్నాను. ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్రపట్టలేదు. ఉదయం ఐదింటికి లేచి చూస్తే గిన్నెల చప్పుడు డిష్ వాషర్ గిన్నెలు సర్దుతూ రాముగారు. వాషింగ్ మెషిన్ దగ్గర వాళ్ళావిడ.

"కాఫీ కలపనా?" అడిగాడు రాము తన చేతుల్ని లుంగీకి తుడుచుకుంటూ.

"బోస్టన్‌లో ఎవర్ని కలవడానికి వెళ్తున్నావ్?" నన్ను ఎయిర్‌పోర్ట్‌లో డ్రాప్ చేస్తూ అడిగాడు రాము. బృంద పేరు చెప్పాను. "అంత క్లోజ్ ఫ్రెండా? తను?"

"అబ్బే అంత లేదు.. మా నాన్న చాలాకాలం అక్కడ పని చేసారు. ఒక ఇల్లు కూడా వుంది మాకక్కడ. రెంట్ కిచ్చాం. నా 'కజిన్' శేఖర్ అన్నయ్య చూసుకుంటాడు. తను న్యూయార్క్‌లో జాబ్ చేస్తూ న్యూజెర్సీలో ఉంటాడు."

"ఓహ్హో నాన్న జ్ఞాపకాలన్నమాట"

"ఔను."

ఇంతలో నా సెల్ రింగయ్యింది. బృంద కాల్ చేసింది. బయల్దేరావా అని. బోర్డింగ్ పాస్ తీసుకుని రాముని హత్తుకుని వీడ్కోలు చెప్పాను. "మళ్ళీ ఎప్పుడొచ్చినా మా ఇంటికి రావాలి. మనం ఆత్మీయులం" అన్నాడాయన.

"సర్, మీ పేరెంట్స్‌ని బాగా మిస్సవుతున్నారు కదూ? వాళ్ళమీద పీకల్దాకా కోపం ఆవేశం ఆక్రోశం ఉన్నాయి కదూ?" అడిగా.

"పక్కరోజు పరిచయానికే నిన్ను మిస్ ఔతున్నట్టనిపిస్తోంది, పేరెంట్స్ అంటావా, శత్రువులాగా దూరం పెడ్తున్నారు నన్ను" దుఃఖం పొంగిపొర్లిందతనికి.

"సర్ ఏదేమైనా, పేరెంట్స్ ఈ భూమ్మీద ఉన్నంతవరకే. వాళ్ళు చచ్చిపొయ్యాక ఆ వెలితిని ఎవ్వరూ పూరించలేరు. అందుకే వాళ్ళ మీద కోపం వద్దు సారీ, మీకంటే చిన్నవాడినైనా మీకెందుకు చెప్తున్నానంటే ఆ దుఃఖం ఎట్లాంటిదో నాకెరుక కాబట్టి. ఎవరి పేరెంట్సయినా అంత కంటే గొప్పగా ఏముంటారు?" చెప్పాను.

ఆయన తిరిగి చూడకుండా వెళ్ళి తన ప్రపంచంలో కలిసిపోయాడు. నేను నా ట్రాలీబ్యాగ్ తోసుకుంటూ విమానం వైపెళ్ళాను.

బృంద నన్ను బోస్టన్ ఎయిర్ పోర్ట్‌లో రిసీవ్ చేసుకుంది. ఆమె రూపం చెక్కు చెదరలేదు, నా కాలేజి ప్రపంచం కళ్ళముందు కదలాడింది. ఆమె తన కార్లో ఇంటికి తీసుకెళ్ళింది. ఇంద్రభవనం మరిపించే ఇల్లు. "నువ్వు క్యాన్సర్ స్పెషలిస్ట్ వైతే మీ ఆయన బ్యాంక్ రాబరీలు చేస్తుంటాడా?" జోక్ వేశాను.

ఆమె గలగలా నవ్వింది. బృందకు మొదటి వివాహం ద్వారా ఒక కూతురుంది. హాస్టల్లో వుంటుంది. బృంద భర్త సమయానికి ఫారిన్ టూర్ వెళ్ళాడు. వావ్, నా జన్మకి ఇంతకంటే మంచి ఛాన్స్ వస్తుందా?

ఇద్దరం భోంచేస్తుంటే డేటింగ్ చేస్తున్న అనుభూతికి లోనయ్యాను. థాంక్స్ గాడ్, అండ్ మై డాడ్! తన పడవ కార్లో నన్ను వాళ్ళ హాస్పిటల్‌కి తీసుకెళ్ళి చూపించింది. అటునుంచి నాన్న ఇంటి అడ్రస్ జి.పి.యస్‌లో ఫీడ్ చేసి అక్కడికి తీసుకెళ్ళింది. చాలా చిన్న ఇల్లు. కాలింగ్ బెల్ కొట్టగానే ఒక ముసలావిడ తలుపు తీసింది. మా నాన్న పేరు చెప్పి శేఖర్ తమ్ముడినని పరిచయం చేసుకున్నాను. ఆవిడకి నా ఇంగ్లీష్ యాస అర్థం కాలేదు. బృంద వెంటనే నేను ఎందుకొచ్చానో చెప్పగానే ఆవిడ నవ్వి లోపలికి రమ్మంది. ఆమె నాన్న పనిచేసే కంపెనీలోనే పని చేస్తుండేదట. నన్ను అచ్చం మీ నాన్నలాగే ఉన్నావని నా మొఖం నిమిరింది. ఇల్లంతా కలియ తిరిగి చూసాను. ఆ సోఫాలు, కుర్చీ, నాన్న వాడిన బాత్‌రూం, ఆయన పడుకున్న మంచం అన్నీ ముట్టుకుని ఆ స్పర్శను నా జ్ఞాపకాల పెట్టెలో భద్రం చేసుకున్నాను. బృంద నన్ను కుర్చీలో కూర్చోపెట్టి ఫోటోలు తీసి అప్పటికప్పుడు ఫేస్‌బుక్‌లో పెట్టింది. "సురేష్ నువ్వు ఏడుస్తున్నావ్ తెలుస్తోందా?" అంది బృంద తన కర్చీఫ్ ఇస్తూ. మేం మళ్ళీ కారెక్కాం. బృంద నా చెయ్యి తన చేతిలోకి తీసుకుని కాసేపు అట్లాగే పట్టుకుంది. ఒక గంటకు నా మనసు నా స్వాధీనంలోకొచ్చింది. బృంద మా ఇతర క్లాస్‌మేట్లతో "ఫేస్‌చాట్" చేయించింది.

రాత్రి పది. ఆ ఘడియ రానే వచ్చింది. "హే, రేపు నాకు నయాగరా చూపిస్తానన్నావ్ గుర్తుందా?" అడిగాను ఆమెకి దగ్గరగా జరుగుతూ.

"యస్, బట్... సురేష్ సారీ" అంటూ మౌనముద్ర దాల్చింది.

నా మనసు చివుక్కుమంది. తను నా కళ్ళలోకి చూడలేకపోతోంది. కాసేపయ్యాక "ఐయాం ప్రెగ్నెంట్ సురేష్ నేను దూరప్రయాణాలు చెయ్యకూడదు. నాక్కూడా నిన్ననే కన్ఫర్మ్ అయ్యింది. నయాగరాకు నీకు ఒక్కడికి ఫ్లయిట్ టికెట్ బుక్ చేసుంచాను, టేకిట్" అంది బృంద. టికెట్ మీద బుక్ చేసిన డేట్ వారం క్రితంది. అంటే తాను ముందుగానే నిర్ణయించుకుంది నాతో తిరగొద్దని. ఇదేదో ముందు చెప్పొచ్చుగా?

"ముందే చెప్పొచ్చు. బట్ నువ్వు అసలే సెన్సిటివ్. మీ నాన్న ఇల్లు చూట్టానికి బోస్టన్‌కి కూడా రావేమోనని" అంది బృంద.

నేను హతూశుడ్నయ్యాను. ఎంత తొండి? నేనొప్పుకోను, చీటింగ్ చీటింగ్.

"గుడ్‌నైట్ సురేష్. రేపొద్దున ఫ్లైట్.. ఇక పడుకో" అంటూ తన బెడ్ రూమ్‌వైపు వెళ్ళిపోయింది. నేనా టికెట్‌ని చింపేసాను. 'అంతర్జాతీయ సోల్‌మేట్స్ సంఘం అధ్యక్షా! ఇది న్యాయమా? ' అని ప్రశ్నిస్తున్నాను.

***

"డియర్ సోల్‌మేట్ రియల్లీ సారీ. నిన్ను డిజప్పాయింట్ చేశాను. కానీ అదే కరెక్ట్. క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌లో ఏం చేస్తామో తెల్సుగా? మొగ్గ దశలోనే తుంచేస్తాం. అప్పుడే క్యూర్ అయ్యే చాన్స్ ఉంటుంది. ఒక సాధారణ కణజాలం అనవసర అవాంఛిత రీతిలో పెరిగి మిగిలిన కణజాలాన్ని మింగేయడమే క్యాన్సర్. మన మధ్య స్నేహంలో క్యాన్సర్ - ఈ డేటింగ్ కాంక్ష. అర్థం చేసుకో. ఇంతకంటే నేనెక్కువ చెప్పాల్సిన పన్లేదనుకుంట."

బృంద పెట్టిన మెసేజ్ చదువుతూ న్యూయార్క్ సిటీలో కాలు మోపాను. "ముందిది చెప్పు, సోల్‌మేట్సా? సౌల్‌మేట్సా? ఎట్లా పలకాలి? మన బంధాన్ని?" రిప్లై పెట్టాను ... జవాబు రాలేదు.

ఒక హోటల్లో దిగి ప్రయాణ బడలిక సడలినాక సబ్వే రైలెక్కి 'మన్‌హట్టన్" అనే రద్దీ ప్రాంతానికి వెళ్ళి 'టైమ్స్ స్క్వేర్' అనే చౌరస్తాలో అటూ ఇటూ తిరుగుతూ అమెరికాలో ఉన్నానన్న ఆ ఆనందాన్ని అనుభవించాను. శేఖర్‌ను కలవాలి. రేపు ఆ ప్రోగాం. అయితే నేను తను కలుసుకునే చోటు ఒకటుంది. మేమిద్దరం ఫలానా టైంకి కలవాలని ముందే మెసేజ్ పెట్టుకున్నాం. నయాగరా జలపాతం చూడలేకపోయాననే బాధతోపాటు ఇంకో ఆలోచన నన్ను పీడిస్తోంది. నేను మా ఆవిడ్ని మోసం చేయకుండా బృంద డీసెంట్‌గా వ్యవహరించినా బృందే నన్ను మోసం చేసిందని పదే పదే అనిపించింది.

***

ట్విన్ టవర్స్, వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఇప్పుడు "9/11మెమోరియల్."

చతురస్రాకారపు జలపాతం, ఆ నీళ్ళు చేసే హోరు, చుట్టూ పార్కు చెట్లు సిమెంటు బెంచీలు అసలే ఆ రోజు సెప్టెంబర్ 11 కావడంతో, టెర్రరిజం పేరిట బలైన అమాయకుల పేర్లు చెక్కి వున్న ఆ గ్రానైటు గోడమీద గులాబీలు, కింద క్యాండిల్స్ వెలుగుతూ ఆ ప్రాంతాన్ని దేదీప్యమానంగా ప్రకాశింపచేస్తున్నాయి. "ఈశ్వర్" అనే పేరు పక్కన నేను వెళ్ళి గులాబీని పెట్టేసరికే అక్కడ ఆల్రెడీ ఒక గులాబీ ఉంది. నాకు తెలుసు శేఖర్ వచ్చి నాకోసం వేచి చూస్తున్నాడని. నేను వెళ్ళి ఒక బెంచి మీద కూర్చుని చుట్టూ చూసాను. గాలి బలంగా వీస్తోంది. వర్షం వచ్చేలాగావుంది. నా జుట్టంతా రేగి అస్తవ్యస్తంగా తయారైంది. ఉన్నట్టుండి నా భుజం మీద ఒక చేయి ఇంకో చేయి నా రేగి వున్న జుట్టును సరిచేస్తూ. వెనక్కి తిరిగి చూశాను. శేఖర్ మై 'హాఫ్ బ్రదర్.. హలో, మై బ్రదర్.'

తడి కళ్ళతోనే పలకరించుకున్నాం ఇద్దరం. తను నా పక్కనే నన్నానుకుని కూర్చున్నాడు. మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం. సడెన్‌గా ఒక పావురం వచ్చి మా ముందు వాలింది. మా వంకే చూస్తోంది. "హే, డాడ్" అన్నాం ఇద్దరం ఒకేసారి. మొహాలు చూసుకుని నవ్వుకున్నాం. మా కళ్ళ మధ్య ఒక సన్నటిపొర. అది పొరకాదు తెర. మా ఇద్దరి గతం ఆ తెరమీద సినిమా రీలులా దొర్లుతుంది.

మీద మీద పడి తన్నుకోవాల్సిన అన్నదమ్ములం ఇట్లా మిత్రుల్లాగా మిగిలిపోయాం. శేఖర్ మా నాన్నకు మొదటి భార్య సావిత్రి సంతానం. శేఖర్ పుట్టగానే ఆవిడ కన్నుమూసింది. శేఖర్ ఆలనా పాలనా కోసం కోసం నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడు. రామ సీతమ్మని. రామ సీతమ్మ సమిష్టి కుటుంబలో పెరిగిన ఒక పల్లెటూరు పిల్ల. బోస్టన్‌లో బిక్కుబిక్కుమంటూ ఐదేళ్ళు కాపురం చేశాక నేను కడుపులో పడ్డాను. అదే అవకాశంగా అమ్మ ఇండియాకి పరుగు పరుగున వచ్చేసింది శేఖర్‌తో. నాకు రెండేళ్ళు వచ్చాక కూడా అమ్మ అమెరికాకు రానంటే రానని భీష్మించుకు కూర్చుంది.

దిక్కుతోచని నాన్న అమెరికాలో ఉద్యోగం మానేసి వచ్చెయ్యలేక అక్కడ ఒంటరిగా ఉండలేక శేఖర్‌ని తనతో తీసుకుని వెళ్ళి తన దగ్గర పెంచుకున్నాడు. ప్రతి రెండేళ్ళకోసారి మా దగ్గరికి వచ్చి వెళ్ళేవాడు. శేఖర్‌తో మాత్రం కాదు. రానాను రాక పోకలు తగ్గిపోయినా డబ్బు మాత్రం పుష్కలంగా పంపించేవాడు. కాలచక్రం గిరున తిరిగి పోయింది. శేఖర్‌కు మా అమ్మంటే పిచ్చి ప్రేమ. మొదట్లో ఉత్తరాలు రాసేవాడు. ఫేస్‌బుక్ వచ్చాక ఫోటోలు ఛాటింగులు చేస్తున్నాడు. ఈమధ్య అవికూడా తగ్గించాడు. నువ్వు ఇండియా వచ్చి నన్ను చూసెళ్ళు అని అమ్మ అంటే లేదు లేదు నువ్వే నా దగ్గరికి వచ్చి కొద్దిరోజులన్నా ఉండెళ్ళు అని శేఖర్. ఈ ఇద్దరు తల్లీ కొడుకుల మధ్యన మధ్యవర్తిత్వం చేయలేక నాకు విసుగొచ్చేది. ఇద్దర్నీ ఒప్పించలేకపొయ్యాను. శేఖర్ ఇంకా పెళ్ళిచేసుకోలేదు. ఏమంటే అమ్మ బాధ్యత కదా అది అని అమ్మకు లింకు పెట్టేవాడు. అతనికన్నా ఐదేళ్ళు చిన్న అయిన నాకు పెళ్ళయ్యి ఒక బాబుకూడా. అమ్మకు ఏదో గిల్టీ ఫీలింగ్ మొదలైంది. దీర్ఘాలోచన పరధ్యానంలో గడుపుతోంది. నాన్నకు భార్యగా, శేఖర్‌కు అమ్మగా రెండు రకాలుగా ద్రోహం చేసాననే అపరాధ భావనతో కుమిలి పోవడం తప్ప యేం చెయ్యాలో తెలీక గమ్మునుండి పోతోంది.

శేఖర్ చిటికె వేయడంతో నేనీలోకంలోకి వచ్చాను. 'ఆ' రిస్ట్ వాచీ శేఖర్ చిటికేసిన చేతికి వేలాడుతూ నన్ను వెక్కిరిస్తోంది. నాన్న ఒక ప్రముఖ ఇంటర్నేషనల్ బ్రాండెడ్ వాచీల కంపెనీలో చీఫ్ మేనేజర్‌గా పనిచేసేవాడు. తానెంతో ఇష్టపడి ఆ వాచిని డిజైన్ చేయించుకున్నాడు. పోయిన ఏడాది శేఖర్ ఆ వాచ్ క్లోజ్‌అప్ పిక్ ఒకటి నాకు వాట్సప్‌లో పెట్టి దాని విశిష్టత మీద క్విజ్ పెట్టాడు. నేను కొంతవరకు చెప్పగలిగాను. తర్వాత అమ్మ అడిగితే మొత్తం చెప్పేశాడు. అంకెల స్థానంలో తెలుగక్షరాలు ఒకటి స్థానంలో 'ఒ' రెండు బదులు 'రె' ఇట్లా తొమ్మిది వరకు. పది బదులు "సా" అంటే సావిత్రి; పదకొండుకు 'ఈ" అంటే ఈశ్వర్; పన్నెండు స్థానంలో "రాం" అంటే రామసీతమ్మ "సా ఈ రాం" నాన్న ఇష్టదైవం. ఇక గడియారం పెద్దముల్లు మీద "శేఖర్" అని, చిన్న ముల్లు మీద నా పేరు చెక్కించాడు. సెప్టెంబర్ 11, 2001 రోజున మాత్రం, దైవవశాత్తూ, (ఆయన ట్విన్‌టవర్స్‌లో మంటల్లో కాలిచనిపోయిన ఆ ఉదయం) హడావిడిలో దాన్ని పెట్టుకోవడం ఎన్నడూ లేని విధంగా మర్చిపోయాడు. నాన్న గుర్తుగా మిగిలిన అమూల్యమైన వస్తువు ఏదైనా ఉందంటే అది ఆ ప్రత్యేకమైన చేతి గడియారమే. దాన్ని నాకిమ్మని శేఖర్‌తో చాలాసార్లు పోట్లాడాను, ఫేస్ బుక్ ఛాటింగ్‌లో ఇచ్చే ప్రసక్తే లేదని ఖచ్చితంగా కీ బోర్డు గుద్ది చెప్పేసాడు.

నేను, భుజానికి వేలాడుతున్న నా బాగ్‌లోంచి సీసా బైటకి తీసి శేఖర్ చేతిలో పెట్టాను. బెల్లంతో చేసిన మినపసున్నుండలవి. శేఖర్‌కి అమ్మ చేస్తే చాలా ఇష్టం. ఒక లడ్డు తీసి సగం తుంచి నానోట్లో పెట్టాడు. మిగతా సగం తమ నోట్లో వేసుకుని చప్పరించాడు. ఇద్దరం తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నాం.

మూడురోజులు మేమిద్దరం క్షణకాలం వేస్ట్ చేయకుండా బలాదూర్‌గా తిరిగాం. తర్వాత రోజు శేఖర్ న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో నన్ను డ్రాప్ చేసి మనసార కౌగిలించుకున్నాడు. రక్తసంబంధం అంటే ఏంటో ఆ క్షణంలో నాకు అర్థమయ్యింది. నేను వెక్కి వెక్కి ఏడ్చాను. "అట్లా ఏడవకు రా, నాక్కూడా వచ్చేయాలని వుందిరా!" సముదాయించబోతూ తనూ కన్నీళ్ళు కార్చాడు.

"అమ్మ మరీ మరీ చెప్పింది. నిన్ను వెంట తీసుకురమ్మని. నిజంరా"

"ఔనా! ఈజిట్? నా మీద అంత ప్రేమ ఉందా అమ్మకి?" వ్యంగ్యంగా అన్నాడు.

"నిన్ను అన్నేళ్ళు పెంచింది కదరా! ఆ మాత్రం ఉండదా? ఆమెకు మైండ్ సెట్ అట్లా వుంది. నాన్నే మార్చలేకపోయాడు. మనవల్ల అవుతుందా? చెప్పు? "

"మరి నాకు వీసా ఎందుకిచ్చింది రా? నాన్నతో పంపించెయ్యడానికి..ఆ? నిన్ను మాత్రం తనతో ఉంచుకుని నన్ను వెళ్ళగొట్టింది అమ్మతనం రుచి చూపించి నన్ను ఈ అమెరికా పాలు చేసిందిరా అమ్మ. నువ్వు మాత్రం అమ్మ చంక దిగకుండా పెరిగావ్.." అంటూ నా చెంప పగలగొట్టాడు. నా ఛాతిపైన పిడిగుద్దులు గుద్దాడు. శేఖర్ దుఃఖంలో నాకు నయాగరా జలపాతం కనిపించింది. ఆజలపాతం ఇంతకంటే గొప్పదా? "నాకొద్దారా అమ్మ? నీ కేనా?" అంటూ నేలమీద కూలబడ్డాడు. నేను కూడా తన ఎదురుగా కూర్చుండిపోయాను. నాన్న నన్ను వదిలి అమెరికా వెళ్ళేటప్పుడు చూసిన చూపులు ఇప్పుడు శేఖర్ కళ్ళలో కనబడ్తున్నై. చూపులు ఏనుగుల్ని మోస్తున్నట్టు భారంగా వున్నాయి.

ఉన్నట్టుండి తన చేతికున్న వాచ్ తీసి నా చెయ్యిలాగి ముద్దాడి వాచ్ తొడిగాడు. నాకు తెలుసు, ఇట్లా తప్పకుండా జరుగుతుందని "పో ఇచ్చేశా పో.. అమ్మ ఎట్లాగూ నీదే ఇప్పుడు నాన్నకూడా నీకే" అని ఒక్క క్షణం నా మొఖం నిమిరి వేగంగా వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోతున్నాడు.

నా లగేజ్ ట్రాలీ తొయ్యడానికి నా చేతులు వణుకుతున్నై.

ఇండియా వచ్చేశాను. స్నానానికి వెళ్ళి వస్తున్నప్పుడు అమ్మ, ఆ రిస్టు వాచీని గుండెలకత్తుకుని మౌనంగా రోదించడం నేను చూసాను. నా వంక అమ్మ దీనంగా చూస్తూ "రేయ్, నేను కొన్నాళ్ళు శేఖర్ దగ్గర వుండాలి వీసా వేయించరా" అడిగింది. అంత కమ్మని మాట అమ్మ నోట కాక ఇంకెక్కడ్నుంచి వినగలం? వెంటనే ఆ శుభవార్త శేఖర్‌కి చేరిపోయింది. ఓహో, దేశాలూ సముద్రాలూ దాటి నేను చేసిన ఘనకార్యం ఇదన్నమాట.

# విజయం

దర్భా లక్ష్మీ అన్నపూర్ణ

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

**ఓరగా వేసి** వున్న తలుపు తెరుచుకుని లోపలికి వచ్చిన విశ్వనాథంగారు నిస్త్రాణగా పడక్కుర్చీలో వాలిపోయారు.

తలుపు శబ్దం, పడక్కుర్చీ కిర్రుమన్న శబ్దం విన్న ప్రభావతి భర్త రాకని గమనించి మంచినీళ్ళ గ్లాసుతో వంటింట్లోంచి ముందుగదిలోకి వచ్చింది.

పడక్కుర్చీలో ఆయన తలవాల్చిన తీరు ఆవిడకేదో భిన్నమైన విషయాన్ని చెబుతున్నట్టుగా అనిపించింది. ఆ నిస్త్రాణ కేవలం శారీరకశ్రమ కాదు అన్న విషయం మాత్రం ఆవిడకి అర్థం అవుతూ వుంది.

"ఏం జరిగిందండి అలా ఉన్నారు?" మంచినీళ్ళ గ్లాసు ఆయన చేతికి అందిస్తూ మెత్తగా అడిగింది ప్రభావతి.

"ఎలా వున్నాను? నడిచి వచ్చానుగా అలసిపోయానంతే" భార్య వదనం వైపు సాలోచనగా చూస్తూ గ్లాసు అందుకున్నారు విశ్వనాథంగారు. ఆ చూసే విధానంలో ఏదో విషయం ఉండనే వుంది అని ఆవిడకి అర్థం అయింది. ఆ విషయం ఏమిటో కూడా ఆవిడ చూచాయగా ఊహించగలిగింది. యిది క్రొత్త విషయం ఏం కాదు.

ఆ విషయాన్ని మనస్సుకి తీసుకోవటంలోనే ఒక్కోసారి ఒక్కో విధంగా ఒక్కో సాంద్రతలో వుంటుంది. దారిలో ఎక్కడో ఏ రోడ్డుమీదనో పినతల్లి కనిపించి ఉంటుంది. అది కూడా తనదికాని ఏ పరాయి యింటి అరుగుమీదనో కూర్చుండిపోయో, పడుకుండిపోయో కనిపించి ఉంటుంది.

అందుకనే ఈయన వదనంలో అంతటి బాధాకర ఛాయలు అనుకుంది ఆవిడ. చూస్తూ ఊరులోలేరే మనకెందుకుట? ఎక్కడ చతికిలబడితే మనకేవిటి అనుకునేందుకు ఆవిడ పరాయి మనిషేం కాదయ్యో! స్వయానా తన తల్లికి చెల్లెలు. చిన్నప్పుడు అమ్మమ్మగారింటికి వెళ్ళినపుడు ఎంతగానో ముద్దుచేసిన, తమని ఎంత మురిపంగానో చూసిన పినతల్లి.

ఒక మనిషి ఆలోచనా విధానం సరయిన మార్గంలో లేకపోతే అది ఆ వ్యక్తితో సంబంధం ఉన్న వాళ్ళందర్నీ ఎంతగా యిబ్బంది పెట్టి, పరిస్థితుల్ని ఎంతగా అతలాకుతలం చేస్తుందో తన పరిస్థితి చూస్తే తెరచిన పుస్తకంలా అర్థం అవుతుందని అనుకుంటారెప్పుడూ విశ్వనాథంగారు.

నలుగురు స్నేహితులతో కలిసినడుస్తున్నప్పుడు ఫలానా చోట కూర్చోవచ్చా, లేక కూర్చో కూడదో అన్న కనీస యింగితం కూడా లేనట్టుగా ఆవిడ దర్శనం యిస్తూ ఉంటే - "అదిగో అక్కడ కూర్చున్న ఆ పెద్దావిడ మీ పినతల్లే కదూ!" అని ఎవరైనా అంటే ఎంత యిబ్బందిగా, తలవంపులుగా ఉంటుందని? ఏమనీ జవాబు చెప్పలేని అధ్వానమైన పరిస్థితి.

పక్కనున్న వాళ్ళు ఆవిడ మీ పినతల్లికదా అని ప్రశ్నించటంలో అర్థం వేరు. అక్కడ కూర్చుందేవిటి అనాథలా? నువ్వుండే ఏం చేస్తున్నావ్ అని ఆ ప్రశ్నకి అర్థం. తను ఏమని సమాధానం చెప్పగలడు? ఆవిడని భరించటంలో వున్న సాధకబాధకాలని ఎవరికి వివరించి చెప్పగలడు?

నిజానికి ఆ సమాధానం ఆ ప్రశ్నంత చిన్నదికాదు. జవాబు విస్తీర్ణం చాలా వుంది. ఈ ప్రపంచంలో ఒక విడ్డూరం వుంది.

ఎదుటివాళ్ళని వేలెత్తి చూపించటంలో, తప్పు పట్టటంలో చాలా ఆసక్తినీ, శ్రద్ధనీ కనబరుస్తారు చాలామంది. యించుమించుగా ప్రతివాళ్ళూను. యిలాంటి పరిస్థితే కనుక వాళ్ళదాకా వస్తే వాళ్ళెలా ప్రవర్తిస్తారు అన్న ఆలోచన ఒక్క క్షణం పాటయినా చెయ్యరు. అపర ధర్మాత్ముల్లా ప్రశ్నలు సంధించి ఆరాలు తీసి ఆ మాత్రం చెయ్యకపోతే యింకెందుకు? నువ్వసలు మనిషివేనా అన్నట్టుగా చూపు బాణాలు సంధించేస్తారు.

అటువంటప్పుడే అనిపిస్తుంది 'అబ్బ అసలు ఈ మనుష్యులన్న వాళ్ళని పట్టించుకోకుండా ఉంటే జీవితం ఎంత హాయిగా ఉంటుంద'ని. కానీ మనిషి సంఘజీవి అనుకున్నా ఆడుకున్నా నలుగురితో కలిసి మనగలగటం తప్పనిసరి.

అసలు విషయం ఒకటేననిపిస్తుంది - మనిషి సహజంగా దయార్ద్రహృదయుడు. ఎదుటివాడి కష్టం చూస్తుంటే మనస్సు నీరయిపోతుంది.

ఎదుటివాడి కష్టం తీర్చాలంటే కరిగిపోయే మనస్సు ఒకటే సరిపోదు - అందుకు తగిన శక్తిసామర్థ్యాలు కావాలి.

ప్రేమ సాంద్రత పెరిగే కొద్దీ, ఆ శక్తి సామర్థ్యాలు పెరుగుతాయ్ - అది వేరే విషయం. పినతల్లి రోడ్డుమీద అస్తవ్యస్తంగా కనిపించటం అన్నది కొత్త విషయం కాదు. యివ్వాళ ఏదో జరిగింది.

"మిమ్మల్ని చూస్తుంటే ఏదో జరిగింది అనిపిస్తోంది అదేదో చెప్పకూడదూ!" ప్రభావతి మళ్ళీ రెట్టించింది.

చెప్పలేక చెప్పలేక చెబుతున్నట్టుగా, ఓ విధమైన న్యూనతాభావంతో కళ్ళని క్రిందకి దించుకుంటూ అన్నారాయన "ఏం వుంది పిన్నిని దూరం నుంచే చూసి వెంటనే దారి మళ్ళించుకుని వేరే రోడ్డులోంచి వచ్చేశాను. నే చేసిన పని నాకే సిగ్గుగా అనిపిస్తోంది. అంతే" ఆయన గొంతులో కాస్తంత విసుగు, అంతకుమించిన నిస్సహాయత ధ్వనించాయి.

కాస్సేపయ్యాక అంది ఆవిడ కూర్చున్న చోటునుంచి లేస్తూ "మన మంచితనం రాణించాలంటే అవతలివాళ్ళకి కూడా కాస్తంత సంస్కారం వుండాలండీ. మీ పిన్ని విషయంలో మనం బాధపడవలసింది ఏం లేదు. ఆవిడ జీవితం ప్రశాంతంగా, స్థిమితంగా గడవటానికి కావలసిన ఏర్పాట్లు మనం చేద్దాం అనుకున్నాం. చేస్తాం అని ఆవిడకి వివరించి చెప్పాం కూడా. మీరు చెప్పిన మాట నేను వినను. నామాటే మీరు వినాలి. నేను చెప్పినట్టే మీరు చెయ్యాలీ అని ఆవిడ భీష్మించుక్కూర్చుంటే మనం మాత్రం ఏం చెయ్యగలమని?"

"ఎవరు ఏమన్నారన్నది వేరే విషయం అసలు పని, ఆవిడని ఆదుకోవటం అన్నది జరగటంలేదు కదా!" తనలో తనే అనుకుంటున్నట్టుగా అన్నారాయన.

'ఆవిడకి సుఖపడే యోగం లేనప్పుడు మనం మాత్రం ఏం చెయ్యగలం. ప్రతివాళ్ళకీ వాళ్ళకంటూ ఒక తలరాత ఉంటుంది. దానిని బట్టే ఆ బుద్ధి కూడా పనిచేస్తుంది" యిక యిందులో మాట్లాడుకోవలసింది ఏం లేదు అన్నట్టుగా తేల్చేసి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది ప్రభావతి.

భార్య చెప్పిందీ సబబుగానే అనిపించింది విశ్వనాధంగారికి.

యిది యివ్వాళ్టి సమస్యకాదు. తను రిటైరయి రెండు సంవత్సరాలు దాటుతోంది.

అష్టకష్టాలూ పడి తల్లిని కడతేర్చి అది దుఃఖమో, ప్రశాంతతో తెలియని ఒక చిత్రమైన స్థితిలో సేద తీరుతున్న వేళ పినతల్లి ఆరోగ్యం దిగజారటం మొదల్యింది. ఆమె ఏకాకి. భర్త, పిల్లలు లేరు.

మళ్ళీ నిస్త్రాణగా పడక్కుర్చీలో చేరగిలబడిన విశ్వనాధంగారికి ఆలోచనలు గతంలోకి మళ్ళాయి.

విశ్వనాధంగారు యింకో సంవత్సరంలో రిటైరవుతారనగా ఆయన తల్లికి అల్జీమర్స్ అనే జ్ఞాపకశక్తిని కోల్పోయే వ్యాధి సోకిందని నిర్ధారణ అయింది. దాంతో ఆయన ఆయన అన్నదమ్ములూ కలిసి తల్లిని చూసుకోవటంలో చాలా అవస్థపడవలసి వచ్చింది.

ఎక్కడపడితే అక్కడ మలమూత్ర విసర్జలు చేసెయ్యటం, అదీ యిదీ అన్న భేదం లేకుండా ప్రతిదీ నోట్లో పెట్టుకోవటం, రాత్రుళ్ళు సరిగ్గా నిద్రపోకపోవడంలాంటి సమస్యలవల్ల అనుక్షణం ఆవిడని కనిపెట్టుకుని కళ్ళల్లో పెట్టుకుని కాపాడుకోవలసిన పరిస్థితి

వచ్చింది. పెద్దవాళ్ళ స్వభావాన్ని తప్పుపట్టటం సబబు కాకపోయినా ఆ స్వభావంలోని కొన్ని విపరీత ధోరణులవల్ల వచ్చే యిబ్బందుల్ని తట్టుకోవటం పెద్ద వయస్సులోకి అడుగుపెడుతున్న కొడుకు, కోడళ్ళకి కూడా ఒక్కోసారి యిబ్బందిగానే పరిణమిస్తుంది.

విశ్వనాధంగారి తల్లి విషయంలో అదే జరిగింది.

ఆవిడది ఏ విషయంలోనూ రాజీపడని మనస్తత్వం. తన హక్కుల గురించే ఆవిడ ఎప్పుడూ విశ్లేషిస్తూ వాటిని కాపాడుకోవటానికే ఆవిడ తాపత్రయపడుతూ, అలా తాపత్రయపడటంలో ఒక్కోసారి యింట్లో పరిస్థితుల్ని అతలాకుతలం చేసేసేది.

తల్లి హక్కుల్ని కాపాడాలని, ఆవిడ జీవితాన్ని సుఖవంతం చెయ్యాలని విశ్వనాధమూ, ప్రభావతి కూడా తాపత్రయపడుతూనే ఉండేవారు.

తనవల్ల పక్కమనిషి ఆనందంగా జీవించగలిగితే తృప్తిపడే, గర్వపడే మనస్తత్వమే ప్రభావతిది. కానీ ఆ బాధ్యత భారం శక్తికి మించింది కాకూడదు.

కానీ ఒక్కోసారి అన్నీ అనుకున్నవి అనుకున్నట్టుగా జరిగిపోవు ఎవరికయినా. అటువంటి సందర్భాలు జీవితంలో చిన్నవాళ్ళకయినా వస్తాయి, పెద్దవాళ్ళకయినా వస్తాయి.

అటువంటప్పుడు కొంతమంది అన్నిటికీ కారణం చిన్నవాళ్ళేనన్న నిర్ధారణకి వచ్చేస్తారు.

పిల్లల దగ్గర జీవించే పెద్దవాళ్ళు ఒక విధమైన అభద్రతాభావంతో బాధపడుతూ చిన్న చిన్న తప్పిదాలని కూడా ఒక్కోసారి భూతద్దంలోంచి చూస్తూ తాము బాధపడుతూ ఎదుటివాళ్ళని కూడా బాధపెడతారు.

చిన్నవాళ్ళకి మంచిగా ఉండటం అనే విషయంలో కూడా కొన్ని పరిధులు ఉంటాయ్. శక్తి యింత అనే పాయింటుకూడా ఉంటుంది. ఒక్కోసారి యింతకన్నా ఎక్కువ మంచిగా ఉందాం అన్న కోరిక, సదుద్దేశ్యం ఉన్నాకూడా అలా ఉండలేక పోతున్నారు చిన్నవాళ్ళు.

ఏది ఏమయినా అది ఒక సంక్లిష్టమైన అనుబంధమే.

ఒకరిలో యింకొకరు మంచినే వెతుక్కోవటానికి ప్రయత్నిస్తే మాత్రం అది ఈ సృష్టికే అలంకారప్రాయం అవుతుంది.

విశ్వనాధంగారూ, ప్రభావతి అందుకే తరచుగా అనుకుంటూ ఉంటారు. "ఫలానావాళ్ళ అబ్బాయి మంచివాడు కాదు. తల్లిదండ్రుల్ని సరిగ్గా చూసుకోడు" అని ఎవరయినా అంటే ఆ మాటకి వంతపాడకూడదని అలా అనటం చాలా సులభం. దానిలో ఉన్న కష్టనష్టాలలోతు ఆ బాధ్యతని భరిస్తున్నవాళ్ళకే అర్థం అవుతుంది.

ఒక్కోసారి మంచిగానే ఉండాలన్న కోరిక ఎంతబలంగా ఉన్నా అది శక్తికి మించిన పనవుతుంది.

అప్పుడప్పుడు తల్లి "నువ్వూ, ప్రభావతీ నన్ను చక్కగా చూసుకుంటున్నారా" అన్నప్పుడు మాత్రం ధన్యమైపోయినట్టుగా అనిపించేది. "నన్ను ఏడిపించుకుని తింటున్నారు" అని నిందించినపుడు క్షోభిస్తున్న హృదయంతో మౌనం వహించేవారు.

మా సంఘర్షణలోనే ఆవిడ జీవితం నుంచి నిష్క్రమించింది.

యిప్పుడు యించుమించుగా అక్కగారి మనస్తత్వాన్నే పుణికిపుచ్చుకున్న విశ్వనాధంగారి పినతల్లి ఆయన జీవితంలోకి ప్రవేశించింది.

అసలు చెప్పాలంటే అక్కగారికన్నా రెండాకులు ఎక్కువే చదివింది అని చెప్పాలి. ఆవిడ తలబిరుసు మనస్తత్వమే ఆవిడకి భర్తనుంచి విడాకులు యిప్పించింది. ఒంట్లో శక్తివున్నంతవరకూ ఒంటరిగానే జీవించింది. ఆవిడకి అన్నదమ్ముల సహాయంతో చిన్న ఉద్యోగం దొరకటంతో ఆర్థికంగా జీవితం బాగానే గడిచిపోయింది జయమ్మకి.

ఆవిడకి ఒంట్లో శక్తివున్నప్పుడు అప్పుడప్పుడు అత్తగారిని చూసుకోవటంలో విశ్వనాథం దంపతులకి సహాయపడిన మాట వాస్తవం. జయమ్మ రిటైరైయ్యాక కూడా ఒంట్లో ఓపిక ఉన్నన్నాళ్ళూ ఒంటరిగానే వుంది. అలా ఉంటున్నప్పుడు మధ్య మధ్యలో విశ్వనాథంగారి యింటికి వచ్చి వారంరోజులు ఉండి వెళ్ళిపోతూనే ఉండేది.

విశ్వనాథంగారి తమ్ముళ్ళిద్దరూ వేరే ఊళ్ళలో ఉద్యోగాల్లో ఉండటంతో జయమ్మ బాధ్యత పూర్తిగా విశ్వనాథగారిమీదే పడింది.

ఆవిడ అన్నదమ్ములు వయస్సు పైబడ్డవాళ్ళు కావడంతో వాళ్ళు జయమ్మ బాధ్యత తీసుకోలేదని అనుకోవటంలో కూడా అర్థం లేదని భావించారు విశ్వనాథంగారు.

జయమ్మ బాత్‌రూములో పడి కాలు విరిగినప్పుడు హాస్పిటల్‌లో చేర్పించి వైద్యం చేయించాడు. డిశ్చార్జి అయ్యాక తెచ్చి యింట్లో పెట్టుకున్నాడు.

అటువంటి సందర్భంలోనే మంచితనం, సానుభూతి అనేవి ఎందుకూ పనికిరాకుండా ఎలాపోతాయో, అటువంటప్పుడు బాధ్యత తీసుకున్న వాళ్ళని ఎంతటి నిరుత్సాహం కమ్మేస్తుందో అనుభవంలోకి వచ్చింది.

ప్రభావతి చేసే ప్రతిపనినీ తప్పు పట్టింది. అన్నం వడ్డిస్తే ఆ వడ్డించటంలో ఆప్యాయత లేదనీ, ఎప్పుడు బయటికి పంపించేద్దామా అని చూస్తున్నానని అభియోగం మోపేది.

"యిది నా కొడుకు యిల్లు, నువ్వే బయటనుంచి వచ్చినదానివి, పరాయిదానివి" అనేది. ఆ మాటకి ప్రభావతి తనలో తనే చిన్నగా నవ్వుకునేది.

కాఫీ ఒకరోజు పల్చగా ఉందనీ, ఒకరోజు నల్లగా ఉందనీ, యింకోరోజు చక్కెర ఎక్కువయిందనీ - ఇలా ఏదో ఒక విషయం మీద తగువుపెట్టుకోవటానికి ప్రయత్నించేది.

ఎదుటి మనిషి దేవతలు అగుపించాలంటే ముందు మనం దేవతల్లా ఉండాలన్న సత్యం జయమ్మలాంటి మనుష్యులు ఊహకయినా అందని సత్యం.

"దూరంగా ఉన్నన్నాళ్ళూ మంచిదానివిగా ఉండేదానివి - దగ్గరకి వచ్చేటప్పటికి నీ అసలు రంగు బయటపడింది" అని తూలనాడేది.

విశ్వనాథంగారు పినతల్లి ప్రవర్తనకి విస్తుపోయి చూసేవారు మినహా ఏం చెయ్యలేకపోయేవారు. ఏ చిన్న మంచిమాట చెబుదామని ప్రయత్నించినా "పెళ్ళాన్ని వెనకేసుకొస్తున్నావా? నువ్వు చిన్నపిల్లాడుగా ఉన్నప్పుడు నేను చేసిన ముద్దంతా మర్చిపోయావా?" అని గదమాయించేది.

"ఏవిటీ అక్కరకు రాని హక్కు.. అర్థంలేని వాచలత్వం" అనిపించింది.

ఒకరోజు నిజంగానే విసుక్కుంది ప్రభావతి "అబ్బ.. ఎన్నాళ్ళీ చాకిరీ! అత్తగారికంటే తప్పదు. మీక్కూడా ఎందుకు చెయ్యాలి? నాకు ఓపిక లేదు"

మంచితనానికి విసుగు వుంటుంది. దానికి ఎదుటివాళ్ళు ఆసరాకూడా కావాలి. అది తెలుసుకోలేకపోయింది జయమ్మ.

"నాకు ఎవరూలేరు కనుక ఒంటరిదాన్ని కనక" జయమ్మ కొట్టినట్టు సమాధానం చెప్పింది.

"ఒంటరివాళ్ళయితే కాస్తంత ఒదిగి ఉండటం నేర్చుకోండి"

"పెద్దదాన్ని పట్టుకుని అంతమాటంటావా? ఒదిగి ఉండవలసిన ఖర్మ నాకేం పట్టలేదు. నా బాధ్యత మీకు తప్పదు."

"తప్పదనే కదా యింటికి తెచ్చిపెట్టుకున్నాం. మా కష్టసుఖాల్నీ, బాదర బందీల్ని కూడా మీరు కాస్త పట్టించుకోవాలిగా."

"ఏవిటే మీ కష్టసుఖాలు. నన్ను చూడ్డమే కదా నీ కష్టం."

పినతల్లి వాదన, మొండితనం విశ్వనాధంగారికి విసుగ్గా అనిపించేవి. అయినా ఏం చెయ్యలేని ఆశక్తత. భార్య విసుగుచెందడంలో తప్పులేదనిపించేది.

చిన్నగా అక్కడక్కడ తెలిసో, తెలియకో పొరపాట్లు జరిగితే సర్దుకుపోయేతత్వం ఆవిడలో కనిపించేదికాదు. నేనంటే మీకు కించిత్తయినా అభిమానంలేదని పోట్లాడేది.

వీళ్ళు తనని మనసారా ప్రేమించాలి అని ఆవిడ పడే తపన, ఆందోళన ఒక్కోసారి విశ్వనాధంగారికి చాలా స్పష్టంగా అర్థం అయిపోతూ వుండేవి. అలాంటప్పుడు ఆయనకి అప్రయత్నంగా కళ్ళు చెమర్చేవి.

నిజమేకావచ్చేమో కానీ ఆ సత్యాన్ని గ్రహించి పినతల్లి అంతగా బాధపడటం, ప్రస్తుతం దొరుకుతున్న ఆదరణని ఆస్వాదించలేకపోవటం సరికాదనిపించింది. ఆవిడ కాస్తంత ఓర్పుతో, వాస్తవిక ధోరణితో వ్యవహరిస్తే అందరూ ప్రశాంతంగా జీవించగలుగుతారు అనుకుని బాధపడేవారు విశ్వనాధంగారు.

ఎంతోకొంత మంచి చూపించినా తృప్తి చెందని పిన్నత్తగారి తీరు ప్రభావతిలో అసహనాన్ని రగల్చిచింది. యిక తను చెడ్డగా ఉండటం తప్పనిసరేమో అన్న భావం ఆవిడలో క్రమంగా కలగసాగింది.

"అబ్బబ్బ మీ పిన్నిని భరించటం యిక నావల్లకాదు బాబూ! ఆరోగ్యం బాగానే కుదుటపడిందిగా యిక ఆవిడ రూమ్‌కి వెళ్ళమనండి. ఏదయినా తగని తప్పని అవసరం అంటూ వస్తే చూకోక తప్పదు కదా!" ప్రభావతి భర్తమీద ఒత్తిడి తీసుకురాసాగింది.

యింట్లో ఈ చికాకునీ, అసౌకర్యాన్నీ భరించలేని విశ్వనాధంగారు పినతల్లికి యిక నీ రూమ్‌కి వెళ్ళిపో అన్న సూచనని యిచ్చారు.

ఆవిడ అంతకంటే పౌరుషంగా, విసవిసా వెళ్ళిపోయింది.

ప్రభావతి తన మదిలో మెదిలిన ఒక చిత్రమైన ఆలోచనని మాత్రం గ్రహించింది. "హమ్మయ్య ఆవిడ చెడ్డది, నోటి దురుసు మనిషి అవటం వల్ల సరిపోయింది. ఏ శంఖాభావం, పశ్చాత్తాపపడవలసిన అవసరం లేకుండా బయటికి పంపించగలిగాం. లేకపోతే ఈ బాధ్యతనీ, బరువునీ దించుకోవటం తనలాంటి మామూలు మంచివాళ్ళకి సాధ్యంకాదు. "

ఆవిడ దెబ్బలాడుతున్నప్పుడు విసుగు చెందిందిగానీ ఆవిడ పరోక్షంగా తనకి ఉపకారమే చేసిందన్నమాట.

ప్రభావతి తన మనస్సుని తనే విసుక్కుంది యిక చాలులే నీ పోకడలని.

యిదే తరహా ఆలోచనతో విశ్వనాధంగారూ ఉలిక్కిపడ్డారని ఆవిడకు తెలియదు. తమలోని ఈ భావాన్ని పినతల్లి హృదయం పసిగట్టి ఉండవచ్చు. అందుకేనేమో ఆవిడలో ఆ బాధ.

ఆ బాధని తీర్చటం అన్నది తమవల్ల అయ్యేపనేనా? సమస్యంతా అసలు అక్కడ్నుంచే పుడుతోందా? విశ్వనాధంగారు ఆలోచనలో పడ్డారు. ఒకవేళ అదే నిజమయితే యిక ఈ సమస్యకి పరిష్కారం దొరుకుతుందా?

యిన్నాళ్ళు పిన్ని రాక్షసి... కాస్తంత మార్పు ఆవిడలో వస్తే ఆవిడ జీవితమూ బావుంటుంది - తనకీ, ప్రభావతికీ తలనొప్పి అన్నది లేకుండా ఉంటుంది అనుకున్నాడు. పినతల్లి ఆలోచనా ధోరణిలో మార్పురావాలని ఎన్ని రకాలుగానో హితబోధలు చేశాడు.

యిప్పుడు తన ఆలోచన ఏవిటి యిలా మలుపు తిరిగిందని మధనపడసాగారు విశ్వనాధంగారు. 'నువ్వు నా తల్లికి చెల్లెలివి మాత్రమే. నా తల్లివికాదు. నీ హద్దుల్లో నువ్వుండాలి.' అన్నట్టు ఉన్నాయేమో తనమాటలు. అవును మరి ఆలోచన అదే అయినపుడు మాట అలాగే వస్తుందిగా!

'నీ తల్లికి చెల్లెల్నయినా నాకు ఎవరూ లేరు కనుక నువ్వే నా కొడుకువి' అనుకుంటోంది ఆవిడ.

విశ్వనాథగారు ఒక్కసారిగా తలవిదిల్చారు. ఆ ఆలోచనలోంచి బయటికి రావాలి అన్నట్లుగా పినతల్లి ఆశకి కూడా అంతు అంటూ ఉండాలి. తప్పంతా ఆవిడదే అన్నట్టుగా ఆలోచనలకి ఒక ముగింపు పలికి ఆయన సేద తీరారు ఆ క్షణంలో. కానీ అసలు సమస్యంతా ఆ తర్వాతే మొదలయింది.

జయమ్మ ఆరోగ్యం కొద్దికొద్దిగా క్షీణించటం మొదలుపెట్టింది. దూరంగా వున్న తమ్ముళ్ళిద్దరితో సంప్రదించి "నీ తిండికీ, వైద్యానికీ కావలసిన ఏర్పాటులన్నీ నేను చేస్తాను. క్రిష్ణా, రామా అనుకుంటూ కూర్చో నీకామాత్రం ఓపిక ఉంది. నాకు తెలుసు"

ఆవిడ ఆమాట వినలేదు "నీ యింట్లో నీతో పాటే ఉంటాను" అని గొడవ చెయ్యటం మొదలు పెట్టింది. నాలుగు రోజులకోసారి యింటికొచ్చి కూర్చుని యిదే విషయం మీద గొడవ.

"సరే.. ఒకరోజు పడుకుని వెళ్ళు" అన్చెప్పి ఉంచుకుంటే పడుకున్న గది, వరండా అంతా ఉచ్చలమయం చేసేసింది.

దాంతో ప్రభావతి శారెత్తిపోయింది. "మీ పినతల్లిని మీరు ఏం చేసుకుంటారో నాకు తెలియదు. నేను మాత్రం యిటువంటి సేవలు చెయ్యలేను" అని ఖచ్చితంగా చెప్పేసింది. అసహ్యాన్ని జయించటం అన్నది అంత సులభమైన విషయంకాదు మరి.

భార్య సహకారం లేకుండా తను మాత్రం ఏం చెయ్యగలడు అని సర్దిచెప్పుకుని పినతల్లికి తన గుమ్మం ఎక్కటానికి వీల్లేదని ఖచ్చితంగా చెప్పేశారు విశ్వనాథంగారు.

"ఆవిడ యింట్లో ఆవిడ ఉచ్చపోసుకుంటుందో, కడుక్కుంటుందో అలాగే ఉంచుకుంటుందో నాకనవసరం. యిన్ని విషయాలు తెలుసున్న మనిషికి బాత్‌రూమ్ కి వెళ్ళేదాకా ఆపుకోవాలని తెలీదూ? మనల్ని ఏడిపించటానికి ఎత్తులు వేస్తోందంతే మీ పిన్ని" ప్రభావతి కస్సుమంది.

ఆమె చెప్పిందీ సబబయిన మాటే జయమ్మ స్వభావంలో ఆ కోణం వుంది. విశ్వనాథంగారికి ఆ విషయం బాగానే తెలుసు.

ఆయన వద్దన్నకొద్దీ యింటిమీదకి వచ్చి నలుగురికీ తెలిసేలా గొడవచేసేది జయమ్మ.

విశ్వనాథంగారికి మనఃశాంతి కరువయింది.

నువ్వు రావద్దన్నావ్ కనుక యీ రోడ్లమీద ఎక్కడపడితే అక్కడ పడుకుంటాను అన్నట్టుగా అలా ఎక్కడపడితే అక్కడ కనిపించేది. ఆవిడ అలా బయట తిరగటాన్ని "వయస్సుమీద పడుతోంది కదా ఏ క్షణంలో చావు ముంచుకొస్తుందోనన్న భయం ఆవిడని వణికిస్తున్నట్టుగా ఉంది. ఎంతయినా నీకు పినతల్లి. నీకు తప్పదుకదా! నువ్వే ఏదో ఒక దారి చూపించాలి. నీ తమ్ముళ్ళంటే దేశంకాని దేశాల్లో ఉన్నారు" అన్నారు దగ్గరి బంధువులు.

విశ్వనాథంగారిది ఎటూ తోచని పరిస్థితి అయిపోయింది. అన్నీ సత్యాలే. ఎటొచ్చీ జయమ్మ స్వభావాన్నీ, అశుభ్రతనీ భరించటం అన్నదే ఆయన ఎదురుగా ఉన్న పెద్ద ప్రశ్న.

"రాత్రుళ్ళప్పుడు మృత్యువు దరిచేరుతుందేమో - అదీ ఒంటరిగా ఉన్నప్పుడు - అన్న భయం ఆవిడని వెంటాడుతోందేమో" అన్న బంధువుల మాటలు ఆయన హృదయాన్ని కలచివేస్తున్నాయి.

నిజమే మృత్యుభయం ఏ మాత్రం జీవితం పట్ల వేదాంత ధోరణిలేని పినతల్లికి ఆ భయం నరకప్రాయంకాక ఏమవుతుంది?

తల్లిదాకా ఎందుకు - ఆ భయం ఏదో లీలగా తననీ వెంటాడుతున్న భావన ఎక్కడో!

తల్లి మృత్యువుకి చేరువవుతున్నప్పుడు ఆవిడని కన్నుల్లో పెట్టుకుని చూసుకున్నాడు. ఆమె తృప్తిగా, ధైర్యంగా వెళ్ళిపోయింది.

అదే పరిస్థితిలో వున్న పినతల్లికీ అదే ఆదరణ కావాలనిపిస్తుంది కదా! అందుకే నువ్వే నాకొడుకువి అంటుందేమో.

కాలం వీటన్నిటితో తనకేం ప్రమేయం లేనట్టు ముందుకి సాగిపోతూనే ఉంది. కొన్ని సమస్యలకి పరిష్కారాలు దొరుకుతాయి - కొన్ని సమస్యలు మరింత జటిలమవుతున్నాయి.

ఈ జీవనగమనంలో, సృష్టి చక్రంలో ఎవరెవరి ఋణాలు ఎవరెవరు ఏ విధంగా తీర్చుకోవాలో వాళ్ళవాళ్ళు కర్మబంధనాలే చెబుతాయి.

ఎంతటి తుఫానులోనయినా చెక్కుచెదరని చుక్కానిలా నిలిచేది మాత్రం మనిషి మంచితనమే. మనస్సు యొక్క పారదర్శకత్వమే.

యిప్పుడు విశ్వనాథంగారిని, ప్రభావతినీ అతలాకుతలం చేస్తున్న సమస్య జయమ్మది. వయస్సుతో, పిల్లల పెళ్ళిళ్ళతో వచ్చే చిన్న చిన్న సమస్యలతోపాటు జయమ్మది భయంకరమైన సమస్య అయి కూర్చుంది.

ఆవిడకి సంబంధించిన సమస్యలోని భయంకరత్వం మాట వినని ఆవిడ తత్త్వం, అపరిశుభ్రత.

కానీ ఈ సమస్యకి ఏదో ఒక పరిష్కారం చెప్పటం అన్నది తనకి తప్పదు.

"నీ డబ్బుల్ని ముట్టుకునే అవసరం లేకుండా ఖర్చంతా నేను భరిస్తూ నిన్ను మంచి వృద్ధాశ్రమంలో చేర్పిస్తాను. అక్కడ నీకు నలుగురి మధ్యనా కూడా ఉన్నట్టుగా ఉంటుంది" అన్నారు విశ్వనాథంగారు పినతల్లితో.

ఆ మాటతో ఆవిడ అంతెత్తున లేచింది. "చెట్టంత మనిషివి నువ్వుండగా నేను వృద్ధాశ్రమంలో చేరాలా దిక్కూ మొక్కూ లేనిదానిలాగ. ముక్కూ మొహం తెలియని వాళ్ళెవరితోనో కలిసి ఉండటం నా వల్లకాదు" అని ఖచ్చితంగా తేల్చిపారాసింది.

విశ్వనాథంగారికి సందిగ్ధాల ముళ్ళపొదల్లో యిరుక్కున్నట్టుగా అయిపోయింది. సమస్య! సమస్య! ఓ వృద్ధురాలి జీవన సమస్య.

కూర్చున్నా, నిల్చున్నా, నిద్రిస్తున్నా, మెలుకువగా ఉన్నా కళ్ళల్లో మెదుల్తున్న పినతల్లి.

ఆవిడని అక్కడ చూశాం అని ఒకళ్ళంటే - యిక్కడ చూశాం అని యింకొకళ్ళు - సానుభూతి నిండిన కళ్ళతో.

ఆఖరికి ఒకరు "ఆవిడ రైల్వే స్టేషన్‌లో అడుక్కుంటూ ఉండగా చూశాం" అని యింకొకరు యింకొక చోట యింకా అధ్వానస్థితిలో చూశామని - ఏవేవో వార్తలు వినవలసి వస్తోంది విశ్వనాథంగారికి.

అవి కేవలం మనుష్యులు పలుకుతున్న మాటల్లా అనిపించటంలేదు. మానవ సంబంధాల్లో ఉండవలసిన విలువల్ని, సాంద్రతని, లోతుల్ని - మానవ మనస్తత్వాలని నిర్దాక్షిణ్యంగా చీల్చి చెండాడి అగ్నిరేణువులతో విశ్లేషించి - నిర్ధారించవలసిన అవసరం ఏర్పడిందని ఎవరో అంటున్నట్టుగా విశ్వనాథంగారికి పదే పదే అనిపించసాగింది.

ఈ సమస్యని - ఈ పెద్దావిడ సమస్యని అపరిష్కృతంగావించిన అంశాలు ఏవిటి? ఆవిడ గయ్యాళితనమా? అపరిశుభ్రతా? వాటిని ఏమాత్రం సహించలేని, భరించలేని తన మనసా?

ఏమో- ఏ అంశం ప్రధాన పాత్ర వహిస్తోందో తెలీదు కానీ ఒక మనిషి వీధులపాలయ్యింది. ఆవిడకి స్వచ్ఛమైన ప్రేమ, ఈ పెద్దావిడ తమ మనిషి అన్న భావం కావాలి. అటువంటి అపురూపమైన ఆదరణకి అందుకోవాలంటే తనవంతు బాధ్యత ఏవిటో మాత్రం ఆవిడ ఆలోచించదు.

ఆ పెద్దావిడ మీదకి నెపం నెట్టివేయటానికి ప్రయత్నిస్తున్న తన మనసుని చూసి విశ్వనాథంగారు లోలోపల నవ్వుకున్నారు.

కొన్ని రోజులు భార్యాపిల్లలు పుట్టింటికి వెళ్తేనే రాత్రుళ్ళప్పుడు ఒంటరిగా ఉన్నప్పుడు తనకి తోచనట్టుగా ఏదోలా ఉండేది. అలాంటిది.

తన పినతల్లి జీవితాంతం ఒంటరిగానే ఉంది. పగలంతా ఉద్యోగంలో నలుగురి మధ్యలోనూ ఉన్నా రాత్రుళ్ళు తన గదిలో ఒంటరిగా ఉండవలసి వచ్చేసి. అటువంటి పరిస్థితుల్ని ఎదుర్కోవటానికి హృదయాన్ని అత్యంత విశాలమయం అయినా చేసుకోవాలి - లేదూ అంటే దేన్నీ లెక్కచెయ్యని విశృంఖల మనస్తత్వాన్నయినా పెంపొందింపచేసుకోవాలి.

తన పినతల్లి స్వభావం రెండోదానికి దగ్గరగా ఉంది కనుక అటువైపే ప్రయాణాన్ని కొనసాగించింది.

అసలు సమస్య అనేది అపరిష్కృతం ఎప్పుడవుతుంది. పరిష్కరించవలసిన వాళ్ళ నిస్సహాయతవల్లకాదూ. సమస్య... సమస్య ఎటుచూసినా సమస్య. ఒక వయసు మళ్ళిన స్త్రీని ఆదుకోలేని తన అలసత్వం తన సుఖజీవనం పట్ల కోరిక.

యిప్పుడు మాత్రం మనస్సుకి సుఖం ఏం ఉందని. ఆవిడని ఆ స్థితిలో చూస్తుంటే బాధతప్ప. రకరకాల ఆలోచనలతో విశ్వనాథంగారికి ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నట్టుగా ఉంది.

ఎదుటి మనిషిలో చిరునవ్వు తెప్పించటం కోసం కష్టపడటంలో ఆనందాన్ని పొందగలిగితే ఓహ్! యిక సమస్యంటూ ఎక్కడ్నుంచి పుడుతుంది?

కంటిముందు చిన్న వస్తువుని అడ్డుపెడితే ఈ విశాల ప్రపంచం మొత్తం కనుమరుగయిపోతుంది.

తన హృదయనేత్రం ముందు నిలిచిన ఆ చిన్న అడ్డుని తొలిగించుకోవాలి.

పినతల్లి పరిస్థితి చూస్తుంటే పెద్ద వయస్సుపట్ల తనకి కలుగుతున్న రోజురోజుకీ తనలో పెరుగుతున్న అభద్రతా భావాన్నీ, మృత్యు భయాన్నీ కూడా విశ్వనాథంగారు గమనిస్తూనే ఉన్నారు.

ఆవిడని అలా దూరంగా పెట్టడం వల్ల తనకి మనఃశాంతి లేదన్న సత్యం ఆయన ముందు పదేపదే సాక్షాత్కరించటం మొదలు పెట్టింది.

జయించాలి. తనలోని భీరుత్వాన్ని జయించాలి. పిరికితనాన్ని జయించాలి. భర్త దేనిగురించో తీవ్రంగా మధనపడుతున్నాడన్న విషయం ప్రభావతి గమనిస్తూనే ఉంది.

జయమ్మ పట్టువిడవకుండా తన ప్రయత్నం చేస్తూనే ఉంది.

ఒక నెలరోజుల తర్వాత ఒకరోజు విశ్వనాథంగారు "ప్రభావతీ మన డాబామీద రూమ్ తాళాలు తెచ్చియివ్వు. శుభ్రం చేస్తాను గదిని"

"యిప్పుడు హఠాత్తుగా మీకెందుకు చెయ్యటం? వీలున్నప్పుడు పనిమనిషి చేతనే చేయిస్తానులెండి"

"ఊహూఁ నేననుకున్న పనిని వెంటనే అమలు చెయ్యాలి" నిశ్చయంగా పలికింది ఆయన స్వరం.

"ఏవిఁటాపని?" ప్రభావతి అడిగింది.

"పిన్నిని తీసుకువచ్చి పైరూములో పెడతాను. ఆవిడకోసం కాస్తంత వంట ఎక్కువ చెయ్యటం ఒక్కటేపని. మిగతాదంతా నేను చూసుకుంటాను"

కళ్ళు విప్పార్చుకుని ఆయనవైపు ఒక్కక్షణం తదేకంగా చూసిన ప్రభావతి పెదవులపై చిరునవ్వు మెదిలింది.

జయమ్మని తీసుకువచ్చి పైన రూములో ఉంచి అవసరమైన సేవలన్నీ చేస్తున్న విశ్వనాథంగారు. ఒక విషయాన్ని గమనించారు. తనలో గూడుకట్టుకుని ఉంది అనుకున్న భయం రెక్కలు విప్పుకుని విశ్వాంతరాళల్లోకి అదృశ్యమయిపోయినట్టు.

అసలు 'భయం' అన్నదే లేనట్టు చిత్రమైన భావం.

ఈ ప్రపంచాన్ని జయించినట్టు ఏదో ఆనందం.

జయమ్మలోని గయ్యాళితనం కూడా మరుగునపడటం మొదలుపెట్టింది.

ఆలోచనలోని ఒక చిన్నమార్పు ఎంతటి సౌందర్యాన్ని తెచ్చిపెట్టింది. పరిష్కారం లేదనుకోవటంలోనే సమస్య ఉత్పన్నమవుతుంది.

# నిజం - డా. డి.వి.జి శంకరరావు

**రాముడింట్లో** ఆ సన్నివేశాన్ని అస్సలు ఊహించలేదు. అందుకనే నిర్ఘాంతపోయాను. చిన్నప్పటి నుంచీ ప్రాణస్నేహితుడు కదా. వాళ్ళింటికి వెళ్ళినపుడు డోర్‌బెల్ అయినా కొట్టను. ఎకాఎకీ తలుపు త్రోసుకు వెళ్ళిపోతా! ఈసారి ఇంట్లో వాళ్ళావిడ, పిల్లలున్నట్టు లేరు. ఒక్కడే.

తలుపు త్రోయగానే చూసిన సీను. వాడు వాడి కుర్చీలో. వాడి ఒళ్ళో 'బ్యూటీ'. ఇద్దరూ తన్మయత్వంలో లోకం మరిచి ఉన్నారు. వాడి చెయ్యి బ్యూటీ తలనిమిరేస్తుంది. నన్ను చూసి ఓ క్షణం తడబడి తేరుకుని 'రారా!' అంటూ ఆహ్వానించాడు. బ్యూటీ అయిష్టంగా నావైపు చూపొకటి విసిరి ఒళ్ళోంచి తటాలున దిగింది. అసలీ కథ మీకు మొదటినుంచీ చెప్తాను.

ఐదేళ్ళ క్రితం...

మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌ని నేను. మా పీజీ విద్యార్థుల్లో ఒకమ్మాయి స్వీటీ. ఆ అమ్మాయికి నేనంటే గురుభక్తి. నాకు ఆ అమ్మాయంటే శిష్యభయం. భయం ఎందుకంటే నేనడిగిన ప్రశ్నకు జవాబు తనవద్ద లేకపోతే టపటపా కన్నీళ్ళయినా వస్తాయి లేదా 'నీ అంతు చూస్తానన్న' లెవెల్లో కళ్ళయినా ఎర్రబడతాయి. ఓ ఆదివారం నేను ఇంటిపై పోర్షను నుండి చూస్తుండగా ఓ కారొచ్చి ఆగింది. స్వీటీ దిగి ఓ గిఫ్ట్ బాక్స్ జాగ్రత్తగా పట్టుకుని మా యింట్లోకి వస్తూంది. నేను దిగి వచ్చేలోగా మా ఆవిడ, పిల్లలు తనని రిసీవ్ చేసుకుని కూర్చో బెట్టి ఉన్నారు.

"నమస్కారం సార్" నన్ను చూసి నిల్చుంది స్వీటీ.

"కూర్చోమ్మా! ఏమిటీ విశేషం?"

"ఏమీలేద్సార్. మీకో గిఫ్ట్ తెచ్చాను. నచ్చుతుందో, నచ్చదో తెలీదుకానీ ఇవ్వాలనిపించింది."

"కొంపదీసి బాంబు కాదుకదా" మొన్ననే చివాట్లు పెట్టాను. అందుకనే మనసులో అనుమానమొచ్చింది.

"ఎందుకమ్మా. ఇవన్నీ" అన్నాను కానీ ఏమిటా అని మనసుదొలిచేస్తుంది.

స్వీటీ 'గిఫ్ట్' రివీల్ చేసింది. అది చిన్నకుక్కపిల్ల. పిల్లలు - గాయత్రి, శివ ఎగిరి గంతేశారు. "హాయ్" అంటూ మా ఆవిడకూడా ఆనందం దాచుకోలేదు.

"ఓహ్. క్యూట్ పప్పీ. థాంక్సమ్మా స్వీటీ. పిల్లలు పప్పీ నొకదాన్ని తీసుకురమ్మని ఎప్పటినుంచో పోరుతున్నారు. మీ సార్‌కి అవి ఇష్టముండవు."

"అయ్యో! మీకు ఇష్టముండవా సార్. పోనీ పిల్లలంటే ఇష్టమా!"

"ఆయనకి మనుషులంటేనే ఇష్టముండదు. ఇంకా జంతువులు కూడానా!" సెటైర్ వేసింది లత. ఆ ఆనందంలో.

పిల్లలు దాన్ని ఓన్ చేసేసుకున్నారు అప్పుడే

"ఏ బ్రీడ్ అమ్మా ఇది స్వీటీ?"

"టిబెటిన్ మాస్టిఫ్ సర్. చాలా ఫెరోషియస్. నాకు డాగ్స్ చాలా ఇష్టం. ఇది పెద్దయ్యాక మీకు నచ్చుతుంది సార్ డెఫినెట్‌గా" కాసేపు తిండీ, ట్రయినింగు, జాగ్రత్తలు తదితర విషయాలు మాట్లాడి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

ఆ కుక్కపిల్లకు ముగ్గురూ కలిసి 'క్యూటీ' అని పేరు పెట్టారు. ఫెరోషియస్ మాటేమోగానీ ఫ్రెండ్లీ డాగ్ అయిపోయింది వీరి ట్రయినింగులో. ఎవరింటికి వచ్చినా 'మీరెళ్ళి చూళ్ళేరా?' అంటూ ఓ లుక్కిచ్చి ఆపై డ్యూటీ చేస్తుంది.

దానివల్ల నాక్కలిగిన నిఖార్సయిన లాభం మా ఆవిడ పోరు తగ్గింది, సాయంత్రం షికారుకీ, సినిమాలకీ వెళ్దామన్న కోరికలు తగ్గి.

మా ఆవిడకి జరిగిన ఏకైక ఆశాభంగం దాని బ్రీడ్ గురించే. ఇంటర్నెట్ అంతా వెదికింది టిబెటన్ మాస్టిఫ్ గురించి. అందులో కనబడిన జూలు, తోక, కళ్ళు ఏవీ కనబడలేదు మా క్యూటీలో. వయసు పెరిగాక వస్తాయనుకుంది. ఇంకెంత పెరగాలి, మరిరావు ఆ లక్షణాలు అని నిర్ధారించుకుంది. అలా అని దానిపై ఏ మాత్రం చిన్న చూపులేదు ముగ్గురికీ. నేను కూడా దాని ప్రేమ ప్రకటించే ధోరణికి మెత్తబడిపోయాను.

ఓరోజు రాముడొచ్చాడు. వాడుకూడా కుక్కలపై అవగాహన ఉన్నవాడే

"ఏమిటి చెల్లెమ్మా. మరీ బొత్తిగా కొత్తవాళ్ళొచ్చినా అరవని కుక్కని పెంచుతున్నావ్?"

"లేదన్నయ్యా! ఇది టిబెటిన్ మాస్టిఫ్. మీరు ఫ్రెండ్లీ అని పోల్చి ఉంటుంది. లేకపోతే మీద బడి రక్కేస్తుంది."

మా ఆవిడ దగ్గర్లో లేని సమయం చూసుకుని వాడు నాతో అన్నాడు "నీ బొంద మాస్టిఫ్‌రా ఇది. ఊరకుక్క. చూస్తే తెలియడంలా. అనవసరంగా రాచమర్యాదలతో పెంచుతున్నారు."

"గట్టిగా అనకురా. మీ చెల్లెమ్మ వింటే నీ అంతు చూస్తుంది. అయినా కుక్క ఏదైతే ఏంరా! "కుక్కా బై ఎనీ నేమ్ ఈజ్ కుక్కా నా ఉద్దేశ్యంలో"

"ఏడ్చినట్టుంది" అన్నాడు. క్యూటీపై వాడి చులకన భావం మాత్రం ఏ మాత్రం మారలేదు ఎన్నేళ్ళయినా.

అయితే నా సలహాని మాత్రం మర్చిపోయాడు. ఏమరుపాటుగా ఒకరోజు లత ఉండగానే క్యూటీని పోవే 'ఊరకుక్కా' అంటూ నోరుజారాడు. అంతే. మా ఆవిడ చేతిలోని వేడి టీ కప్పు 'పొరపాటున' జారి వాడి మీద పడింది. ఆ అనుభవం వాడికి జ్ఞానాన్ని ప్రసాదించింది. మరెప్పుడూ వారి ముగ్గురి ఎదుటా క్యూటీని తూలనాడలేదు.

ఈ మధ్య రాముడు వచ్చినప్పటికి క్యూటీతోబాటు, ఇంకో పప్పీ ఉంది.

"అరే ఇది బాగుందే ఎక్కడిదీ?"

"మా వెట్ డాక్టరు ఆధ్వర్యంలో, వేరే వాళ్ళ దగ్గర ఒరిజినల్ టిబెటిన్ మాస్టిఫ్ ఉంటే జత కలిపించాం. ఇది దాని పిల్లనే."

"తెలుస్తుందోయ్. ఆ చెవులు, ముక్కు చూడు. ఇట్టే చెప్పేయొచ్చు. అయినా ఒకటే పుట్టిందా?"

"లేదురా. ఆరు పుడితే హాట్ కేకుల్లా తలా ఒకరు తీసుకుపోయారు. అన్నీ పెంచడం కూడా కష్టమేకదా! ఈ ఒక్కటి లత ఉంచింది."

"ఇది ఒరిజినల్ బ్రీడ్‌రా. నాకు మాత్రం ఇవ్వరేం?" అంటూ పప్పీని చేతిలోకి తీసుకున్నాడు.

లత రాగనే అన్నాడు. "చెల్లెమ్మా మాకు ఓ పప్పీ ఇచ్చి ఉండాల్సింది కదా!"

"అయ్యో! అన్నయ్యా క్యూటీని మీరు రానివ్వరు సరిగ్గా. దాంతో మీకు అని ఇష్టంలేదేమో అనుకున్నాను."

"అంటే మంచి బ్రీడ్.." అనబోయి గతం గుర్తొచ్చి నసిగాడు.

"ఇష్టమేనమ్మా" అంటూ.

"అయితే తీసుకెళ్ళండన్నయ్యా. జాగ్రత్తగా చూసుకోండి. దాని పేరు 'బ్యూటీ'.

ఇప్పుడు నేను షాక్ తిన్నది దాని గురించే.

మా యింటికి వచ్చినపుడు క్యూటీని తరిమినంత పనిచేసే రాముడు దాని పిల్లని మాత్రం ఒళ్ళో ఆడిస్తూ ఉన్నాడు.

"ఏదైనా మంచి బ్రీడ్ మంచి బ్రీడేరా. బ్యూటీకి ఇప్పటినుండే ఎన్ని అర్థమౌతాయో తెలుసా?" ఆరాధనగా చెప్తూపోతున్నాడు.

దానికి నాపై అయిష్టత తగ్గినట్టుంది. కొంచెం జంకుతూ నా కాళ్ళ దగ్గరకు వచ్చింది. ఫ్రెండ్లీగా తోక ఊపుతూంది. దాని తలనిమురుతూ మనసులో అనుకున్నాను.

"ఏదేమైనా ఒక అబద్దంతో దీనికి ప్రత్యేక హోదా సాధించాను ఆ రోజు వెట్ డాక్టరు - ప్లానింగూ అన్నాను కానీ అసలు విషయం చెప్తే పరిస్థితి ఇలా ఉండేదా? ఏమరుపాటుగా ఉన్నప్పుడు క్యూటీ రివ్వున గేటు దాటిన విషయం. ఆపై ప్రెగ్నెంటు కావడం. 'ఏం చెప్తాంలే' అని దాచి పెట్టాను. అయినా ఇలా పట్టుపట్టి బ్యూటీని తెచ్చుకొంటాడని నాకేం తెలుసు? కాబట్టి తప్పునాదికాదు" ఆలోచనలో ఉండగా రాముడన్నాడు.

"ఏమోయ్. బ్యూటీని ఇచ్చేసినందుకు బాధపడ్తున్నారా?"

"ఎందుకురా బాధ. ఇంత చక్కగా చూసుకుంటుంటే" మనసులో మాత్రం అనుకున్నాను" నేనాడిన అబద్ధం లతకి చెప్పాలి. లేదంటే ఎప్పుడైనా నోరు జారి నిజం చెప్పేస్తుంది. ఆనక బ్యూటీది కుక్క బతుకైపోతుంది"

## చిగురించిన జ్ఞాపకం  మణి వడ్లమాని

మనుషులు కాలగర్భంలో కలిసిపోయిన వారి గుర్తులు  జ్ఞాపకాలు కొన్నైనా మిగులుతాయి. కొంతకాలానికి ఆ జ్ఞాపకాలు  కూడా మరుగున పడిపోతాయి. కానీ ఈ మధ్యన  ఓ జ్ఞాపకం నివురును తొలగించుకొని బయటకు వచ్చింది. ఎలా మర్చిపోయవంటూ  కేకలు వేసింది. చిత్రంగా అది ఎక్కడ వచ్చింది అంటే ఈ మధ్య పిల్లల్ని తీసుకుని నార్త్ఇండియా టూర్ వెళ్ళినప్పుడు. ఆగ్రా,మధుర,బృందావనం వెళ్ళాము. ఆ బృందావన వీధులలో తిరుగుతూ ఉంటె  జ్ఞాపకం వచ్చింది. నిజానికి ఆ జ్ఞాపకానికి ఆ ఊరుకి  పొంతన లేదు. అయితేనేం మర్చిపోయిన జ్ఞాపకానికి అక్కడ జ్ఞాపకం వచ్చింది.

★★

టూర్ నుంచి వచ్చాకా ఓ  ఆది వారం రోజున   సందడి అంతా  మా ఇంట్లోనే. మా పెద్ద తమ్ముడి పిల్లలు శ్రుతి,కృతి  చెల్లెలి పిల్లలు, సౌమ్య,వంశీ  నా పిల్లలు,దివ్య,కావ్య  వెరసి  అర డజను మంది. ఇల్లంతా పీకి పందిరివేస్తున్నారు.

గోల గోల చేస్తున్న  పిల్లలకి   చెప్పాను. "ఈ రోజు మీకు ఒక అసైన్మెంట్ ఇస్తాను అది చెయ్యాలని."

"ఏమిటేమిటి" అంటూ ఎగిరారు

"పాత ఆల్బమ్స్ అన్ని తీసి  స్కాన్ చేసి పెట్టండి అన్ని కంప్యూటర్ లో సేవ్ అయ్యి ఉంటాయి.సరేనా?"

"సరే సరే" అంటూ  చెప్పగానే బుద్ధిమంతులా పని మొదలు పెట్టేసారు.

పైన అటక మీదున్న సూట్కేసు కిందకి దింపారు. "అబ్బ ఎన్ని ఆల్బమ్సో!" అంది చిన్న మేనకోడలు కృతి  దానికి ప్రతీది ఆశ్చర్యమే!

ఆ ఫోటో లు చూస్తూ తెగ నవ్వుకుంటున్నారు.పిల్లలు.

అబ్బో  "అక్కా! మమ్మీని చూడు ఆ రెండు జడలు,ఆ లంగా వోణిలో  యెంత గమ్మత్తుగా ఉందో, అని కావ్య కామెంట్,

"మమ్మీ ఏంటాఆ పొడుగు బొట్టు  హహహ," అని దివ్య మొహం చిరాకుగా పెట్టింది.

"అయ్యా,ఇక్కడ చిన్నత్తని చూడు, ఎటో చూస్తోంది"

"ఇది తాత గారు కదా, భలే యంగ్  గా ఉన్నారు, తాజమహల్ దగ్గర కదా "

"నేను చూడలేదు తాతగారిని , నేనూ చూడలేదు  నేను చూడలేదు" అని దివ్య,సౌమ్య  తప్ప మిగతావాళ్ళు అనుకుంటున్నారు

ఇక ,ప్రతి ఫోటో గురించి ఏదో ఒకటి మాట్లాడుతూ విరగ బడి నవ్వుతున్నారు.

"పెద్దత్తా అప్పుడు నువ్వు ఎంత సన్నగా ఉన్నావో," శ్రుతి కామెంట్

"మమ్మి  పిన్ని పెళ్ళికి నేను రాలేదా? అని  నా చిన్నకూతురి కొంటె ప్రశ్న

"అప్పుడు నువ్వు మీ మమ్మీ బొజ్జలో ఉన్నావు" అని కృతి కిసుక్కున నవ్వింది.

"అమ్మా! ఇది అన్ని పెద్ద మాటలు మాట్లాడుతోంది" అని  నా పెద్దకూతురు దివ్య కంప్లైంట్ చేసింది.

"అబ్బబ్బ దెబ్బలాడు కోకుండా పని చేయండి" అని కసిరాను.

అప్పటికి కాస్త ఊరుకొని   మళ్ళీ ఏదో ఒకటి లొడ లొడ వాగుతూనే ఉన్నారు.

ఫోటోలు చూస్తున్న చిన్న మేన కోడలు కృతి ఒక ఫోటో తీసి చూపిస్తూ ఈవిడ "వీళ్ళు ఉన్నారేంటి? అని అడిగింది."నేను అందుకొని చూసాను.

అది మా మా నాన్నమ్మ, చిన్నాన్నమ్మ వున్న ఫోటో . మెదడు లో ఏదో కదలిక

"ఏది ఏది" అంటూ అందరూ చూసారు,

అప్పుడు దివ్య చెప్పింది "ఆవిడ ఎవరంటే  మన తాతగారు ఉన్నారు కదా! అదే మీ డాడీ వాళ్ళ డాడీ కి పిన్ని అవుతుంది"

"అవును  వాళ్ళిద్దరూ జుట్టు లేకుండా, బ్లౌజ్ లేకుండా అలా టిపికల్ గా ఎందుకున్నారు?"  అని అన్నారు ఆ ప్రశ్నకి  దివ్యకి కూడా ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.

వాళ్ళు ఎందుకలా ఉన్నారనే భావం వాళ్ళ మొహాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

వెంటనే నేను వాళ్ళతో "కృతీ, పాత రోజులలో హస్బెండ్ పోతే ఆడవాళ్ళు అలాగే ఉండేవారు. తరువాత ఆ పద్దతి మారిపోయింది. ఇప్పుడు ఎవరు అలా ఉండటం లేదు" అని చెప్పాను

"పాపం వాళ్ళకి జుట్టు లేకపోతె ఏడ్చేవారు కాదా?" అని అమాయకంగా అడిగింది.

దాన్ని ఎలాగో సమాధాన పరిచి ఆ ఫోటో తీసుకోని బయటికయితే వచ్చాను కానీ ఆ మాటలు మాత్రం నా చెవిలో గింగురుమంటూ ఉన్నాయి.

★★

మా టూర్ నుంచి వచ్చాక ఓ ఫ్రెండ్ ఇంట్లో, ఒక మహిళా దర్శకురాలు వితంతువుల మీద తీసిన సినిమా చూడటం జరిగింది. అందులో ని చిన్నపిల్ల పాత్ర ని చూడగానే మటుకు చిన్నాన్నమ్మ గురించి, నాన్నమ్మ చెప్పినవన్నీ కళ్ళముందు నిలిచాయి.

ఏడేళ్ల పిల్లకి పెళ్లి చేసారుట, అతనికి దాదాపు ఇరవయ్యేళ్లు ఉన్నాయేమోట. ఏదో జబ్బు చేసి ఆయన కాస్తా హరీమన్నారుట. అప్పటి నుంచి పుట్టింట్లో అన్నగారి దగ్గర ఉండిపోయారు.

ఇంతకీ ఆ పెళ్ళి చేసింది'ఆవిడ మేనత్త. ఇంట్లో ఆడపిల్ల ఎదిగిపోతోందని, మేనల్లుడికి భారం తీరిపోతుందని బాధ్యత నిర్వహించి పెళ్లి అయితే చేసింది కానీ."అతను జబ్బు మనిషి అని తెలియదు" అని చేతులు దులిపేసుకుంది.

"పైగా వాళ్ళు బోలెడు ఆస్తిపరులే మనోవర్తి ఇస్తారు" అంటూ చెప్పబోయేసరికి. మా నాయినమ్మ అన్నగారు ' ఇక చాల్లే జరగాల్సిన అన్యాయం జరిగిపోయింది. ఇక నోరుముసుకో అని ఆవిడని కసిరేసి పంపించేసారు..

ఏ మాటకామాట చెప్పుకోవాలి. మా తాతగారు పెద్ద అభ్యుదయ వాది, రాజారామోహన్ రాయ్ మాటలకు చాలా ప్రభావితం అయ్యారుట. అందుకే మరదలుని చూసినప్పుడల్లా. చిన్నపిల్ల,మళ్ళీ పెళ్లి చేస్తే బావుంటుందని, ఆయనకి అనిపించేది అని నాన్నమ్మ చెబుతుంటే మా తాతగారు ఓ హీరో లా అనిపించారు. .

అంతే ఆ మాట కాస్త మా నాన్నమ్మ అన్నగారికి తెలిసి ఈ బావగారు తన చెల్లెలికి ఎక్కడ మళ్ళీ చేయించేస్తాడో అని వెంటనే ఆవిడని ఇంటికి పిలిపించి గుండు గీయించి,తెల్లచీర కట్టి ముసుగేసి కూర్చోపెట్టారుట.

ఆవిడకి జుట్టు తీసిన సంఘటన గురించి చెబుతుంటే,నాకు మా చెల్లెలుకి ఎంత బాధ వేసిందో. పాపం ఏవిటి ఆవిడ బతుకు అటు పుట్టింటపంచన,లేకపోతె అత్తింటి పంచన చేరి ఎంత నరకం అనుభవించుంటుందో కదా అనిపిస్తుంది.

అటు ఇద్దరు అక్కల ఇళ్ళలో, అన్నగారి ఇంట్లో, ఇటు అత్తగారి వైపు వాళ్ళ ఇళ్ళలో పురుళ్ళకి,పుణ్యాలకి, ఇంకా ఇతరత్రా పనులకి అంకితమయింది. చెయ్యని తప్పుకు అందరి చేత, తిట్లూ .ఈసడింపులూ మధ్య ఆవిడ జీవితం తెల్లారిపోయింది.

అవన్నీ వింటున్న మాకు ఉక్రోషం వచ్చి మానాన్నమ్మతో అన్నాము "మీరు ఎందుకు మన ఇంట్లోనే ఉంచేసుకోకపోయరా?" అంటే,దానికి ఆవిడ రెండు కారణాలు చెప్పారు "ఒకటి ఇప్పటి కాలంలా కాదురా అప్పుడు అన్నిటికి భయమే, రెండోది మీతాతగారు కూడా చిన్న వయసులోనే పోయారు. మీ నాన్నకి ఐదు ఏళ్ళు,అత్తయ్యకి మూడేళ్లు నాకే దిక్కులేదు. మీ నాన్న ఓచోట, నేను ఓచోట ఉండేవాళ్ళము ఇక దాని సంగతి ఏం ఆలోచిస్తాను. మీ నాన్నకి ఉద్యోగం,పెళ్లి, అయ్యాక, అది మళ్ళీ నా దగ్గరకు రావడం మొదలుపెట్టింది" అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు.

ఇంతలో బయట హడావుడి విన్పించింది. నా ఆలోచనలకు స్వస్తి చెప్పి బయటకు వచ్చాను. శ్రీవారు ఆఫీసు నుంచి వస్తూనే హుషారుగా "కార్లో ఓ రెండు రోజులు ఎక్కడికైనా వెళదాము" అనగానే ఠక్కున "మామిడాడ వెళ్దాము" అన్నాను

"అదేమిటి అక్కడికి ఎందుకు" అనగానే పిల్లలు "మమ్మీ ఎందుకో చిన్న తాతమ్మను తలచుకొని అప్సెట్ అయింది" అని చెప్పారు.

"అరె అదేమిటి ఎప్పుడో జరిగిన దానికి ఇప్పుడు తలచుకుని బాధ పడితే ఎలా" అని అన్నారు.

"అదేం లేదు లెండి ఏదో మా చిన్న తనం ఆ రోజులు,నాన్నగారు,నాన్నమ్మ ఇలా అన్ని జ్ఞాపకాలు కలిపి గుర్తుకొచ్చాయి" అనేసరికి

"సరే! మరి ఆ ఊర్లో  ఎవరు ఉంటున్నారు అన్నారు. "ఇంకో చిన్నాన్నమ్మ కొడుకు ఉంటున్నాడు" అని అన్నాను.

"ఓకే అయితే అక్కడికే  వెళ్దాము" అన్నారు.

★★

అనుకున్నట్లుగానే శనివారం పొద్దున్నే మేము నలుగురం బయలుదేరాము. మధ్యలో సూర్యాపేట లో టిఫిన్లు కానిచ్చుకొని బయలుదేరాము.

అప్పుడు నా పక్కనే కూర్చొన్న  దివ్య అడిగింది "మమ్మీ చిన్నతాతమ్మ గురుంచి నాకు తెలుసుకోవాలని ఉంది. ఇప్పుడు వివరంగా చెప్పు"

దానికి చెబుతూ నేను  గతంలోకి  వెళ్ళిపోయాను. ఆవిడని మొదటి సారి చూసిన దృశ్యం గుర్తుకొచ్చింది. అప్పుడు నాకు పదేళ్లు. ఐదవ క్లాసు చదువుతున్నాను. ఓ రోజున మా ఇంటికి వచ్చారు ఆవిడ పేరు యశోద,కాని అందరూ సోదెమ్మ అని  పిలిచేవారు.

చూడటానికి కొంచెం పొట్టి గా,బొద్దుగా లా ఉండే వారు. ఆవిడవి  చక్కటి ముఖకవళికలు. ఎప్పుడువచ్చినా  పిల్లలున్న ఇల్లు అని ఏదో ఒకటి చేసి తెచ్చేవారు. ఆరోజున కూడా అలాగే  రెండు చేతుల నిండా సంచులు,అందులో జంతికలు,చేగోడీలు,ఇంకా అప్పడాలు వడియాలు కూడా తెచ్చారు. రాత్రి అయింది. అందరూ భోజనాలు చేసి పడుకున్నారు. మంచి నిద్ర లో ఉన్న నాకు  ఎక్కడ నుంచో మూలుగు వినిపిస్తోంది. అది అంతకంతకూ అది  పెద్దదిఅయింది,"బాబోయి చచ్చిపోతున్నరోయి,అంటూ కేకలు", ఉలిక్కిపడి  గబగబా లేచాను ,అప్పటికే నాన్నగారు,అమ్మ,నానమ్మ అందరూలేచారు.నిద్రమత్తులో ఉన్న నాకు ఏమైందో తెలియటం లేదు.

మా నాన్నమ్మ మాత్రం "వెధవ కడుపు నొప్పి దాని ప్రాణాలు తిసేస్తోంది" అని మెల్లగా అంటున్నారు.

మా అమ్మ "పోనీ నేను వెళ్లి చూస్తాను" అంది.

"నువ్వెళ్ళి ఎలా చూస్తావు,అది అసలే ఇంట్లోకి రాకూడదు" అన్నారు.

"పర్వాలేదు లెండి స్నానం చేస్తాను" అని అమ్మ అంది

"అబ్బ అలా ఆవిడ లుంగలు చుట్టుకు పోతుంటే చూడ లేకపోతున్నాను,అసలు  ముందు ఆవిడని ఆ సందులోంచి  వచ్చి లోపల పడుకోమను. ఏదైనా పురుగు,కుట్టిందంటే ప్రమాదం,ఆ కడుపు నొప్పి తగ్గడానికి కాస్త వాము నీళ్ళు ఇవ్వండి" అని  నాన్నగారు అన్నారు.

అమ్మ వెళ్లి ఆవిడని లోపలకి  తీసుకొచ్చి ఓ మూలగ చాపమీద పడుకో పెట్టింది,ఆవిడ నాన్నగారిని చూసి తెగ మొహమాటపడిపోతోంది. "ముందు వాడిని లోపలికి వెళ్లి పడుకోమను. ఈ వెధవబాధ నాకెపుడు ఉండేదే" అనిఅన్నారు.

దానికి నాన్నగారు వెంటనే "పిన్నీ!నువ్వు ఇప్పుడు ఏంమాట్లాడకమ్మా"అని అమ్మ వైపు తిరిగి

"ఆవిడని రేపో సారి  హాస్పిటల్ కి తీసుకెళ్ళి  ఆ చాకో గారికి చూపించు" అన్నారు.

"అమ్మా..!ఏమైంది చిన్నాన్నమ్మకి?" అని అడిగాను,

"ఏదో లే నీకెందుకు పెద్దవాళ్ల విషయాలు అని కసిరేసారు"  ఆ సంఘటన  నా మనసులో చెరగని ముద్ర వేసుకుపోయింది.

నా మాటలు  వింటున్న దివ్య "మమ్మీ ఛీఛీ  ఘోరం కదా అది ఆవిడకి  పాపం పీరియడ్స్ లో వచ్చే కడుపు నొప్పి వచ్చేదా,అబ్బ వింటుంటే నే భలే బాధగా ఉంది" అంది.

"అవును, దివ్యా !అప్పట్లో కొన్ని పద్ధతులు అలానే ఉండేవి." అని మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాను.

"ఎప్పటిలాగే  ఆవిడ ఎవరికి సాయం కావాలన్నా వాళ్ళ ఇళ్ళకి వెళ్ళడం,అక్కడ చాకిరీ  చేస్తుండగానే,ఇంకో ఇంట్లోచి పిలుపు వచ్చేది..అలా ఎవరికి అవసరం ఉంటే అక్కడికి వెళుతూ ఉండేవారు. అయితే ఆ పనులకి తగిన గుర్తింపు ఎవరం ఇవ్వలేదేమో అనేది గుచ్చుతూఉంటుంది

నాన్నగారికి ట్రాన్స్ఫర్స్ మూలంగా మేము ఊర్లు మారినప్పుడు మటుకు  మా మేనత్త వాళ్లింట్లో ఉండేవారు. ఆవిడకూడా బాగా చూసుకునే వారు. వాళ్ళది పెద్ద ఫ్యామిలీ, డబ్బున్నవాళ్ళు కూడా. వాళ్ళ పిల్లలతో ఆవిడ చాల సరదాగా ఉంటూ కాలక్షేపం చేసేవారు. మధ్యలో మా అత్తయ్య తెలుసున్న లేడీ డాక్టర్ ద్వారా  ఆవిడకు ఆపరేషన్ చేయించారు. దానితో ఆవిడ కడుపు నొప్పి బాధ పోయింది

ఆవిడ అందరికి సాయం చేసింది. ఆవిడ అక్కపిల్లలు, అన్నపిల్లలుకి కాకుండా. మొహమైనా తెలియని భర్త వైపు వాళ్ళకి, మరుదులు, ఆడపడచులు పెళ్ళిళ్ళకి, పురుళ్ళకి,వెళ్లి ఇంటెడు చాకిరీ చేసేది. కానీ తలచుకుంటే ఎంతో బాధ వేస్తుంది ఇంతా చేసి ఆవిడ ఏం సుఖపడింది, తనకో ఇల్లు లేదు, తన సొంతవాళ్ళు యెవరులేరు. సంచారిలా అందరిళ్ళు తిరిగేది.  ఎవరి ఇంట్లోను ఓ పరుపుమీద గాని, మంచం మీద గాని  పడుకోవడం ఎరగదు. ఏదో మూల చాపవేసుకొని పడుకునేవారు.  ఆ తర్వాత, తర్వాత మా నాన్నగారు ఆవిడ కోసం ఒక మంచం చేయించారు. “అబ్బే నాకు మంచం వద్దురా! కొంగు పరచుకుని పడుకుంటే చాలు” అని అనేవారు.

ఆ అభిమానంఅను,కృతజ్ఞత అను ఆవిడ ,ఖర్చులకి మేము(నేను, పిన్ని, మావయ్యలు)  డబ్బు ఇస్తూఉండేవాళ్ళము

ఆవిడకి సినిమాలు అంటే ఇష్టం,బయటకు వెళ్ళడం సరదా,ఇవన్ని అందరికి ఉండే అతి సామన్యమైన కోరికలు. అవికూడా  తీరలేదు. మా ఇంటికి వస్తే,ఆవిడకి ఒక విధమైన స్వతంత్రం ఉండేది. మా నాన్నగారు అల చూసుకునే వారు.అప్పట్లో నేను పిన్ని అనే వాళ్లము “మీరు కొంచెం ధైర్యం చేసి ఉంటె  బావుండేది.నాన్నమ్మా” అంటే   “ఒసే ఒసే అలా మాట్లాడకండే,అవన్నీ పాపపు మాటలే నరకం లో కొరత  వేస్తాదే” అనేది. ఆవిడ అమాయకత్వానికి  జాలి వేసేది. అన్నటికంటే నేను పిన్ని విలవిల లాడింది దేనికంటే జుట్టు పెరిగిపోయింది మంగలి వాడిని పిలవమని అన్నప్పుడు మటుకు ఇద్దరిమీద జాలి వేసేది,  “ఆ మంగలి వాడిని పక్కనే ఉన్న గంత లోంచి రమ్మనమను” అని చెప్పటం చాల బాధగ ఉండేది.

ఇలా రోజులు గడిచిపోతున్నాయి. నాకు, పిన్నికి పెళ్ళిళ్ళు అయి  ఇక్కడకు వచ్చేసాము.  ఫొటోస్ లో చూసారు కదా. ఆ తరువాత మా అత్తయ్య వాళ్లింట్లో కూడా  పరిస్థితులు మారాయి. మా నాన్నమ్మ పోయారు,ఆ వెంటనే మా నాన్నగారు కూడా పోయారు. మా అమ్మే మా దగ్గరకు వచ్చేసింది. ఇక ఆవిడ మళ్ళీ పుట్టింటికి మామిడాడ వెళ్ళిపోయారు. ఆ ఇంట్లో మా నాన్నమ్మ ఇంకో చెల్లెలు కొడుకు దగ్గర ఉండి చివరి రోజులు గడిపారు

ఆవిడ పోయినప్పుడు  నాకు  ఆపరేషన్ అవటం వల్ల  వెళ్లలేకపోయాము. ఆ తరువాత  అక్కడి కి వెళ్ళాల్సిన పని లేకపోయింది.

కానీ ఎందుకో మనం టూర్ వెళ్ళినప్పుడు ఆవిడ బాగా గుర్తొచ్చారు. అందుకనే ఒక్కసారి ఆ ఊరు వెళ్ళాలని చాల బలంగా అనిపించింది” అని చెప్పడం ముగించాను.

కొంచెం సేపటి వరకు ఎవ్వరూ మాట్లాడలేదు. వాతావరణం తేలిక చేయడానికి డ్రైవ్ చేస్తున్న మా వారు ఏదో  సరదా కబుర్లు చెప్పి నవ్వించారు.

ప్రయాణం మధ్యలో  రెండు సార్లు ఆగాము ఒక సారి లంచ్ కోసం తణుకు దగ్గర. ఆ తరువాత రామచంద్రపురం బైపాస్ రోడ్ లో  టీ కోసం ఆగాము. మారెండో అమ్మాయి కావ్య ,మా వారు  మాట్లాడుకుంటూ బానే తొందరగానే  తీసుకొచ్చేసారు.

సాయంకాలం కల్లా కాకినాడకి వెళ్ళి పోయాము అక్కడ హోటల్ ఆ రాత్రి గడిపి , పొద్దున్నే మామిడాడ బయలుదేరాము.

దార్లో బిక్కవోలులో  వినాయకుడిని, గోలింగేశ్వరుదుని చూసుకొని మామిడాడ ఊర్లోకి చేరుకున్నాము. ఆ ఇంట్లో ఉన్న  ఇంకో చిన్నాన్నమ్మ కొడుక్కి ఫోన్ చేస్తే ఆయన దారిగుర్తులు చెప్పారు. ఆ గుర్తులు పట్టుకొని  సరాసరి  ఇంటి ముందే వెళ్లి ఆగాము. అప్పటికే వాళ్ళు  మాకోసం ఎదురు  చూస్తున్నారు. మమ్మల్ని చూసి వాళ్ళు ఎంతో సంబరపడిపోయారు.  భోజనాలు అయ్యే లోపల ఎదురుకుండా ఉన్న  సూర్యభగవానుడి గుడికి వెళ్లి దర్శనం చేసుకున్నాము. ఈ గుడి గురించి కూడా ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. లోపల ఊర్లోకి వెళితే కోదండరామాలయం కూడా ఉంది. మా నాన్నమ్మల కిష్టమయిన పుట్టింటి రాముడు.

ఈ ఇంటి మనవరాలు మొగుడు అని మా ఆయనకి స్పెషల్ గా వెండికంచం వేసి సుష్టుగా భోజనంపెట్టారు. పిల్లలు కూడా పెద్ద పరిచయం లేకపోయినా వాళ్ళతో  బాగా కల్సిపోయారు.

ఆ ఆత్మీయత వెలకట్టలేనిది.

మా నాన్నమ్మ పుట్టిల్లు వందేళ్ళ నాటి పెంకుటిల్లు. ఆకారం ఉంది గాని. ఇల్లు లోపల అంతా పాడు బడిపోతోంది, ఏవో చిన్నచిన్నగ మరమ్మత్తులు చేయించారు.

ఎర్రమందారం,జూకామందారం చెట్లు, బూడిదగుమ్మడి,చిక్కుడు పాదులు ఆ పక్కకి నూతిపళ్ళెం అచ్చు చిన్నానన్నమ్మ వర్ణించి నట్లే ఉన్నాయి. చిన్నానన్నమ్మ చివరి రోజులలో ఇక్కడే గడిపారు.ఆ ఇల్లు మొత్తం ఆవిడ స్మృతులతో నిండి ఉంది. ఇల్లంతా కలయ తిరిగాము. కొన్ని పాత ఫోటోలు చూసాము మసకబారి,మచ్చలుపడి,మొహాలు కనిపించకుండాఉన్నాయి,అయినా ఇన్నాళ్లుగా గుండెల్లో ఉన్న బరువు ను చేత్తో తీసేసినట్లుగ ఉంది. వాళ్ళని చూసి కలసి మాట్లాడినంత ఆనందంగా అనిపిస్తోంది. మమ్మలిని ఇక్కడ చూసి తప్పకుండా ఆవిడ పై నుంచి ఆశీర్వదిస్తారు అనుకున్నాను

వాళ్ళకి చెప్పి తిరుగుప్రయాణం అయ్యాము.

## ఆద్యుడు — రవి కొప్పరపు

ఆ ఇల్లు, గుర్తులు శిథిలమవుతున్నా ,లోపల నుంచి మళ్ళీ ఓ జ్ఞాపకం చిగురిస్తోంది ఆకుపచ్చగా!

"ఒరేయ్, తొందరగా కానియ్యిరా, సూటుకేసులు కార్లో పెట్టాలి". కింద నుంచి నాన్న పిలుపు. తొందరెక్కువ. వెళ్ళేది మా కార్లోనే, నడిపేది కూడా నేనే. దాదాపు అరగంట ప్రయాణం తెనాలికి. అక్కడే మా బామ్మ ఇల్లు. ఒక్కతే ఉంటోంది ఇప్పుడు. స్వంత ఇల్లు. ఒక పోర్షను అద్దెకి ఇచ్చి, మిగతా సగం లో తనుంటోంది. అప్పుడప్పుడూ మా అమ్మా, నాన్న, లేదా నేను సెలవల్లో వెళ్తూంటాము బామ్మ దగ్గరికి. అసలు నా చిన్నప్పుడు సగం స్కూలు బామ్మ దగ్గరే ఉండి చేసా తెనాలిలో. ఒక్కతే ఎందుకు అక్కడ, వచ్చి మా దగ్గరుండమని నాన్న, అమ్మ చెపుతూనే వున్నా, యాభై ఏళ్ళుగా అక్కడే ఉండటం వల్ల పరిచయాలు బాగా వున్నాయ్. ఇంక విజయవాడ లో మాదగ్గరకొస్తే అంత తెలిసిన వాళ్ళెవరు లేరూ. అందుకే అక్కడే ఉంటోంది.

వాట్సాపులో టైప్ చేయడం పూర్తి చేసి, ఫోను జేబులో పెట్టుకొని "వస్తున్నా" అని కిందకి పరిగెత్తా. సామాన్లు కార్లో పెట్టి అందరం బయల్దేరాం. కారు నేను నడుపుతూ వుంటే నాన్న ముందు సీట్లో కూర్చుని, వెనక్కి తిరిగి అమ్మతో మాట్లాడుతున్నారు. అమ్మతో పాటు కూర్చోవచ్చు, కాని ఆయనికి తన డ్రైవింగ్ మీదున్న నమ్మకం ఇంకెవరి మీదా లేదు. నేను సరిగ్గా పోనిస్తానో లేదోనని ముందు కూర్చుని, ఇక్కడ నెమ్మదిగా పోనివ్వు, ఆ కారుని దాటి వెళ్ళు, ఇలా సలహాలు. దీన్నే ప్యాసింజర్ డ్రైవింగ్ అంటారేమో. విజయవాడ దాటి తుమ్మపూడి, దుగ్గిరాల మీదుగా తెనాలి వైపు పోతున్నాం. పెద్ద సిటీ దాటామన్నదానికి సంకేతంగా చుట్టూ పొలాలు, చెట్లూ, చిన్న చిన్న టౌన్లు. చిన్నప్పటి వాతావరణం గుర్తొచ్చింది. అప్పట్లో మా బామ్మ దగ్గర ఉండేప్పుడు, నా ఫ్రెండ్సుతో ఇలా బయటకొచ్చి పొలాల వెంబడి తిరిగే వాళ్ళం. అవి మా పొలాలే. అసలు కొన్ని తరాల వరకు మాకు చాలా ఆస్తులు, పొలాలు, స్థలాలు వుండేవంట, జమీందారీ తాలూకావాళ్ళమట. కాలం గడిచే కొద్దీ కొన్ని పోయాయ్, కొన్ని మిగిలాయ్.

కారు బామ్మ ఇంటి దగ్గర తీసుకొచ్చి ఆపాను. పెట్టెలు కిందకి తీస్తుంటే ఇంటి తలుపు తీసి బామ్మ బయటకి వచ్చింది. బాగోగులు అడిగిన తరువాత అందరం లోపలికి వెళ్ళాము. ఇంట్లో పెద్ద సామాన్లేమి లేవు. నేను చిన్నప్పటినుంచి చూస్తున్న సామాన్లే వున్నాయ్. అవి ఎంత పాతవో తెలీదు కాని, మంచి నగిషీలు చెక్కినవి, రకరకాలా డెజైన్లు వేసి ఉన్నాయ్. అలాంటివి ఇప్పుడు దొరకవు. నేను చిన్నప్పుడు ఆడుకున్న బల్ల ఉయ్యాల ఇంట్లో ఇంకా అలాగే వుంది. అప్పటికి మధ్యాహ్నం అయ్యింది. భోజనం చేసి, అందరం ఉస్సూరుమంటూ వరండా లో కూర్చున్నాం. నేను ఆ ఉయ్యాలలో కూర్చుని ఊగుతున్నా.

"అవున్రా ఆది. నీకేదో పెద్ద ఉద్యోగం వచ్చిందని మీ అమ్మ చెప్పింది. మంచి జీతమేనా?" అడిగింది బామ్మ.

"గవర్నెంటు ఉద్యోగం"

"ఏదో మిలటరీ ఉద్యోగమంది మీ అమ్మ? సైన్యం లో చేరావా ఏంటి? జాగ్రత్త నాయనా. మన వంశానికి నువ్వొక్కడివే దిక్కు"

నేను నవ్వుతూ "సైన్యం లో కాదు బామ్మ..డిఫెన్సు డెపార్టుమెంటులో ఉద్యోగం. సైన్యాన్నికి ఉపయోగపడే వస్తువులు మేము తయారు చేస్తాం. కొత్త డెపార్టుమెంటు AMAR అని. అంటే అడ్వాన్స్ డ్ మెటీరియల్ అండ్ రీసెర్చ్"

నాన్న కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్నారు. తల ఎత్తకుండా " జీతం లక్షల్లో వుంటుంది."

"ఏమన్నావు?" బామ్మ అడిగింది..

"లక్షల్లో . మంచి ఉద్యోగమే..ఇంజినీరింగు చేసాడు కదా.." నాన్న మళ్ళీ.

"నిన్ను కాదురా. ఏవన్నావురా ఆది?"

"సైన్యానికి ఉప..."

"అది కాదు. ఆ పేరు, ఏం చెప్పావ్? అమరా?"

"అవును?" నాకర్థంకాక అన్నా. మిగతా వాటివిషయాలు వదిలేసి తనకేమాత్రం సంబంధం లేని ఈ పేరు గురుంచి అడగడం విడ్డూరమనిపించింది నాకు.

"ఉండిక్కడ..ఇప్పుడే వస్తా.." అని లోపలికెళ్ళింది బామ్మ.

నాన్న నేను ఒకరికేసి ఒకరం చూసున్నాం.

రెండు నిమిషాలైనా బామ్మ రాకపోతే నేనే లోపలకి వెళ్ళా. ఇంటి వెనకవైపున్న గదిలో బామ్మ ఏదో వెతుకుతున్న చప్పుడు వినిపిస్తోంది. చుట్టూ అన్నీ చాలా పాతా సామాన్లు, ఏ కాలం నాటివో కుర్చీలు, బల్లలు, భోషాణాలు, పెద్ద ఇనపెట్టెలు ఇంకా చాలా వున్నాయ్. చిన్నప్పుడు రెండు మూడు సార్లు వచ్చుంటానేమో ఈ గదిలోకి. చీకటి గా వుండి భయం వేసేది..

"ఏం వెతుకుతున్నావ్ బామ్మా?"

"ఆ మూలనున్న పెద్ద ఇనపెట్టె బయటికి లాగి ఇక్కడికి తీసుకురా. చెప్తా" అని చూపించింది. మిగతా సామాన్లు పక్కకి తోసి ఆ పెట్టెను తీసుకొచ్చా. బామ్మ నేల మీద కూర్చుని పెట్టె తలుపు తీసి, లోపల వెతుకుతోంది. అందులో కొన్ని పాత వస్తువులు గుర్తుపట్టలేని విధంగా వున్నాయ్. బామ్మ, బాగా తుప్పు పట్టిన ఒక ఇనప గుండ్రాయి లాంటిది ఒకటి తీసింది లోపలినుంచి...అది నాకిచ్చి,

" దాని మీద ఏముందో చదవరా" అని అడిగింది.

ఆ గుండ్రాయి కొంచెం బరువుగా వుంది. బాగా పాడయిపోయింది. ఏవో అక్షరాలు వున్నా చదవటం కష్టం. తుప్పు తుడిచినా సరిగ్గా కనపడటం లేదు. ఏదో ఒక అక్షరం లాంటిది కనపడుతోంది కాని అది బాగా చెక్కుకు పోయి వుంది. కొంచెం ఊహను కలిపితే ఇంగ్లీషు అక్షరం R అవ్వచ్చు. ఖచ్చితంగా చెప్పలేము.

"మీ తాతయ్య పోయేముందు దీన్ని భద్రంగా దాచమన్నారు. అప్పట్లో నీ వయస్సులో వుండగా ఆయన తాతగారు ఇచ్చారట. అది కూడా ఆయన తండ్రి గారి నుంచి వచ్చిందట. ఎన్నో తరాలనుంచి మన వంశంలో వుందట ఈ గుండ్రాయి. దీని మీద అమరుడో గంధర్వుడో ఏదో పేరు వుండేదట.. అప్పట్లో, అంటే మీ తాతగారి ముత్తాతగారు చాలా పేరు మోసిన వారంట. ఆది వెంకయ్య గారో, ఆది వైతరణి గారో ఏదో ఉండేది ఆయన పేరు. గొప్ప విద్వాంసుడని, చాలా విషయాలు తెలుసని..బ్రిటీషు వాళ్ళ భాష మాట్లాడేవారని, వాళ్ళతో బాగా స్నేహం వుండేదని చెప్పేవాళ్ళు. ఆయన, భార్య సరోజనమ్మ గారు జమీందారి కుటుంబం వారంట. దాని వల్లే మనకి ఇప్పటికీ కొద్దో గొప్పో ఆస్తులున్నాయి. ఊళ్ళలో గుళ్ళూ, గోపురాలు, అప్పట్లో స్కూళ్ళు కట్టించారు. నువ్వు అమరు అంటే ఇది గుర్తొచ్చింది. ఇది ఇంక నీదగ్గరే పెట్టుకో" అంది బామ్మ.

నాకేమీ అర్థం కాలేదు. పాత గుండ్రాయికి, నా ఉద్యోగానికి, బోడి గుండుకి మోకాలికి ముడి పెట్టినట్టుంది. ఎందుకు నొప్పించడం అని "సరే తీసుకెళ్తా . ఇంకో పది రోజుల్లో జాయిన్ అవుతున్నా".

"జాగ్రత్తగా వుండరా. ఆ మిలటరీ ఉద్యోగాలు మనకు సరిపడవు.." అంది మళ్ళీ బామ్మ.

"చెప్పా కదా బామ్మా. మిలటరీ ఉద్యోగం కాదు. నువ్వు ఖంగారు పడకు...నేను కొంచెం సెటిల్ అయిన తరువాత నిన్నొకసారి తీసుకెళ్తా".

ఇంతలో అమ్మ వచ్చి ఎవరో చూడటానికి వచ్చారని చెప్పింది. మేమా గది తాళాలేసి వరండా వైపు నడిచాం.

★★★★★

మూడు నెలలైంది నేను ఉద్యోగంలోకి చేరి. పని బాగానే వుంది కాని, నా బాసు నాకు సంబంధించిన పని వరకే చెప్పేవారు కాని, అసలు అది ఎందుకు ఉపయోగపడేదో చెప్పలా. ఎవర్ని అడిగినా ఎవరూ తమ పనికి సంబంధించిది తెల్సంటారే కాని, మిగతా వాళ్ళ పనేంటో, అసలు వాళ్ళు పని చేసేది దేనికో తెలియదనేవాళ్ళు. కొందరికి తెలుస్కోవాలని కుతూహలం వున్నా, అడగడానికి ధైర్యం చాలలేదు...నేను అక్కడా, ఇక్కడా అడుగుతూనే వున్నా. ఇలా కొంత కాలం గడిచింది.

ఒక రోజు మా బాసు తన గది లోకి పిలిచి తలుపెయ్యమన్నారు, సూటీగా చూస్తూ,

"నువ్వు నీ పని మీద దృష్టి పెట్టడం మంచిది. అందరినీ వాళ్ళ పని గురించి అడుగుతున్నావని తెలిసింది?".

"అవున్సార్. అసలు మేము ఏ ప్రాజెక్టు మీద పని చేస్తున్నామో చెప్తే మాకు కూడా మా పని ఎలా చేస్తే తొందరగా రిజల్టు వస్తుందో, ఎలా ప్రాజెక్టుకి ఉపయోగపడుతుందో తెలుస్తుంది. మా పని చుట్టూ గిరి గీసి కూర్చుంటే, ప్రాజెక్టుకి అంత ఉపయోగం లేదు" అన్నాన్నేను.

"మీకు చెప్పిన పని మీరు చెయ్యండి, అది ప్రాజెక్టుకి ఎలా ఉపయోగ పడుతుందో నేను చూసుకుంటాను." కొంచెం గొంతు పెంచుతూ అన్నారు మా బాస్..."ఇక్కడ జరిగేది ఏ సాఫ్ట్ వేర్ ఉద్యోగమో కాదు. దేశ రక్షణకి సంధించిన పని. తెలియాల్సిన వాళ్ళకే చెప్తాము, తెలియాలనుకుంటే చెప్తాము. అనవసర విషయాల జోలికి వెళ్తే నీ ఉద్యోగం సంగతి వదిలెయ్యి, దేశ ద్రోహం చట్టం కింద అరెస్టు చెయ్యాల్సి వస్తుంది.."

"అది కాదు సార్, ప్రాజెక్టు ..." అనేంత లోపే, ఆయన ముందుకు వంగి "ఇంక నువ్వు వెళ్ళొచ్చు." అన్నారు.

ఇంక మాట్లాడేదీ ఏమీ లేక, బయటికొచ్చి నా డెస్కు దగ్గరికి కెళ్ళాను. ఈ విషయాన్ని వదిలేద్దామని అనుకున్నా. కాని ఇంకా మెదడులో అవే ప్రశ్నలు. ఆయన అరుపులకి తల నొప్పొచ్చినట్టుంది. కొంచెం కాఫీ తాగాలి. మా ఆఫీసు లోనే ఒక రూములో కాఫి మషీను ఒకటుంది. అక్కడికి వెళ్ళి కాఫి కలుపుకొని అక్కడున్న సోఫాలో కూర్చుని మెల్లగా కాఫీ తాగుతున్నా.

రెండు నిమిషాల తరువాత గదిలోకి ఒక బట్టతలతను వచ్చాడు. చూస్తుంటే నిద్రపోయినట్టు లేదు. నన్ను చూసి, మొహమాటానికి ఒక నవ్వు విసిరి కాఫీ కలుపుకుంటున్నాడు. అతన్ని కొంచెం సేపు చూసి, అడిగా.

"బాగా అలిసి పోయినట్టున్నారు?"

కొంచెం ఇబ్బందిగా నవ్వడాతను. చెయ్యి చాచి "నా పేరు అద్వైత్, ఆది అంటారు నన్ను" అన్నా.

"రంజిత్ మిస్రా" అన్నాడతను. పేరు ఎక్కడో విన్నట్టుంది.

"మీరు...అప్లైడ్ డివిజన్ లో పని చేస్తారు కదూ.."అవునన్నట్టు తలూపాడతను.

"మీ పని చాలా ఇంటరెస్టింగ్ అని విన్నా. అఫీసు వెనకాల వున్న ఆ పెద్ద బిల్డింగ్ లో కదా మీరుండేది?"

మళ్ళీ తలూపాడు. మితభాషి.

నవ్వుతూ అడిగా "ఆ బిల్డింగ్ లో ఏముందో తెలుసుకోవచ్చా? మా ఆఫీసులో బెట్ వేసుకున్నాం. నేనేమో అదొక గోడౌను అనంటాను, కాదు అక్కడ హరికథ చెప్తారని నా కొలీగంటాడు. మీరు బాగా చెప్తారని పేరుంది.."

అతనూ కొంచెం నవ్వి, "చెప్పకూడదండి.. చెప్పలేము కూడా. మీకు హరికథ కావాలంటే నేను ఇక్కడికి వచ్చి చెప్తా.."

ఇద్దరమూ కొంచెం సేపు అలా మాట్లాడుకొని ఎవరి దారిన వాళ్ళం వెళ్ళాము.

నేను పనిలో మునిగి తేలేసరికి సాయంత్రం ఏడయ్యింది. అస్సలు గమనించలేదు టైము. అప్పటికే అందరూ వెళ్ళిపోయారు. నేను నా బ్యాగు తీసుకొని, ఆఫీసు నుంచి బయటకి వచ్చాను. నిర్మానుష్యంగా వుంది పార్కింగ్ లాట్. మెల్లగా నా కారు దగ్గరికి వెళ్ళి బ్యాగు కారులో పెట్టాను. ఎదురుగా రంజిత్ ఉండే పెద్ద బిల్డింగ్ కనిపించింది.

లోపలికి వెళ్ళడానికి నాకు పర్మిషను లేదు. సెక్యూరిటి గార్డులు డోరు దగ్గర వున్నారు. నా కుతూహలం ఇంకా రెట్టింపయ్యింది. రంజిత్ ఖచ్చితంగా లోపల వుంటాడు పని చేస్తూ. మనిషి మెతగ్గా కనిపించాడు. కొంచెం రుద్దితే లోపల ఎముందో తెలుస్తుంది. నేను ఆ గార్డుల దగ్గరికి వెళ్ళి "లోపల రంజిత్ మిస్రా గారిని కలవాలి. ఈ ప్రాజెక్టు డిస్కు ఇవ్వాలి" అని ఒక డిస్కు చూపించా. నా ఆఫీసు బాడ్జి కూడా చూపించమన్నారు.. ఒక గార్డు లోపలికి వెళ్ళి రెండు నిమిషాల తరువాత తిరిగి వచ్చి "లోపలికి వెళ్ళండి అన్నాడు". నాకాశ్చర్యం వేసింది.. ఇంత ఈజీనా లోపలికి వెళ్ళడం? అలా అయితే ఈ పని ముందే చేసేవాడిని కదా.

లోపల కెళ్ళి నడుస్తుంటే రంజిత్ ఎదురు పడ్డాడు. "సారీ, మిమ్మల్ని కలవాలని ఆ గార్డులకి అబద్ధం చెప్పాను.."

"అది నాకర్థమయ్యే మిమ్మల్ని లోపలికి పంపమన్నాను. మీరు చాలా పెద్ద రిస్కు తీసుకుంటున్నారు. రండి నాతో" అన్నాడు రంజిత్.

మేమిద్దరం ఒక డోరు దగ్గరికి వచ్చి, దాన్ని తెరిచాం. లోపలికి అడుగుపెట్టగానే మా ముందర కొన్ని కుర్చీలు, వాటి తరువాత పెద్ద అద్దం తో చేసిన కిటికీ వుంది. అంటే ఆ కుర్చీల్లో కూర్చుని, ఆ అద్దం కిటికీ లోంచి చూడచ్చు ఏముందో. ఆ కిటికీ వెనక వున్న దృశ్యం చూస్తే అద్భుతం అనడం దానిని అవమానించినట్లే. కళ్ళు ఎంత పెద్దవి చేసినా తనివి తీరని అపూర్వమైన దృశ్యం. ఒక పెద్ద గది....కాదు, కాదు...పెద్దది అనడం కంటే విశాలమైన, బ్రహ్మాండమైన గది అనడమే కరెక్టు. కనీసం వంద అడుగుల ఎత్తు, వంద అడుగుల వెడల్పు వుంటుంది. మొత్తం తెల్ల పెయింటింగు. ఒక వైపు పెద్ద క్రేను. గది పై కప్పు నుంచి అత్యంత కాంతివంతమైన లైట్లు. ఇంక గది మధ్యలో వున్నదాన్ని చూస్తే ఏదో హాలీవుడ్ సినిమాలోనించి తీసుకొచ్చారేమోనని అనిపిస్తుంది. ఒక గుండ్రని గోళం. ఏదో లోహంతో తయారుచేసింది కాబోలు. మిల మిల మెరుస్తోంది ఆ లైట్లలో. దాని చుట్టూతా రెండు రింగులు గిరగిర తిరుగుతున్నాయి.. ఆ గోళం కనీసం ముప్పై , నలభై అడుగుల వ్యాసం ఉంటుంది. లోపలికి వెళ్ళడానికి ఒక తలుపనుకుంటా వుంది.

నేను మాట రాక అలా చూస్తూ వుండిపోతే, రంజిత్ మాట మళ్ళీ ఈ లోకంలోకి తెప్పించింది.

"ఇది టాప్ సీక్రెట్ ప్రాజెక్టు, మన దేశానికి పనికొచ్చే ఒక కొత్త ఆయుధం. మన సైనికుల్ని అరక్షణంలో ఒక చోటుకి నుంచి ఇంకో చోటుకి తీసుకెళ్ళే పరికరం. పూర్వకాలంలో దేవతలు ఇలా మాయమయ్యేవరని విన్నాం. కాని ఇప్పుడది నిజం చేసి చూపిస్తున్నాం"

"అంటే..." నేనేం అడగాలో నాకే అర్థం కావటం లేదు.

"అంటే, ఇది ఒక టెలిపోర్టేషన్ మషీన్. దేన్నైయిన క్షణం లో భూమి మీద యే ప్రదేశానికైనా పంప వచ్చు. కిందకి పదండి చూపిస్తాను".

ఆ బ్రహ్మాండమైన గోళం దగ్గరికి వెళ్ళాము. రంజిత్ దాని డోరు తెరిచి, లోపలికి చూపిస్తూ, "ఇందులో కూర్చుంటారు మన సైన్యం. ఈ తలుపు వేసేసిన తరువాత, మనం ఎక్కడికి వెళ్ళాలంటే అక్కడి ప్రదేశం తాలూకు సమాచారం ఈ కంప్యూటరుకి ఇస్తే క్షణంలో వెళ్తారు.."

"మళ్ళీ తిరిగి రావాలంటే?"

రంజిత్ ఒక డెస్కు దగ్గరికి వెళ్ళి చేతిలో ఏదో తీసుకొచ్చాడు. అది ఒక చిన్న గోళం లాగ ఉంది. ఆ పెద్దదాని పిల్ల లాగ. రంజిత్ అది నాకిచ్చి,

"ఇది ప్రతి సైనికుడి దగ్గర ఉండాలి. దాన్ని బట్టి వాళ్ళు ఎక్కడ వుంటారో తెలుస్తుంది. అప్పుడు మేము వాళ్ళని మళ్ళీ ఇక్కడికి ఈ పెద్ద మషీన్లో కి తెస్తాము. మన కార్లో జిపి యస్ లాగన్నమాట."

నేను ఆ చిన్న గోళం ని పరీక్షగా చూశాను.. ఒక చోట చిన్న గా AMAR అని చెక్కి వుంది. మా డిపార్టుమెంటు పేరు. ఎందుకో బొమ్మ గుర్తొచ్చింది. తన గుండ్రాయి మీద కూడా...

"లోపల చూస్తారా?" అడిగాడు రంజిత్ నా అలోచన్లకి అడ్డంపడి .

"వెళ్ళొచ్చా? అసలే పర్మిషను లేకుండా వచ్చా, అనవసరంగా మీ ఉద్యోగానికి కూడా ప్రాబ్లెం.." అన్నా నేను.

రంజిత్ నవ్వి, "అసలు ఈ టైంలో పెద్దగా ఎవరూ రారండి. మాలాంటి వాళ్ళు తప్ప.."

నేను సరేనని, డోరు తీసుకొని లోపలికెళ్ళా. కూర్చోవడానికి కుర్చీలు అలాంటివేమీ లేవు. క్షణం లో అయిపోయే దానికి కుర్చీ దేనికి. లోపల చాలా ఖాళీ ఉంది. మరి అంత మంది సైన్యాన్ని పంపాలి కదా. నేను లోపల నింపాదిగా చూస్తూ వుంటుంటే, పెద్ద శబ్దంతో ఆ పెద్ద గోళం డోరు మూసుకుపోయింది. నేను పరిగెత్తినా లాభం లేకపోయింది. గోళానికున్న కిటికీల లోనుంచి రంజిత్ ని పిలుద్దామని చూశా.

బయట రంజిత్ తో పాటు నా బాస్. ఇద్దరూ నన్నే చూస్తున్నారు. గోళం లోపలున్న స్పీకర్ల లో నుంచి నా బాస్ గొంతు.

"నీకు ముందే వార్నింగ్ ఇచ్చాను. అనవసరపు విషయాల్లో తల దూర్చొద్దని.. ఇంక చేసేదేమి లేదు. నిన్ను పంపెయ్యడమే.."

"రంజిత్...రంజిత్...డోరు తెరు...ఆయన మాటలు వినకు...రంజిత్"...దబదబా కిటికీ తలుపులు కొడుతున్నా.

రంజిత్ నిస్సహాయంగా చూస్తున్నాడు.

"తలుపు తియ్యండి...ఎక్కడికి పంపిస్తున్నారు నన్ను?" అరుస్తున్నా.

"ఎక్కడికి కాదు. ఎప్పుడుకి అని అడుగు..." మా బాస్ అన్నాడు.

"అంటే..????"

"అంటే...నువ్వు మానవ చరిత్రలో కాలంలో ప్రయాణించే మొట్ట మొదటి మానవుడివి....నువ్వున్నది టైం మెషీన్లో.."...

ఉరుము మీద పడినట్టైంది.

"మళ్ళీ వెనక్కి రావడం అసంభవం. కాలాన్ని మించిన ఆయుధం లేదు. సరిగ్గా వాడుకుంటే అసలు శత్రువులే లేకుండా చూడచ్చు. నీ చేతిలో ఉన్న చిన్న గోళం నిన్ను మాత్రమే పంపించే ఏర్పాటు. మనుషుల్ని చంపకుండా, వాళ్ళని వదిలించుకోవడానికి ఇది భలే మార్గం. ఎంత వెదికినా నువ్వు దొరకవు. వెతకడం అనేది ఒక ప్రదేశంలో చేసేది. కాలం లో ఎవరు వెతుకు తారు?. నిన్ను ఒక లక్ష సంవత్సరాలు వెనక్కి పంపుతా. మనం అప్పుడు ఇంకా కోతుల రూపంలోనే వుండే వాళ్ళమంటా. హనుమంతుడు కనపడతాడేమో చూడు"..నవ్వుతూ అన్నాడు బాసు.

"నో.." గట్టిగా అరిచాను, బాస్ బట్టన్ నొక్కుతూంటే

ఏదో ఒకటి చెయ్యాలి...దీన్ని ఆపాలి..చుట్టూ చూసా.. బట్టన్స్ తో ఒక టేబుల్ లాంటిది కనిపించింది. నా దగ్గరున్న చిన్న గోళంతో దాన్ని మీద గట్టి గా కొట్టా...గోళం కొంచెం నొక్కు పడింది కాని ఆ బట్టన్స్ కొన్ని ఊడిపోయాయి...అది చూసి ఇంకా దబ దబా బాదాను....పెద్ద గోళంకి ఏదో అయ్యింది...ఊగడం మొదలు పెట్టింది..

ఏం జరిగిందో కాని చుట్టూ చాలా కాంతివంతమైన వెలుతురు....హటాత్తుగా వెలుతురు మాయం....నాకు తల తిరుగుతోంది...స్పృహ తప్పి పడిపోయాను...

★★★★★

కళ్ళు తెరిచి చూసే సరికి నీలాకాశం. పక్షుల కోలాహలం. తల ఇంకా తిరుగుతోంది. మెల్లగా లేచి చుట్టూతా చూశాను. ఏదో పొలం పరిసర ప్రాంతాల్లో వున్నాననుకుంటా. ఏ ఊరిది? నన్నెక్కిడికి పంపారు?

మళ్ళీ కళ్ళు మూసుకొని జరిగింది గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుంటే,

"సామి, ఏంది ఇలా పడున్నావు? ఏ వూరు మీది?"

ఎదురుగా పంచెగోచీ కట్టుకొని, గునపం భుజం మీద పెట్టుకొని రైతు లాగ ఎవరో.

"ఏ...ఏ ఊరిది?" అడిగా తల పట్టుకుని.

"కొత్తూరు...అది సరే గాని, జబ్బైందా? కింద పడున్నావు? ముందు లెవ్వు.."

చెయ్యి పటుకొని లేపాడు నన్ను.

"పెద్ద బిడ్డల బాబు లాగున్నావు... ఏడ నుండి వచ్చావు? "

"చాలా...దూరం.." నడవడానికి ప్రయత్నం.

"ఇది మా రాజలింగం జమీందారి గారి పొలం...ఆయన దగ్గరికి తోడ్కొని పొతాను, ఆయనకి సెప్పుకో.."

జమీందారా?

"ఏ సంవత్సరం ఇది?"

"అదేమో గాని, మా జమీందారు గారు నైజాం పెబువులికి కప్పం కడతారు.." వాడికి తెలిసింది చెప్పాడు.

నైజాం ప్రభువులా? అంటే కనీసం పద్దెనిమిదో శతాబ్దం...1750-1780 ..లేదు...అది ఇంపాజిబుల్ !

జమీందారు గారు ఇంటి బయటే కూర్చున్నారు. ఎవరితోనో మాట్లాడుతూ, మమ్మల్ని చూసి ఆగారు.

ఆ రైతు ఆయనకి నమస్కారం పెడుతూ.

"దణ్ణాలు సామి, ఈ బిడ్డ మన పొలం లో పడివొంటే మీ దగ్గరికి తీసుకొచ్చా. చానా దూరం వొచ్చాడంట. సూస్తుంటే పెద్దోళ్ళ బిడ్డ మాదిరి వున్నాడని తమరి దగ్గరికి ఎత్తుకొచ్చా.."

జమీందారు గారు నన్ను పైకీ, కిందకీ ఒక సారి చూసి, "తమరి ఊరు, పేరు?" అనడిగారు.

ఏం చెప్తే ఈయనకు అర్థం అవుతుంది?

"నా పేరు అద్వైత్... మాది ఆంధ్ర ప్రాంతంలో బెజవాడండి"....తల పట్టుకుని ఆగాను. ఇంకా దిమ్మగా వుంది. మళ్ళీ ఏదో చెప్పబోతుంటే...."సరి సరి.." మధ్యలో ఆపారు జమీందారు గారు

ఆయన పక్కనున్నతని వైపు చూసి ఏదో చెప్పి, "ముందు మీరు మా ఆతిధి లోగిలి లో సేద తీర్చుకోండి...మాకు ఇప్పుడు అత్యవసర కార్యాలున్నవి...మా గణకుడు మీకు తగిన వసతి ఏర్పాటు చేస్తారు.." అన్నారు..

"థాంక్యూ...ఆ..అదే...ధన్యవాదాలు"

"ఓహో...మీకు తెల్ల దొరల భాషా కూడా వచ్చా...మంచిది...చదువు నేర్చిన వారివల్లె ఉన్నారు...మా కుమార్తె మీతో సంభాషించగలదు..." అని, లోపలికి చూస్తూ,

"అమ్మా, సరోజా, ఇలా రామ్మా ఒక మారు..." అన్నారు.

సరోజ? సరోజ?? ఎక్కడ విన్నా ఈ పేరు??

గణకుడు నా వైపు చూసి...

"రండి ఆది..?" అని ఆగారు...నా పేరు గుర్తు రాక...

నేనేం చెయ్యాలో నాకర్థం అయ్యింది...నేనెవరో కూడా తెలిసింది...కళ్ళు ఒకసారి మూసుకొని, మెల్లగా తెరిచి, చిన్నగా నవ్వుతూ (బామ్మని గుర్తుతెచ్చుకొని)...."అద్వైత్, ఆది వెంకయ్య అని పిలవండి"

# భోక్త

## అనామకుడు

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

"రా, వచ్చి కూచో పేరిశాస్త్రీ"

"ఎలా ఉన్నారమ్మా?"

"ఎవరితో ఐతే జీవితాంతం జీవిస్తానని అనుకున్నానో – ఆయన చాలాతొందరగా నన్నొదిలిపెట్టి వెళ్ళిపోయారు. ఆయనతో వెళ్ళిపోదామంటే – పిల్లల్ని వదిలి వెళ్ళిపోలేకపోతున్నాను. అలాగని పిల్లలు నా దగ్గరే ఉంటారా అంటే – వాళ్ల చదువులకి వాళ్ళు అమెరికా వెళ్ళిపోయారు"

"మీరు అధైర్య పడకండమ్మా – ఈ ఊరి జనం అంతా మీ పిల్లల్లాంటి వాళ్ళే. వాళ్ళంతా మిమ్మల్ని తల్లిలా చూసుకుంటున్నారు. వాళ్ళకోసమైనా మీరు ధైర్యంగా ఉండాలి. ఊరికి కావల్సిన మేలు చేస్తూ ఉండాలి"

"నేనెవరినయ్యా ఊరికి మేలు చెయ్యడానికి? ఉన్నన్నాళ్ళూ – ఈ ఊరు మనదీ, ఈ జనం మనవాళ్ళూ అంటూ బతికిన నాయుడు గారు పోయారు. నేను చేసేది ఏమీలేదు – ఈ ఊరిమీద బతకడం తప్ప"

"మీరు ఊరిమీద బతకడం ఏంటమ్మా? జమీందారుగారు ఈ ఊరికి చేసినదానికి – మీకు ఏంచేసి ఈ ఊరు ఋణం తీర్చుకోగలుగుతుంది?"

"జమీలూ, జమీందారీలూ ఎప్పుడో పోయాయి పేరిశాస్త్రీ – ఇక్కడున్నవాళ్ళలో కాస్త ఆస్తి ఉన్నవాళ్ళం మేం. అదీ ఆ భగవంతుడి దయవల్ల. ఆ ఉన్నదాంట్లో ఎవరికైనా మేలు జరిగితే అంతకన్న కావల్సిందేముంటుంది?"

"అలా అనుకోగలగడమే మీ గొప్పతనం"

"ఈ మాటలకేంలే కానీ – మీ భార్య పురిటికి పుట్టింటికెళ్ళింది కదా – ఇప్పుడేగా పురిటిరోజులు – కబురేమైనా వచ్చిందా?"

"నిన్నరాత్రే కానుపైందిట – పిల్లాడు పుట్టాడుట – మావగారు ఫోన్లో చెప్పారు – అది చెప్దామనే మీదగ్గరకి వచ్చాను"

"ఇంత మంచిమాట ఇంత ఆలస్యంగానా చెప్పడం? అంటే వెంకటశాస్త్రి గారు మళ్ళీ పుట్టారన్న మాట. పిల్లాడికి మీ నాన్న గారి పేరే పెడతావుగా. ఆయనలానే పెద్ద ఘనాపాఠీ అవాలి నీ కొడుకూనూ"

"ఇంతవరకూ ఏమీ అనుకోలేదు కానీ – ఇప్పుడు మీరన్నారుగా – ఇంక ఆలోచించేదేమీలేదు – పిల్లాడి పేరు మానాన్నగారిపేరే – వెంకటశాస్త్రి"

"నేను చిన్నవెంకటశాస్త్రనే పిలుస్తాను – ఎప్పుడు చూపిస్తావు మాకు? ఇంతకీ నువ్వు ఎప్పుడు బయల్దేరుతున్నావు?"

"సాయంత్రం బయల్దేరుతున్నానమ్మా"

"నీకు పుట్టబోయే వాళ్ళకోసం – వెండి కంచమూ, వెండి గిన్నే చేయించి ఉంచాను. నీతో తీసికెళ్ళు. అలాగే ఈ పదివేలూ ఉంచు. పిల్లవాడి అవసరాలకి పనికివస్తాయి"

"పెనిమిటి పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నారు మీరు – ఇవన్నీ ఎందుకమ్మా?"

"మా యింట ఏశుభకార్యమైనా దగ్గరుండి చేయించేవారు మీ నాన్నగారు – ఆ తర్వాత నువ్వు – ఇప్పుడు మళ్ళీ మీ నాన్నగారి అంశే – ఈ చిన్నవెంకటశాస్త్రి. మీనాన్నగారే మీ ఇంట్లో కొడుకుగా పుట్టినందుకు మీరు పండగ జరుపుకుంటోంటే నేనీ మాత్రం చెయ్యడం ఏదో ఘనకార్యం ఐనట్లు మాట్లాడతావేం?"

"అమ్మా – నేను మీరు కాపురానికి వచ్చిన ఆరు నెలలకి పుట్టానుట – నేను పుట్టినప్పుడు – జమీందారుగారు – మీచేతే – నాకు వెండికంచం, వెండిగిన్నే, వెయ్యిరూపాయలూ ఇప్పించారుట – కంచం, గిన్నే ఇంకా మాఇంట్లో ఉన్నాయి – అవే కాదు – ఇంతకు ముందు తరాలనుండి మీ వంశం మాకిస్తున్న కంచాలూ, గిన్నెలూ – మా ఇంట భద్రంగా ఉన్నాయి"

"ఆనవాయితీ ఆగకుండా – ఇప్పుడు నేనూ చిన్నవెంకటశాస్త్రికి ఇస్తున్నా – ఇంక రాబోయేతరం సంగతి మన చేతిలో ఉందా?"

"అలా అంటారేంటమ్మా?"

"ఏంచెప్పగలం పేరిశాస్త్రీ – మాపిల్లలు చూడు – చదువులకి విదేశాలకి వెళ్ళిపోయారు. వెళ్ళిపోయారని నేనేం వాళ్లని తప్పుపట్టడంలేదు. మారే కాలంతో మనుషులూ మారాలి. అలానే నీపిల్లాడూనూ – నువ్వు మీనాన్నగారి దగ్గర వేదాలూ, మంత్రాలూ, పురాణాలూ, కర్మకాండలూ నేరుకున్నావు. వాటిని నమ్ముకునే బతుకుతున్నావు. చిన్న వెంకటశాస్త్రి అలా చెయ్యాలని లేదుగా"

"వాడికి నేను మా విద్యలన్నీ నేర్పిస్తాను. మీరు వాడిచేతే వ్రతాలూ, పూజలూ చేయించుకోవాలి"

"అలాగే జరిగితే నాకు సంతోషమే"

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

"ఏంటి పేరిశాస్త్రీ – అదోలా ఉన్నావు? ఒంట్లో కులాసానేకదా?"

"బానే ఉందమ్మా"

"ఆర్థికంగా ఏమీ ఇబ్బంది లేదుగా – మొహమాటపడకు – చెప్పు"

"ఆర్థికపరమైన ఇబ్బందులు ఏవీ లేవమ్మా"

"మరి సమస్య ఏమిటి?"

"చిన్న వెంకటశాస్త్రి విషయమే"

"పదేళ్ళూ నిండాయా?"

"ఆ నిండాయిగా"

"ఏం చెప్పిస్తున్నావు?"

"ఏం చెప్పించను? మాటే రానివాడికి మంత్రం ఏంవస్తుంది? వేదం ఏం వల్లెవేస్తాడు? స్వరం ఏం పట్టుకుంటాడు?"

"ఈ శ్రోత్రీయం వదిలేసి మామూలు చదువులు చెప్పించు – ఏదో ఉద్యోగం చేసుకుంటాడు"

"మాటరాదుగా – స్కూలుకి వెళ్ళడంలేదు – ఎవరైనా మూగ అంటారని బెంగ – మహా అభిమానం పిల్లాడికి. ఏం చెయ్యాలో పాలుపోడంలేదు"

"అధైర్యపడకు – కొందరికి ఆలస్యంగా వస్తాయి మాటలు"

"అలా అనే ఏళ్ళు గడుపుకొస్తున్నా – పదేళ్ళకి కూడా రాని మాటలు ఇంకముందేం వస్తాయి?"

"పోనీ డాక్టర్లకి చూపించలేకపోయావా?"

"మా మావగారు తమ ఊళ్ళో పెద్దడాక్టర్లకి చూపించారు – అన్ని పరీక్షలూ చేసి – వాడికింక మాట రాదని తేల్చారు"

"ఎలా బతుకుతాడో?"

"అదే కదమ్మా నా బాధ. మా వంశం మాట మీద ఆధారపడ్డది. వాక్కే మా జీవనాధారం. అదేలేదు వాడికి"

"మీ వంశంలో అటుకానీ ఇటుకానీ – ఇలా మాటరాని వాళ్ళు ఉన్నారా?"

"నాకు తెలిసి లేరు. మానాన్న గారి వైపు మీకు తెలుసుగా – మామూలు మాటకాదు – సుస్వరభూయిష్ఠంగా వేదపారాయణ చెయ్యగలిగిన వాళ్ళు. నేను చేసిన పాపం ఏమిటో – నా పిల్లాడికే ఈ లోపం వచ్చింది"

"ఎవరికి ఎందుకు ఏంప్రాప్తిస్తుందో చెప్పలేం పేరిశాస్త్రీ – ఇందులో నువ్వు చేసిన పాపం కానీ పుణ్యం కానీ ఏవీలేవు. ఆ ఆలోచనలు మానెయ్యి. ఇప్పుడు మనం ఆలోచించాల్సింది వాడి జీవితం సాగేలా భుక్తికి ఏం చెయ్యాలనే"

"నాకేం దారి దొరకడంలేదు"

"వాడికి మీ ఇంటి విద్య నేర్చుకోడం కుదరదు. అలాగని స్కూలుకి వెళ్ళే మనస్సులేదు వాడికి. పంపించే ఉద్దేశం నీకూ లేదు. నీకు తప్పనిపించకపోతే నాకో మార్గం తోస్తోంది"

"చెప్పండమ్మా"

"వాడు మంత్రానికి పనికి రాడు కాని – భోక్తకి కాదుగా. వాణ్ణి భోక్తగా పంపించు. అదేం తప్పు కాదు. అదీ దైవకార్యమే. పితృదేవతలు భోక్తల రూపంలోనే భూమ్మీదకి వచ్చి నివేదనలు స్వీకరిస్తారని కదా నమ్మకం. ఆలోచించు"

"మీరు చెప్పింతర్వాత నేను ఆలోచించేది ఏముంది తల్లీ – ఆచరించడమే"

"ఐతే – ఈసారి నాయుడిగారి ఆబ్దీకానికి – చిన్నవెంకటశాస్త్రిని మాయింటికి భోక్తగా పంపించు. అందుకు అవసరమైన కార్యక్రమం ఉంటే చూడు. వాడు ఏమీ చదవలేదన్న శంక నాకు లేదు. మా ఇంటికి వచ్చినట్లు తెలిస్తే – తక్కిన వాళ్ళూ అంగీకరిస్తారు. సరేనా"

"మహాప్రసాదం తల్లీ"

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

"దేవుడు నిన్ను పరీక్షిస్తున్నాడయ్యా పేరిశాస్త్రీ"

"నాలాంటి అర్భకుడికి ఇంత పరీక్షా? మరీ ఇంత దురదృష్టమా?"

"ఏది అదృష్టమో, ఏది దురదృష్టమో ఎలా తెలుస్తుంది?"

"మాటరానివాడు ఎలా బతుకుతాడో అనుకుంటే – భోక్తగా బతకచ్చని మీరు దారి చూపించారు. పట్టుమని పాతికేళ్ళూ రాలేదు. ఇప్పుడు వాడికి ఈ మధుమేహమంటే – దురదృష్టం కాక ఇంకేమిటి తల్లీ?"

"ఇలా అవుతుందని ఎవరు ఊహించగలరు? మన ఊహకి అందనివి చేసేవాడూ, చేయించేవాడూ కాబట్టే – అతన్ని జగన్నాటకసూత్రధారి అంటున్నాం. ఇదంతా ఆనాటకంలో భాగం. చూడాలి. తప్పదు."

"ఇది చూసే నాటకం ఐతే – చూస్తూ బాధపడతాం – బాధపడుతూ చూస్తాం. ఐతే ఈ నాటకంలో పాత్రలం మనమే. సుఖదుఃఖాలు మనకే"

"ఉపనిషత్తులు చదివిన వాడివి. భగవద్గీత పారాయణం చేస్తున్నవాడివి. వాటిసారం ఈ కష్టసమయంలో నీకు ఆసరా కావాలి."

"మీకు తెలియంది ఏముంది? కష్టాలు లేని సమయంలో వేదాంతం చదివి, అర్ధంచేసుకుని, ఒంటపట్టిందనుకుంటాం. అదంతా కష్టాలు ఉన్నప్పుడు ఉపయోగించాలని అనుకుంటాం. అసలు కష్టం వచ్చినప్పుడు ఆ జ్ఞానమంతా ఆవిరైపోయి అజ్ఞానంలో పడిపోతాం"

"అలాంటప్పుడే భగవంతుడు సాయం చేస్తాడని నమ్మగలగాలి. ఆ నమ్మకాన్ని మించిన బలం లేదు. భగవంతుడి కన్న భగవంతుడి మీద నమ్మకం మనిషికి బలం. అదే అవసరం"

"మధుమేహాన్ని తీసి పారేసే మందులు లేవు – అదుపులో ఉంచే మందులే కానీ. అంతకు మించి తిండి అదుపు ముఖ్యం. భోక్తగా వాడికి తిండి అదుపు కుదరదు. ఇంక భోక్తగా ఎలా వెళ్తాడు? సంభావనలు ఎలా సంపాదిస్తాడు? జీవితం మళ్ళీ మొదటికి వచ్చింది"

"దేవుడు ఏదో ఒకదారి చూపిస్తాడులే పేరిశాస్త్రీ. ఆ నమ్మకంతోనే ఇంటికి వెళ్ళు. మీ ఆవిడకీ, చిన్నవెంకటశాస్త్రికీ ధైర్యం చెప్పు"

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

"ఇలా చేసేరేంటమ్మా?"

"ఏంచేసాను పేరిశాస్త్రీ?"

"పదెకరాల మామిడితోట – మా చిన్నవెంకటశాస్త్రి పేరన రాసారు కదమ్మా"

"నోటితో బతకాల్సిన పిల్లవాడు – మాటెలాగూ ఇవ్వలేదు ఆ దేవుడు – ఏదో కూటితో బతుకేస్తున్నాడనుకుంటే – అదికూడా కూడదని – తినే నోటిని కట్టేసుకోమన్నాడు. ఇంకేం పెట్టుకు బతుకుతాడు చిన్నవెంకటశాస్త్రి"

"మా అవస్తేదో మేం పడాలి కానీ – మీరు మీతోట వాడికి ఇచ్చెయ్యడం సబబేనా?"

"వాడికి చెందాల్సింది వాడికి అందచేస్తున్నాను – అంతకు మించి నేనేం చెయ్యడంలేదుగా"

"తరతరాలుగా వస్తున్న ఆస్తి – మీ తర్వాత మీ వంశంవాళ్ళకి చెందడం న్యాయం – వాటిని అందుకోవల్సింది, అనుభవించాల్సిందీ – మీ పిల్లలు కానీ – చిన్నవెంకటశాస్త్రి కాదు"

"ఎక్కడో అమెరికాలో ఉంటున్న వాళ్లకి – తోటని అనుభవించే అవకాశం లేదు. దాని అవసరం కూడా వాళ్ళకి లేదు. చిన్నవెంకటశాస్త్రికి అది జీవనాధారం అవుతుంది. కాదనకు పేరిశాస్త్రీ"

"నన్ను మీరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు – మీరిస్తున్న తోటను నేను కాదనడంలేదు – దాని అసలు హక్కుదార్లం మేము కాదు – హక్కుదార్లని కాదని మాకు ఇచ్చేందుకు మేము మీకేం చేసాం తల్లీ?"

"యాభైయేళ్లక్రితం – నేను కాపురానికి వచ్చినప్పట్నుంచీ చూస్తున్నాను – మా ఇంట్లో ఏకార్యమూ – మీయింటివాళ్ళు లేకుండా జరగలేదు. నేను రావడానికి ముందు కూడా – అలాగే ఉండేదని – నేను వచ్చినప్పట్నుంచీ వింటూనే ఉన్నాను. పోయి ఏ లోకాల్లో ఉన్నారో – నాయుడు గారైతే – ఏంచేసి వాళ్ళ ఋణం తీసుకోగలమో – అని అంటూనే ఉండేవారు – ఈ రోజు ఈ చిన్నపని నన్ను చెయ్యనియ్యి"

"పాతికేళ్ళక్రితం చిన్నవెంకటశాస్త్రి పుట్టినప్పుడు వాడి అవసరాలకి సరిపడా రొక్కం, వెండిగిన్నె, వెండి కంచం ఇచ్చారు. మంత్రాలు చదవడానికి, వాడికి నోరులేదంటే – వాణ్ణి భోక్తగా మీ ఇంటికి పిలిపించుకున్నారు. భోక్తగానే వాడి జీవితం గడిచిపోతోందనుకుంటే – మాయదారి చక్కెర వ్యాధి వచ్చి పడింది. వాడి జీవితం ఎలా అని అనుకోనక్కర్లేకుండా – జీవితాంతం భుక్తికి – ఏర్పాటు చేస్తున్నారు"

"ఆ కన్నీళ్ళేంటి పేరిశాస్త్రి. మనందరికీ ఏం ఇచ్చినా, ఇవ్వకపోయినా – అంతా ఆ పైవాడే అని ఎప్పుడూ చెప్పే నువ్వే – నేనేదో ఇచ్చానన్న మాయలో పడిపోతున్నావెందుకు? అలాంటి భ్రమలేం పెట్టుకోవద్దు. మాటను లాగేసుకున్నా – మధుమేహాన్ని ఇచ్చినా – అంతా ఆ జగన్నాటకసూత్రధారి ఆడించే నాటకంలో – భాగమే – అందులో ఓపాత్రను నేను – ఈ తోటని చిన్నవెంకటశాస్త్రికి అందివ్వడం నాటకంలో ఓ చిన్న సన్నివేశం – అంతే"

"కనిపించని ఆ దేవుడు ఉన్నాడో లేడో తెలుసుకోగలిగేంత జ్ఞానినీ కాదు. కనిపించే మీరు భగవత్స్వరూపమే అని అనుకోలేనంత అజ్ఞానినీ కాను"

"మనం అందరం ఆ మహాజ్ఞాని ముందు అజ్ఞానులమే పేరిశాస్త్రి – వేదర్షులకీ, ఉపనిషద్ద్రష్టలకీ స్పష్టం అయిందో లేదో తెలియని విశ్వస్వరూపం – విజ్ఞానం కొత్త విషయాలు కనుక్కుంటున్నకొద్దీ – ఇంకా సంక్లిష్టం అవుతోందే తప్ప – అంతు పట్టే సూచనలేం కనిపించడంలేదు – సత్యాన్వేషణలో – వేల సంవత్సరాల క్రితం ఎక్కడ ఉన్నామో – ఇప్పుడూ అక్కడే ఉన్నాం – చిన్నవెంకటశాస్త్రి పుట్టడమే మూగగా ఎందుకు పుట్టాడో, పాతికేళ్ళు కూడా రాకుండా అధుమేహం ఎందుకు వచ్చిందో – ఎలా తెలుస్తుంది మనకి? ఈ అజ్ఞానంలోనే మన జీవితాలు తెల్లారిపోతాయో – ఏమో"

# భిన్న ధృవాలు బులుసు సరోజినీ దేవి

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

అర్ధరాత్రి .. లోకమంతా నిద్రోతున్న నిశ్శబ్దం. కొత్తగా కాపురాని కొచ్చిన పరిమళ చెవిలో గుసగుస

“నిద్రపోయావా అప్పుడే” ? అని .

చప్పున కళ్ళు తెరిచి, భర్త మధుబాబు, తన పక్కన ఆనుకుని ఉండడం చూసి సిగ్గుల మొగ్గయి పోయి గుండెల్లో తల దాచేసుకుంది.

ఆ తలని నిమురుతూ...

“నీకు అప్పాలు చేయడం వచ్చా”? మంద్ర స్థాయిలో అడిగాడు. తుళ్ళిపడబోయి ఆపుకుంది. ఈ కొద్ది రోజుల్లోనే అతగాడిని స్టడీ చేసి ఎప్పుడు ఏం మాట్లాడాలో తెలియదని తెలుసుకుంది. అబ్బో .. గొప్ప డబ్బున్నోడు. ఎన్,ఆర్. ఐ .. సంపాదించిదంతా పోగేట్టి పుట్టిన భూమ్మీదకి వెళిపోవచ్చేసాడంటూ వెంటపడి వేధించి పదేళ్ళు గాప్ పెద్ద లెక్క పెట్టాల్సిందే కాదని తనకి అంటగట్టిన వరసకి మేనత్త ని –

“చూడూ ..చూడు !నువ్వు మెచ్చి మేకతోలు కప్పిన ఈ నా మొగుడు అర్ధరాత్రి కొత్త పెళ్ళాన్ని అడిగిన క్వశ్చన్ ?" .. అని జుట్టు పట్టుకుని నాలుగు పీకాలనిపించింది.

“మెలుకువ వచ్చేసిందా?" ఈసారి ఇంకా దగ్గరి కొచ్చేసాడు. పోన్లే .. ఇలాగయినా తన ముచ్చట తీరుతుందని సద్దుకుంది ఆ ప్రశ్నకి కొండంత కోపం వచ్చినా. మృదువుగా, మత్తుగా చూసింది. తెల్లని పాల నురుగు చీర కొంగుతో అతడిమోహం కప్పి. ఆ పల్చని తెర లోంచి కళ్ళల్లో కళ్ళు కలిపింది. బలే నవ్వాడు ప్రకాష్..

“త్వరగా పడుకో. పొద్దున్న మనకి బోలెడు పని. రేపు సండే కదా? అందర్నీ ఇక్కడికే రమ్మన్నాను”!.. అన్నాడు.

“ఎవరెవరు? పార్టీ ఇస్తున్నారా? ఎంత మంది?" అడిగింది గాభరాగా. అడుగుతూ కళ్ళు పెద్దవి చేసి చూసింది. మత్తు కూడా వదిలిపోయి దిగ్గున లేచి కూర్చుంది పరిమళ. మధుబాబు ఇచ్చిన ఝలక్ తో నిద్ర మండిపోయి పారిపోయింది.

“సర్ ప్రైజ్!”అంటూ కళ్ళు చికిలించిన మధుబాబు మొహం చూసి ‘ఖర్మ’అనుకుంది. అంతలోనే సద్దుకుని " పోన్లే పెళ్ళయ్యాక ఫ్రెండ్స్ కి ఆ మాత్రం పార్టీ ఇవ్వరేంటి?’ అనుకుని కళ్ళు మూసుకుని నిద్రపోయింది పరిమళ.

మర్నాడు తెల్లగా తెల్లారినా లేపని భర్తని ఎంతో మెచ్చుకుంటూ గబగబా తయారయి కిచెన్ లో అడుగు పెట్టిందో లేదో అవాక్కయిపోయింది. మాట్లాడబోతే గొంతు పెగల్లేదు. స్టవ్ మీద పెద్ద గంగాళం! అద్దెకి తెచ్చినట్టున్నాడు.. సలసలా మరుగుతున్న నీళ్ళు! పెద్ద గిన్నెలో

బియ్యం రెండు చేతులతో పిసికి, పిసికి మరీ కడుగుతున్నాడు. పావుకేజి కంటే ఎక్కువే చింతపండు నానపెట్టి ఉంది. వంటిల్లంతా నీటి మయం! రెండు కాళ్ళు ఆ తడిలో తపతప లాడిస్తూ గిరగిరా తిరిగేస్తూ హడావిడి పడిపోతున్నాడు. పరిమళని చూసి చూడగానే –

"దా .. వచ్చీ .. నేను పులిహోర చేసేస్తాను.. ఈలోగా నువ్వు అప్పాలొండెయ్!" అన్నాడు .

" రెండుకూరలు, పప్పు ,పచ్చడి,దప్పళం వండుదాం. లొట్టలేసుకుని తినేలా!.. వంట వాడు మనలా వండుతాడా చెప్పు!"అన్నాడు మళ్ళీ. నోటంట మాట రాక గుడ్లప్పగించి చూస్తోంది పరిమళ. మొగుణ్ణి చూస్తే మాలావు హుషారుగా ఉన్నాడు.

'పోన్లే .. ఒక్క ఆదివారానికే తను ఇలా అయిపోకూడదు' అనుకుంది పరిమళ! అప్పుడు చూసింది అతడు కట్టుకున్న అంగవస్త్రం .. అది గోచీలాగూ లేదు.. అలా అని కూస్తంత పొడుగూ లేదు. మాటిమాటికి దాన్ని సద్దుకుంటూ వండుతుంటే కడుపులో తిప్పినట్టవుతోంది. 'ఈ వంట నేను తినను' అనుకుంది .

"మీరు బయిటికి రండి .. ఎంత మందికో చెప్తే నేను వండుతా"! అంది.

"పాతిక కి ఇంకో అయిదు ఎక్కువే అనుకో "!అన్నాడు. మొహం గిర్రున తిరిగింది పరిమళకి.

'హోటల్ లో పార్టీ ఇచ్చేవాళ్ళంగా'? అనబోయి, ఇతగాడికి వంట చేయడం అతి ప్రియమని తెలుసు గనక ఏమనకుండా 'అప్పాల' ప్రయత్నం మొదలెట్టింది. వంట అయేటప్పటికి బిలబిలమంటూదిగారు జనం! అన్నీ ఫామిలీస్!. ఒక పెద్ద మనిషి చేతిలో నిలువెత్తు పెద్ద ఫోటో .. ఆ ఫోటోలో ఒక స్వామీజీ. ఒకావిడ సర్రున పరుగెత్తుకొచ్చి బర్రున అక్కడున్న బల్ల ఒకటి లాగి పారేసి స్వామీజీని గోడకానించింది. మరో ఆవిడ 'ఏనుగు కాలంత' లావుపాటి 'పూలదండ' నలుగురి సాయంతో తెచ్చిఆ ఫోటోకి తగిలించింది. దండ వేసి వెయ్యగానే పోలో మని దండాలు దండాలు పెట్టేసుకుంటున్నారు జనమంతా .. పరిమళ ని నవ్వుతూ పలకరిచేస్తున్నారు .. ఈ లోపల ఒకావిడ పరమగంభీరంగా –

" మొదలెడదామా?" అంది ..

తాళాలు, తప్పెట్లతో, దరువులతో భజన మొదలయిపోయింది. గుండె దడదడ లాడేలా. తమ వూళ్ళో గుడి దగ్గర ఫుల్లుగా తాగేసి పేరడీ పాటలు పాడుతున్న ' బైటో భజన' గుర్తొచ్చింది పరిమళకి. ఈ లోపల మధుబాబు చంగుమని హాల్లోకి దూకాడు. అతగాడిని అలా చూడగానే కెవ్వుమని కేక వేసాననుకుంది పరిమళ. కాషాయ రంగు పైజమా, ఎర్రటి లాల్చి, నుదురుమీద జేగురురంగు బొట్టు, దాని కింద అడ్డంగా విభూది రేఖ.. కళ్ళకి కాటుక .. పైగా గెంతులు, డాన్సులు, పూనకం వచ్చినట్టు ఒకటే వూగిపోడాలు, ఉగ్రూతలూగే స్టెప్పులు, పూనకం వచ్చినట్టు ఊగిపోడాలు.. బిత్తరపోయి చూసింది పరిమళ. 'అదేదో నిన్న తనతో చెయ్యొచ్చుగా ఈ డాన్సులు'? అనుకుంది. అలా పాడిపాడి , ఆడిఆడి అలిసిపోయి పోయారందరూ. ఆ గోలకి తల నొప్పి, ఆ చాకిరీకి నడుం నొప్పి, నీరసం వచ్చి సొమ్మసిల్లినట్టు పడుకుండి పోయింది పరిమళ. పోతేపోన్లే .. ఇవ్వాల్సిన పార్టీ పీడ ఒదిలి పోయిందనుకుంది నిట్టూరుస్తూ మధ్యరాత్రిలో తెలివొచ్చి .

★★★ ★★★ ★★★

నాలుగు రోజులు గడిచాయి .. ఆ రాత్రి మా గొప్ప ఇదిగా తయారయి మొగుడి పక్కన చేరింది పరిమళ. కొత్త బిచ్చగాడిలా ఉత్సాహం ఊపిరాడనివ్వడంలేదు. కబుర్లు, కాకరకాయలు లేకపోయినా ఓ మోస్తరు థ్రిల్లింగ్ గానే గడిచింది ఆ రాత్రి. కానీ 'అన్నింటికీ సద్దుబాటే' అనుకుంటూ నిరాశగా నిద్రలోకి జారింది. మధ్య రాత్రిలో ఒకటే రైలింజను చప్పుడు వినిపించింది. చెవిలో రొద, కూత. చటుక్కున లేచి కూర్చుంది. తీరా వెతికితే అది మొగుడి గురక .. పులి బోనులో పొరపాటున చిక్కడి పోయి, ఆ ఇనప చువ్వల మధ్య తల దూర్చి ఎలా బయిట పడాలో దారి తెలియని దానిలా పిచ్చి చూపులు చూసింది పరిమళ. పరిమళ జీవితానికింక 'పరిమళం' లేదు అనుకుంది. అతగాడిని కుదిపి, లేపి అటు తిరిగి పడుకున్నప్పుడు గురకలో మార్పొచ్చింది. నాలుగు నిట్టూర్పులు ఆగిఆగి ఎక్కిళ్ల ల్లా వచ్చాయి.

రెండు నెలలు గడిచాయి. ఎంత బతిమాలినా ఏవో వంకలు చెప్పి ప్రకాష్ తో ఒక్క భజన కీ వెళ్ళలేదు పరిమళ. రసగుల్లాలాంటి పెళ్ళాం పక్కన ఉండగా రైలింజను కూతలు కూసే మొగుణ్ణి ఏమనాలో ఏదిబ్బపాటి బుక్కు లోనూ ఉండిందదు. ఆ రాత్రంతా శివరాత్రి జాగరం! పగలు నిద్రలేమి పరిమళకి.

మర్నాడు రాత్రి కుక్కర్ విజిల్లా సైరన్లిచ్చాడు. జుట్టు పీక్కోవాలనిపించింది. వయసు ముదిరేదాక పిల్లని ఎంచి ఎంచి ఒక్కత్తీ నచ్చలేదని వంకలు పెట్టి పెట్టి తల బోడి చేసుకున్న మొగుడుగారు తనక్కూడా జుట్టు లేకపోతే బావురుమంటాడని మళ్ళీ సద్దుకుంది. కాకపోతే ఒక్క బహు మంచి పని మాత్రం చేసింది. ఇంకెప్పుడూ ఎంత బతిమాలినా బావుండదని మొరపెట్టుకున్నా ఒక్క భజనక్కూడా రానంది. మధుబాబు అలిగాడు ,అలిగాడు,అలిగాడు. విసుగొచ్చి ఊరుకున్నాడు .

★★★ ★★★ ★★★ ★★★

రెండు నెలలు గడిచాక, ఓ రోజు గాఢ నిద్రలో ఉన్నప్పుడు మళ్ళీ అర్ధరాత్రే చెవిలో గుసగుస. చెవిని బర బరా పామేసుకుంది. అయినా ఓ అయిదు నిమిషాలాగి మళ్ళీ "బుజ్జమ్మ! బుజ్జమ్మా! అని వినిపించింది. ఏయ్! ఏమిటీ తనకి ముద్దు పేరోకటా?'సంబడం' అనుకుంటూ కళ్ళు తెరిచింది .. ఏంతో మత్తుగా నవ్వాడు మధుబాబు. పిచ్చ గోముగా చూసాడు ..ఎత్తైన కొండ మీద కెక్కి ఒక్క ఎగురు ఎగిరి చందమామని అందుకున్నట్టు ఒక్కసారిగా ఆకాశానికి నిచ్చేనలేసేసింది పరిమళ ..

"చెప్పండి"! అంటూ కావలించేసుకుంది తమకంగా .

"నీకు బొబ్బట్లు ఒత్తడం ఒచ్చు కదూ దొంగా"! అన్నాడు. 'ఓర్నాయనోయ్' గతుక్కుమంది

"అలా చూడకోయ్! ఈ ఆదివారం మన వంతు స్వామిజిని కొలవడం! " అన్నాడు భజన అనలేక ..

'చచ్చానే మేనత్తా!' అని గావుకేకలు పెట్టింది పరిమళ. గుండెల్లో పడ్డ రాయితో ఆమె మౌనంగా వెర్రి,పిచ్చి చూపులు చూడడం మొదలెట్టింది .

"మా బంగారు కదూ?" అన్నాడు.

"ముప్పై మందికి బొబ్బట్లా? ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో ఇలా ప్రతి ఆడది వంటిట్లో ఇలా బొబ్బట్లు ఒత్తుకుంటూ బలై పోయింది .. ఆ రోజులు ఇప్పుడు పోయాయ్. స్వగృహ వచ్చింది. అత్తరిల్లు, వంటిళ్ళు ఉండనే ఉన్నాయ్.. నన్ను చంపకండి.మీకు పుణ్యం ఉంటుంది !" అంది.

"అరెరే! విను! ఇది పూజ కదా పండూ! అందుకే మనం చేసుకునేది. లేకపోతె నిన్నెందుకు శ్రమ పెడతానురా చిట్టి తల్లి?" అన్నాడు ముద్దాడుతున్నాట్టు. మరో ముద్దు పేరు వచ్చి పడింది పరిమళ ఒడిలోకి. ఇలా ముద్దు పేర్లు వచ్చి పడగానే ... ఆడది కదా? పొగడ్తలకి లొంగిపోయింది. ఆ ఆదివారం కూడ బొబ్బట్లతో, పిండివంటలతో హోరెత్తిపోయింది ఇల్లు.. మొగుడుగారు గెంతిగెంతి అలిసిపోయారు. 'తెగ చావొచ్చి పడింది తనకి' అనుకుంది పరిమళ తల కొట్టుకుంటూ.

★★★★★★★ ★★★★★★

రోజులు గడవకా మానవు. జరిగేవి జరక్కా మానవు. మరో రెండేళ్ళు గునగునా నడిచి చక్కా పోయాయ్. తాళాలు ,తప్పెట్లతో పరిమళ రోజులు నిస్సారంగా సాగిపోతున్నాయ్. సరే ఆ మర్నాడు దసరా పండగ ! ఆమె అత్తగారి తద్దినం. అప్పటికే ఆడపడుచులిద్దరూ ఫామిలీస్ తో వచ్చేసారు. ఇల్లంతా సందడి. ఎదెక్కడ ఉందో తెలియనంత ఇంకేదీ కనపడనంత! ఇద్దరక్క చెల్లెళ్ళు ఇల్లంతా చుట్టబెట్టేసి కావలిసినవన్నీ మూటలు కట్టేసి మిగిలినవి జల్లెస్తున్నవేళ!

అప్పుడు పరిమళ మొగుడు పరుగెత్తుకొచ్చి పెళ్ళాం పక్కన కూర్చున్నాడు. అందరూ ముసిముసి నవ్వులు నవ్వుతుంటే –

"వంటవాడు దొరకలేదు"! అన్నాడు విచారంగా మోహం పెట్టి. గతుక్కుమంది.

"మరెలా?' అంది.

"నేను సాయం పడతాను" అన్నాడు రెండు చేతులూ పట్టుకుని. అయోమయంగా నోట మాట పెగలక చచ్చినట్టు తలూపింది .

“అయ్యో! నేనూ ఓ చెయ్యి వేద్దును. కాని రాక రాక వచ్చాం కదా వంట అయ్యే లోపుల ఫ్రెండ్స్ ఇళ్ళకి వస్తామని మాటిచ్చాం అక్కా, నేను.. బాగుండదు”! అంది చిన్నాడపడుచు. ఆ రాత్రి ఎంతో సరదా కబుర్లు మాత్రం చెప్పాడు మధుబాబు పరిమళ పక్కనే ఉండి. అంటుకోకుండా, ముట్టుకోకుండా .. మర్నాడు తద్దినానికి పనికి రాదంటూ ..మాట్లాడుతూ మాట్లాడుతూ హఠాత్తుగా –

“నువ్వు గారెలు క్రిస్పీగ వండు బుజ్జీ! పరవన్నంలో బెల్లం వెయ్యి, అలాగే పూరీలు ఇలా చేతుల్లో వేసుకుంటే పటపట విరిగేల నాకిష్టం ,ఆపైన నీ ఇష్టం!” అన్నాడు గారాలు పోతూ..

’తోక్కేం కాదూ “అనుకుంది కచ్చగా. పొద్దున్నే లేచి వంటకి తగలేసి మంటగా కూర్చుంది పరిమళ. నవ్వించే ప్రయత్నాలు చేస్తున్నాడు మధుబాబు. అందరు వచ్చాక కార్యక్రమం మొదలయింది .. పూర్తయ్యాక భోక్తలకి వడ్డిస్తుంటే చాంద్రాయణవ్రతం మొదలెట్టాడు పంతులు.

“మీకు తెలుసా మధుబాబు గారు.. కిందటి నెల మీరు వూళ్ళో లేరు.లాయరు శ్రీపతి గారు పోయారు. అతడి భార్య విమల మొగుడి కంటే పన్నెండేళ్ళు చిన్నది .. డబ్బుందని ఇచ్చేసాడు తండ్రి . .. ఈ పిల్ల పాకాన పడేసరికి ఆయన లోకాలు ఒదిలేసాడు. గొప్ప జాలేసింది విమల గారిని చూస్తే .. ‘కోరికలేమో మహ గట్టివి కదండీ!’ ఇంక జీవిత కాలం ఈసురోమని బతకడమే .” అన్నాడు .. గత్యంతరం లేక పంతులు మాటలు వింటూ గుడ్లప్పగించి పరిమళ వైపే చూస్తున్నాడు మధుబాబు.

“భోక్తలకి మారు వడ్డించండమ్మా!”అన్నాడు పరిమళ వైపు చూస్తూ పంతులు. పరిమళ మళ్ళా కూరలు పట్టుకొచ్చింది .

“సరి అయిన వయసు తేడా ఉంటే సరైన కోరికలు పుడతాయ్. ఒకే ఈడు వాళ్ళకి ఒకే బుద్ధులు ఏడుస్తాయ్ కాబట్టి”! అన్నాడు పంతులు దీర్ఘం తీస్తూ. ‘వీడు వదిలేట్టుగా లేడు” అనుకున్నాడు మధుబాబు.

“గుప్పెడు అన్నం వండుకోవాలన్నా, ఓ ఇంత కూర వండుకోవాలన్నా, ఇద్దరూ కలిసి సినిమాకో,షికారుకో వెళ్ళినా .. మరి కాస్త పెద్దయ్యాక గుళ్ళకి, గోపురాలకి వెళ్ళినా .. అవి సమాన స్థాయిలో ఉంటాయి. దశాబ్దం ఉంటే ముక్కు మూసుకు కూర్చోవడమే!వయసు తేడా ఎక్కువయి కాదూ విమలగారు చిన్నగా ఉన్నప్పుడే శ్రీపతి గారికి రిటైర్మెంటు రావడం, సర్వీస్ తక్కువయిపోవడంతో తను కూడా ముసిలిదానిని అయిపోయానన్న బాధతో విలవిలలాడడం. విమల గారికి బాధ ఉంటుందంటే ఉండదా మరి”? అన్నాడు ఆపకుండా. మధుబాబు, పరిమళ లు ముఖాలు చూసుకున్నారు. పరిమళ మొహంలో దిగులు కనపడింది మధుబాబుకి అతి స్పష్టంగా. పంతులు మళ్ళీ అందుకున్నాడు.

“మనం మన పిల్లని ముద్దుగా పెంచేసి, ఆ వచ్చేవాడు కూడా ముద్దుగా చూసుకోవాలనే యావతో .. పోన్లే .. మంచి ఉజ్జోగం ఉన్నవాడికి ఇస్తే సుఖపడుతుందని పిల్లని అప్పజెప్పేస్తాం. పిల్ల మంచి వయసులో ఉంటుంది. ఇంక ఏజ్ బార్ పెళ్ళికొడుక్కి తొందరగా వయసు పైబడి దేవుడు,పూజా,పునస్కారాల మీదకి మనసు మొగ్గు చూపుతుంది. ఇంకేమిటి? ఉపన్యాసాలు, భజనలు, తొక్కు, తొడిమ, రుచిగా వండుకోవడం మినహా ఏముంటుంది? అంతేఇంక జీవితం.పాపం! మంచి పిల్ల విమల!” అన్నాడు పంతులు విచారంగా మొహం పెట్టి.

పరిమళ మొహం ముడుచుకుపోయింది. ఏడుపు బలవంతాన ఆపుకుంటూ వంటింట్లోకి తప్పుకుంది. అప్పటికి వాస్తవం లోకి వచ్చి పడ్డాడు మధుబాబు. ఇంక సహించలేకపోయాడు. తన పొరపాట్లని లెక్క పెట్టుకుంటున్నాడు. ఆ సాయంత్రం అక్కచెల్లెళ్ళు, బావామరుదులు వెళ్లిపోతుంటే ఎప్పటిలా ‘రెండురోజులు ఉండి వెళ్ళండి ‘ అనలేదు. మంచానికి అడ్డంపడి ఆలోచిస్తూనే ఉన్నాడు. తననే నమ్ముకున్న భార్య అమాయకపు మొహం పదేపదే కళ్ళముందు నిలిచింది. పరిమళ అటు తిరిగి పడుకుని ఉంటే పలుకరించే ధైర్యం కూడా రాలేదు. గడచిన రోజుల్ని తలచుకొని భారంగా నిట్టూర్చాడు.

★★★★ ★★★★★ ★★★★ ★★★★ ★★★★ ★★★★

తెల్లారింది. వాకింగ్ కి వెళ్ళొచ్చి హుషారుగా గెడ్డం గీసుకుని టిప్పుటాపుగా తయారైపోయాడు మధుబాబు. అతడినే చూస్తోంది పరిమళ.

“ఈ రోజు ఆదివారం. త్వరగా రెడీ అవాలి.“ అన్నాడు పరిమళ వైపు చూసి కన్నుకొట్టి.

"నేనురాను మీ భజన్లకి" అనబోయేలోగా తటాలున వాటేసుకున్నాడు.

"కొన్నాళ్ళు శెలవు పెట్టాను పరిమళా! హాయిగా హనీమూన్ వెళ్దాం!" అన్నాడు. అంటూనే చేతుల్లో చేతులుంచి దగ్గరగా గుంజుకుని కౌగిలిలో బంధించాడు. ఆశ్చర్యంతో మతి పోతోందామెకి. ఎన్నాళ్ళ విరహమో గాని కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్టు పరిమళ చిక్కిందతగాడికి..

'ఇప్పుడతడి ఆవేశం వేరుగా ఉంది. వివేకం పని చేస్తోంది 'అనుకుంది పరిమళ. ఇంతలో చెవిలో ఏదోగుసగుస.

'నీకు మడత కాజా చెయ్యడం వచ్చా?' అని. ఫకాలున నవ్వింది పరిమళ.

'చింత చచ్చినా పులుపు చావదు మరి' ...!!!

# ఏక్సిడెంట్ ఆనంద్ వేటూరి

"పది లక్షలు ఆవుతుంది ఆపరేషన్ కి" డాక్టర్ రఘు అన్నాడు.

"సర్ ఇది చాల అన్యాయం సర్ ఏదో మైనర్ కిడ్నీ ప్రాబ్లం అని హాస్పిటల్ లో జాయిన్ అయ్యే ముందర చెప్పారు. కాని ఇప్పుడేమో ఆపరేషన్ చేయాలి అంటున్నారు" కోపంగా అన్నాడు ఆనంద్.

"దానికి నన్నేంచేయ్యమంటావయ్య తీసుకొచ్చిన వెంటనే తెలిసిపోవడానికి ఇది ఏమైనా చిన్నానా చితక జ్వరమా! కిడ్నీ ప్రాబ్లం సో ఎంత పెద్ద డాక్టర్ కి అయినా ప్రపంచంలో నువ్వు ఎక్కడికి తీసుకువెళ్ళినా తెలుసుకోవడానికి టైం పడుతుంది. అర్ధం చేసుకోవడానికి ప్రయత్నించు" అంతే ఆవేశంగా చెబుతూ "మీకు మీ భార్య ప్రాణాలు దక్కాలంటే పది లక్షలు రెడీ చెయ్యండి. లేదంటే మీ వైఫ్ ని డిస్చార్జి చేసేస్తాం తీసుకెళ్ళిపొండి. కాని ఒకటి మాత్రం నిజం.. ఆపరేషన్ చేయకుండా తీసుకువెళ్తే మాత్రం మీ వైఫ్ ఇంకో ఆరు నెలలకు మించి బతకదు" అని చెప్పి ఉన్న విషయాన్నీ నిర్మొహమాటంగా బయట పెట్టాడు డాక్టర్ రఘు.

ఏం చెయ్యాలో తోచక ఆనంద్ అక్కడే నేల మీద కూలబడ్డాడు. ఆనంద్ ని చూడగానే డాక్టర్ రఘు కి కొంచం జాలి కలిగింది. అతను ఆనంద్ దగ్గరకు వెళ్ళి "చూడండి మిస్టర్ ఆనంద్ నిజం చాలా కఠినంగా వుంటుంది బట్ వుయ్ హావ్ టు ఫేస్ ది రియాలిటి. ఆపరేషన్ చెయ్యకపోతే మీ భార్య చనిపోతుంది అన్నది ఎంత నిజమో ఆపరేషన్ చేస్తే బతుకుతుంది అన్నది అంతే నిజం. కాబట్టి మీరు ఎంత త్వరగా డబ్బు రెడీ చేస్తే అంత మంచిది. ఆలస్యం అయ్యే కొద్ది ప్రమాదం ఎక్కువ ఆవుతుంది" కొంచెం చనువుగా హెచ్చరించాడు డాక్టర్ రఘురాం.

"కాని ఇప్పటికిప్పుడు పది లక్షలు అంటే కష్టం కదా డాక్టర్. అందులోను నాకు ఉద్యోగం లేదు. ఆస్తి అంతస్తులు లేవు తల్లి తండ్రులతో గొడవపడి సంధ్యను పెళ్లి చేసుకున్నాను.ఈ పరిస్థితులలో ఆ డబ్బు నేను ఎలా సర్దగలను" కళ్ళనీళ్ల పర్యంతం అయ్యాడు ఆనంద్. అతను తన భార్యను హైదరాబాద్ లో ఒక పెద్ద కార్పోరేట్ హాస్పిటల్ లో జాయిన్ చేసాడు. కొద్దిరోజుల క్రితం జ్వరంగా ఉండి ఎప్పటికి తగ్గకపోతే అతను హాస్పిటల్ లో జాయిన్ చేసాడు. మొదట మాములు జ్వరమే అన్నారు కాని ఇప్పుడు ఆ జ్వరం కిడ్నీ ప్రాబ్లం కింద మారి దాని ఖరీదు పది లక్షలు అయ్యింది.

"చూడు మిస్టర్ ఆనంద్, మీరు ఇలా బాధపడడంవల్ల ప్రయోజనం ఏమిలేదు యాజ్ ఏ డాక్టర్ డబ్బు తెచ్చే వరకు నేను కూడా చెయ్యగలిగింది ఏమిలేదు. కాని మీ తండ్రిగారికి నేను చిన్ననాటి స్నేహితుడిని అవ్వడం వల్ల ఒక చిన్న మాటసాయం చేమాత్రం చెయ్యగలను" అన్నాడు డాక్టర్ రఘురాం ఆ మాటలు వినగానే ఆనంద్ లో ఏదో చిన్న ఆశ కలిగింది. మొదటిసారి తన భార్యను తను రక్షించుకోగలను అనే నమ్మకం కలిగింది. డాక్టర్ వైపు ఆనందంగా చూసాడు.

"డాక్టర్ మీరు నాకా మాట సహాయం చెయ్యగల్గితే నేను మీకు జీవితాంతం ఋణపడి వుంటాను. చెప్పండి డాక్టర్ నన్ను ఎం చెయ్యమంటారు" అని అడిగాడు ఆనంద్. డాక్టర్ తన రివోల్వింగ్ చైర్ లో కొంచం సర్దుకుని

"నీకు మహేంద్ర గారు తెలుసు అనుకుంటాను" అని అన్నాడు.

"అంటే మహంద్ర అండ్ మహేంద్ర గ్రూప్ అఫ్ కంపెనీస్ చైర్మన్ మహేంద్ర గారే కదా" కొంచెం ఉత్సాహంగా అడిగాడు ఆనంద్. "అవును ఆయనే చిన్నప్పుడు మా వూరిలో ఉండేవారు. అయన నేను ఒకే చోట చదువుకునేప్పుడు నేను అయన చాల మంచి స్నేహితులం. నీకు తెలిసే ఉంటుంది మహేంద్ర గ్రూప్ పేరిట చారిటబల్ సర్వీసెస్ ఎన్నో చేపట్టారు.కావాలంటే నువ్వు ఆయనదగ్గరకు వెళ్ళు నేను నీ పేరుని రికమెండ్ చేస్తాను.ఆయన ఏదో ఒక మార్గం చూపించకపోడు. యాజ్ ఏ డాక్టర్ అండ్ యువర్ ఫామిలీ ఫ్రెండ్ నేను ఇంతకన్నా నీకు ఎక్కువ సహాయం చెయ్యలేను" అని చప్పి మహేంద్ర గారి ఇంటి అడ్రస్ తో పాటు ఒక లెటర్ కూడా రాసి ఆనంద్ కు అందచేసాడు డాక్టర్ రఘురాం.

★★★★★

"కౌన్ హాయ్ ఆప్ క్యా చాహియే ఆప్కో" ఆ ఇంటి వాచ్ మాన్ అడిగాడు.అదొక పెద్ద భవంతి తన చారిటీస్ ద్వార ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించిన రాజా మహేంద్ర భూపతి నివాసముండేది అక్కడే. పది ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడిన అత్యంత ఆధునికమైన భవనం అది. ఆ ఇంటి చుట్టూ ఉన్న ప్రహరీ గోడ ప్రపంచంలోని ఏడు వింతలలో ఒకటైన చైనావాల్ ను తలపిస్తోంది.

"రాజా సాబ్ కో మిల్నా హై"తను వచ్చిన పని ఏంటో చెప్పకుండా గూర్ఖని అడుగుతున్నాడు ఆనంద్.

"అభి నహి సాబ్ సో రహే హై. అభీ జావో ఆర్ బాద్ మే ఆవొ" నేపాలి గూర్ఖ తన ఇంటి యజమాని పట్ల విశ్వాసం చూపించడానికి అన్నట్లు ఆనంద్ ని ఆపుతున్నాడు. ఎంత బతిమాలినా ఆనంద్ కి అనుమతి లభించట్లేదు.ఇంకా ఆశ వదులుకుని వెను తిరిగిన సమయంలో

"రాంలాల్, ఉస్ ఆద్మికో అందర్ భేజో" అనే స్వరం వినిపించింది.

"జీ అచ్చ సాబ్" అని గేటు తెరిచాడు వాచ్ మాన్. ఆనంద్ లోపలి ప్రవేశించాడు. ఎదురుగుండా అతనికి ఒక పెద్ద విగ్రహం దాని చుట్టూ ఉన్న వాటర్ ఫౌంటైన్ కనిపించాయి. అతను మెల్లగా గార్డెన్ దాటుకుని ఇంటిలోపలకి ప్రవేశించాడు. లోపల ఎంతో సృజనాత్మకత తో నిర్మించిన కట్టడాన్ని అతను చూసాడు.

"కూర్చోండి మిస్టర్ ఆనంద్" అన్నాడు మహేంద్ర. అయన గొంతులో ఒక రకమైన గంభీరం ఉంది. అది ఎలాంటి వారినైనా ఒక క్షణం భయం తో కూడిన గౌరవానికి గురి చేస్తుంది.

"నీ పేరు నాకెలా తెలుసు అని అనుకుంటున్నావా? నాకు డాక్టర్ రఘురాం ఫోన్ చేసి నీ గురించి అంతా చెప్పాడు" విస్మయంతో చూస్తున్న ఆనంద్ ని ఉద్దేశించి అన్నాడు.

"సర్ మీకు డాక్టర్ గారు చెప్పే ఉంటారు నా సమస్య గురించి. కాబట్టి నేను ఉన్న విషయం సూటిగా చెప్తున్నాను నాకు అర్జెంటు గా మీ సంస్థ తరఫు నుండి పది లక్షలు కావలి సర్ " అన్నాడు ఆనంద్.

అనవసరమైన విషయాలతో కాలయాపన చెయ్యడం అతనికి ఇష్టం లేదు.

"మిస్టర్ ఆనంద్ మా సంస్థ నుంచి మీకు పది లక్షలు ఇవ్వడానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. కాని మీరు ఏదో ఒక ఉద్యోగం చేసే వారైతే మా పని కొంత వరకు సులభమవుతుంది. మీకేమో ఉద్యోగం లేదని రఘురాం చెప్పాడు. మీరు ఏదైనా ఒక ఉద్యోగం చేస్తూ ఉంటె నేను మీకు తప్పకుండా పది లక్షలు గ్రాంట్ చేయిస్తాను. ఈ విషయమ్ ఫోన్ లో చెప్పడం నాకు ఇష్టం లేక నీకే స్వయంగా చెప్దామని నిన్ను రమ్మన్నాను " అని తన నిస్సహాయతను తెలిపాడు మహేంద్ర.

"అంటే ఇంకా ఏ విధంగాను నా భార్య బతికే అవకాసం లేదా?" అని నిరాశగా అన్నాడు ఆనంద్.

"నో నో అలా ఎందుకు నిరుత్సాహపడతారు. మీ ప్రయత్నం మీరు చెయ్యండి. నేను కూడా ట్రై చేస్తాను కాని మా సంస్థ నుంచి సహాయం అందాలి అంటే తప్పనిసరిగా ఉద్యోగం ఉండాలి" అని ఉన్న విషయాన్ని బయటపెట్టాడు భూపతి. కర్ర విరగకుండా పాము చావకుండా చెయ్యడం అంటే

ఇదేనేమో అని మనసులో అనుకున్నాడు ఆనంద్. ఏమి చెయ్యాలో తోచని పరిస్థితిలో అక్కడే కాసేపు తన భార్య సమస్య గురించి మహేంద్ర గారితో అన్ని రకాలుగా చర్చించి లాభం లేదని తెలిసాక తిరిగి ఇంటి దారి పట్టాడు ఆనంద్.

★★★★★★

"ఇక్కడి నుంచి హైదరాబాద్ ఎంత దూరం" చాయ్ బండి వాడిని అడిగాడు ఆనంద్. అతనిప్పుడు విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్ళే జాతీయ రహదారి మీదున్న ఒక చాయ్ దుకాణంలో ఉన్నాడు. మహేంద్ర గారి సంస్థ విజయవాడ లో ఉంది. అక్కడ పని సఫలం కాకపోవడం వలన అతను తన బండి మీద తిరుగు ప్రయాణం అయ్యాడు.

"ఇక్కడి నుంచి ఒక వంద కిలో మీటర్లు ఉంటుంది సర్ " చెప్పాడు చాయ్ బండి అతను.

ఆనంద్ కి చాలా నిరుత్సాహంగా ఉంది. దానికి కారణం లేకపోలేదు. చిన్నపటినుంచి అతను తనకు ఏ విధంగా ఇతరులు సహాయపడతారా అనే ఆలోచించేవాడు కాని తన పని తాను చేసుకునే వాడు కాదు. అతను ఇంజనీరింగ్ చదువుతూ ఉండగా సంధ్య పరిచయం అయ్యింది. అందరిలాగే సంధ్య కూడా నాలుగవ సంవత్సరం కాంపస్ లో సెలెక్ట్ అయ్యింది. సంధ్యకి మొదటి నుంచి ఆనంద్ అంటే వాళ్ళ మాలిన అభిమానం, ప్రేమ. కారణం ఆనంద్ అమాయకత్వం, తెలివితేటలు కావచ్చు లేదా మరింకేదైనా కావచ్చు. జీవితంలో కొన్ని కొన్ని సంఘటనలు చాలా యాదృచ్ఛికంగా మాములుగా జరిగినా అవి మన మీద బలమైన ప్రభావం చూపిస్తాయి. కారణం ఏమైనప్పటికీ సంధ్యకి మొదట్లోనే ఆనంద్ బాగా నచ్చాడు.

కాని ఆనంద్ ఎప్పుడు సంధ్య విషయంలో ప్రేమ గురించి ఆలోచించలేదు. ఎందుకంటే అప్పటికింకా అతను నిరుద్యోగి. పైగా తల్లి తండ్రులంటే అభిమానం గౌరవం భయం ఉన్నాయ్. కాని సంధ్య అంటే ఏ మూలో ప్రేమ లేకపోలేదు. ఒకసారి సంధ్య కొంత చొరవ తీసుకుని ఆనంద్ పట్ల తన ఇష్టం తెలియచేసింది. ఎలాగో తను ఉద్యోగం చేస్తుంది కదా ఏదో ఒక విధంగా ఆనంద్ కి కూడా తన కంపెనీ లో ఉద్యోగం వేయించవచ్చు అని సంధ్య ఆలోచించింది. సంధ్య కాంపస్ లో సెలెక్ట్ అవ్వడం వరకు బాగానే ఉంది కాని ఆ కంపెనీ నష్టాల్లో ఉండడం వాళ్ళ ఇంజినీరింగ్ పూర్తి అయ్యి ఆరు మాసాలు గడచినా ఇంకా జాయిన్ కావడానికి పిలుపు రాలేదు. ఇంకా ఎక్కువ కాలం ఇంట్లో ఉండటం ఇష్టం లేక ఏదో ఒక విధంగా బతకవచ్చు అని ఆనంద్, సంధ్య కొంత డబ్బు తీసుకుని హైదరాబాద్ వచ్చారు. ఆనంద్ సంధ్యలు ఇద్దరు ఒకే రూంలో ఉండడం గమనించిన చుట్టుపక్కల వాళ్ళు ఆరా తియ్యడం మొదలు పెట్టారు. ఇలా మంచిది కాదని ఆనంద్ సంధ్య ఇద్దరు కొంతమంది స్నేహితుల సహాయంతో వివాహం చేసుకున్నారు.

ఒకసారి అనుకోకుండా షాపింగ్ చేస్తుంటే డాక్టర్ రఘురాం కనిపించాడు. అయన వెంటనే ఆనంద్ ను గుర్తు పట్టాడు. విషయం అడగగా ఇంట్లో నుండి వచ్చేసిన విషయం సంధ్యతో పెళ్లి వివరంగా చెప్పాడు ఆనంద్. డాక్టర్ రఘురాం ఆనంద్ కి మంచి జరుగుతుందనే ఉద్దేశంతో ఆనంద్ వాళ్ళ తల్లితండ్రులకు విషయం తెలియ చేశాడు.

ఈ విషయం తెలుసుకున్న ఆనంద్ తల్లితండ్రులు జీవితంలో మళ్ళీ అతన్ని చూడకూడదు అనే నిశ్చయానికి వచ్చి అదే విషయాన్నీ అతనికి తెలిపారు. పెళ్లి అయ్యిన ఒక సంవత్సరం వరకు కూడా సంధ్యకి తను సెలెక్ట్ అయ్యిన కంపెనీ నుండి పిలుపు రాలేదు. వాళ్ళిద్దరూ చేసే చిన్న చితకా ఉద్యోగాలు ఇద్దరినీ బతికించేవి. మొన్న మొన్నే ఇద్దరికీ పార్ట్ టైం జాబ్స్ కూడా పోయాయి దానికి కారణం కూడా అందరికి తెలిసిన అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభమే. సంధ్యకి అనారోగ్యంగా ఉంటే మొదట కొన్ని మందులు వాడాడు. తగ్గకపోతే లాభం లేదని డాక్టర్ రఘురాం సహాయంతో కార్పోరేట్ హాస్పిటల్ లో జాయిన్ చేశాడు. అప్పుడు అతనికి డాక్టర్ రఘురాం చెప్పిన అసలు విషయం తెలిసింది. ఇప్పుడు అతను తన భార్యను ఏ విధంగా ఐనా బతికించుకోవాలనే తపనలో ఉన్నాడు.

★★★★★★

తన భార్యను ఎలా అయినా బతికించుకోవాలని పరధ్యానంగా ఆలోచిస్తూ బండి మీద చాయ్ దుకాణం నుంచి ప్రయాణం అయ్యాడు ఆనంద్. రోడ్ మీద చాల వేగంగా వెళ్తున్నాడు.ఎంత ఆలోచించినా అతని కి ఎటువంటి దారి "కనిపించలేదు. "హెల్ప్ హెల్ప్"అని శబ్దం వినిపించడంతో ఆలోచనలనుంచి బయటకి వచ్చి బండిని రోడ్ పక్కన ఉన్న ఒక చెట్టు కింద ఆపాడు. శబ్దం ఐతే వినిపించింది కాని అతనికి ఆ చుట్టూ పక్కల ఎక్కడా మనిషి జాడ కనిపించలేదు. రోడ్ మీద అడపాదడపా వెళ్ళే వాహనాలు తప్ప మళ్ళి ఆ శబ్దం కూడా వినిపించలేదు. తన భ్రమ అయ్యుంటుందని బండి

దగ్గరకు వచ్చి తిరుగు ప్రయాణం అవుదాం అనుకోగానే "హెల్ప్ హెల్ప్" అని మళ్ళీ అదే ఆర్తనాదం వినిపించింది. ఈసారి లీలగా ఆ ధ్వని వచ్చిన వైపు చూపు సారించాడు. రోడ్ కి ఎడం పక్కగా ఆ శబ్దం వస్తున్నట్లు గమనించాడు. మెల్లగా ఆ ధ్వనిని అనుసరిస్తూ పొదల మధ్యకు వెళ్ళాడు.అయినా అతనకేమి కనిపించలేదు. ఇంకొంచెం ముందుకు వెళ్లగా అతనికి మూలుగులతో కూడిన ఆర్తనాదాలు దగ్గర అయ్యాయి.

పొదలను తప్పించుకుని ఎదరకు వెళ్ళిన అతను హతాశుడయ్యాడు. కారణం అతనికి ఎదురుగా ఒక పెద్ద చెట్టుకు గుద్దుకుని నేల మీద చావు బతుకుల మధ్య వున్న ఒక వ్యక్తి చేసిన ఆక్రందనలు అవి. అతన్ని చూడగానే ఆనంద్ భయకంపితుడై "ఆక్సిడెంట్ ఆక్సిడెంట్" అంటూ రోడ్ మీదకు పరుగు పెట్టలనుకున్నాడు. కాని ముందు అతని పరిస్థితి చూడాలనుకుని దగ్గరకు వెళ్లి ముక్కు దగ్గర చెయ్యి పెట్టి చూసాడు. అతనింకా కొన ఊపిరితో ఉన్నాడు. ఆనంద్ చెయ్యి పెట్టగానే గట్టిగా మూలిగాడు అతను. భయంతో ఆనంద్ వెను తిరగబోతుంటే "సర్" అని పిలిచాడు.

"ఏంటి?" అన్నట్లు చూసాడు ఆనంద్.

"నన్ను ఈ ఆక్సిడెంట్ కి గురి చేసింది ఎవరో తెలీదు ఇప్పుడు మీరు నన్ను హాస్పిటల్ కి తీసుకు వెళ్ళే అంత వరకు నేను బతుకుతానో లేదో కూడా తెలీదు. మీరు నాకొక చిన్న సహాయం చెయ్యాలి" అన్నాడు ఆ వ్యక్తి.

ఆనంద్ కి చూచాయగా విషయం అర్థం అయ్యింది. ఎవరో హైవే మీద తాగేసి వాహనం నడుపుతూ ఈ ఆక్సిడెంట్ చేసి ఉండాలి. ప్రమాదంతో అదుపు తప్పి బండి రోడ్ మీద కాకుండా ఇలా పొదల్లోకి వచ్చి పడింది. హై వే కదా ఎవరికీ కనిపించడం లేదని తెలుసుకున్న ఆక్సిడెంట్ చేసిన వాళ్ళు. తమ మీదకు కేసు రాకుండా ఉండాలని చల్లగా జారుకున్నారు. విషయం తెలీక తను వచ్చి ఇతని దగ్గర ఇరుక్కున్నాడు. ఇప్పుడు ఇతను ఏం సహాయం అడుగుతాడో ఏంటో.

"సర్ మా తల్లిగారు చావు బతుకుల మధ్య వున్నారు సర్. ఆమెకు ఆపరేషన్ కు పది లక్షలు అవసరం అయ్యింది" ఆయాసం తీర్చుకోవడానికి అన్నట్లు ఆగాడు ఆ వ్యక్తి. కుతూహలం తట్టుకోలేక ఆ వ్యక్తిని అడిగాడు ఆనంద్.

"ఏ హాస్పిటల్ లో జాయిన్ చేసారండి" అతను కొంత ఊపిరి తీసుకుని "కేర్ ఎమర్జెన్సీ హాస్పిటల్ లో" వెంటనే ఆనంద్ గుండె ఝల్లుమంది ఎందుకంటే తన భార్య సంధ్యను కూడా తను అదే హాస్పిటల్ లో జాయిన్ చేశాడు.

"మా తల్లిగారికి కిడ్నీ ప్రాబ్లం సర్. ఆపరేషన్ కి పది లక్షలు అవసరమైనది. నేను విజయవాడ నుంచి మా మావయ్యగారి దగ్గర మాకు రావాల్సిన డబ్బులు తీసుకుని వస్తూ ఉండగా ఈ ఆక్సిడెంట్ జరిగింది. నేనింకా ఎంత సేపు బతుకుతానో కూడా తెలీదు. మీరు దయ చేసి సాయంత్రం నాలుగు గంటల లోపల ఎలాగైనా ఈ డబ్బు హాస్పిటల్ లో కట్టి నా తల్లిగారి ప్రాణం కాపాడండి సర్ " అని చెప్పే తన చేతుల్లో ఉన్న బాగ్ ఆనంద్ చేతిలో పెట్టి స్పృహ కోల్పోయాడు ఆ వ్యక్తి. హతాశుడై అతని వంక చూస్తున్న ఆనంద్ అతను ఇచ్చిన బాగ్ చూసి ఉలిక్కిపడ్డాడు. ఆ బాగ్ చివర అంచు కొంత మేర రక్తంతో తడిసి ఉంది.

★★★★★

"పేరేంటి అన్నారు?" అడిగింది కాష్ కౌంటర్ లో ఉన్న మధ్య వయసు స్త్రీ. "వీ.ఆర్. సంధ్యా దేవి" చెప్పాడు ఆనంద్. ఆ వ్యక్తి ఇచ్చిన డబ్బును తీసుకుని హాస్పిటల్ కు చేరుకొని ఆ డబ్బును ఆపరేషన్ కోసమై కాష్ కౌంటర్లో కడుతున్నాడు ఆనంద్. ఆ డబ్బును తన భార్య ఆపరేషన్ కి వాడుకోవడం ఎంత వరకు సమంజసమో అతనిప్పుడు ఆలోచించే స్థితిలో లేదు. తన ముందు ఉన్న లక్ష్యం తన భార్య ప్రాణాలు కాపాడుకోవడం. దానికోసం ఇంకొకరి ప్రాణాలు వెల కట్టడం ఎంత వరకు న్యాయం. ఆనంద్ లో ఇప్పుడు పాపభీతి తొంగి చూసింది. తన భార్య పేరున ఆ డబ్బు కడుతున్నప్పుడు ఆ బాగ్ అంచున చివర ఉన్న రక్తం మరక అతనిని వెక్కిరించింది. ఇంకా హాస్పిటల్లో ఉండలేక తన భార్య ఆపరేషన్ ఇంకొక రెండు గంటలలో మొదలౌతుందని తెలిసి కూడా తన ఇంటికి బయల్దేరాడు ఆనంద్.

ఒక పక్క తన భార్య ఆపరేషన్ విజయవంతం అవుతుందా లేదా అనే ఆలోచన, ఇంకొక పక్క ఇతరుల అత్యవసరమైన డబ్బులు తన స్వార్ధం కోసం వాడుకుంటున్నాను అనే పాపభీతి తో పరధ్యానంగా బండి నడుపుతున్నఆనంద్ ఎదురుగా వస్తున్న ఎద్దును ను గమనించలేదు, అయితే

అప్పటికే వలసిన నష్టం జర్గిపాయింది. సడన్ బ్రేక్ వెయ్యడంతో కీచు మని శబ్దం చేస్తూ చెట్టుకు గుద్దుకుంది బైక్. అంత ఎత్తున ఎగిరి ఎడం వైపుగా పడ్డాడు ఆనంద్. “”ఆక్సిడెంట్!!!”” ఎవరో గట్టిగా అరిచారు.

★★★★★

“గుడ్ ఈవినింగ్ మిసెస్ సంధ్య ఆనంద్.మీకొక గుడ్ న్యూస్” ఉత్సాహంగా డోర్ తెరుచుకుని వచ్చిన డాక్టర్ రఘురాం అన్నాడు.

“గుడ్ ఈవినింగ్ డాక్టర్. నేను ఇక్కడున్నాను ఏంటి? నాకు ఏం జరిగింది?“ అయోమయంగా అడిగింది సంధ్య. వారం రోజుల క్రితం జ్వరం తగ్గట్లేదని ఆనంద్ తనను తీసుకు వచ్చి కేర్ హాస్పిటల్లో జాయిన్ చేశాడు. అంతవరకే తనకు గుర్తుంది .ఆ తరువాత ఏమి జరిగిందో తెలీదు.

“జస్ట్ రిలాక్స్ మిసెస్ సంధ్య మీకు ఏమి కాలేదు. మా వల్లే ఒక చిన్న పొరపాటు జరిగింది” కొంచెం ఇబ్బందిగా చెప్పాడు డాక్టర్ రఘు “మీరు అందుకు మమ్మల్ని క్షమించాలి”అన్నాడు.

”పొరపాటా ? ఏమిటది డాక్టర్. నేను మిమ్మల్ని క్షమించడం ఏంటి?” కొంచెం ఖంగారుగా అడిగింది సంధ్య.

“మిసెస్ సంధ్య నేను చెప్పేది ఖంగారు పడకుండా చివరిదాకా వినండి.వారం రోజుల క్రితం మీ భర్త జ్వరం తగ్గట్లేదని మిమ్మల్ని ఈ హాస్పిటల్ లో జాయిన్ చేశాడు. టెస్టు అన్ని చేసాక మీకు కిడ్నీ ప్రాబ్లం ఉందని తెలిసింది”అని చెప్పి కొంచెం సేపు ఆగాడు. ”నో” అని అరవబోతున్న సంధ్య ను వారించి ”ప్లీజ్ మిసెస్ సంధ్య నేను చెప్పేది పూర్తిగా వినండి. డోన్ట్ గెట్ ఎగ్జైటేడ్” అని మళ్ళి విషయం కొనసాగించాడు.”మీకు కిడ్నీ ప్రాబ్లం అని తెలిసిన తరువాత మీ భర్త ఆనంద్ చాల బాధపడ్డాడు. ఎలాగైనా మిమ్మల్ని బతికించుకోవాలని నన్ను బతిమాలుకున్నాడు. నేను ధన సహాయమై నా స్నేహితుడు మహేంద్రను కలుసుకోమని మీ భర్తను విజయవాడ పంపాను. ఆయన ఇంకా తిరిగి రాలేదు. నేను ఆయన సెల్ కి రెండు గంటల నుంచి ట్రై చేస్తున్నాను స్విచ్ ఆఫ్ అని వస్తోంది” అని మళ్ళి సంధ్య వైపు చూసాడు.

“మరి నా ఆపరేషన్ కు డబ్బు ఎలా సమకూరింది డాక్టర్?” కొంచెం కుతూహలంగా అడిగింది సంధ్య “అదేచెప్పబోతున్నాను సంధ్య గారు.. ఈ విషయం లోనే మీరు నన్ను మా హాస్పిటల్ స్టాఫ్ అందరిని క్షమించాలి. నిజానికి మీకు వచ్చింది మాములు మలేరియా జ్వరమే కాకపోతే కొంచెం సీరియస్ గా వచ్చింది. కాని మా స్టాఫ్ అజాగ్రత్త వల్ల వేరే వాళ్ళకు వెళ్ళాల్సిన ఎక్స్ రే రిపోర్ట్స్ తారుమారు అవ్వడం వల్ల మీకు కిడ్నీ ప్రాబ్లం అనుకుని అదే విషయం మీ భర్తకు చెప్పాను” అంటూ విషయం వివరించాడు డాక్టర్ రఘురాం.

“మరి నాకు కిడ్నీ ప్రాబ్లం లేదనే విషయం మీకు ఎలా తెలిసింది?“ అడిగింది సంధ్య.

“మీ దగ్గరకు రావడానికి ముందర నేను ఒక యాభై సంవత్సరాలు పైబడిన స్త్రీకి కిడ్నీ ఆపరేషన్ కి అవసరం ఐతే మీ పక్కనున్న ఐ సి యు లోకి వెళ్ళాను. అక్కడ ఆమె కేస్ షీట్, రిపోర్ట్స్ చూడగానే నేను షాక్ అయ్యాను, ఎందుకంటే అందులో కిడ్నీ ప్రాబ్లంకి సంబంధించిన రిపోర్ట్స్ లేవు. ఏదో మాములు జ్వరం గురించినవి వున్నాయి అంతే. అనుమానం వచ్చి నేను ఆమె పేరు చూస్తే ఆర్. సంధ్యా దేవి అని ఉంది. నాకు వెంటనే మీ పేరు గుర్తు వచ్చింది. మీరు వీ. ఆర్. సంధ్య దేవి కదా“ అడిగాడు డాక్టర్ రఘు. అవునన్నట్లు తలూపింది సంధ్య.

“వెంటనే నేను మీ రిపోర్ట్స్ తీసుకువచ్చి చూస్తే ఆవిడ ఉన్న స్థితికి సరిపోయాయి. నాకు విషయం అర్ధమయ్యింది. నేను వెంటనే మీ అయన సెల్ కి ట్రై చేసాను. మీరు సెడటివ్ డోస్ వల్ల ఇంకా మగత నిద్రలో ఉన్నారు. అందుకే మీరు లేచిన తరువాత మీకు విషయం చెప్పాను” అని ముగించాడు డాక్టర్ రఘు.

”ఇంతకి డాక్టర్, ఆ కిడ్నీ ప్రాబ్లం ఉన్న ఆమెకి ఇప్పుడు ఎలా ఉంది?” కొంచెం కుతూహలంగా అడిగింది సంధ్య.

“గాడ్ ఇస్ దేర్. ఆవిడ ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. ఇప్పుడు ఆమె క్షేమంగానే ఉంది” అన్నాడు డాక్టర్ రఘు.

“మరి పది లక్షలు అవసరం అయ్యింది ఆమె కిడ్నీ ప్రాబ్లం కి కదా వాళ్ళ బంధువులెవరైనా కట్టారా?”అడిగింది సంధ్య.

“అదే నాకు అర్ధం కావడం లేదు. హాస్పిటల్ మొత్తం విచారించిన ఆపరేషన్ అయ్యిన తరువాత ఆవిడకు సంబంధించిన వాళ్ళు ఒక్కరూ కనబడలేదు. కాని ఆపరేషన్ కి అయ్యిన డబ్బు పే చేసినట్లు రిజిస్టర్ లో ఉంది. ఇది ఎలా జరిగిందో మరి“ కొంచెం అయోమయంగా అన్నాడు డాక్టర్.

"ఎలా జరిగినా కాని ఆమె క్షేమంగానే ఉంది కదా అంత దేవుడి దయ. ఇంతకి ఆనంద్ ఏమైనట్టు?" అర్థం కానట్టు అడిగింది సంధ్య. తనకి కూడా తెలీదు అన్నట్లు భుజలెగారేసాడు డాక్టర్ రఘురాం.

★★★★★

"చాలా అదృష్టవంతుడివయ్యా. త్రుటిలో ఈ రోజు నీకు ప్రాణాపాయం తప్పింది" తన పక్కనున్న వ్యక్తి అనడంతో మెలకువ వచ్చిన ఆనంద్ చుట్టూ చూసాడు. అతని పక్కన ఒక పది మంది వరకు గుంపుగా మూగి ఉన్నారు.

"నాకు ఏమైంది?" అయోమయంగా అడిగాడు ఆనంద్.

"ఏమి కాలేదు బాబు. ఎద్దు ఎదురు పడడం వల్ల బైక్ అదుపుతప్పి చెట్టుకు గుద్దుకుంది. నువ్వు అంత ఎత్తున గాలి లోకి ఎగిరావు. కానీ అదే సమయానికి అటుగా వచ్చిన ఇసుక లారీలో పడడం వల్ల నీకు స్పృహ తప్పింది. కాని ఎటువంటి నష్టం జరగలేదు" ఇందాక తనను లేపిన మధ్య వయసు అతను అన్నాడు.

ఆనంద్ కి మెల్లిగా విషయాలు అన్ని గుర్తుకురాసాగాయి. ఆ ఆక్సిడెంట్ అయిన వ్యక్తి, తన భార్య కిడ్నీఆపరేషన్ కోసం అతను ఇచ్చిన డబ్బును తన భార్య పేరు మీద చెల్లించడం, ఎద్దు ఎదురు రావడంతో బండి అదుపు తప్పడం అంతా కళ్ళముందు కదిలాయి. వెంటనే అతను తన భార్యకు ఎలా వుందో అని ఖంగారుగా బయల్దేరుదాం అనుకున్నాడు. కాని ఆక్సిడెంట్ కారణంగా బండి పూర్తిగా ధ్వంసం అవ్వడంతో ఆటోలో హాస్పిటల్ కి చేరుకున్నాడు. డాక్టర్ రఘు తన భార్య వున్నా ఐ సి యు లో ఉన్నాడని తెలుసుకుని అక్కడకు పరిగెత్తాడు. డోర్ తెరుచుకుని లోపలి ప్రవేశించగానే డాక్టర్ తో నవ్వుతూ కబుర్లు చెప్తున్న సంధ్యను చూసి అతని మనసు కుదుట పడింది.

"డాక్టర్ సంధ్యను బతికిన్చినన్దుకు చాలా కృతజ్ఞతలు డాక్టర్ " అంటూ ఎంతో ఉద్వేగంతో డాక్టర్ను అభినందించాడు ఆనంద్.

"కూల్ డౌన్ మిస్టర్ ఆనంద్. ఇప్పుడే మీ భార్యకు విషయం మొత్తం చెప్పాను. మీకు కూడా చెప్పాలి" దయచేసి నేను చెప్పింది పూర్తిగా వినండి. " అంటూ జరిగిన విషయం మొత్తం ఆనంద్ కు వివరించాడు డాక్టర్ రఘురాం. అంత విన్న తరువాత కొంచెం అయోమయంగా

"అంటే నా భార్యకు కిడ్నీ ప్రాబ్లం లేదన్నమాట. మరి ఆ కిడ్నీ ప్రాబ్లం ఉన్న స్త్రీకి డబ్బులు ఎవరు కట్టారు. ఆమె తాలూక వాళ్ళు ఎవరు లేరన్నారు కదా" అడిగాడు ఆనంద్.

"ఈ విషయం, గురించే నువ్వు వచ్చేముందు మీ భార్యతో చర్చిస్తున్నాను. కాని ఎంత ఆలోచించినా మాకు అర్థం కాలేదు." అని అన్నాడు డాక్టర్ రఘు.

"నాకు అర్థం అయ్యింది. ఇది కూడా మీ హాస్పిటల్ స్టాఫ్ చలవే. నేను **వీ.ఆర్. సంధ్యదేవి** పేరున కట్టిన డబ్బులు వాళ్ళు **ఆర్. సంధ్యా దేవి** పేరున కట్టి ఉంటారు " అంటూ ఉన్న విషయాన్ని బయట పెట్టాడు ఆనంద్.

"మరి నీకు ఇంత డబ్బు ఒక రోజులో ఎలా దొరికింది" అనుమానంగా అడిగాడు డాక్టర్ రఘు. ఇంతలో ఒక కంపౌండర్ ఖంగారుగా అక్కడకు వచ్చి "డాక్టర్ ఒక ఆక్సిడెంట్ కేస్ వచ్చింది. కండిషన్ చాలా సీరియస్ గా ఉంది. మీరు అర్జెంటు గా రావాలి" అని తొందరపెట్టాడు. వెంటనే ఆ సంభాషణ అంతటితో ఆపి ఆ ఆక్సిడెంట్ కేసు దగ్గరకు వెళ్ళాడు డాక్టర్ రఘు. ఆయనను అనుసరించి వెళ్ళిన ఆనంద్ బెడ్ మీద ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆక్సిడెంట్ తాలూకు వ్యక్తిని చూసి ఉలికిపడ్డాడు. కారణం అతను ఉదయం హైవే మీద తనకు డబ్బిచ్చి స్పృహ కోల్పోయిన వ్యక్తే.

"ఆనంద్ ఏమిటలా చూస్తున్నావ్? ఇతను మహేంద్ర గారి మేనల్లుడు" అని అన్నాడు డాక్టర్ రఘు. వెంటనే ఆనంద్ బయటకి వచ్చేసాడు. తను చేసిన తప్పుకి అతను చాల పశ్చాతాపడ్డాడు. డాక్టర్ రఘు మహేంద్ర గారి మేనల్లుడిని ట్రీట్ చేసి ఒక గంటలో సబ్ ఆర్డినేట్స్ కి పని అప్పగించి వచ్చి ఆనంద్ ను కలుసుకున్నాడు.

"ఏంటి ఆనంద్ ఆందోళనగా ఉన్నావ్? నీ భార్యకు ఏమి ప్రాబ్లం లేదుగా" అడిగాడు డాక్టర్ రఘు.

"అదికాదు డాక్టర్" అంటూ విజయవాడ హై వే మీద ఆక్సిడెంట్ విషయం మహేంద్ర గారి మేనల్లుడు తన చేతిలో డబ్బు ఉంచి స్పృహ కోల్పోవడం ఈ విషయం అంతా బయట పెట్టాడు ఆనంద్.

"డోన్ట్ వర్రీ ఆనంద్. నువ్వు ఇందులో బాధ పడాల్సింది ఏమి లేదు. నువ్వే కనుక సమయానికి ఆ డబ్బు చెల్లించకపోయి ఉంటే అతని తల్లిగారికి ఆపరేషన్ జరిగి ఉండేది కాదు. నీ ఉద్దేశం వేరైనప్పటికీ దేవుడు మంచే చేశాడు. ఆవిడతో పాటు నీ భార్యను కూడా బతికించాడు. అఫ్ కోర్స్ నీ భార్యకు ఏ ప్రాబ్లం లేదనుకో. నేను మహేంద్ర గారి మేనల్లుడితో మాట్లాడి నువ్వు చేసిన సహాయానికి నీకు ఏదో ఒక ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తానులే" అన్నాడు డాక్టర్ రఘు సంతోషంతో డాక్టర్ రఘు చెయ్యి ఊపుతూ.

"థాంక్ యు వెరీ మచ్ డాక్టర్ నేను జీవితాంతం మీకు ఋణపడి ఉంటాను" అంటూ ఉద్వేగంతో అన్నాడు ఆనంద్.

" నువ్వు రుణపడి ఉండాల్సింది నాకు కాదు ఆనంద్. ఒక్క ఆక్సిడెంట్ తో ఇన్ని జీవితాలు చక్క దిద్దిన భగవంతుడికి" అన్నాడు డాక్టర్ రఘు. ఆనందంతో తన భార్య గది వైపు నడిచాడు ఆనంద్.

# అనగనగా ఓ రాజకుమారి — బోడపాటి రమేష్

ఊహాదేశపు మహారాజు అప్పుడే సభ చాలించి అంత:పురం చేరుకుంటున్నాడు. ఆయన వెంట మహామంత్రి కూడా ఉన్నాడు.

"ప్రభువులు ఎందుకనో ఆందోళన చెందుతున్నట్లున్నారు."

"............"

"మన రాజ్యానికి ఏదయినా ఆపద సంభవిస్తోందా? శతృ రాజులెవరైనా మన మీద దాడి చేస్తున్నట్లు వేగులు వార్త తెచ్చారా? మీ బాధకు కారణం చెప్పండి ప్రభూ." మంత్రి ముఖంలో ఆందోళన.

"ఏం లేదు మహా మంత్రీ.. మీ దేశభక్తి, శక్తిసామర్థ్యాలవల్ల భగవంతుని ఆశీస్సులతో మన ప్రజలు సుఖంగానే ఉన్నారు. శతృ రాజుల వల్ల ఆపద కూడా లేదు. కానీ..."

"చెప్పటానికి సందేహిస్తున్నారేం ? అది నేను వినకూడని విషయమా ప్రభూ?" అన్నాడు ఆతృతగా.

"అదేంకాదు. అంత:పురం లోని విషయాలే కలవరపెడుతున్నాయి అమాత్యా. ముఖ్యంగా మా చిన్నారి యువరాణి ఊహా కుమారి విషయం లోనే మేము ఆందోళన చెందుతున్నాము".

"యువరాణి వారు ఏమయినా అనారోగ్యానికి గురయినారా ప్రభూ?"

"శారీరక అనారోగ్యం లేదు కానీ మానసికంగా చాలా బాధ పడుతున్నట్లు తోస్తున్నది. చెలికత్తెలతో ఆడి పాడదు. ఏదో ఊహాలోకం లో విహరిస్తున్నట్లు తోస్తున్నది."

"యుక్త వయసు వచ్చినది కదా ఆమె వివాహ విషయమై ప్రభువులవారు ఆలోచించాలి. ఏ రాకుమారునైనా వరించెనేమో? లేదంటే స్వయంవరం ఏర్పాట్లు చేయమందురా ?"

"ఇప్పట్లో వివాహ ప్రయత్నాలు ప్రారంభించటం ప్రమాదకరం. అందరు రాకుమారులు ఆమెను కాంక్షింతురు. ఎవరికి కోపము కలిగిననూ యుద్ధములు తప్పవు."

"అట్లయిన నృత్య సంగీతములతో ఆమెకు కాలక్షేపము కలిగించవచ్చునేమో?"

"అదియూ విఫలమయినది. మా చిన్నారికి సంగీతమన్న ఆసక్తి లేదు. ఆమె గొంతెత్తి పాడిన అంత:పురవాసులందరూ వ్యాధిగ్రస్తులగుదురు. చిన్నతనం నుండి రాచరికం లో పెరిగినదేమో నృత్యం ఆమెకు అలవి అగుటలేదు. పైగా ఆమె శరీర శ్రమకు ఓర్చుకొనలేదు. గ్రంధపఠనం మీద మక్కువ ఉన్నట్లుగా మహారాణీ వారు గ్రహించి మాకు మనవిచేసుకున్నారు."అన్నాడు మహారాజు ఒకింత దర్పంగా.

"అయినచో ఇంకేమీ మనవద్ద పురాణ గ్రంధములు, పతివ్రతల కథలు, వ్రతకథలూ ఉన్నవి కదా. వాటి శ్రవణమునకు ఏర్పాట్లు చేయమందురా?"

"వాటి మీద మాపట్టికి అయిష్టత. అవి అన్నియూ పాతకాలపు భావములనియూ అనాదిగా స్త్రీని అణగ దొక్కుటకు ఆమె వ్యక్తి స్వాతంత్రం హరించుటకు పురుషులు కల్పించిన కట్టుకథలని ఆమె అభిప్రాయం".

"హరిహరి. ఇదేమి విపరీతం ప్రభూ. అనాదిగా ఆదర్శప్రాయములైన రామాయణ భారతాది పురాణ గ్రంధములను ఈసడించటమా! మన రాకుమారివి విపరీత భావములుగా తోచుచున్నవి.మానసిక చికిత్స అవసరమేమో, రాజవైద్యులను పిలిపించమందురా?".

"వద్దు మహామంత్రీ మా చిన్నారిని మానసిక వైద్యమునకు గురిచేయటం మాకు ఇష్టంలేదు."

"మరి"

"మన రాజ్యంలో గ్రంధములు రచింప గలవారికోసం దండోరా వేయించండి. పద్య కవిత్వమన్న మా చిన్నారికి గిట్టదు. వచన కవిత్వమే కావలెను. ఉదయమునుండి రాకుమారి రాత్రి శయనించువరకూ ఆమెకు గ్రంధ పఠనం కావించవలెను. స్త్రీలకు ప్రాధాన్యం. తను మెచ్చిన రచన చేసినవారికి తగిన సత్కారం అని ప్రకటించండి."

"మన ఆస్థాన కవులున్నారు కదా."

"వారు మగవారు. వారి రచనలు మా రాకుమారికి రుచించవు."

"మరి ప్రతిదినమూ బహుమతి సత్కారములు జరపవలెనన్న మన ఆర్ధిక పరిస్థితి క్షీణించునేమో."

"ఇక మీరు వెళ్ళవచ్చు".

"చిత్తం ప్రభూ".

★ ★ ★

రాజ్యమంతటా స్త్రీల నుండి రచనలు రాకుమారి కొరకు రావలెనని దండోరా వేయబడింది. బహుమతులు కూడా ప్రకటించటంతో ఆమె అనుగ్రహానికి పోటీ పడేవాళ్ళు రోజు రోజుకి ఎక్కువవుతున్నారు. వీరినందరినీ అంత:పురం తీసుకువెళ్ళటం రాజోద్యోగులకు తలకు మించిన భారంగా తయారయింది. .

"ఇందులో నువ్వు చెప్పదలచుకున్న భావమేమి ?" ఆ రచయిత్రిని ప్రశ్నించింది, అప్పుడే విన్న రచన గురించి.

"ఏం లేదు రాకుమారీ, స్త్రీలకు అన్ని సమయములందునూ పురుషుని రక్షణ కావలెనని, అది లేనిచో ఆమె అగచాట్లు పడునని. "వణుకుతూనే చెప్పింది.

"అంటే స్త్రీ పురుషునకు బానిసగా ఉండటం తప్పదనే కదా." రాకుమారి గద్దించింది.

"....... " ..

"ఈ రచనలో పురుష ప్రమేయం కనిపించుచున్నది. నిజం చెప్పు. "

"మన్నించండి. నేను నా పిల్లల బాగోగులు చూస్తుంటే మీ బహుమతికి ఆశ పడి నా భర్త చేసిన ప్రయత్నం."

"చూచితిరా మగవాని దౌర్జన్యం. కేవలం బహుమతికి ఆశపడి ఈమెను తన పిల్లలకు దాసిగా నియోగించి ఆమె స్వతంత్ర భావములను అణగదొక్కుచూ తన భావములను అమె పేరు మీద ప్రచారం చేయ బూనుకున్న కుత్సితుడు. ఎవరక్కడ.?"

వచ్చిన భటులతో" ఈమె భర్తను ఆరు మాసములు కారాగారం లో బంధించమని మా తండ్రి గారికి చెప్పండి.అతడు తిరిగివచ్చువరకూ కుటుంబ పోషణకు ఏర్పాట్లు చేయండి".

★ ★ ★

రోజులు గడుస్తున్నాయి, రాజ్యానికి భారంగా.

రాజు, మంత్రి మళ్ళీ భేటీ.

"విచారంగా ఉన్నారేం ప్రభూ."

"ఏముంది. ఇదివరలో మా చిన్నారి ముచ్చట తీర్చటానికి రచనలను ప్రోత్సహించాను. అదే నా అశాంతికి కారణమయింది."

"నిజమే ప్రభూ. మన రాజ్యపు ఆర్ధికస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది.".

"అందరి రచనలు విన్న మా రాకుమారికి తను కూడా రచనలు చేయాలనే ఆసక్తి మొదలయింది. రచనలు చదివి వినిపించటం పాత పద్ధతి. నటీనటులతో నిరంతర ధారావాహికలు నిర్మించి దృశ్య ,శ్రవణ పరికరాలతో ప్రజలు తమ ఇంటి వద్దే వీక్షించే ఏర్పాట్లు చేయించమని కోరింది. రాజ్యమంతా అటువంటి పరికరాలు అందచేయండి."

మంత్రికి మతి పోయినట్లనిపించి "అవి మన రాజ్యం లో తయారవవ్వు ప్రభూ." అన్నాడు అయోమయంగా.

"ఏ రాజ్యం లో తయారయితే అక్కడినుంచి తెప్పించండి."

"మన ఆర్ధిక పరిస్థితి."

"నాణాలు ముద్రించండి. లేకపోతే ప్రజలమీద పన్నులు ఎక్కువ వేయండి. మా చిన్నారి ఆనందమే మా ఆనందం,. ప్రజల ఆనందం కావాలి. మా చిన్నారే ప్రజ. తక్షణం అమలు చేయండి".

'చిత్తం మహారాజా 'అనే మాట వినిపించక పోవటంతో ఆశ్చర్యంగా చూసిన రాజుకు చిత్తరువులా నిలబడ్డ మంత్రి కనిపించాడు.

# ఊట....! డా. వాసాల వరప్రసాద్

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

శాంతమ్మకు మెలకువ వచ్చింది. పక్కనున్న టార్చ్‌లైట్ వేసి గోడగడియారం వైపు చూసింది. సమయం ఉదయం 3.00 గంటలు అవుతోంది. నిన్నటికంటే అరగంట ముందే మెలకువ వచ్చినట్టుంది. టార్చ్ ఆఫ్ చేసి మళ్ళీ పడుకోవడానికి పక్కకు దొర్లింది. నైట్ బల్బ్ వెలుగులో ప్రక్క

బెడ్‌పై నిద్రపోతున్న ముసలాయన్ని చూసింది. ఆయన హాయిగా నిద్రపోతున్నాడు. తను కూడా నిద్రపోవాలనే బలవంతంగా కళ్లు మూసింది. క్షణకాలం కూడా కాలేదు. కళ్లు తెరుచుకున్నాయి. మళ్లీ పక్క మార్చింది. అయినా నిద్ర రావడం లేదు. ఈ 60 సంవత్సరాల ముసలితనానికి అన్ని ఆలోచనలే....ఆ ఆలోచనల నిండా 'నీళ్లే...'.

ఎండాకాలం మొదలయినప్పటి నుండి నెలరోజులు గడిచాయే లేదో బోర్ మోటార్లో నీరు సరిగా అందడం లేదు. గల్లీలో కొత్తగా బోరు వేసుకొని ఇల్లు కట్టుకున్నవారికి కూడా నీళ్లు ఉండడం లేదు. పై పెచ్చు ఒకరి తర్వాత ఒకరు లోతుగా బోర్లు వేస్తుంటే నీళ్లు అడుగంటిపోతున్నాయి. 'పోనీ మున్సిపాలిటి నల్లాలో నీళ్లయినా వస్తాయి కదా అనుకుంటే అదీ రెండు రోజులకొకసారి.... అదీ తాగటానికి మాత్రమే సరిపోతాయి. మరి పనులన్నింటికో ....?'

మరోసారి టార్చిని గడియారం వైపు వేసింది. ఈసారి సమయం 3.15 నిమిషాలు కావస్తోంది. శాంతమ్మ ఉండలేక పోయింది. మంచం మీద నుండి లేవాలనుకుంది. కాని నడుం పట్టేసినట్లు ఉండడం వలన ఒకేసారి లేవలేకపోయింది. అయితే ఈ టైమ్‌లో రాత్రి నీటి ఊట బోరులో వుంటుంది. ఈ టైమ్‌లో బోర్ మోటార్ వేస్తే ట్యాంకులో కొన్ని నీళ్లు నింపుకోవచ్చు. ఈ ఆలోచన బలాన్ని ఇచ్చినట్లయింది. మరోసారి ప్రయత్నించి లేచి కాసేపు మంచంపైనే కూర్చుంది. కాసేపాగి టార్చ్ చేతిలోకి తీసుకొని తలుపు తీసింది. బయటకు వెళ్లి చిన్న బకెట్లో నీళ్లు తీసుకొని ఈశాన్యంలోని బోర్ మోటార్ వైపు మెల్లిగా అడుగు వేయడం మొదలుపెట్టింది. బోరులో నీరు అందకపోవడం వల్ల పైనుండి మోటార్ పంపు బోల్టు తీసి కొన్ని నీళ్లు అందులో నింపుతే కాని అది స్టార్ట్ కాదు. అందుకే చీకట్లో ఒక చేత్తో టార్చ్ మరో చేత్తో చిన్న బకెట్ పట్టుకొని నీటి విషయంలో ఇంటాయన పట్టించుకోకపోవడాన్ని మనసులో ఆడిపోసుకుంది. ఈ పెద్ద మనిషి కనీసం భూమిలో వుండే బోర్ మోటార్ వేయించినా బాగుండేది. బయటకు బాగా శబ్దం చేయకుండానే నీళ్లని ట్యాంకులో నింపేది. పిల్లలు ఉన్నన్ని రోజు అన్నీ వాళ్లే చూసుకున్నారు. ఇప్పుడు వాళ్లు పక్షుల్లా ఎగిరిపోతే ముసలాయన తను ఇద్దరే మిగిలిపోయారు. మెల్లిమెల్లిగా నడుచుకుంటూ బోర్ మోటార్‌ను చేరుకుంది.

మోటార్ ప్రక్కనున్న రంధ్రాన్ని మూసి ఉన్న బోల్టుని విప్పి టార్చ్ ఆన్ చేసి నీళ్లు పైకి రావడానికి మగ్గుతో ఆ బోర్ పైపులో నీళ్లు పోసింది. ఇలా రెండు మూడు మగ్గు నీళ్లు పోసిన తర్వాత పైపు నుండి నీళ్లు పైకి వచ్చాయి. పక్కనున్న బోర్ మోటార్ స్విచ్ వేసింది. బోర్ మోటర్ ''ఉయ్....'' అంటూ నీళ్లు ట్యాంకులోకి వెళ్తున్నట్టుగా నిశ్శబ్దంలో వినిపిస్తోంది. అయినా మనస్సు కుదుటపడలేదు. ఒక్కోసారి శబ్దం మాత్రమే వస్తుంది. పైపులోకి భూమి లోపల ఊట అందక బోర్ మోటార్ శబ్దం మాత్రమే చేస్తుంది. కాబట్టి ఓసారి డాబాపై ఉన్న నీటి ట్యాంకు మూత తీసి చూస్తే మంచిది అనుకుంది.

ఈశాన్యం మూల నుండి మెల్లి మెల్లిగా నడుచుకుంటూ డాబాపై నైరుతి మూల ట్యాంకు వైపు వెళ్ళడానికి మెట్లెక్కడం ప్రారంభించింది. మెట్లు ఎక్కడం కాస్త ఇబ్బందిగా ఉన్న డాబా పైకి వెళ్తున్న కొద్దీ ట్యాంకులో నీళ్లు పడే శబ్దం చెవుకు చేరగానే శాంతమ్మకు కాస్త ఊరట కలిగింది. ఓసారి డాబాపై నైరుతి మూలకు మెల్లి మెల్లిగా చేరుకొని నీటి ట్యాంకు మూత తీసి టార్చ్ వేసింది. వయ్యారంగా వెళ్తున్న నీళ్ళని కళ్లనిండా చూసుకుంది. ట్యాంకులో పడుతున్న ఆ శబ్దాన్ని వింటూ అక్కడే ట్యాంకు దగ్గర కూర్చుండిపోయింది. ఇప్పుడు శాంతమ్మకి ఆ శబ్దమే సంగీతం. హాయిగా కళ్లు మూసుకుంది.

క్షణం గడిచిందో లేదో.. ''కుతుక్...కుతుక్...'' మంటూ మెల్లి మెల్లిగా నీళ్లు ఆగిపోయాయి. బోర్ శబ్దం మొరటుదేలింది. అది 'బావ్...బావ్...' బావురమంటూ వింత శబ్దాన్ని చేయడం మొదలు పెట్టింది. శాంతమ్మకు అర్థమయింది. బోర్ బావిలో ఊట అయిపోయిందని. గబుక్కున

లేవడానికి ప్రయత్నించి మళ్లీ కూర్చుండిపోయింది. కాని నీళ్లు లేకుండా బోర్ నడుస్తే మోటార్ పాడయిపోతుంది. ఓసారి అలా పాడయితే అది రిపేర్ అయ్యేవరకు మూడు రోజు నానా అవస్థలు పడాల్సివచ్చింది. ఈసారి శక్తినంతా కూడగట్టుకొని ఒక్కసారిగా లేచి నిలబడి టార్చ్ ఆన్ చేసి మెల్లి మెల్లిగా మెట్లు దిగింది. ఆయాస పడుతూనే వెళ్ళి బోర్ స్విచ్ ఆఫ్ చేసింది. నిశ్శబ్ద రాత్రిలో బోర్ మోటార్ వికృత శబ్దాలు ఆగిపోయాయి.

నిశ్శబ్దానికి కొంత స్వాంతన చెందినా శాంతమ్మ మాత్రం నిరాశ చెందింది. ఈ రాత్రి సమయంలో కూడా నీళ్లు సరిగా ట్యాంకులో పడలేదు. పట్టుమని అయిదు నిమిషాలు కూడా కాలేదు. అప్పుడే బోర్‌లో నీటి ఊట అందడం లేదు. మళ్ళీ బోర్ వేద్దామంటే ఓ అరగంట వరకు బోర్ పైపుకి భూమి లోపల ఊట అందదు. చేసేది లేక శాంతమ్మ పెరట్లోనే బోర్ గద్దెపై కూర్చుంది.

పిల్లలుంటే వాళ్లే ఇదంతా చూసేవారనిపించింది. కాని ఒక్కరు కూడా ఇంటి పట్టున లేకపోవడం వెలితిగా తోచింది. ఏమిటో ఈ జీవితం... పిల్లలు చిన్నగున్నప్పుడే బాగుండేది. ఎంత ఎండలు మండినా ఇంటి బావిలో పుష్కలంగా నీళ్లు ఉండేవి. పిల్లలు తలో చేయి వేసి గంగాళాన్ని నింపేవారు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ బావిలో ఎంత పూడిక తీసినా ప్రయోజనం లేకపోయింది. మెల్లిమెల్లిగా బావి బావురుమంది. ఒక్క చుక్క నీరు కూడా లేకుండా పోయింది. అందరి ఇండ్లలోని బావులకు ఇదే గతి పట్టింది. అప్పుడు కూడా పిల్లలు లక్ష్మి, రమేష్ తలో చేయి వేసి దగ్గరున్న సర్కారు చేతి పంపు నుండి నీళ్లు పట్టుకొచ్చి ఇంట్లో సిమెంటు కుండీని నింపేవాళ్ళు. అలా వాళ్లు నీళ్లు మోసుకుని తీసుకరావడం, నేను నీటి కోసం నానా హైరానా పడటం ఆయనకి కష్టంగా అనిపించి బ్యాంకులో లోన్ తీసుకొని మరీ బోర్ వేయించారు. అప్పటి నుండి నీటికి లోటు లేకుండా పోయింది. పెరట్లో మొక్కకు కూడా కష్టం తీరిపోయింది. పక్కింటి వాళ్ళు, ఎదురింటి వాళ్లు నీళ్ళకోసమని వచ్చి చాలాసేపు కబుర్లతో కాలక్షేపం చేసి వెళ్లేవారు. కాని ఇప్పుడు గల్లీ నిండా అందరి ఇండ్లల్లో బోర్లు.... ఒకరిని మించి మరొకరు లోతుకు నీళ్లను తోడేస్తున్నారు. అయినా పిల్లలెప్పుడు పెద్దయిపోయారో, ఈయన ఎప్పుడు రిటైర్ అయ్యారో...తనకెప్పుడు వయస్సు పైబడి శరీరం సహకరించకుండా పోయిందో...అంతా కలగానే వుంది.

ఇద్దరు పిల్లలకి పెళ్ళిల్లు అయ్యాక మాత్రం తన జీవితంలో పెను మార్పులు వచ్చాయి. కూతురు లక్ష్మి పిల్లల పురుళ్ళు అయ్యేంతవరకే ఇంటికి వస్తూ పోతూ వుండేది. ఇప్పుడు రమ్మని పిలిచినా నా కుటుంబం, నా పిల్లలు అంటూ రావటమే మానేసింది. కొడుకు కూడా పెళ్లయ్యాక కోడలుతో ఉద్యోగరీత్యా పట్నంలోనే కాపురం పెట్టాడు. పిల్లలు పెద్దయ్యాక జీవితంలో ఇవన్ని సహజమని ఎంత సర్దిచెప్పుకున్నా మనసుకి మాత్రం ఓ మూల బాధగానే వుంటుంది. ముసలితనంలో ఈ బాధ వారికి అర్థం కావాలంటే పిల్లల మనసులో కూడా మా స్థితిని అర్థం చేసుకునే ఊట ఊరాల్సి ఉంది. అది ఎప్పుడు సాధ్యం అవుతుందో....! అది ఆ భగవంతుడికే తెలియాలి.

అప్పటికి కొడుకు మా ఇద్దరిని కూర్చోపెట్టుకొని ''నా ఉద్యోగరీత్యా నాకు ఇక్కడ ఉండడం సాధ్యం కాదు కదా...! రండి మాతోనే సిటీకి వచ్చేయండి...మాతోనే వుండండి'' అన్నాడు. సరే పట్నం వెళ్దామంటే వాడిది చిన్న ఉద్యోగం, చాలీ చాలని జీతం, ఇరుకైన ఇల్లు, ఎవ్వరూ పలకరించని అదో రకమైన వాతావరణం అన్నింటిని దృష్టిలో పెట్టుకొని ''మీ అమ్మకి ఇంకా చాతన అవుతుంది, కట్టుకున్న ఇంటిని, ఉన్న ఊరుని వదిలి మీతో ఎలా వచ్చేది, మరీ కష్టకాలం వస్తే అప్పుడు చూద్దాం లే...'' అంటూ ఆయన దాటవేశాడు. ఇక అప్పటి నుండి వాడు 'పండుగకో...పబ్బానికో తప్ప' ఇంటికి రావడం మెల్లి మెల్లిగా తగ్గిపోయింది. వాడికి రావాలని ఉన్నా ఉద్యోగరీత్యా సెలవు దొరక్కపోవడం ఒకవైపు అయితే మరోవైపు వాడికి పుట్టిన కొడుకు రాహుల్ ఆలనా పాలనా అన్నీ చూడడం వల్ల తరచూ రావడం తగ్గించేశాడు. అయినా ఎప్పుడూ ఫోన్ చేస్తుంటాడు. ముసలాయన ఆరోగ్యం ఇబ్బందిగా ఉంటే మాత్రం పట్నం తీసుకెళ్లి ఓపిగ్గా హాస్పిటల్ తీసుకవెళ్లి డాక్టర్లకు శ్రద్ధగా చూపిస్తాడు, మందులు గట్రా ఇప్పిస్తాడు. ఇంటికి వెళ్తే కోడలు కూడా అన్ని సపర్యలు సమయానికి శ్రద్ధగా చేసి పెడుతుంది. మనవడు రాహుల్‌తో కూడా సమయం హాయిగా గడిచిపోతుంది. కాని ఇప్పుడు వెళ్దామంటే ఈ

ఎండాకాలం అది కూడా సాధ్యం కాదు. ఎందుకంటే పట్నంలో  కూడా నీటి కష్టాలు తక్కువేం కాదు. దినదిన గండమే.  నీళ్లు కూడా కొనుక్కోవాల్సిందే...తాగటానికే కాదు వాడుకోవడానికి కూడా....!

మనవడు రాహుల్ గుర్తుకురాగానే ఒకసారి మనసుని మెలిపెట్టినట్టుగా అనిపించింది. కనీసం వాళ్లనైనా ఇక్కడికి రమ్మందామంటే నీళ్లకు కరువాయే. ఏం చేయాలో శాంతమ్మకి పాలు పోలేదు. అప్రయత్నంగానే ఉబికి వచ్చిన కన్నీటి ఊటను కొంగుతో తూడ్చుకుంటూ ఎలాగోలా ఇక్కడే సర్దుకుపోదాం అంటే  పైబడుతున్న వయస్సు, పైగా నీటి కరువు రెండూ ఇబ్బంది పెడుతున్నాయి.

శాంతమ్మ అరగంట అయిపోయి వుంటుందని మెల్లిగా లేచి మళ్లీ చిన్న బకెట్లోంచి మగ్గులో నీళ్లు పట్టుకుంది. టార్చ్ ఆన్ చేసి బోర్ పైపు రంధ్రంలో నీళ్లు పోసింది. నాలుగైదు మగ్గులు పోసిన తర్వాత నీళ్లు ఉబికి పైకి వచ్చాయి. ఇక బోర్ మోటార్ వేద్దామనుకునే లోపల పక్కింట్లోంచి కూడా బోర్ మోటార్ శబ్దము వినబడింది. చూస్తే అక్కడ కూడా లైట్ వెలుగుతూ కనపడింది. బహుశా నాలుగు గంటలయి వుంటుంది. తను మొదటిసారి బోర్ వేసినప్పుడే ఆ శబ్దానికి లేచినట్లున్నారు. శాంతమ్మకి పొరుగింటివాళ్లపై కోపం వచ్చింది. పొరుగువారు ఎంత మంచివాళ్లయినా వాళ్లకి కూడా నీళ్లు కావాలిగా అనుకోగానే కాస్త కోపం తగ్గింది.

బలవంతంగా మోటార్ స్విచ్ వేసింది. ''బూర్....''మని మోటార్ శబ్దం పెద్దగా శాంతమ్మకు వినపడిరది. కొద్ది సేపటికి బోర్ శబ్దం కొంచెం తగ్గింది. నీళ్లు సన్న ధారగా ట్యాంకులో పడుతున్నట్టుగా శాంతమ్మకు అనిపించింది. ఎన్ని నీళ్లు పడుతున్నాయో చూద్దామని మళ్లీ మెల్లి మెల్లిగా మెట్లు ఎక్కుతూ నైరుతి వైపు ఉన్న ట్యాంకు దగ్గరికి చేరింది. మూత తీసి టార్చ్ వేసింది. 'చిన్న పిల్లాడు పోసే ఒంటేలుకు మల్లే' నీళ్లు ట్యాంకులో పడుతున్నాయి. టార్చితో పరీక్షగా ట్యాంకులో క్రిందున్న నీళ్లను చూసింది. 'ఓ నాలుగు బకెట్లు నీళ్లు పడ్డాయనుకుంది...ఈ నీళ్లు దేనికి సరిపోతాయి...పొద్దున్నుంచి రాత్రిదాకా ఎన్ని పనులకి నీళ్లు అవసర మవుతాయో ఈ మగవాళ్లకేం తెలుసు...అన్ని సవ్యంగా జరగాలని మాత్రం అనుకుంటారు'.

మళ్లీ బోర్ మోటార్ శబ్దం పెరిగిపోయింది. శాంతమ్మకి అర్థం అయింది, పక్కింటి వాళ్లు బోర్లు వేయడం వన ఇప్పటికి బోర్ మోటార్లో నీటి ఊట తగ్గిపోయిందని. చేసేది లేక మెల్లి మెల్లిగా నడుస్తూ ఆయాసపడుతూ వెళ్ళి మోటార్ని ఆపేసింది. ఈసారి బోర్‌లోకి నీరు చేరాంటే చాలా సమయం పడుతుంది. తెల్లవారుతోంది కదా అందరూ బోర్లు వేస్తారు.. మధ్యాహ్నం వరకు గాని మళ్లీ బోర్‌లోకి నీరు ఊరదు.

చేసేది లేక గది తలుపు తెరచి బెడ్ దగ్గరికి వచ్చింది. టార్చ్ ఆన్ చేసి గోడ గడియారం వైపు తిప్పింది. ఉదయం 4.30 ని॥లు అవుతుంది. ఓసారి ముసలాయన వైపు ఆలంబనగా చూసింది.  తనూ మంచంపై నడుం వాల్చింది. శరీరం అలసినందుకు కాస్త హాయిగా అనిపించినా మనసంతా అదోలా వుంది. కళ్లు మూసుకుంది. కష్టమైనా సరే ఈసారి రమేష్ ఫోన్ చేస్తే చాలా మాట్లాడాలని అనుకుంది. మా పరిస్థితిని అర్థం చేసుకుని మమ్మల్ని కనిపెట్టుకు ఉండడానికి మా దగ్గరికి వాడు రాకపోతేనేం...! మేమైనా వెళ్లి వాడికి చేదోడు వాదోడుగా ఉండచ్చు.... ఆర్థికంగా వాడిపై భారం కాకుండా ఆయనని ఒప్పించి బ్యాంకులో ఉన్న కొంత డబ్బుని వాడికి ఇప్పించేలా చేస్తాను. అయినా మా తదనంతరం అంతా వాడిదేగా....! నేనిలా అనుకుంటున్నాను కాని ఆయన ఏమంటారో...? కనీసం వాళ్లయినా ఇక్కడకు వస్తే బాగుండు. కొడుకు, కోడలు, బిడ్డ అల్లుడు అందరూ ఇంటికి రాక ఎన్నినెలలు అయ్యిందో.....! మనవడు రాహుల్‌పై మనస్సు కొట్టుకుంది. అప్రయత్నంగానే శాంతమ్మ కళ్లలో మళ్లీ కన్నీటి ఊట ఉబికి వచ్చింది. పిల్లల్ని తలచుకుంటూ నిద్రలోకి జారుకుంది.

‘‘ఎదురుగా కొడుకు రమేష్, కూతురు లక్ష్మి ఒకరి తర్వాత మరొకరు పోటీగా పక పకా నవ్వుకుంటూ సర్కార్ బోర్ నుండి నీళ్లు తీసుకొస్తున్నారు. నీలి రంగు నీళ్ల డబ్బాని నింపుతున్నారు.. మనవడు రాహుల్ నీటిలో చేతులు పెట్టి ఆడుతున్నాడు...!’’.

ఇంతలో ‘‘శాంతా...శాంతా...! లేవవే ఆరున్నర అయింది.... నీళ్ల ట్యాంకర్ వచ్చినట్లుంది... పక్కింట్లో బిందేల శబ్దం అవుతున్నాయి..... లే...! ఈ రోజు పోతే మళ్లీ రెండు రోజులకు గాని ట్యాంకర్ రాదు... ఈరోజు మునిసిపాలిటి నల్లా కూడా రాదేమో...? తొందరగా లెవ్వు’’ అనగానే కల నుండి ఉలిక్కిపడి లేచింది శాంత.

ఎదురుగా కూతురు, కొడుకు లేకపోయేసరికి క్షణకాలం శాంతమ్మ నిరాశ చెందింది. తెరచివున్న గది తలుపునుండి ఇంటి గుమ్మం వైపు ఓసారి చూసింది. కాస్త తేరుకొని ఎక్కువసేపు ట్యాంకర్ ఉండదు, కాబట్టి వెంటనే వంటిట్లోకి వెళ్లింది. బిందెల్ని గబా గబా కడిగి ట్యాంకర్ వైపు నడిచింది.

# భూమి

రవి కొప్పరపు

"నువ్వు విన్నావా ఆ వార్త? నిజమేనా?" ఇంటికి రాగానే అడిగారు ఆయన. తొందరగా వచ్చేసారు ఇవాళ. ఆయనికి పని మీద కంటే, నా మీదే ప్రేమెక్కువ. ఆఫీసులో ఏమాత్రం పని లేకపోతే, వెంటనే ఇంటికి వచ్చి నా దగ్గర వాలిపోతారు. వచ్చి, నన్ను దగ్గర పెట్టుకొని కూర్చుంటారు. అస్సలు వదలరు. నాకేమో చాలా పనులు, నేను కూడా ఆఫీసు నుంచి వచ్చిన తరువాత.

నేను తలెత్తకుండానే జవాబు చెప్పా "చాలా విన్నా ఇవాళ. ఏది మీరు అడిగేది?".

చిరాకుగా అన్నారు "అబ్బా, నువ్వు పని చేసేదే అలాంటి విషయం మీద. పైగా ప్రభుత్వ అంతరిక్ష పరిశోధనా ల్యాబ్ లో...ఇంత కన్నా వేరొక ముఖ్యమైన వార్త ఏముటుంది మీకు? అసలు ఎవరికైన ఇవాళ ఇంతకంటే అద్భుతమైన వార్త ఏముంటుంది?"

కరక్టే, ఇవాళ పొద్దునే ఎవరి పనుల్లో వాళ్ళుంటే, దేశాధ్యక్షుడు, ఆయనతో పాటు మా అంతరిక్ష పరిశోధనా సంస్థ ముఖ్యాధికారి (అంటే నా బాస్) ప్రపంచం ఉలిక్కిపడే వార్త చెప్పారు. మానవాళి ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న వార్త. ఈ విశాల విశ్వంలో ఇకనుంచి మనం ఒంటరిగా లేము. మనలాంటి గ్రహం ఒకటి వుందని, ఉండడమే కాదు, ఆ గ్రహం మీద వేరే జీవులున్నారని ప్రకటించారు. సరే, ఈ విషయం నాకు ముందే తెలుసు. ఎందుకంటే ఆ పరిశోధనలో నేను కూడా పాలు పంచుకున్నాను కాబట్టి! కాని ఎవ్వరికి ఈ విషయం చెప్పలేదు. చెప్పనివ్వలేదు. దేశాధ్యక్షుడికి కూడా చాలా ముందే తెలుసు. కాని ప్రపంచానికి ఎలా చెప్పాలో, ఎప్పుడు చెప్పాలో అనేది తర్జనభర్జనలు పడి, చివరకి ఈ వార్త మీడియా వాళ్ళకి ఎలాగో తెలిసిపోయిందని, వాళ్ళు ప్రపంచానికి చెప్పేలోపే అధికారికంగా చెప్తే జనాలకి ప్రభుత్వం ఏదో దాస్తున్నదని ఆలోచన రాకుండా చూడచ్చు. పైగా, ప్రభుత్వమే స్వయంగా చెప్తే, మీడియా వాళ్ళు లేని పోని భయాలు కల్పించకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. అసలు ఏమి లేకుండానే వాళ్ళు ప్రతి విషయాన్ని 'సంచలన ' వార్త అంటారు. మరి ఈ రేంజులో ఉన్న వార్త అనధికారికంగా తెలిస్తే ఇంకేమైనా వుందా?

"ఆ వార్త నిజమే. నాకు ముందే తెలుసు. కాని ఎవరికీ చెప్పదొన్నారు" అన్నాన్నేను.

ఆయనేమి మాట్లాడలేదు. నా సమాధానం కంటే, టెలీవ్యూ లో వచ్చే వార్తలు చూస్తున్నారు. ఏదో చర్చా కార్యక్రమం అనుకుంటా. ఏదో వాదించుకుంటున్నారు. ఒకరేమో ఇది చాలా దుర్వార్త అని, లేని పోని తలనొప్పులు మనకు ఎందుకని, మనం వాళ్ళకు ఏమీ సంకేతాలు పంపక్కర్లేదని, దీని మూలంగా మనకు చాలా హాని కలుగుతుందని వాదిస్తున్నారు. మన గురుంచి అందరికి టాంటాం దేనికని, వాళ్ళు ఎలాంటి వాళ్ళో తెలియకుండా ఏమి చెయ్యొద్దని వాదన.

ఇంకొకరేమో, మనకు ఇష్టమున్నా లేకపోయినా, కొందరు అతి ఉత్సాహవంతులు ఎవరో ఒకరు ఖచ్చితంగా మన గ్రహం నుంచి సంకేతాలు పంపిస్తారని. అలా ఎవరికి వాళ్ళు ఇష్టమొచ్చి పంపే బదులు ప్రభుత్వమే అధికారికంగా పంపిస్తే మంచిదని. పైగా సంకేతాల్లో భయంకరమైన విషయలేమీ పంపక్కర్లేదని 'హలో మేము ఇక్కడ వున్నాము, మేము ఇలాంటి జీవులం, ఇలా వుంటాము ' అని సందేశం ఇస్తే చాలని అంటున్నారు. దానికే మరీ ఇంత 'అతి ' స్పందన అనవసరం అని వాళ్ళ భావన. మన గురుంచి ఏమి చెప్పకుండా, వాళ్ళ నుంచి విషయాలు రాబట్టడానికి ప్రయత్నించచ్చు. అసలు విషయం అది కాదు.

మన గురుంచి వాళ్ళకి తెలిసినా వెంఠనే ఏమీ చెయ్యలేరు. వెంఠనే ఏమిటి, కనీసం ఒక 40 ఏళ్ళు పడచ్చు వాళ్ళు అసలు ఇక్కడికి రావాలనుకుంటే. అంత దూరంలో వున్నారు..అది కూడా వాళ్ళకు చేతనైతే. చూస్తుంటే వాళ్ళు మనకన్నా కనీసం 100 సంవత్సరాలు వెనకబడి వున్నారు. మనం రాకెట్లు వేసుకొని మన సౌర కుటుంబం లోని గ్రహాలకి వెళ్ళగలుతున్నాము.. పదిహేనేళ్ళ క్రితం, ఒక ప్రైవేటు కంపెనీ మన సూర్యుడికి దగ్గరలోని ఒక నక్షత్రానికి రాకెట్టు పంపించింది...అది అక్కడికి చేరిందని సంకేతం వచ్చింది. మళ్ళీ దాని గురుంచి వార్త లేదు. కాబట్టి, చూస్తుంటే మనమే వాళ్ళకన్నా టెక్నాలజిలో ముందున్నాము. బలహీనుడి ముందు బలవంతుడికి భయం దేనికి?. అని ఇంకొందరి వాదన.

"నన్నడిగితే మనకు పోయేదేమి లేదు. కాని మన మతాలు, మన దేవుడి మీద నమ్మకం అన్నీ ప్రశ్నించుకోవాలి ఇప్పుడు అన్నారాయన..."ఎలా?" అడిగాన్నేను, భోజనం పెడుతూ.." ఎందుకంటే మన దృష్టిలో మనం దేవుడిని ఊహించుకున్నాం...ఇప్పుడు మన దేవుడు వాళ్ళనెందుకు సృష్టిస్తాడు? అసలు వాళ్ళు దేవుడిని నమ్ముతారా? లేదా మనమే నమ్ముతున్నామా? ఇలాంటి చాలా ప్రశ్నలు వున్నాయి" .

"అది సరేగాని, మీ ఆఫీసులో ఏమంటున్నారు?" అడిగారాయన..."అసలు నాకెంత గర్వంగా ఉందో తెలుసా? ఇది కనుక్కోవడంలో నీ పాత్ర ఎంత వుందో నాకు తెలీదు కాని, నా ఫ్రెండ్స్ అందరూ నన్ను అభినందిస్తున్నారు. నేను చాలా ఫోజు కొడుతున్నాను..కొంతమంది మన ఇంటికి కూడా వస్తామన్నారు. నేనే ఇప్పుడు వద్దన్నాను".

నేను మౌనంగా వుండడం చూసి అడిగారాయన "ఏంటి ఇవాళ ఎక్కువ మాట్లాడట్లేదు? అసలు ఇవాళ నేను ఎక్కువ మాట్లడుతున్నాను నీకంటే ఈ విషయం మీద. రోజు నన్ను నీ పరిశోధన విషయాలతో చెప్పి చక్కగా నిద్ర పుచ్చేదానివి, ఇవాళ ఏమి మాట్లాడవా? అసలే నాకు నిద్ర వచ్చే టైము అయ్యింది" అన్నారు నవ్వుతూ.

భోజనం అయ్యింది..ఇద్దరం కూర్చున్నాము.

"మీకో విషయం చెప్పాలి" నసిగా...

"చెప్పు, ఇంతకంటే బ్రహ్మాండం బద్దలయ్యే విషయం ఏముంటుంది?"

మెల్లగా చెప్పడం మొదలెట్టా "మీకు గుర్తుందో లేదో మొన్నామధ్య ఒక ప్రైవేటు కంపెనీ దగ్గర్లోని నక్షత్రానికి రాకెట్టు పంపించింది".

"ఆ, దాని గురుంచే మర్చిపోయాను..నేనేంటి, చాలా మంది మర్చిపోయారు..ఏమైందో దానికి తెలియలేదు కదా?" అన్నారు...

"మీరు నన్ను మర్చిపోరు కదా?" ఆయన వైపు చూస్తూ అన్నా.

ఆయన నవ్వి, "నువ్వు చెప్పే విషయాలు మర్చిపోతా గాని, నిన్ను ఎలా మర్చిపోతాను, పైగా నువ్వేదో ఆ రాకెట్లో వెళ్ళలేదు కదా?"

నేనేమీ మాట్లాడలేదు. ఆయన వైపే చూస్తూ ఉండిపోయా.

ఆయన అనుమానంగా చూస్తూ "ఏంటి నువ్వు చెప్పేది?" అని అడిగారు.

"కొంత కాలం క్రితం ఆ కంపెనీ ఒక కొత్త టెక్నాలజి కనుక్కుంది. దాని మూలంగా ఇంతవరకు మనం చేస్తున్న అంతరిక్ష ప్రయాణం పదో వంతుకు తగ్గుతుంది. ఆ కంపెనీ, మా అంతరిక్ష పరిశోధన ల్యాబ్ సహాయంతో ఒక రాకెట్టు తయారు చేసింది ఆ నక్షత్రం దగ్గరికి పంపేందుకు. పదిహేను సంవత్సారాల అయ్యింది అది వెళ్ళి.." ఆగాన్నేను..

"అబ్బా, ఇవన్నీ ఇప్పుడు ఎందుకు? అసలు విషయం చెప్పు" అన్నారాయన.

"అక్కడికే వస్తున్నా. ఆ రాకెట్టు వెళ్ళింది ఎక్కడికో కాదు. మీరు ఇవాళ చూసిన వార్తల్లోని గ్రహానికే".

అదిరిపడ్డారాయన.. "ఏంటి?? నిజమా? అంటే...అంటే...మీ అందరికీ ఈ గ్రహం గురించి 15 ఏళ్ళ క్రితం ముందే తెలుసా?!!"

..చెప్పడం సాగించా నేను "తెలియడమే కాదు, ఆ గ్రహ జీవుల గురుంచి చాల విషయాలు కూడా తెలుసుకున్నాము. కాని ఆ రాకెట్టు ని వాళ్ళు చూసారు, ఏదో ఎగిరే పళ్ళెం అనుకుంటున్నారు. ఆ గ్రహాన్నీ, గ్రహ జీవుల్నీ మరింత దగ్గర నుంచి పరిశోధించడానికి కొంతమందిని మరో రాకెట్లో పంపిస్తున్నారు. ఆ బృందంలో నన్ను కూడా రమ్మని అడిగారు".

నేను చెప్పిన విషయం అర్థం అవ్వడానికి కొంత సమయం పట్టిందాయనకు. అర్థం అవ్వగానే భయం కనిపించింది ఆయన్లో. అది ఎవర్నో పోగొట్టుకొనే భయం. దానికి కారణం ఉంది. ఆ గ్రహం దగ్గరికి ప్రయాణం చెయ్యడానికి కనీసం పదిహేనేళ్ళు పడుతుంది. మళ్ళీ తిరిగి రావడానికి ఇంకో పదిహేను...కనీసం ముప్పై ఏళ్ళు . అది కూడా వెళ్ళి వెంఠనే తిరిగి వస్తే, మధ్యలో ఏమీ కాకుండా ఉంటే...ఇక్కడే ఒక వింత విషయం ఉంది.

ఈ ముప్పై ఏళ్ళు జరిగేది ఆ రాకెట్లో వెళ్ళే వాళ్ళకి కాదు. వెనక ఉండిపోయే వాళ్ళకి,. సాపేక్ష సిద్ధాంతం ప్రకారం, రాకెట్లో ఉండేవాళ్ళకి కేవలం పదేళ్ళు కంటే ఎక్కువ అనిపించదు. దాని మూలంగా, రాకెట్లో ఉండేవాళ్ళ కంటే, వెనక ఉండిపోయే వాళ్ళకి ఎక్కువ వయస్సు ఉంటుంది. అంటే, నేను తిరిగి వచ్చే సరికి, ఆయన నాకంటే దాదపు ముప్పై ఏళ్ళు పెద్దవాళ్ళైపోతారు!

"వెళ్ళద్దు, అసలు నేను ఆఫీసులో ఉంటేనే ఎప్పుడెప్పుడు నిన్ను కలుద్దామని వుంటుంది. ఇంక నువ్వు ముప్పై ఏళ్ళు వెళ్ళిపోతే??" బేలగా అన్నరాయన.

"నేనింకా ఏమీ చెప్పలేదు వాళ్ళకి. నాకూ వెళ్ళాలని లేదు, కాని గ్రహాంతర యానం చెయ్యడానికి యెంతమందికి అవకాశం దక్కుతుంది? అలాగని మిమ్మల్ని వదులుకోలేను. ఏమి చెయ్యాలో తోచట్లేదు"

" నీ బదులు వేరే ఎవ్వరూ వెళ్ళలేరా?" దిగమింగుకుంటూ అడిగారు..

"ఉన్నారు కాని, నాలాగ ఈ గ్రహం గురుంచి పరిశోధన చేసిన వాళ్ళు తక్కువ. పైగా మిగతా వాళ్ళందరు నాకంటే వయస్సులో చాల పెద్ద. అసలు ఈ బృందంలో అందరూ నాలాగే తక్కువ వయస్సున్న వాళ్ళు. నేను అన్ని విధాల సరిపోతానని నన్ను అడిగారు..".

కొద్ది సేపు మౌనం...అది కొంతసేపో, మాకు అలాగ అనిపించిందో తెలీదు...రకరకాల అలోచనలు ఇద్దరికీ.

కొంచెం సేపు అలోచించారాయన. నా మూడు వేళ్ళు పట్టుకొని "నా స్వార్ధం కోసం నిన్ను వుండమనను...నా దగ్గరే వుంటే నీకు, ఆ గ్రహాంతర యానం చేసినంత పేరు రాదు. నువ్వు వెళితే, నీ పేరు తర తరాలకి గుర్తుండి పోతుంది...చరిత్రలో శాశ్వతంగా ఉండిపోతావు..."

"నేనేమీ చెప్పదలుచుకోలేదు ఇప్పుడే. ఇంకా సమయం వుంది.. పైగా, ఆ గ్రహం ఎక్కడికీ పోదు, అక్కడే వుంటుంది" అన్నాన్నేను.

"అన్నట్టు, అడగడం మర్చిపోయా...ఆ గ్రహాన్ని మీరేమని పిలుస్తున్నారు?"

లేస్తూ అన్నాను "ఇంతకు ముందు మేము పంపిన రాకెట్లో, ఆ ఏలియన్స్ వాళ్ళ గ్రహాన్ని ఏమని పిలుస్తున్నారో తెలిసింది...మేము కూడా అదే పేరుతో పిలుస్తున్నాము"...

"ఏమని"?

**"భూమి"**

# ఉండండి నాన్నా! డా.పేరం ఇందిరా దేవి

చాలా రోజులుగా కూతురున్న ఊరికి వెళ్ళలేదు నారాయణ రెడ్డి. ఇప్పుడతనికి ఆ వూర్లో పనుంది. ఇప్పుడు కూతురు కోసం కాకుండా పనికోసం వచ్చానంటే కూతురు బాధపడుతుంది. పైకి ఏమీ అనకపోయినా మనసులో అయినా నన్ను పట్టించుకోలేదు కదా అనుకుంటుంది. నిజమే కూతుర్ని పట్టించుకోలేదు. పట్టించుకోకూడదని కాదు అలాంటి పరిస్థితిలో వున్నాను మరి అనుకున్నాడు. నారాయణ రెడ్డి అంటే వూర్లో మంచి వ్యవసాయపు భూములున్న వ్యక్తి . ఆరు నూరైనా నూరు ఆరైనా మాట మీద నిలబడే ఖచ్చితమైన మనిషి, నలుగురికి సాయం చేయడంలోను, కుటుంబ వివాదాలొస్తే, భూమి తగాదా లొస్తే, తగవు తీర్చే పెద్దమనుషుల్లో నిజంగా పెద్ద మనిషి. నొప్పివ్వక తానొవ్వక అనే సిద్ధాంతంతో పాటు ఎవరైనా నొప్పించినా, అతడే పరిస్థితిల్లో అలా చేశాడో అనుకుని, మనసుని మళ్లించుకుని, మన్నించి మర్చిపోయే వాడు. అందుకే అతని వదనంలో శాంతం తాండవిస్తుంది, లేత గులాబీ రంగులో ఎనభైలో కూడా ఆయన ఛాయ మెరుస్తుంది. నీ కొడుకుల మొహాల్లో ముడతలున్నాయి నీవేమి అమృతం తాగావా అని అతని స్నేహితులు అబ్బుర పోతుంటారు. తల దించుకునే పనెప్పుడూ ఆయన చేయలేదు. కష్టాలకు కన్నీళ్లకు క్రుంగక, లొంగక మేరు పర్వతంలా నిలబడ్డాడు.

కానీ ఇవాళెందుకో ఆయన మనసుకు కష్టంగా వుంది. ఎప్పుడో అమ్మిన ఓ భూమి తాలూకు రిజిస్ట్రేషన్ గురించి పేరు రాయడంలో ఏదో పొరపాటు జరిగినందుకు వాళ్ళు కారు పంపిస్తాం రమ్మన్నారు. తీరా బయలు దేరుతుంటే ఆయనలో ఈ సందేహం మొదలయ్యింది. కూతురికి వస్తున్నానని ఫోన్ చేద్దామని అనుకున్నాడు కానీ మనసొప్పు లేదు. పని మీద వస్తున్నానని చెప్పడం అతనికి కష్టంగా వుంది. భార్యకు చెప్పేశాడు. “జానకికి నువ్వు ఫోన్ చెయ్యి నేను వస్తున్నానని“ అన్నాడు. అమ్మా కూతురు రోజూ మాట్లాడుకుంటుంటారు అప్పుడప్పుడు 'నాన్న కివ్వమ్మా ' అని కూతురు అడిగితే మాట్లాడుతుంటాడు ,అదే పనిగా కూతురుకు అతనేమీ ఫోన్ చేయడు.

దారి వెంట అంతా కూతురు గురించి ఆలోచించాడు నారాయణరెడ్డి. సంవత్సరం దాటింది కూతుర్ని చూసి అతనికి అయిదేళ్ల వయసులో వున్నప్పుడు తల్లిని కోల్పోయాడు. అతనికి లీలగా గుర్తున్నది చనిపోయే ముందు తల నిమిరిన తల్లి చేతి స్పర్శ, అంతవరకు ఏడ్వని అతని తాత

కూతుర్ని చితిపై పడుకో బెట్టాక పొడవైన ఆమె జడ చితి పైనుండి నేలపై జీరాడుతుంటే దాన్ని చేతుల్లోకి తీసుకుని గుండెలు పగిలేలా మనవడిని హత్తుకుని భోరుమనడం. నారాయణ రెడ్డి తన తల్లి అందం, రంగు, పొడవాటి జుట్టు పుణికి తెచ్చుకున్న కూతుర్ని చూసుకుని మా అమ్మ అని మురిసిపోయేవాడు . అతని తల్లి పేరు జానకి. అదే పేరు కూతురుకు పెట్టుకున్నాడు. వూర్లో ఆడపిల్లలు ఎవరూ చదువుకోకున్నా జానకిని బీఎస్సీ బియ్యాడీ చదివించాడు. జానకి తమ్ముళ్లు డిగ్రీలు చేసినా వ్యవసాయంలో తండ్రికి సాయంగా ఉండిపోయారు.

జానకికి టీచర్ వుద్యోగం వచ్చింది.మంచి కుటుంబం నుండి సంబంధం కూడా వెతుక్కుంటూ వచ్చింది. ఒక్కడే కొడుకు, అత్తామామ మంచి వాళ్ళని తెలిసింది. అల్లుడు బంగారం, కెమిస్ట్రీ లెక్చరర్ గా పని చేస్తున్నాడు. కట్న కానుకలు ఏమీ అడగలేదు. జానకి అదృష్టానికి నారాయణరెడ్డి మురిసిపోయాడు. ఉన్నంతలో పెళ్లి బాగా చేశాడు. జానకి కాన్పుకు అమ్మగారింటికి వచ్చింది, ఆరునెలలు మనవడ్ని మురిపెంగా క్రిందపెట్టకుండా మోశాడు. మళ్ళీ మనుమరాలు పుట్టింది. మూడో నెలలోనే బాబుకు స్కూల్ ఉందని జానకి బిడ్డను తీసుకుని వెళ్ళిపోయింది. కొడుకులకు పెళ్లిళ్లు అవడం, వాళ్లకు పిల్లలు పుట్టడం, వాళ్ళతో అనుబంధం, ఇలా సాగుతున్న సమయంలో జానకి భర్త గుండెపోటుతో మరణించాడు. కుమిలి పోతున్న కూతుర్ని చూసి కన్న వాళ్ళ హృదయాలు భగ్గుమన్నాయి. అత్తమామలు కోడల్ని బాగా చూసుకున్నా ,తల్లి దండ్రుల ప్రేమ , అండ ఆ సమయంలో అవసరమని జానకి దగ్గర చాలా కాలం వున్నారు.

కాలం అన్ని గాయాల్ని మాన్పుతుంది. నెమ్మదిగా జానకి ఉద్యోగానికి వెళ్ళింది. పిల్లల్ని మంచిగా తీర్చింది. అమ్మాయికి పెళ్లి చేసింది. పెళ్ళయాక కూతురు అల్లుడు అమెరికా వెళ్లిపోయారు. కొడుకు ముందే అమెరికాకు చదవడానికి వెళ్లి అక్కడే వుండిపోయాడు. అత్తా మామ నాలుగేళ్లలో ఒకరు ముందు ఒకరు వెనక కాలం చేశారు. ఇప్పుడు జానకి ఒక్కతే వుంది. అది తలుచుకుంటేనే తండ్రి మనసు బరువవుతుంది. అత్త కాలం చేశాక ఓ ఆరు నెలలు అమెరికాలో వున్న కూతురు, కొడుకు దగ్గరకు వెళ్ళొచ్చింది. జానకి పుట్టింటికి వచ్చినప్పుడు నారాయణ రెడ్డి ఓ స్నేహితుడికి ఆరోగ్యం బాగా లేకపోతే బెంగుళూరు హాస్పిటల్ కు వెళుతోంటే సహాయంగా వెళ్ళాడు అందువలన కూతుర్ని చూడక ఏడాది అయింది.

'ఎప్పుడూ తమ్ముళ్ల దగ్గరే ఉంటారే ...ఏం నాన్నా నా దగ్గరకు రారేం ?' అని కూతురు అడగలేదు కానీ ... కూతురు దగ్గర ఉండలేక పోతున్నానే అపరాధ భావం అతనికే కలిగింది. జానకి కూతురు, కొడుకు ఒంటరిగా వున్న అమ్మను వదిలి ఎందుకు అమెరికాలో వున్నారో అర్థం కాలేదు . బంధాలు, బాంధవ్యాలు అనేవి లేకుండా స్వార్థం పెరిగి పోతోంది. సాంకేతికంగా ఎదిగి , సౌకర్యాలు పెరిగి మానవుడు సంకుచితుడు అయిపోతున్నాడు . ఏమవుతాయి మానవ సంబంధాలు? ఎన్నో బాధ్యతలు, బాధలు వున్నా, నా కూతురు ఒంటరిగా ఉందని తలచుకుని మేం బాధ పడుతున్నామే ... జానకి పిల్లలకు ఎందుకు ఆ ఆలోచన రావడం లేదు? మార్పు సహజమే .. తరాల అంతరాలలో తేడాలుంటాయి కానీ కనీసం కన్నతల్లి గురించి ఆలోచించలేని పరిస్థితి ఉంటుందా! ఏమో మరి ప్రాధాన్యతలు మారిపోయాయి! మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు అయినప్పుడు డబ్బు తెచ్చే సౌకర్యాలు, సంతోషాలకు ప్రాధాన్యత పెరుగుతుంది. నా బంగారు తల్లికి అల్లుడు పోవడంతోటే అన్ని శాంతులు అన్ని సంతోషాలు పోయాయి. ఇప్పుడు గానీ అల్లుడు ఉంటే జానకి గురించి తాను ఇలా వ్యధ చెందేవాడా! తెలియకుండానే కళ్ళలో కన్నీళ్లు తిరిగాయి. అల్లుని మంచితనం, అందమైన చిరునవ్వు, కూతురి కళ్ళలో నైరాశ్యం గుర్తుకొచ్చేకొద్దీ నారాయణ రెడ్డికి దుఃఖం ఎక్కువయింది. కారులో వున్నది అపరిచితులు కాబట్టి వాళ్ళు అతని కేసి చూడలేదు. వాళ్ళ మధ్య సంభాషణ కూడా జరగలేదు కాబట్టి నారాయణ రెడ్డికి కూతురి గురించిన ఆలోచనలు బాధించాయి . అయిదు గంటల ప్రయాణంతో అలిసిపోయి కూతురింటికి వచ్చాడు.

తల్లి పోలికలున్న కూతుర్ని చూస్తే అతనికి ఒక రకంగా సంతోషం మరొక రకంగా కూతురు ఇలా ఒంటరయిందే అని బాధ. చాలా కాలం తర్వాత కూతురుతో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ భోంచేశాడు మరుసటి రోజు "సెలవు పెడతా నాన్నా !" అని జానకి చెప్పగానే

" రిజిస్ట్రాఫీసు లో పని చూసుకోవాలి కదా సెలవు ఎందుకు వృధా చేసుకుంటావు ? రోజంతా బయటే వుంటాను కదమ్మా !" అన్నాడు.

మధ్యాహ్నం భోజనానికి ఏర్పాటు చేసి స్కూలుకు వెళ్ళిపోయింది జానకి. సాయంత్రం తండ్రి కిష్టమైన కూరలు వండి పెట్టింది. నారాయణ రెడ్డికి మనసు చల్లగా వుంది. కూతురు సమక్షం ఆయనకు ప్రశాంతత నిచ్చింది. అదీ ఇదీ మాట్లాడుతూ

"అమ్మా పిల్లల్ని మన దేశం వచ్చేయమని చెప్పరాదా! ఇక్కడ వాళ్లకు ఉద్యోగాలుండవా ఏమిటీ ? నీవు ఒక్కదానివి అయ్యావు --- నీ పిల్లలు ఇక్కడుంటే నీవు వాళ్ళ దగ్గరకు పోవడమో వాళ్ళు నీ దగ్గరకు రావడమో చేయొచ్చు కదా ! "

"లేదు నాన్నా---నేనేమీ చెప్పను. వాళ్ళ జీవితం వాళ్ళిష్టం. వాళ్లకు నచ్చినట్లు వుంటారు, వాళ్లకు ఇష్టమున్న చోట వుంటారు. నేనెందుకు కల్పించుకోవడం? ఒక వేళ నేను అడిగినా, వాళ్ళేమీ స్పందించరు. ఒంటరితనం అంటారా.. అది నాకు అలవాటయింది" జానకి కళ్ళలో నిస్తేజం చూసి అతనికి చాలా కష్టమేసింది.

"బడి సంగతేంటమ్మా గవర్నమెంట్ బళ్ళు పూర్తిగా అధ్వాన్నం అయిపోతున్నాయని పేపర్లో రాస్తున్నారు. " అన్నాడు

"నిజమే నాన్నా! స్కూళ్లు మూతపడే పరిస్థితికి వచ్చాయి.. అందరూ కాన్వెంట్ కెళితేనే చదువనుకుంటున్నారు, మధ్యాహ్న భోజనపథకం కొంతవరకు కొన్నాళ్ళు పిల్లల్ని బడికి రప్పించింది కానీ ఇప్పుడు అదీ పని చేయడం లేదు. ఒకటి నుండి పది తరగతులకు 54 మంది వున్నారు. వాళ్లలో బడికి వచ్చేది ముప్పైమందే. ఆసక్తి పోతోంది నాన్నా ఈ వుద్యోగం చేయడం పై! ఒకప్పుడు పేద, పల్లె విద్యార్థులకు చదువు చెప్పడంలో ఎంతో ఇష్టం ఉండేది. మనవూర్లో మాకు ఎంత బాగా చెప్పేవాళ్ళు. మా టీచర్లను చూసి నేను టీచర్ కావాలని కోరుకున్నా. కానీ ఇప్పుడు పరిస్థితులు ఈ వృత్తికి గౌరవం ఇచ్చేలా లేవు. విద్యార్థులకు గురువుల పట్ల గౌరవం కూడా లేదు .. టీచర్లలో కూడా మునుపటి నిబద్ధత కూడా లేదు--- "

"విలువలన్నీ మారిపోయాయమ్మా .. మంచిని మరిచి వంచనే నేర్చిన వాడు నెగ్గుకొస్తున్నాడు. పోనీ నీకు వుద్యోగంలో తృప్తి లభించకపోతే.. వదిలేసి మా దగ్గరకొచ్చేయమ్మా నీ పిల్లల దగ్గరకు కూడా ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్లొచ్చు "

"అలా పూర్తిగా నిరాశలో లేనులే నాన్నా ---చదువుకోవాలని వచ్చే ఒక్క విద్యార్థికైనా చదువు చెప్పడం నా విధి కదా! "–

"నీ ఇష్టం తల్లీ ..నీకు ఏది చేయాలనిపిస్తే అది చేయమ్మా .. నీవు సంతోషంగా, ప్రశాంతంగా వుండు " అంటుంటే ఆతని గొంతు వణికింది.

ఎగసి పడే అలలా వుండే కూతురు కదలిక లేని సరస్సులా నిబ్బరంగా వుంది. జానకి నవ్వితే గలగల పాడే సెలయేరులా అనిపించేది. జానకి ఇంట్లో ఉంటే తుళ్ళింతలు, కేరింతలు వుట్టిపడేవి. జానకి పెళ్లయి వెళ్ళి పోయాక ఇంట్లోని నిశ్శబ్దం తట్టుకోలేక---నారాయణరెడ్డి, అతని భార్యా ,తమ్ముళ్లు దిగాలు పడ్డారు. నెమ్మదిగా జానకి "ఆడ" పిల్ల అని "ఈడ" పిల్ల కాదని గ్రహించారు. త్వరలోనే అందరికి జానకి ఒక చుట్టం లాగా అయిపోయింది. మర్యాదలు పాటించడం మొదలు పెట్టారు . తమ్ముని భార్యలు భయంతో అణకువతో ఆమెకు సేవ చేయడానికి వస్తే జానకి నవ్వేసేది ".. నా ఇంట్లో నాకు మర్యాదలా ! "అని చిరు కోపం ప్రదర్శించేది. అయినా అవి అలానే సాగేవి .

భర్త మరణం తర్వాత జానకి ఎప్పుడూ మౌనంగానే ఉండేది. పిల్లలు కూడా అదే ధోరణిలో వాళ్ళమ్మను అంటిపెట్టుకుని ఎవరి దగ్గరకు వచ్చేవాళ్ళు కాదు. ఇపుడెలా వున్నారో మరి ఏండ్ల తరబడి అమ్మను చూడకుండా! అద్దాలనాడు బిడ్డలు, గడ్డాలనాడు కాదు అని ఇలాంటి పరిస్థితిలోనే పెద్దలు అని వుంటారు.

సాయంత్రం స్కూలు నుండి రాగానే తండ్రికి తాను తీసుకొచ్చిన చీనీ పండ్లు వలిచి ఇచ్చింది జానకి. సాయంత్రం నుండి జానకి దగ్గుతూనే వుంది.

"డాక్టర్ దగ్గరకు వెళ్లరాదా అమ్మా! ఇప్పుడైనా వెళదాం పద !" అన్నాడు తండ్రి .

"ఇది జలుబు వలన లే నాన్నా --- క్లాసులు తీసుకుంటే సాయంత్రం కొంచం ఉంటుంది --- ప్రొద్దునకు తగ్గుతుందిలే. మీరు పడుకోండి, ఏవైనా కావాలంటే లేపండి.. మందులన్నీ వేసుకున్నారా ? ఇదిగో నీళ్లు మీ మంచం ప్రక్కనే పెట్టాను." జానకి అన్ని జాగ్రత్తలు చెప్పి వెళ్లిపోతుంటే

"ఉదయాన్నే వెళ్ళిపోతాను తల్లీ .. తీసుకొచ్చిన వాళ్ళు మళ్ళీ కారులో దిగబెడతామంటున్నారు " అన్నాడు.

"ఉండొచ్చు కదా నాన్నా కొన్ని రోజులు! "అనబోయి తమాయించుకుంది జానకి .

నాన్నతో అలా సాయంత్రాలు గడపడం .. ఆమెకు బావుంది. కానీ నాన్నకు వ్యవసాయం, వూర్లో ఎన్నో పనులు, అమ్మ ఉంటే కూడా తొందర పెడతాడు వెళ్లాలని, కానీ జానకి తల్లి మాత్రం వస్తే పదిరోజులు తక్కువ కాకుండా ఉంటుంది. నారాయణ రెడ్డి మాత్రం అతని సొంత వూరు విడిచి ఉండలేడు. ఎందుకు నాన్నని ఉండమని అడిగి బాధించడం? అనుకుంది జానకి .

ఎన్ని రోజులుండగలడు ? తానెప్పుడైనా ఒంటరే ! ఈ ఒంటరితనానికి తానెప్పుడో అలవాటుపడింది. మెల్లిగా కళ్ళుమూసుకుంది . కానీ నిద్రరాలేదు. భర్త గుర్తుకొచ్చి ఆమెకు తెలియకుండానే కన్నీళ్లు వచ్చాయి ఇంత ప్రపంచానికి చోటుండగా అతనికెందుకు లేదు? అన్న ప్రశ్న పాతికేళ్లుగా ఆమె వేసుకుంటోంది.

మూడురోజులుగా జానకి జలుబు దగ్గుతో బాధపడుతోంది. సెలవు లేదని స్కూలుకు అలాగే వెళుతోంది. పక్క గదిలో కూతురు దగ్గుతోంటే కన్నతండ్రి కి కునుకు పట్టలేదు. లేచి వచ్చి చూశాడు. రోజంతా అలసిపోవడం వలన జానకి అంత దగ్గు వస్తున్నా నిద్ర పోతోంది. జానకి ని ఒంటరిగా చూస్తున్న కొద్దీ తండ్రి మనసులో అలజడి మొదలైంది. ఉదయాన్నే జానకిని వదిలి ప్రయాణం చేయాలంటే మనసొప్పడం లేదు. కొన్ని రోజులు జానకి దగ్గర వుండి పోతే బావుంటుంది అనిపిస్తోంది. 'వ్యవసాయం, బాధ్యతలు ఇంకా వూర్లో పంచాయితీలు అనుకుంటూ జానకి గురించి పట్టించుకొనే లేదు. పెళ్లి, కాన్పులు చేయగానే ఆడపిల్ల బాధ్యతలు తీరిపోయాయనే భావనతోనే వున్నాము. కష్టం వచ్చినపుడు కూడా వచ్చి కొంతకాలం వుండి పోయాం, కానీ ఎందుకో ఇప్పుడు జానకిని వదిలి వెళ్ళబుద్ధి కావడం లేదు, మనసులో ఏదో పీకుతోంది, ఇక్కడ పొద్దుపోని మాట వాస్తవమే, అయితే జానకి స్కూలుకు వెళ్ళినప్పుడు ఏదో చదువు కుంటూ గడిపేస్తే సరిపోతుంది. కానీ ఉదయమే వెళతానని చెప్పేశానే... వెళ్లి కొన్నిరోజుల తర్వాత మళ్ళీ వద్దునా!' ఇలా ఆలోచిస్తూ నిద్ర పోయాడు.

ఉదయాన్నే టిఫిన్ చేస్తుండగానే కారు వచ్చింది. కూతురు వుండి పొమ్మంటే ఉందామని వున్నాడు నారాయణ రెడ్డి. జానకి వాళ్ళమ్మకు, తమ్ముళ్లకు, పిల్లలకు ఏవో సంచిలో సర్దింది. తండ్రి తెచ్చిన డబ్బాలు మళ్ళీ నిండుగా బరువుగా వున్నాయి. నారాయణ రెడ్డి గుండె కూడా బరువెక్కింది. జానకి నిర్లిప్తంగా స్కూలుకు తయారవుతూ తండ్రికి ఆరోగ్యం గురించి జాగ్రత్తలు చెబుతోంది. మూడురోజులు తండ్రి సమక్షంలో బాగా గడిచాయి. "ఇంకొన్ని రోజులు వుండండి నాన్నా" అందామని వున్నా ---

"పనులున్నాయి పోవాలమ్మా .. ఇంకోసారి వస్తాలే " అనే సమాధానం తండ్రి దగ్గర నుండి వస్తుందని జానకి నోరువిప్పలేదు.

కారులో కూర్చున్నాడు నారాయణ రెడ్డి.. 'వుండండి నాన్నా' అంటుందేమో జానకి అని ఎదురు చూసిన అతనికి నిరాశ కలిగింది. కూతురు తన సమక్షాన్ని అంతగా ఆశించడం లేదన్న విషయం అతన్ని బాధించింది. కారు కదులుతుండగా చూశాడు కూతురు కళ్ళలో లీలగా తిరిగిన కన్నీళ్లు. అవి చెప్పకనే చెప్పాయి "వుండండి నాన్నా "అని. అప్పటికే కారు సందు మలుపు తిరిగింది.